ఆంధ్ర … వారపత్రిక

ముమూర్ష (కథ)
రావికొండలరావు




30-9-59 25 న.పై.
ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY




సంజవేళ

—ఫొటో : పి. రామారావు.

కోపించిన గోదావరి



వరదబాధితులను పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి.



గోదావరి మహాసముద్రమై పొంగగా వటపత్రశాయిలా నిలచిన భద్రాచల రామచంద్రుని దేవాలయం జలానికి ఆశ్రయం కల్పించింది.



* రాజమండ్రివద్ద రైలువంతెనను దాదాపు చుంబిస్తున్న గోదావరి. *

కౌరవ రాజసభలో శ్రీకృష్ణుడు చేసిన విశ్వరూప ప్రదర్శనానికి దుష్టచతుష్టయంతో పాటు అనేకమంది బలహీనులు భయభ్రాంతులై పోయినా మహానీయులైన భక్తులూ, జ్ఞానవృద్ధులూ ప్రత్యక్షంగా దర్శించారట!

కాని, ఉన్నట్టుండి గడచిన పది దినాల నుంచి శ్రావణ ఏకాదశి ఉత్సవంలో ప్రళయ తాండవంతో గోదావరి దాల్చిన విశ్వరూపానికి అంతా తల్లడిల్లి పోయినవారే! భయభ్రాంతులై పోయినవారే!

1953 తర్వాత అఖండగోదావరి ఇంతగా ఎన్నడూ ఉప్పొంగలేదు.

బూర్గంపాడు, కొత్తపేట, భద్రాచలం, పోలవరం, కొవ్వూరు, రాజమండ్రి, మానవరం, కోటిపల్లి, నరసాపురం, ధవళేశ్వరం, ముమ్మిడివరం ఈ ఊళ్లన్నీ వెల్లువలో మునిగి పోయాయి. పోలవరం ప్రాంతంలో 18 వేల కుటుంబాలు నిరాశ్రయమైనాయి. సీలి పల్లివద్ద, ఇంకా అనేకచోట్ల, కట్టకు రెండు చోట్ల కొండంతంత అడుగుల మేర పెద్ద గండ్లు పడ్డాయి.

ధవళేశ్వరం ఆనకట్టపై 18 7. అడుగుల నీరు ప్రవహించింది 1953 లో ఇక్కడ 19 5 అడుగులదాకా వచ్చింది. రైలువంతెనవద్ద 64.7 అడుగులదాకా వచ్చింది.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

★

Founder
K. Nageswara Rao

స్థాపితము
1908

★

సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

★

సంపుటము 55
సంచిక 3

30-10-59
బుధవారం

వికారి భాద్రపద బహుళత్రయో॥

★

విడిప్రతి వెల 25 న. పై.
సంవత్సర చందా 13-0-0

★

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టివీధి
మదరాసు-1.

విషయానుక్రమణిక

ముఖచిత్రం:

సారథీవారి 'భాగ్యదేవత' లో

రాజసులోచన

ఉత్తరాలు

తెలుగు సినిమాలు

ప్రముఖ సినీమానటుడు ఎన్. టి. రామారావు వ్రాసిన "తెలుగు సినిమాలు" అనే వ్యాసం చదివి నేను చాలా ఆనందించాను. సినిమాలలో సంఘాలో లోపాలను వివరిస్తూ ఎటువంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలి? అనేది చక్కగా విశదీకరించారు.

యుగంధరం, శెట్టి ప్రభాకరరావు.
బందరు.

* * *

కోపంగా

చాలా బాగా వున్నది. కాని ఇది చదువుచున్నంత సేపు రామారావుగారు ఏదో కోపంతో వ్రాసినట్లు అనిపిస్తున్నది. కోపమైనా మరే మైనా, మొత్తానికి రామారావుగారే ఎదురుగా నిలబడి చిత్ర పరిశ్రమలోని బాధలను గురించి చెప్పుచున్నట్లుగా తోచినది.

వెల్లంకి జయమోహన్ రావు.
(గుంటూరు)

ధైర్యంగా

ఆర్టిస్టులూ, ప్రొడ్యూసర్లూ, రచయితలూ డైరక్టర్లూ కూడా వారి సలహాలను అంగీకరించి, అనుసరించి, తమతమ బాధ్యతలను గుర్తించి ప్రవర్తించి నట్లయితే తెలుగు సినిమాను యొక్క భవిష్యత్ బాగుండు ననుటలో సందేహము లేదు.

ఆర్. వి. ఆనందరావు.
(మద్రాసు.)

* *

మంచిమాట

జీవితంలో మరువరాని—"ఎవరినో ఉద్ధరిస్తున్నా మనుకోవడం తగదు. అలా నమ్మడం ఆత్మవంచన. మనకీ ఉన్న ప్రతిహక్కుకీ చక్కని ఒక బాధ్యత కూడా ఉంటుంది". వాక్యాలను నునిశితంగా విమర్శన చేసి నిష్ఠ తెలియజేసిన ప్రసిద్ధనటులు రామారావు గారికి ఆంధ్రపత్రిక ద్వారా నా అభివందనలు అందజేసుకొంటున్నాను.

శిష్ట్లా సీతారామాంజ
నేయులు (తెనాలి.)

హాళ్ళూ పెళ్ళూ

"మీ అమ్మాయి పెళ్ళెప్పుడు" వ్యాసం చక్కగా వుంది. "పెళ్ళిళ్ళు కావలసిన వాళ్ళు హాళ్లూ పెళ్లూ" లో వర్ణించిన హాళ్ళూ పెళ్ళూ పెళ్ళి కావలసిన వాళ్ళలో కంటె పెళ్లి అయిన వాళ్లలో లేవా అని నా అనుమానం—

రాజధాని కబుర్లు చాలా బాగుంటున్నాయి.


పొన్నాడ వెంకట్రామయ్య
(రాజోలు)

* * *

రిమార్కు

'పెళ్ళిళ్ళు కావలసిన వాళ్ళ హాళ్ళూ, పెళ్ళూ' అన్న పూర్ణాదేవి గారు చాలా బాగా వ్రాశారు. ఇలాంటి రచనలే ఏ పోదరుడో వ్రాసివుంటే 'హీరోయిన్ మార్కు' లన్నీ ఒక్కసారిగా "వాట్?!" అని క్వశ్చన్ మార్కుల్లాగా మారి విరుచుకపడే అవకాశ

(54-వ పేజీ చూడండి)



రాజధాని కబుర్లు

ప్రవీణ్

గయుడికి మాట ఇచ్చి, నిలబెట్టుకోడంకోసం బావమఱదితో యుద్ధానికి దిగాడు అర్జునుడు. అన్నమాట తప్పని, తప్పడు మాట అనని హరిశ్చంద్రుడు—(హరిశ్)చంద్ర'మతి'ని తాత్కాలికంగా అమ్మేసుకున్నాడు. తండ్రి మాట నిలబెట్టుకోడంకోసం గదా రామచంద్రుడు అరణ్యవాసం చేసి, కోతి ఇంజనీర్ల సహాయంతో సేతువు నిర్మించాడు? పాఠక మహాశయా! పట్టు పట్టరాదు; పట్టి విడువగరాదు.

ఈ సత్యాన్ని మీరూ, నేనూ అంతా గుర్తించాం: గుర్తించేగదా ఫలానా విషయం ఫలానా ముహూర్తాలపైన ఆధారపడి జరగాలని పట్టుపట్టడం మా నేరం? మా నేయడంవల్లనే వరదలు వచ్చినప్పుడల్లా నదీమతల్లికి నమస్కరించి, పారిపోతున్నాం. వచ్చే ఏడు వచ్చి, వరదలను తీసుకురాదని ఆశిస్తున్నాం పోయిన ప్రాణాలను పోయినట్టుగా చిట్టా ఆవర్జాలలో నమోదుచేసి, 'ఇక పోవు' అని విశ్వాసం వెలిబుచ్చుకుంటున్నాం.

చనిపోవడానికి సిద్ధంగా ఉన్న ఒక వ్యాపారస్తుడు తన వారసుణ్ణి పిలిచి, రెండు అమూల్యమైన సలహాలనిచ్చాడట: "నాయనా! ఇచ్చినమాట ఎన్నడూ తప్పకు!" అన్నాట. 'సరే' అన్నాట్ట కొడుకు. అని, 'ఆ రెండో సలహా ఏమిటి, నాన్నా?' అన్నాట్ట. 'అసలు చచ్చినా మాట ఇవ్వకు' అన్నాట్ట తండ్రి. అని, కన్ను మూశాడు.

తండ్రి దెయ్యానికి మాట ఇవ్వడంవల్లనే గదా హేమ్లెట్ అరడజను మనుష్యుల్ని అనుకోకుండా దెయ్యాల్ని చేయాల్సివచ్చింది? ఇందువల్ల కూడా, పాఠకమహాశయా!, పట్టు పట్టరాదు, పట్టి విడువగరాదు.

ఈ విషయం నాకు తెలియక కాదు; తెలిసి, జ్ఞాపకంలేక, మీకు క్రిందటివారం మాట ఇచ్చాను. 'పైవారం ఫలానా విషయంపై రాస్తాను' అన్నాను. ఇప్పుడు ఆ విషయం ఏమో జ్ఞాపకంలేదు! మాట నిలబెట్టుకోలేకపోతున్నాను. జ్ఞాపకంవస్తే, పైవారం తప్పక రాస్తానని మాట ఇస్తున్నాను. ఈ మాట నిలబెట్టుకోడానికి తప్పక యత్నిస్తానని కూడా మాట ఇస్తున్నాను.

ఈవారం మరచిపోడానికి కారణం ఉంది: మొన్న బుధవారం రెడ్డి వసతిగృహంలో సినీనటుడు గుమ్మడి వెంకటేశ్వరరావుకి 'బ్రహ్మాండం'గా 'వివాహం' జరిగింది. కానీ కాని, కట్నాలు కానుకలు లేని ఈ పెళ్ళికి ఆర్థికమంత్రి పౌరోహిత్యం వహించారు. ఈ బ్రహ్మానందంలో మునిగి నేను మీకిచ్చిన మాట మరచిపోయాను.

కొంచెం ఆగండి: చెబుతాను.

నిజాంపై ఎత్తిన ధ్వజం

ఈజిప్టు మాజీరాజు ఫరూక్ సిసలైన ముసల్మానుడు అంటూ సరదాగా అబద్ధమాడాడు పాశ్చాత్య రచయిత ఒకడు ఒకసారి. వారిజాక్షులందు వైవాహికములు ఎటపెటరాలో బొంకవచ్చునని ఆ రచయిత నమ్మకం.

ముసల్మానులు ఒకేసారి నలుగురికంటె ఎక్కువ వారిజాక్షులను చేపట్టరాదు. ఇది పూర్తిగా పాటించదలచిన ఫరూక్ ఒకేసారి నలుగురుకంటె ఎక్కువ మందిని పెళ్లాడలేదుట. ఒకేసారి పెళ్ళాడ్డం! ఐతే—అతని భార్యలు ఎటునుంచి లెక్క పెట్టినా నూర్గురు కంటె ఎక్కువే—అన్నాడా పాశ్చాత్య రచయిత.

ఈ విషయం ఊరికే చెప్పాను. దీనికీ, ఇప్పుడు చెప్పబోయే దానికి సంబంధంలేదు

మహాఘనత 'వహించిన' మాజీ ప్రభువు రేబ్యుడు నిజాంగారికి నూట ఇరవై మంది కొడుకులు ఉన్నారు. నూట ఇరవై మంది ఉన్నారని ఇప్పుడు అధికారికంగా తెలిసింది. పూర్వం మన రికార్డు ద్రౌపదికి ఐదుగురు భర్తలు, ధృతరాష్ట్రుడు దుర్యోధన, దుశ్శాసనాది నూరుగురు కుమారులు! ఈ నూట ఇరవై మంది కుమారులు నిజాంగారిపై ఆందోళనం ధ్వజం ఎత్తారని కొత్త ఢిల్లీనుంచి వార్త వచ్చింది గతవారం.

ఈ నూటఇరవై మంది ఒక సంఘం స్థాపించుకున్నారట. పిమ్మట, తమ తండ్రి తమ అవసరాలను తీరుగా తీర్చడం లేదని రాష్ట్రపతికి మహజరు పెట్టుకున్నారట. మా నాన్న ప్రపంచానికంతటికీ ధనాఢ్యులనిపించుకో దగినవాళ్ళలో ఒకడు, కాని ఏంలాభం! మేం బయటికి పోతే రిక్షాల్లో పోవాల్సి వస్తోంది—అని.

ఇటువంటి మహజరు సంగతి వింటే ఎవరికైనా గుండె తరుక్కుపోతుంది. తరుక్కుపోకుండా ఉండడానికి ఎన్ని గుండెలుండాలి మనిషికి? మ. ఘ. వ. కి కూడా ఇంతే ఐంది పాపం! అసలే పొదుపుగా ఉండాలని ప్రయత్నిస్తున్నాడాయె! ఏళ్ళకేళ్ళ క్రితం చనిపోయిన తండ్రిగారి చిరుగు బట్టలు కుట్టించి తొడుక్కోడం ప్రారంభించాడు. నా కొడుకులకు అప్పిస్తే లాభం లేదని ప్రకటించాడాయె, ఎవరేమన్నా, కొడుకులు—'ఋణానందలహరి'లో మునిగి తేలడం ఇష్టంలేక! ఇప్పుడీ మహజరు.

నిజాం ప్రతిధ్వజాన్నెత్తాడు. 'నా కొడుకులకు అన్ని సౌకర్యాలూ చేశాను. తిండికి లోటులేకుండా ఏర్పాట్లు చేశాను. 'ఫేమిలీ ట్రస్ట్' వంటిది ఏర్పరిచాను. వాళ్ళ బిడ్డలకు మంచి స్కూల్లో చేరే ఏర్పాట్లు చేయించాను. బయటకు వెళ్ళడానికి కార్లున్నాయ్ కూడా. ఇంత చేసినా వాళ్లు ఇలా అన్నారంటే కుటుంబ పెద్దయైన వారికి కృతజ్ఞత లేదన్నమాట!'

నగరంలో మసిలే జనం సంగతి చూడకుండా వీధులమ్మట తుర్రుమనే కార్లలో షికార్లుచేసే నిజాం శతాధిక సంతానాన్ని చూసిన వాళ్ళంతా ఆయన మాటలనే నమ్ముతున్నారు. నిజం నిజాంకు తెలుసు; ఆయన కొడుకులకే తెలుసు.

* * *

గుమ్మడి "దొంగతనం"

కవికుమారుడు 'సినారె' హృదయాన్ని సినీనటుడు గుమ్మడి దొంగిలించేశార్ట. ఈ 'ప్రియమైన దొంగ'కి 'సినారె' వెంటనే తన కుమార్తెనిచ్చి వివాహం చేశారు. కన్యపేరు: 'విశ్వనాథ నాయుడు.' గుమ్మడి దొంగిలించి భుజాలు తడుముకున్నారా? లేదు, ఛాతీ విరుచుకు నిలబడ్డారు.

పైగా అన్నారు: "ముసలివేషాలు వేస్తూ వచ్చిన నన్ను ముసలాడే అనుకుంటారేమో?"

★ రాజధాని కబుర్లు ★

లేదు. అవన్నీ వేషాలే; నేను వయసులో నే ఉన్నాను. మామగారికి ఆయన కుమార్తెను 'మాఇంటి మహాలక్ష్మి' లా చూసుకుంటానని, 'ఇల్లరికాని' కి రావని హామీ ఇస్తున్నాను." అని, ముసిముసి నవ్వులు నవ్వుతున్నారు. అలా నవ్వుకోడానికి కారణం ఉంది. కావ్యాల్లో నాయకులు నాయిక హృదయం తస్కరించగలనీ వచ్చేది. ఈయన మామగారి హృదయం తస్కరించి, ఆయనచే సత్కరించబడ్డారు.

శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావుకి ఇదివరలో పది పదిహేను సంవత్సరాల క్రితం వివాహమైంది: ఇది "రెండో పెళ్ళి". పెళ్ళికి పెద్దభార్య రాలేదు. సహజమేగదా?

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, బహుభార్యా నిషేధచట్టం అమలుజరిపే ప్రభుత్వంలో ఆర్థికమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి ఈ పెళ్ళికి పౌరోహిత్యం వహించారు. ఆయనరాక అందరికీ ఆనందం కల్పించింది. ఆయనకూడా నవ్వుతూనే కూచున్నారు. కాని నా అనుమానం ఏమిటంటే, పెళ్ళికి ఎవరైనా కానుక లర్పిస్తే అక్కడికక్కడ 'గిఫ్టుటాక్సు' వసూలు చేసేద్దాం.' అని ఆయన ఉద్దేశ్యం అయ్యుంటుంది.

* * *

పూర్వం ఫలానా సంగీతసభలో త్యాగరాజును ఖూనీ చేస్తున్నారు అంటే 'పట్టుకో, పట్టుకో' అంటూ పరుగెత్తుకొచ్చారట పోలీసువాళ్ళు. వైవాహిక విషయాల్లో కొంతవరకు జొంకవచ్చును గాని మరీ పెళ్ళికొళ్లాలకి పోతే పాఠకుల్లో కొందరు అపార్థం చేసుకోవచ్చు: 'మమ్మల్ని భోజనాలకి పిలవలేదేం?' అని సినారెకి, గుమ్మడికి టెలిగ్రాములు కొట్టచ్చు. అందువల్ల జరిగింది తీరుగా చెప్తాను.

సెప్టెంబరు 16 వ తేదీ సాయంత్రం రెడ్డి వసతిగృహంలో ఆంధ్ర సారస్వత పరిషత్తు పక్షాన కావ్యావిష్కరణ సభ జరిగింది. నవ్వనిపువ్వు, నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు వంటి కావ్యాలను రచించిన శ్రీ సి. నారాయణరెడ్డి సరిక్రొత్త రచన 'విశ్వనాథనాయుడు' కావ్యాన్ని శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి ఆవిష్కరించారు. సభకు ఆర్థిక మంత్రి శ్రీ కాసుబ్రహ్మానందరెడ్డిగారు అధ్యక్షత వహించారు. కార్యదర్శి శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి సదస్యులను ఆహ్వానించారు.

ఈ కావ్యాన్ని రచయిత ప్రఖ్యాత సినీ మానటుడు శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావుకి అంకితం ఇచ్చారు. రాజధానినగరంలో ఆహ్లాదకరంగా జరిగిన సమావేశాల్లో ఇది ఒకటి. శ్రోతలు వక్తల ఉపన్యాసాలను శ్రద్ధగా విన్నారు. కావ్యాన్ని కన్యకగా వర్ణించడం ఆచారం కనుక, ఈ ఉత్సవాన్ని వివాహమహోత్సవంగా నిర్వహించారు నిర్వాహకులు. శ్రీ నారాయణరెడ్డి హృదయాన్ని శ్రీ గుమ్మడి దొంగిలించినది వాస్తవమే ఐనా, శ్రీ గుమ్మడి హృదయాన్ని శ్రీ నారాయణరెడ్డి కూడా దొంగిలించారని తెలిసింది. శ్రీ గుమ్మడి రచయితను శాలువలు కప్పి సత్కరించారు. 'దొంగ' లిద్దరూ ఒకరిపై నొకరు మాటలపన్నీరు జల్లుకున్నారు.

సమావేశం ముగియగానే సంతకాల యాత్ర ప్రారంభమైం. కొత్తల్లుడు కళ్యాణవేదిక దిగి రాకుండానే సదస్యులలో యువకులు చుట్టుముట్టి, నోళ్లుతెరచి, నోటు బుక్కులు తెరచి, సంతకాలు కావాలని అడిగారు. కుడిచేయి నొప్పి పెట్టేవరకు, పెన్నులో ఇంకు ఇంకిపోయేవరకు సంతకాలు చేశారు శ్రీ గుమ్మడి.

* * *

గురువారం ఉదయం రిట్జ్ హోటల్లో వారి గదిలో శ్రీ గుమ్మడిని కలిశాను. నేటి సినీమా రంగంలో తప్పించుకోవలసిన, తప్పించుకోగలిగిన, తప్పించుకోలేని లోటుపాట్ల గురించి ఆయన అభిప్రాయాలు తెలిపారు. 'మీరు బాగా నటించిన చిత్రం ఏది?' 'మీతో చక్కగా నటించిన నటి ఎవరు?' 'అన్నిటికంటె మీకు బాగుండని చిత్రం ఏది' వంటి ప్రశ్నలు విసిరాను. ఈ ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇవ్వలేదు అంటే అబద్ధం ఔతుంది. 'ఇచ్చారు' అంటే 'రామన్నారు?' అని ప్రశ్నిస్తారు పాఠకులు. 'వియనని ఆయనకు మాట ఇచ్చాను. కనుక, పాఠకమహాశయా, మరొక్కసారి గుర్తు చేస్తున్నాను: "పట్టుపట్టరాదు. పట్టి నేని విడువగరాదు."

* * *

విమర్శ-కులు

రాజధాని నగరంలోని లోటుపాట్లను రాజధాని కబుర్లలో వివరించేటప్పుడు, పత్రికాముఖంగా వెల్లడైన వీటిని అధికారులు సాధ్యమైనంత త్వరలో సవరించగలరనే భావం రచయితను ప్రోత్సహిస్తుంది. ముఖ్యంగా కొన్ని కొన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర వ్యవస్థలు ఈ భావానికి దోహదం చేస్తున్నాయ్.

కొన్ని వ్యవస్థలు దోహదం చేస్తున్నా


'భారతి' ప్రచురించిన కథ 'అపరాజిత'కు బహుమతి

—నవ్యసాహితీ సమితి పోటీ ఫలితం

1958-59 లో వివిధపత్రికలలో వెలువడిన కథలను తీసుకుని నవ్యసాహితీ సమితి నిర్వహించిన పోటీలో, "భారతి" పత్రిక 1959 మార్చి సంచికలో ప్రచురితమైన "అపరాజిత" అనే కథకు మొదటి బహుమతి రు 116 లభించినది. దాదాపు 1500 కథలు పోటీకి వచ్చినవి. వీటిని ప్రత్యేకంగా యేర్పడిన సంఘం పరిశీలించి 15 వందల కథలలో ఉత్తమమైన వాటిని నిర్ణయించ వలసినదిగా శ్రీయుతులు దేవులపల్లి రామానుజరావు, కురుగంటి సీతారామయ్యా, త్రిపురనేని గోపీచంద్ గారలకు ఇచ్చారు. వారు మొన్న సమావేశమై శ్రీ వాకాటి పాండురంగారావు రచించిన "అపరాజిత" కథ మొదటి బహుమతికి అర్హమైనదని నిర్ణయించారు.

1958 ఏప్రిల్ మొదటి తేదీ నుంచి 1959 మార్చి 31 వ తేదీ వరకూ పత్రికలలో ప్రచురితమైన కథలను మాత్రమే ఈ పోటీకి ఎన్నుకున్నారు. ఇందుకుగాను 16 పత్రికలలో అచ్చు అయిన కథలను ఈ సందర్భంలో చదివారు. సీతాదేవి రచించిన "కండూతి," శ్రీ అంగర వెంకటకృష్ణారావు రచించిన "తొగరుచెట్టు" (ఆంధ్ర సచిత్ర వార పత్రికలో ప్రచురితమైనవి) భారతిలో శ్రీ బలివాడ కాంతారావు వ్రాసిన కథ "వరద వెల్లువ" మొత్తం ఎనిమిది కథలు తుది పరిశీలనకు వచ్చినవి. వీటన్నిటిలో 'అపరాజిత' ను ఉత్తమ కథగా నిర్ణయించడమైనది.

బహుమతిపొందిన కార్టూన్



వి. జయం. ఉ. వెంకటరావు, గుంటూరు

నుంటే మరికొన్ని చేయడంలేదు అనే అర్థం. ఈ మరి కొన్నిటిలో ప్రత్యక్షంగా కనుపించేది ఆర్. టి. సి. ఉరఫ్ దైవాధీనం బస్ సర్వీస్.

కొన్ని వారాల క్రిందట 'దైవాధీనం బస్ సర్వీస్' శీర్షిక క్రింద ఒక వ్యాసం ప్రచురితం ఐనప్పుడు, అధికారులు ఆ వ్యాసంలోని ఆరోపణలలో స్పష్టత లేదని అన్నారు. రెండువారాల క్రితం బస్సుల కాలాలను గురించి స్పష్టంగా కొన్ని విషయాలు పేర్కొనబడ్డాయి. లక్షలాది రూపాయలు వెచ్చించే ఆర్ టి సి అధికారులు ఈ ఆరోపణలపై ఏ విధమైన చర్య తీసుకున్నారో అర్థంకాదు. చెప్పడానికి వారికి కోరకగాని తీరికగాని ఉన్నట్టు కనపడదు.

పదిహేను రోజులుగా రాజధానిలో బస్సులు మరీ అర్థంకాని పరిస్థితిలో నడుస్తున్నాయ్. ఏ రూట్ పరిశీలించినా, రెండు బస్సులు కలిసిగాని రావడంలేదు. సాధారణంగా రెండుకంటె ఎక్కువ బస్సులు రావడం, ప్రయాణీకులు పనులు పాడుచేసుకోవలసి రావడం జరుగుతోంది. ఆర్ టి సి కి నిర్వహణాధికారు లున్నారు; ప్రధాన నిర్వహణాధికారి ఉన్నారు. వీరు బల్లల వెనుక కూచొని పనిచేయడం మాని, కాగితాలపై సంతకాలు వాయిదాలు వేసి, నగరంలో అటూ ఇటూ తిరిగి 'నిర్వహిస్తే' బాగుంటుంది తమ అధికారాలు.

లేకుంటే 'పత్రికల్లో విమర్శిస్తే ఇలాగే చేస్తాం జాగ్రత్త!' అని చెప్పడమా ఇది?

ఆలస్యంగా వచ్చిన జ్ఞాపకం

ఇప్పుడు హఠాత్తుగా గుర్తు కొచ్చింది! ఈ వారం దయలేని దవాఖానాలనుగురించి వ్రాస్తానని పాఠకులకు మాట ఇచ్చాడు 'ప్రవీణుడు'–కాని ఏం ప్రయోజనం? చోటు ఐపోయింది. మళ్ళీవారం రాయాలి. ★

నెం. 1. "ఏమిటా మ్మాయితో నీకు మాటలు? ఏ విషయం?"

నెం. 2. "ఆ విషయమే."

నెం. 1. "ఏమంటుంది తను."

నెం. 2. "అదే అంటుంది."

నెం. 1. "ఏదరా."

నెం. 2. "అదేరా."



న్యూఢిల్లీ లేఖ

శ్రీకృష్ణ

'పంచశీల' పటాపంచలు; ఎగుమతుల తగ్గుదల


ఈసారి పార్లమెంటు సమావేశం కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వం బర్తరఫ్ చేసిన విషయమై ఉద్రేకపూరితమైన చర్చలతో ప్రారంభమైనది. ఇండియా సరిహద్దులపై చైనా జరిపిన దురాక్రమణపై కూడా తీవ్రమైన వాదోపవాదాలు జరిగాయి. ఇంకా కేంద్ర ఆహార విధానం పోటును, శ్రీ ఎ. పి. జైన్ రాజీనామా, జనరల్ తిమ్మయ్య రాజీనామా ఉదంతం ఇవి కూడా చర్చలలోనికి వచ్చాయి. ఇది ఇలా ఉండగా అధికారభాషా సమస్య కూడా చర్చనీయాంశమే అయింది. హిందీని అధికారభాషగా చేయడం విధాయకమని సేఠ్ గోవిందదాస్ అన్నారు. ప్రధానమంత్రి ఈ విషయంలో అవలంబించిన వైఖరి ప్రశంసాపాత్రంగా ఉంది.

చైనా దురాక్రమణ పార్లమెంటు సభ్యులలో చాలా ఆందోళన కలిగించింది. కాంగ్రెస్ సభ్యులతో సహా అనేకమంది చైనాపట్ల ప్రధానమంత్రి వైఖరిపై ఉద్రేకపడ్డారు-అసంతృప్తి ప్రకటించారు. మితిమీరిన రాజీధోరణి ప్రధానమంత్రి అవలంబిస్తున్నారని కొందరు ఉద్రేకపడ్డారు. ప్రధానమంత్రి అంతర్జాతీయ విధానాలను ఆచార్య కృపలానీ నిశితంగా ఖండించారు. లార్డ్ సాలిస్‌బరీ బ్రిటిష్ కామన్సుసభలో ఒకప్పుడు అన్నమాటలు ఈ సందర్భంలో స్మరించుకోవడం యుక్తం.

“తాతలనాటి పాత సిద్ధాంతాలు పట్టుకుని విధానాలు రూపొందించుకోవడం రాజకీయాలలో అతిసామాన్యంగా కనిపించే తెలివి తక్కువతనం. కాలదోషంపట్టిన విధానాలు మృతకళేబరాల వంటివి. పాత సిద్ధాంతాలు చిరిగిపోయినా కూడా పీలికలు పట్టుకు వేళ్లాడడం, ఆపీలికలు కూడా పోయినా వాటి తాలూకు నీడలు చూసి భ్రమించడం రాజకీయాలలో మితిమీరిపోతున్నది. ఇది శుద్ధ అవివేకం.”

పంచశీల పటాపంచలైపోయినా శ్రీ నెహ్రూ ఇంకా దాని తాలూకు అంగాలను పట్టుకు వ్రేలాడుతున్నారు. ఇండియా సరిహద్దులు అతిక్రమించిన తరువాత కూడా చైనా ప్రధాని శ్రీ చౌ-ఎన్ లై 'పంచశీల' పట్ల అచంచలవిశ్వాసం ప్రకటించారు! శ్రీ చౌ-ఎన్ లై ఇంత అకస్మాత్తుగా కత్తి దూయడానికి రెండు కారణాలు కనిపిస్తున్నాయి. ఇప్పుడు చైనా దురాక్రమణ జరిపిన ప్రాంతం అసలు చైనా భూభాగమేనని ఆయన భావించడం అందుకు ఒక కారణం. శ్రీ నెహ్రూను నిష్పక్షమైన తటస్థవిధానం నుంచి మేల్కొల్పడానికి ఈ విధంగా చేయి చేసుకోవాలనుకోవడం రెండవ కారణం.

సోవియట్ వార్తాసంస్థ 'టాస్' ఈ దురాక్రమణ చర్యపైఒక ప్రకటన చేస్తూ “ఇండియా చైనాల స్నేహసంబంధాలు దెబ్బతిన్నందుకు రష్యాలోని ప్రముఖ రాజకీయ వేత్తలు విచారపడుతున్నట్లు” పేర్కొన్నది. ఇండియాతో ఈ చిల్లరతగాయిదాలు తగదని మాత్రం శ్రీ క్రుశ్చేవ్ తన చైనా 'కామ్రేడ్'లకు నచ్చచెప్పనయినా లేదు కనీసం! 'టాస్' ప్రకటనను ఒక వ్యాఖ్యాత



భారత ప్రధాని శ్రీ నెహ్రూ ఈనెల 14 వ తేదీన బయలుదేరి ఆఫ్ఘనిస్థాన్, ఇరాన్ దేశాలలో పర్యటించారు. కాబూల్‌లో బగ్రాన్ విమానాశ్రయంవద్ద ఆఫ్ఘన్ ప్రధాని శ్రీ మహమ్మద్ దావూద్ ఆయనకు స్వాగతమిచ్చారు.

'రెండు భుజాలపై నిండు కడవలున్నా చుక్క తొణకనట్లు' ఉన్నదని వ్యాఖ్యానించాడు. ఈ తొణకని బెణకని రష్యా వైఖరిని ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ చాలా మెచ్చుకున్నారు.

ఇండియాపై చైనా దురాక్రమణపట్ల ప్రెసిడెంట్ నాసర్‌తో సహా, తదితర బాండుంగ్ దేశాల అధినేతలందరూ కిమిన్నాస్తిగా మౌనంపాటిస్తున్నారు. వారెటువంటి వ్యాఖ్యానాలూ ఇంతవరకు చేసి ఉండలేదు.

ప్రెసిడెంట్ నాసర్ మౌనం చూస్తుంటే మూడేళ్ళవెనుక ఈజిప్టుపై ఆంగ్లో-ఫ్రెంచ్ దళాలు దురాక్రమణ చేసినప్పుడు ప్రప్రథమంగా దాన్ని ఖండించింది శ్రీ నెహ్రూ అనే విషయం జ్ఞాపకానికి వస్తున్నది.

ఇండియా తన పని తను చూసుకుంటూ ఎవరి అంతరాంగికాల్లోను జోక్యం కల్పించుకోని మాట నిజం. ప్రస్తుతం ప్రధానమంత్రి కాబూల్, టెహరాన్‌లకు; రక్షణమంత్రి న్యూయార్క్‌కు, సర్వసేనాని అస్సాం సరిహద్దు ప్రాంతాలకు వెళ్లారు. మొన్న పార్లమెంటులో ప్రధానమంత్రి సమర్పించిన అధికార పత్రంలో గడచిన నాలుగేళ్ళుగా ఇండియా – చైనాలకు నడచిన ఉత్తర ప్రత్యుత్తరాలు పేర్కొనబడినాయి. కాగా చైనాపట్ల ఇండియా ఎంత అమాయికమైన, చిత్రమైన, తప్పు అభిప్రాయాలతో (సర్వజ్ఞభ్రాంతి!) ఇన్నాళ్లూ వ్యవహరించిందో తెలియవచ్చింది. ఈ సమయంలో దేశంలో ప్రధాని లేకపోవడం కొందరికి కొన్ని భయసందేహాలు కలిగిస్తున్నది కూడా. పెద్దవాడు ఆయన దగ్గరుంటే కొంత మానసికంగా అయినా తృప్తి! కాగా ఆయన విదేశ పర్యటనకు వెళ్ళడం చైనా అపార్థం చేసుకుని, ఇండియాభూభాగంపై తన హక్కును మనం ఒప్పుకున్నట్లు భావిస్తుందేమోనని కూడా కొందరు ఆందోళన పడుతున్నారు.

శ్రీ నెహ్రూయే గనుక ప్రతిపక్షంలో వుండివుంటే మరో ప్రధానమంత్రి అలా ఈ సమయంలో విదేశయాత్రకు వెళ్ళడాన్ని ఎంతగానో నిరసించివుండేవారు. ఇక్కడ చైనా కొంత లోపలికివచ్చి ఆక్రమించుకోవాలని కూర్చుంటే ఆయన ఇప్పుడే విదేశపర్యటన చేయడం బాగులేదు.

మెక్‌మహోన్ రేఖ ననుసరించి, ఇండియా టిబెట్టు సరిహద్దు 710 మైళ్ళ పొడవున ఉన్నది. ఈ సరిహద్దు దాటి దక్షిణంగా 32,000 చదరపుమైళ్ళు వైశాల్యంగల ప్రాంతం తనకు చెందాలని చైనావాదం! ఈ ప్రాంతం ఈశాన్య సరిహద్దు ఏజన్సీకన్న కూడా పెద్దది. లాంగ్జూప్రాంతం చుట్టూ కొద్ది భూభాగం మిగియుటున్‌లో అంతర్భాగంగా వారు పేర్కొని ఆక్రమించుకొన్నారు. మెక్‌మహాన్ రేఖదగ్గర హిమాలయాలకు దక్షిణంగాఉన్న మిగియుటున్ ప్రాంతంలో టిబెట్‌కు చెందిన ఒక ప్రసిద్ధ మఠం ఉండడంచేత అది అప్పట్లో టిబెట్‌కు యిచ్చివేశారు.

భూటాన్, టిబెట్ సరిహద్దురేఖ పొడవు 250 మైళ్ళు. ఇందులో 200 మైళ్ళ పొడవు, 2000 చదరపుమైళ్ళ భూభాగమూ ఈశాన్య సరిహద్దు ఏజన్సీకి తూర్పున చైనా కోరుతున్నదట. చైనా దేశపటంలో అప్పుడే యిది చేర్చడం కూడా జరిగింది! సెరుతిమూలనుకూడా కొద్దిప్రాంతం ఇలాగే కలిపివేయబడింది.

ఇలాగే యు. పి., టిబెట్ సరిహద్దు పొడవు 220 మైళ్ళు. బారాహోతీవద్ద 2.కి; నిలాంగ్‌వద్ద 50 చదరపుమైళ్ళు చైనీయులు కావాలంటున్నారు. ఇది నిలికనుమకు చేరువ ప్రదేశం.

ఇటు హిమాచల్ ప్రదేశ్ – టిబెట్ సరిహద్దు 90 మైళ్లు ఉన్నది. ఇక్కడ గల షిప్‌కీ కనుమవద్ద కూడా కొద్దిప్రాంతం వీరు కోరుతున్నారు. పంజాబ్ - టిబెట్ సరిహద్దులో మరికొన్ని గ్రామాలు కూడా వీరికి కావాలట! లడఖ్ - టిబెట్ సరిహద్దు 1,000 మైళ్ళలోను, మూడోవంతు 'అజాద్' కాశ్మీర్‌కు చెందుతుంది, అక్సాయిచిన్‌వద్ద 6000 చ. మై., తూర్పులడఖ్ లో 2,000 చ. మై. కూడా చైనా కోరుతున్నది.

కొంచెం లెక్కప్రకారం గనక పరిశీలిస్తే ప్రధానమంత్రి ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్ పర్యటనకు ప్రత్యేకత కలదనిపిస్తుంది. 1884 తరువాత అప్పటి జారిస్ట్ రష్యా ఆక్రమణ పథకం ఒకటి ఏర్పాటుచేసింది. అందులో ఇండియాను కబళించడం ఒకటి. ఇటీవలి ఒక ప్రముఖ రచయిత ఇలా పేర్కొన్నారు.

"రష్యానుంచి ఇండియా రక్షణ చాలా తమాషాగా జరిగింది. పందొమ్మిదవ శతాబ్దంలో పూర్తిగా పర్షియా, రష్యా ఇండియాల మధ్య తటస్థంగా ఉండిపోయింది. ఇటు పర్షియా, అటు ఆఫ్ఘనిస్థాన్ రెండూ ఇండియారక్షణకు పెట్టని కోటలైనాయి. ఈ రక్షణకు పాకిస్తాన్ నిర్మాణంతో మరింత బలం ఏర్పడింది."

* * *

ఈ వారం ఎగుమతి దిగుమతి సలహా సభ్య సమావేశాలు ఇక్కడ జరిగాయి. దీనితో పాటు ఎగుమతి దిగుమతివ్యాపార నిర్వాహక సంస్థ 1957–58 వార్షిక నివేదిక కూడా ప్రకటించబడింది. ఈ నివేదిక సంగ్రహపాఠం ఇలా ఉంది:

"1957_58 ఆర్థికసంవత్సరం మొదటిసగంలో దాదాపు509 వస్తువుల దిగుమతులు బాగా తగ్గించడంజరిగింది. కాగాపోగా 1957 జులై–సెప్టెంబరులలో చాలావస్తువుల దిగుమతులకు వ్యాపారానికికాక కేవలం అవసరానికి కోటాలక్ష లైసెన్సులు మంజూరయినాయి. 1957 అక్టోబర్ నుంచి 1958 మార్చివరకు 285 వస్తువుల దిగుమతి కోటాలు పూర్తిగా తగ్గించబడ్డాయి. భారత దేశపు స్టెర్లింగు నిల్వలు తగ్గిపోకుండా ఇలా ఏకమొత్తం తగ్గింపులు తప్పనిసరి అయినాయి.

> రోజూ శ్రద్ధగా పేపరు చదువుతూ, ఈ రాజకీయకల్లోలంతో చికాకుపడిపోతున్న పెద్దమనిషిని 'ఏమిటి విశేషాలు' అని కుశల ప్రశ్న ఒకరు వేయగా తుదీ మొదలూ లేకుండా 'పూసకు తిరిగినన్నాళ్ళూ ఏం చైనా ఏం చైనా అని పొంగిపోవడమూను, అతి స్నేహం మితిమించేటప్పటికి ఏం చెయ్‌నా ఏం చెయ్‌నా అని తటపటాయించటమూను' ఇత్యాదిగా ఏకరువుపెట్టాడు ఆయన సీరియస్‌గా.

ఇక ఎగుమతులు 1956 కన్న 57 లో కొంత తగ్గినట్లు కనిపిస్తున్నాయి. అయితే ఎగుమతివ్యాపార స్వేచ్ఛను అరికట్టక పోయినా, ఎగుమతుల అభివృద్ధివిధానం సక్రమంగా అమలుజరిగినా ఇలా తగ్గడం జరిగింది. 1956 సాధారణసంవత్సరంలో అయిన ఎగుమతుల విలువ 619 కోట్ల రూపాయిలు కాగా, 1957 లో 605 కోట్లు మాత్రమే అయింది. ఇదిగాక బాకీ కింద అమెరికాకు 38 కోట్ల రూపాయల విలువ చేసి వెండికడ్డీలు, 'కట్ కాయిన్సు' ఇండియా చెల్లించింది. ఇది కలుపుకుంటే ఎగుమతుల విలువ పెరగడం స్పష్టంగానే కనిపిస్తుంది.

కాగా ఇండియా ఎగుమతుల రాబడి, తగ్గడానికిగల ఇతర కారణాలు చూదాం. అమెరికాతోపాటు, తదితర దేశాలు కూడా ఇండియా వస్తువుల కొనుగోలు తగ్గించాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో రాను రాను పోటీ ఎక్కువకావడం దీనికొక కారణం. ఇండియాలో మితిమీరిపోతున్న ధరవరలు, ముడిపదార్థాలకరువు, పెరిగిపోతున్న కార్మిక వేతనాలు, స్వదేశంలోనే ఎగుమతి వస్తువుల ఇతోధికవాడకం; యివన్నీ కూడా ఇందుకు కారణాలుగా పేర్కొనవచ్చు.

1957 లో విదేశ ద్రవ్యమార్పిడిలో 'తేయాకు' ఇండియాకు మామూలుగా ఎక్కువలాభం తెచ్చిపెట్టింది. అయితే 1956 లో ఎగుమతి అయిన తేయాకు52,70,000,00

(62-వ పేజీ చూడండి)



"ఇదుగో! ఇదే ఆఖరుసారి చెబుతున్నా— తర్వాత నన్నని ప్రయోజనం లేదు. గడువులోగా బాకీ ఇవ్వవలసిన ఆరువేలూ అణా పైసల్తో సహా చెల్లించావా సరి. లేదా నా పెళ్ళాంబిడ్డల్ని నీవు శపించి లాభం ఉండదు జాగ్రత్త!"

చెప్పవలసిన మూడుముక్కలు టకీమని చెప్పి వెనక్కి తిరిగాడు వీరభద్రం.

నడిరోడ్డు కెక్కిన బ్రతుకుతో, ముళ్ళ కంచెపై దుప్పటిపడ్డవానిలా కర్మవిరతుడై నిగూఢంగా నిట్టూర్చాడు సూర్యం.

దుఃఖసాగరంలో విషాదలహరులు రెండు సుడులు రేగాయి చక్రవర్తికి.

* * *

"అమ్మాయి రాణీ! నువ్వు ఎప్పుడెళ్ళా లమ్మా కాలేజీకి — ఎంతకట్టాలి? అసలు మొత్తం నీకెంత కావాలి?" వీరభద్రం కూతురు నడిగాడు.

'మామూలు పెరంఫీజా కాక ఈ నెలకు మూడువందలు కావలసి ఉంటుంది నాన్నా' హుందాగా జవాబిచ్చింది రాణి.

"మూడువందలే! ఏమిటే మహాలావు ఖర్చులునీకు—ఎంతసేపు గుడ్డలు! దేనికైనా అంతూ పొంతూ ఉండాలి. జాగీర్దారి కూతురు కూడా కట్టి ఉండదు చదువుకునే రోజుల్లో ఈ జార్జెట్లూ, ఈ శాటిన్లూను. ఎక్కడి డబ్బూ కట్టిన అందం ఉండిచావని గుడ్డలకు పెడతారు ఏం పిదపకాలం వచ్చిందో" విసుక్కున్నాడు వీరభద్రం—

రాణి నొచ్చుకున్నది. ఒక వైఖరిగా కళ్లు చిట్లించి నూతి మొసల్లా చూపులు పెట్టి "నాన్నా అయితే ఆడవాళ్ల బట్టలదగ్గర్నుంచీ వాటి ఖరీదుల్నుంచీ నీకు అక్కర్లేనిదంటూ లేదన్న మాట! మూడువందలకు బట్టలేం రావు నాన్నా పోదాగా ప్రతి కాలనుకుంటే! ఈమాత్రానికే నీకింతకష్టం దేనికి—సరైన బట్టలైనా లేక నాటివాళ్ళల్లో తలెత్తు కెలా తిరగాలి—" అక్కసును అక్షరాల్లోకి అనువదించింది రాణి

కండువా విదలించి భుజంపై పారేసి మూడునోట్లూ సోఫాలో పెట్టి పెడుతూ "కానీ అమ్మా కానీ—ఇరుగో పైకం—నా మాటలు అట్టే పట్టించుకోకండి మీరంతా—రోజులు ఎడవనీయండి ఎట్లాగో..." అంటూ ఆవేశంగా అని బాగ్గా వెళ్ళిపోయాడు వీరభద్రం.

'అనునిషితీరే అంత' అంటూ ఆ నోట్లు చేతపట్టుకువచ్చి అమ్మాయిని అనునయించింది. వర్ధనమ్మ.

సప్తవర్ణులతో కటిన పాతజంపఖానా బ్రిడ్జింగు, గుండీకిబగులు ఒక పిన్నీసు పెట్టుకున్న షర్టుతో చక్రవర్తి, కొత్తకాన్వాస్ సోల్డాలు మొదలైన టిప్‌టాప్ సామంగులతో కూలింగ్ గ్లాసెస్‌తో రాణి, మరునాడు ఉదయం బండీకి వచ్చి థర్డ్‌క్లాసులోనూ, ఫస్టుక్లాసులోనూ ఎక్కారు. రైలు కదలిపోయింది నిశ్చలంగా.

* * *

చక్రవర్తిని గురించి రాణి అభిప్రాయం 'మన్ను తిన్న పాము' అని.

...రాణిని గురించి అభిప్రాయ పడవలసిన అవసరం, అవకాశం లేకపోయాయి చక్రవర్తికి.

ఇద్దరూ మద్రాసులో ఒకే కాలేజీలో చదువుతున్నారు. ఆ విషయం ఇద్దరికీ తెలుసు కాని ఒకే క్లాసు కాదు. చక్రవర్తి ఎం. ఏ. ఫైనల్ ఇయరు. రాణి బి. యే. లో వుంది.

కాలేజీ డే ఉత్సవాల్లో లైలా మజ్నూ నాటకం ప్రదర్శించాలని తలచారు విద్యార్థి సంఘం.

మజ్నూ పాత్రధారిగా చక్రవర్తిని ముందే నిర్ణయించాడు సూత్రధారి. మేకప్ చేసి చూసి 'మై గాడ్ అచ్చం మజ్నూ వే ఫో!' అంటూ జబ్బ విరగ్గొట్టాడు మిత్రుడు మోహన్‌రావు.

'చక్రవర్తి యెప్పుడూ ఇంత అందంగా కనిపించలేదు. వెలగల దుస్తులు వేస్తే అతను చక్రవర్తిలాగానే ఉన్నాడు. పేదతనం అందాన్ని మసకమసకలాడిందు,' అన్నది సరోజ—రాణితో కదూ అంది ప్రశ్నించే కనుపాపలతో......

కసితో నిర్లక్ష్యంగా కళ్ళు చక్రవర్తి పైకి త్రిప్పిన రాణి లజ్జతో మోసులు వేసే ఊసులతో కళ్ళను సరోజవైపు తిప్పింది తర్వాత ఆదో లోకంలో నివసించడం మొదలెట్టింది రాణి.

దేహం ఇక్కడే వదలి మరో లోకంలోకి బట్వాడా అయిన రాణిని బుగ్గపై వేలితో కోపంగా పొడిచి స్పృహ తెప్పించి మరీ అడిగింది మాలిని, 'అవతల పిలుస్తున్నారు వినపడుతోందా' అని.

రాణి వెనుదిరిగి చూసేసరికి కాలేజి విద్యార్థి సంఘం నాయకుడు, నాటక సూత్రధారీ అయిన ఫలానా రావు గారు 'సదరు నాటకం వేసే విషయంలో లైలా పాత్రకు మిమ్మల్ని ముందే బుక్ చేసుకుని వెనకాల అడగాలని వచ్చాం—ఇందు మూలంగా నాముకు మీ అంగీకారం అడుగుతున్నాం గనుక అది ముందే ఇచ్చేసినట్లు భావిస్తూ మీకు నమస్తే"అని తరువాత కార్యక్రమంలోకి వెళ్లిపోయాడు.

పెదవిదాకా వచ్చి ఆగిపోయిన అనుమానాల అభ్యంతరాల అనేక కారణాల మరీ భయాల తిరస్కారం పురస్కారంగా మారి పువ్వొత్తిలా నవ్వులు రాలువారాయి రాణికి—మేకప్‌లో చక్రవర్తిత్వం వెంపెసలారుతున్న చక్రవర్తి చలించాడు ఒకింత. "వీరభద్రం కూతురు రాణియా!"

"అవున్నా—అప్పుడే విషాద భంగిమా నువ్వూనూ. ఇహ పద నీ పోర్షన్ చదవాలి" అన్నాడో శిష్యం.

ప్రేక్షకుల కరతాళ ధ్వనుల మధ్య సవాలక్ష సర్వోత్తులమధ్య నాయికా నాయకులు రజతపాత్ర లందుకున్నారు ఉత్తమ నటనకు. కాలేజీ డే ఉత్సవాలు దీపావళిలా వెలుగుతో వెలసిపోయాయి.

వీరభద్రం సూట్ ఫైలుచేశాడు కోర్టులో—సూర్యం-ఫలానా తేదీలోగా బాకీ మొత్తం కక్కాలని—లేదా అటాచ్‌మెంటు తప్పదనీ జడ్జి గర్జించాడు.

సదరు తేదీకి అన్నీ అయిపోయాయి. సూర్యం సూర్యచంద్రాదులు కూడా తోడుండే పాకలో కాపురం—బతక లేక బడి పంతులు ఉద్యోగం బరువుగా లాగుతూ.

ఇంట్లో వళ్లు పట్టించుకుంటూ వీరభద్రం సూర్యం చెంబూ తప్పేలా, ఇల్లూ వాకిలీ వేలం వేసిన బాపతు డబ్బు అంతా బాకీ క్రింద జమ కట్టించి, గుమాస్తా రామనాథంతో 'ఏమంటున్నారు తండ్రీ కొడుకూను?' అన్నాడు వైఖరిగా తన దెబ్బకు సూర్యం చక్రవర్తి ఏమనుకుంటున్నారో తెలుసుకుందామని.

భాగ్యవంతుల కొంపల్లో భాషాప్రవీణ రామనాథం చేతులు నలుపుతూ—"ఆఁ ఇంకా అనేదేముంది—కొంపంతా చీకటయ్యాక వాడింకా సూర్యమేమిటి?" అన్నాడు దీర్ఘాంతీస్తూ—

సింహంలా నోరంతా తెరిచి 'హహహ' అని హాసగర్జన చేశాడు స్వీయ విజయచిహ్నంగా వీరభద్రం. కొంచెంసేపు ఇలా గడిచింది.

'చక్రవర్తిట. కొడుకు పేరు పెట్టాడు చూశావు. దానికి చక్రవర్తో! మాడు కుక్క తింటానికి' అన్నాడు పొజ్జ నిమురుకుంటూ వీరభద్రం ఏవగింపు మొహంతో...

"అయ్యా ఒక్కమాట! ప్రపంచం చూడండి—అన్నీ విపర్యాయాలూ, విపరీతాలూనూ. గ్లాసెడు మంచినీళ్ళు తెచ్చిపెట్టని పిల్ల పేరు గంగ! కానీలేని బిచ్చగత్తె పస్తుండో కూతురు పేరు రాజకుమారి—పట్టెడన్నం పెట్టి యెరగని మహాతల్లి అన్నపూర్ణ! హేదో—విలోమానుబంధాలూ, విపర్యయానువాదాలూను లోకం—" అన్న రామనాథం పాండిత్యప్రకర్షకు బొబ్బరింత పెట్టి నవ్వి 'అద్భుతం' అని తలవిదలించి కొంప్లిమెంటిచ్చాడు వీరభద్రం.

తన కూతురు నిజంగా రాణియే అనుకున్నాడు సగర్వంగా తనలో తాను.

'అన్నట్టు అమ్మాయి దగ్గరనుంచి ఉత్తరాలే లేవేమిటో, ఈ గొడవల్లో మరచాను'.

రామనాథం అందుకున్నాడు.

'అమ్మాయిగారు మూడు లెటర్సు రాశారండీ వారం వారం తేడాతో—మూడు మూడు వందలు పంపమని—తొమ్మిది

ఒకడు: "అతను నీ గురించి లేని అబద్ధాలన్నీ చెబుతున్నాడు."

రెండోవాడు: "చెప్పనీ నాకేం ఫర్వాలేదు."

ఒకడు: "అదేవిటీ."

రెండోవాడు: "నా గురించి ఉన్న నిజాలు చెబితేనే నాకు భయం."

★ విపర్యయాలు ★

వందలు పదరు పేరకు దాఖలు చేశానండి మనియార్డరుగా—ఈ గొడవల్లో నేనూ మర చాను' అన్నాడు కంఠం, కాళ్లూ వణుకుతూ వినయం ప్రస్ఫుటమౌతున్న రామనాథం.

కాల్తున్న వళ్ళు పట్టించుకోలేక మండుతున్న ఉక్కుపిండంలా స్నానాలకొట్లోకి వెళ్ళి అవుత్ ఖానాజీవంతీ పేశాడు వీరభద్రం.

'ఆయన తత్త్వమే అంత ఇవాల్టిదా' అని రామనాథంతో అంటూ మూతివిరుస్తూ వెనుదిరిగి లోపలికి వెళ్ళింది వర్ధనమ్మ.

ఒకనాడు వీరభద్రం పేరిట ఉత్తరం వచ్చింది.

పరీక్షలకు అమ్మాయి హాజరు కాలేదని... హాస్టల్ లో ఆమె ఉండటం లేదని...పది హేనురోజుల క్రితం ఖాళీ చేసిందని...

తెల్లబోయాడు వీరభద్రం......బావురుమంది వర్ధనమ్మ...కనుబొమలు ముడివేసి మరీ ఆలోచించసాగాడు రామనాథం.

వర్ధనమ్మకు ధైర్యంచెప్పి, రామనాథం భార్యను ఆమెకు తోడుగా ఉంచి వీరభద్రం రామనాథం ఆదుర్దాగా బయలుదేరి వెళ్లారు మూడు గంటలబండీలో మద్రాసు.

రైలు నడుస్తుండగా రామనాథం అన్నాడు..."మన సూర్యం కొడుకున్నాడే వాడికైనా తెలీకుండా ఉంటుందంటారా... ఏమిటో...ఏం జరిగిందో ఎక్కడైనా అమ్మాయి కనిపించి అయినా ఉండదూ"

చటుక్కున ఏదో స్ఫురించిన వీరభద్రం "లేకపోతే మనమీద పగచేత ఆ దిక్కుమాలిన చక్రవర్తిగాడు ఏమైనా అత్యాచారం చేయించలేదుగదా' డగ్గుత్తికతో సందేహం వెలువరించాడు.

"ఛాఛా వాడివల్ల అటువంటిదేం జరగదు. అయినా మొన్న తల్లిదండ్రుల్ని కూడా పిలిపించాడట మద్రాసు - వాళ్ళుకూడా వెళ్ళి పక్షం కావస్తోంది" అంటూ రామనాథం చెప్పటం రాసాగాడు.

ఏమిటో గొడవ అన్నట్టు వీరభద్రం కిటికీలోంచి బయటికి చూస్తూ కాస్సేపు ఆలోచించాడు.

* * *

ఆదుర్దాతో ప్రిన్సిపాల్ రూంలో అడుగుపెట్టి, తొట్రుపాటు గొంతుతో తనవిషయం వివరించి ప్రిన్సిపాల్ వ్రాసిన ఉత్తరం చూపి ఏమిటని ప్రశ్నించాడు వీరభద్రం. ఆతనితో ఆచూకీకోరకు రామనాథంకూడా కొన్ని ప్రశ్నలు వేశాడు. కాని ఇద్దరూ నిరుత్సాహంతో బయటికి వచ్చారు.

మళ్ళీ ఏదో జ్ఞాపకంవచ్చి రామనాథం లోపలికివెళ్ళి బయటికివచ్చాడు. "చక్రవర్తిగాడు పరీక్షలుకూడా వ్రాశాడట"అన్నాడు వీరభద్రంతో...అయితే యిప్పుడేమంటావ్' అన్నాడు వీరభద్రం. 'వాడింటి అడ్రెసు తీసుకున్నాను పోదాం పదండి మాంబళం'అంటూ దారితీశాడు రామనాథం.

ఇంటిగేటు మూసివుంది. "చక్రవర్తి సినీ ఆర్టిస్ట్" అని బోర్డు ఉంది.

గేటుదగ్గర తారట్లాడుతూ 'పెద్ద కాంపౌండూ, బంగళానూ,విడెవరో సినిమా యాక్టరు - వాడై ఉండడు' అనగానే

గేటు వెనక భాగమున్న అల్సేషియన్ కుక్క అరుపుకు ఉలిక్కిపడ్డాడు వీరభద్రం. 'కుక్కలున్నాయి జాగ్రత్త' అని నత్తురు నత్తురు మంటూ వ్రాసి ఉన్న బోర్డు చదివాడు రామనాథం.

ఇంతలో బంగళా సింహద్వారం లోంచి సిల్కు లాల్చీ, పైజామా వేసుకున్న ఒక యువకుడు మూర్తిగొన్న యువతిలాగా, సుందరతిలాగా దగ్గరకు వచ్చి చూసి, గేటు తెరిచాడు రామనాథం నిలువునా ఆశ్చర్యపోయి నేనెవరో.. అనబోయాడు 'అదేమిటండీ గుర్తుపట్టాను రండి' అని ఆప్యాయంగా నవ్వి ఆహ్వానించాడు యువకుడు.

వీరభద్రం వెనుదిరిగి చూశాడు. అవమానం, ఆశ్చర్యం, భయం ముప్పిరిగొని ఉక్కిరి బిక్కిరై పోయాడు. తలదించుకుని మెల్లిగా అడుగులు వేస్తూ వెళ్లిపోబోతూడు వీరభద్రం. రామనాథం ఏమీ చేయలేక ఇటు యువకుడివైపూ — అటు వీరభద్రంవైపూ చూస్తూ నిలబడ్డాడు. యువకుడు ఆశ్చర్యంతో చూస్తూ ఉండిపోయాడు క్షణం. ఇంతలో పెద్ద ప్లిమత్ కారు ఒకటి మెల్లిగా నడచి రెండడుగులు సాగిన వీరభద్రంముందు ఆగింది.

కారులోంచి దిగిన ఒక బక్కపల్చటి పెద్దమనిషిని చూసి వీరభద్రం మతి నివ్వెరపడిపోయాడు. ఐదు వేళ్ళకు తొడిగిన రాళ్ళ ఉంగరాలు ధగధగ మెరుస్తుండగా వీరభద్రం భుజంపై చెయ్యి వేసి రండి వీరభద్రం గారూ అంటూ లోపలకి ఆహ్వానించి తీసుకువచ్చాడు.

గేటు దగ్గర నిలుచుండిపోయిన యువకుణ్ణి చూపిస్తూ 'వీడెవరో మీకు తెలుసనుకుంటాను' అన్నాడు ఆవ్యక్తి. గొంతు కాస్త సర్దుకుని 'మీ అబ్బాయి' నేను గుర్తుపట్టాను. అన్నాడు అశో స్వరంతో వీరభద్రం. 'కాదు అయితే సరిగా గుర్తించలేదు ప్రఖ్యాతి సినీనటుడు. లక్షాధికారి — పూర్వాశ్రమంలో ఒకబడి పంతులు కొడుకు — పేరుకు మాత్రం చక్రవర్తి —' అని కొంచెం ఆగి పరీక్షగా చూశాడు వీరభద్రం ముఖంలోకి ఆ పెద్దమనిషి.

అణువు అణువూ తనువెల్లా మాటలు ఈటెలై బాధించగా "సూర్యం-అదృష్టవంతుడివి... నాకు ఈ జన్మలోనే బాగా బుద్ధి చెప్పావు" అని గొణిగాడు తలవంచుకుని వీరభద్రం.

ఏమీ అర్థంకాక తనను తను గిల్లి చూసుకుని మరీ చూస్తున్నాడు రామనాథం.

తిరిగి సూర్యం అందుకున్నాడు. 'అప్పటి చక్రవర్తి కాదండీ వీరభద్రం గారు. అన్నానికి లేనివాడు చక్రవర్తి ఏమిటంటూ మీరు నా ముఖాన్నే నిందించారు. కనుక నే మీ ముఖాన్నే నేనూ ఒకమాట చెప్పవలసివస్తున్నది. నా కొడుకు ఈ వాడు మీ యింటికే చక్రవర్తి — మీ అమ్మాయి నా కోడలు.'

ఈ మాటలు విని ఒక్కసారి గరిమనాభి తప్పినట్లయింది వీరభద్రానికి. ఉప్పెనలో తెప్పమీద ఉన్నట్లు కళ్లు తిరిగిపోయాయి.

'మంగళాశాసనం పొలిమేర దగ్గరకే అయిందిగా. సరే లోపలికి దయచేయండి బావగారూ, అమ్మాయినీ అల్లుణ్ణి దీవించండి' అంటూ సూర్యం దారితీశాడు భావగర్వితంగా.

వెంటనే పకపకనించి రామనాథం అన్నారు. 'ఇంత ఆస్తిపరులై కట్నం ఆశించలేదు సరిగదా, ఉన్న చెంబూ తప్పేలా కూడా ఎదురిచ్చి చేసుకున్నట్లయింది' అన్నాడు. వీరభద్రం "డో టూ బ్రూటస్" అన్నప్పటి సీజర్ ముఖంపెట్టి 'రామనాథం

(63 వ పేజీ చూడండి)

అమెరికాలో కృష్చేవ్

చంద్రగోళంలోకి రాకెట్ పంపించాలనీ, అమెరికాకు కృశ్చేవ్‌ను పంపించాలనీ సోవియెట్ యూనియన్ కొంత కాలంగా ప్రయత్నిస్తోంది. ఈ నెల 14, 15 తేదీల్లో ఈ రెండూ ఒక్కసారిగా జరిగాయి.

అంతర్జాతీయంగా ఈ రెండూ అపూర్వ సంఘటనలే. రెండూ శాంతిప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని చేసినవే. రెంటికీ మానవజాతి భవిష్యత్తుమీద ఎంతో కొంత ప్రభావం ఉండకతప్పదు.


ప్రపంచంలోకల్లా బలీయమైన రెండు దేశాలు అత్యాధునికమైన మారణాస్త్రాలను, సైనిక బలాలను సమీకరించుకుని పరస్పర భయసందేహాలతో నిలబడిఉన్నాయి. ఏ దేశం కొంచెం తొందరపాటు చూపించినా ప్రపంచమే మారణహోమానికి ఆహుతి అయ్యే ప్రమాదం ఉంది. రాజకీయ, ఆర్థిక విధానాలలో ఎన్ని తేడాలున్నా ఈ గోళం మీద కలిసిమెలిసి సహజీవనం చేయక తప్పదనే సత్యాన్ని ఈ రెండు దేశాలు గ్రహించి పరస్పరం రాజీకి రావటంమీద ప్రపంచ ప్రజల మనుగడ ఆధారపడి ఉంది.


ఈ సత్యాన్ని రష్యా, అమెరికాలు రెండూ గ్రహిస్తున్నాయనటానికి, అమెరికా అధ్యక్షుడు సోవియెట్ ప్రధానిని తమ దేశానికి ఆహ్వానించటం, తాను సోవియెట్ ప్రధాని ఆహ్వానం అంగీకరించి ఈ ఏడాది ఆఖర్లోగా రష్యా వెళ్ళటానికి నిశ్చయించడం ప్రబలమైన ఉదాహరణ.

చంద్రగోళానికి రాకెట్ పంపించటం వలన ప్రత్యక్షలాభాలేమేమి సాధించవచ్చునో ఇంకా తెలియటంలేదని శాస్త్రజ్ఞులు అంటున్నారు. అదేవిధంగా కృశ్చేవ్ అమెరికా పర్యటనవల్ల వెంటనే కలిగే ప్రయోజనం ఏమిటో ఇప్పటికిప్పుడే చెప్పలేమని రాజకీయ వేత్తలు అంటున్నారు.

చంద్రగోళానికి రాకెట్ పంపించటంవల్ల వెంటనే ప్రత్యక్ష లాభాలు కనిపించక పోయినా, అలా పంపించటమే మానవునికి గొప్పవిజయంగా, మానవుని మేధాశక్తికి నిదర్శనంగా తీసుకోవచ్చు. అలా కృశ్చేవ్ అమెరికా పర్యటనవలన వెంటనే ప్రచ్ఛన్న యుద్ధం అంతరించి, ప్రత్యక్ష శాంతి ఏర్పడినా ఏర్పడకపోయినా, అసలు ఆ పర్యటన సంభవం కావటమే హర్షించదగినది; శాంతియుత సహజీవనం వైపు ఒక అడుగైనా ముందుకు వేయటం వంటిది.

కృశ్చేవ్ అమెరికా రావటం అమెరికన్ రాజకీయ నాయకుల్లో అనేకులకు ఇష్టం లేదు. అమెరికాలో ఆయనకిచ్చిన స్వాగతం అటూ ఇటూగా ఉంది. ప్రభుత్వమూ, కొన్ని సంస్థలూ, ఒక గొప్ప అతిథికివ్వవలసిన మర్యాద ఇచ్చాయి. ప్రజాబాహుళ్యం ఉత్సాహంతో పొంగిపోనూలేదు, అమర్యాద చూపనూలేదు; ఒకవిధమైన ముభావంతో ప్రవర్తించారు. హంగరీ, ఇతర తూర్పు యూరప్ రాజ్యాలనుంచి పారిపోయివచ్చిన కాందిశీకులు మాత్రం కృశ్చేవ్‌ను అభిశంసిస్తూ ప్రదర్శనలు చేశారు. న్యూయార్క్ మేయర్ సోవియెట్ ప్రధానికిచ్చిన విందుకు అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రూమన్,





ప్రపంచసమస్యలను ముఖాముఖి చర్చించటానికి ఇటీవల కలుసుకున్న

ఐసెన్‌హోవర్ — కృశ్చేవ్


న్యూయార్క్ మాజీ గవర్నరు హారిమన్ డిసే మొదలైన ప్రముఖులు హాజరుకా నిరాకరించారు. పత్రికాప్రతినిధులు హంగరీ లాంటి విషయాలు ప్రస్తావించి కృశ్చేవ్‌ను ఇరకాటంలో పెట్టాలని చూశారు. రెండువేలమంది వ్యాపారస్తులు సమావేశమైన న్యూయార్క్ ఎకనామిక్ క్లబ్ సభలో కొందరు రష్యన్ సెన్సార్‌షిప్ నిబంధనలను గూర్చి ప్రశ్నలువేసి కృశ్చేవ్ సభ విడిచి వెళ్ళిపోతానని కోపంగా బెదిరించేదాకా ఇబ్బంది పెట్టారు. ఇంకా యిలాంటివే ఎన్నో జరిగాయి. కృశ్చేవ్ పర్యటన ముగిసేలోగా మరికొన్ని జరగవచ్చు.

కాని సోవియెట్ ప్రధాని తాము కోరి కోరి అమెరికా వచ్చినందుకు నాలిక్కరుచుకుంటున్నారనటానికి దాఖలా లేదు. వ్యతిరేక ప్రదర్శనలను పట్టించుకుంటున్నట్లు లేదు. "నన్ను ఈ దేశానికి రానివ్వటం కొందరు అమెరికన్ రాజకీయ నాయకులకు ఇష్టం లేదని తెలుస్తూనే ఉంది. కాని మీ అధ్యక్షుడు నన్ను ఆహ్వానించి గొప్ప వివేకం, మనోబలం ప్రదర్శించారు" అని ఆయన అన్నారు. "ప్రచ్ఛన్నయుద్ధం తగ్గుతుందన్న సూచనలే కాదు. నిజంగానే తగ్గుముఖం పట్టింది," అని ఉత్సాహపడ్డారు. అమెరికా రష్యాల మధ్య స్థిరమైన స్నేహభావం, వ్యాపార, సాంస్కృతిక సంబంధాలు అభివృద్ధి చేయటానికే తాము వచ్చామని చెపుతున్నారు. పారిశ్రామిక, వ్యవసాయక రంగాలలో అమెరికన్లు సాధించిన అద్భుత పురోగమనానికి 'జోహార్' అన్నారు. అమెరికనులు నిజంగా శాంతి అభిలషిస్తున్నారని తనకు నమ్మకం కలిగిందన్నారు.

81 దేశాల ప్రతినిధులుపాల్గొన్న సమితి సర్వసభ్య సమావేశంలో ఆయనచేసిన ప్రసంగం పలువురికి ఆశ్చర్యం కలిగించింది. ఆచరణసాధ్యం కాదని మొహంమీదే తెలిసిపోతున్న దీర్ఘప్రతిపాదనలు కొన్ని ఆయన చేశారు. ఇవి వినటానికి చాలాబాగున్నాయి. "నాలుగేళ్ళలో అన్ని దేశాలూ పూర్తిగా నిరాయుధీకరణ అమలుజరపాలి. అన్ని రకాల కాల్బలాలు, నౌకా, విమానదళాలు రద్దయిపోవాలి. సైన్యాధ్యక్ష పదవులను, యుద్ధశాఖలను రద్దుచేయాలి. సైనిక శిక్షణాలయాలను మూసివెయ్యాలి. విదేశాలలో సైనిక స్థావరాలను ఎత్తివేయాలి. తయారైన అణ్వస్త్రాలను నిర్మూలించాలి. ఇకముందు అవి తయారుకాకుండా నిషేధించాలి.

దేశాల మధ్య సంబంధాలకు 'పంచశీల' ప్రాతిపదికగా పెట్టుకోవాలని విశ్వసిస్తున్న భారతదేశానికి, ఆర్థికంగా వెనుకబడిన ఆసియా, ఆఫ్రికా ఖండాల ప్రజలకు

(62-వ పేజీ చూడండి)



మీరు ఇలా హఠాత్తుగా కాదంటే ఎలా? మీరు కాదనరన్న ఆశతో మేము ఇంగులో దిగాం కదా మూడుపూటలు గడువివ్వండి ఖాళీ చేస్తాము అన్నాడు సింహాద్రి.

సుబ్బన్న మందహాసం చేశాడు. అప్పు దొరుకుతుందన్న ఊహతో గాలిపుట్టలు కట్టుకోడం చాలా పొరబాటు—ఐదారు జన్మల తరవాత నువ్వు గాలిమేడ కట్టబోయినట్టు అన్నాడు.

సింహాద్రి గుండె గతుక్కుమంది. నేనింకా ఐదారు జన్మలెత్తాలా?

ఐదారేం ఖర్మ...జన్మజన్మాల ప్రాప్తో వస్తూ పగబట్టి, ఇచ్చి పుచ్చుకోడాలు తీరి సరిపడేదాకా ఇకనేసని.

ఐతే అప్పుడు నేనేం చేస్తాను? ఏమవుతుంది అన్నాడు సింహాద్రి.

అవడానికేముంది. నీదగ్గిర మామూలుగానే డబ్బుండదు. ఇప్పటిలాగానే అప్పుడూ అప్పులూ చేస్తూ ఉంటావు అప్పుడు, ఒగోజున గబగబా అప్పులన్నీ తీర్చి అవతల పారెయ్యడమే కాక, అప్పులవాళ్ళందరి మొహాలూ బద్దలయేలా డబ్బు విసిరికొట్టి, వాళ్ళకి ఎగురప్పులుకూడా యిచ్చి ఏడిపించేటంత ధనికుడివి కావాలన్న గుర్రాశ కొద్దీ ఒరోజు పొద్దున్నే మంచిమాట చేసుకుని, చిన్న లక్షాధికారింటికి వెళ్ళి ఐదొందలు అప్పుతీసుకుని, పెద్ద కోటీశ్వర్రావింటికి బయలుదేరుతావు. ఓ షిర్లాగారింటికి వెళ్ళి చేబదులు అడగాలని వెళ్తావుంటావు. ఆగోజున షిర్లాగారు కారు నచ్చక పరదాకి రిక్షామీద కొంచెం దూరం వెళ్తారు. రిక్షాకి కూలి ఐదొందలివ్వడానికి చిల్లరలేక లక్షరూపాయల నోటుకి చిల్లర దొరక్క వాట్ అనుకుంటూ వుంటారు. చేంజి నాదగ్గరుందని అందాకా ఆ పక్కనే ఉన్న నువ్వు ఆ డబ్బులిచ్చి రిక్షాని పంపేస్తావు. అనక ఆగాన నీ ఫ్రెండయిపోయి, ఎప్పుడేనా లక్షా కోటీ ఇబ్బందయితే మొహమాట పడకు పుచ్చుగో అంటారు. అంటూ ఓకోటిస్తాడు ఇంకోటిమ్మంటావు నువ్వు. గంటసేపటో అప్పుతీరుస్తానంటావు. ఆ రెండుకోట్లూ ఇలా ఆ గంటా పట్టుకు నేసరికి ఊళ్లో పలుకుబడి దారుణంగా పెరిగిపోయి పెద్ద డబ్బు-గాడీలో పడిపోతావు. అప్పుడు ఖంగారులో షిర్లాగారే నీదగ్గిర సదీ సగకా లక్షలు అప్పు తీసుకుంటాడు కూడా.

ఈ విసంగా ఆలోచించుకుంటూ నే ఓపక్క అప్పులవాళ్ళకు అంకకుండా, వాన చినుకులమధ్య సహదేవుడు గుర్రం తోలినటు నీ చేతిలో డబ్బు పట్టుకు వెళ్తావుంటావు. అయితే నీ కల్పతాక పన్నె వేళానికి వచ్చే సరికి, ఆకలంలో నీచేత డబ్బును ఏ షిర్లావో అడిగాడనుకుని అందించబోయినటు పట్టుకుంటావు. అప్పుడు ఎక్కడించో అప్పారావు వచ్చి రెండొందలు చేబదులు తీసుకుని, నీదగ్గిర డబ్బుందని గాలిలో ఊదేవరకూ అప్పులవాళు వడగళ్ళలావచ్చిపడి ఉన్నది ఊడ్చుకపోతారు.

ఓ సింహాద్రి! ఇపుడూ అబుద్ధే ప్రదర్శించి దొంకభోయే అప్పును నమ్ముకుని నాపుట్టలో ప్రవేశించావు. గాన తెలుపడమైనది అని సుబ్బన్న ఊరుకున్నాడు.

సింహాద్రి తెల్లబోయి తేరుకుని నవాబాసు. ఔనుగాని, సుబ్బన్నా నీకెలా తెలుసు ఇవన్నీ, ఈ జన్మలూ ఫరాయింపులూ కథాకమామిషూనూ! అన్నాడు

నీవు నేర్పిన విద్యయే అన్నాడు సుబ్బన్న వినమ్రత ఉట్టిపడేలా.

నాగలక్ష్మికి ఈ వరస చూడగా ఒళ్లుమండింది. బావుంది నీవినయం నువ్వూ. ఆనక కథయ్యేటపుడు అంతాకలిసి ఫాటోగ్రాఫు దిగుదురుగాని గాని, ముందరవాళ్ళని లేవగొట్టు అంది ధరతో.

ఒనడికొరుచీను, గొంతుసవరించుకుని కలగజేసుకుంది. అయ్యా సుబ్బన్నగారూ. అలా చెప్పదుమాటలు నరాదు చెడేరు పూర్వకురప్పల్లో రామయ్య అని రైతు ఉండేవాడు. ఓమాయదారి మారయ్యాకి ఓనాలుగొందలు అప్పివ్వడానికి వడిగట్టి మర్నాగు పంచాయితీ దగ్గిరకొస్తే కొయితం రాసుకు నగదుపుచ్చుగుందుగాని నమ్మకన్నాడు. మారయ్య అప్పులు తీర్చడని భయపడ్డ నలుగురు గుర్నాగ్గులు ఇది తెలిసి పంచాయితీ ఆఫీసు అరుగుముందు రామయ్య ఒక్కడూ కూర్చుని ఉండగా చూసి కొంచెం అసింటా కూర్చుని, ఈవూళ్ళో ఎవడో వెర్రివెంగళాయి మారయ్యాని నమ్మి అప్పిడుతున్నాట్ట అంతకన్న డబ్బుని గోయితీసి కప్పెట్టుకోరాదూ అని వినిపించేలా రామయ్యాకి వినపడేలా అనుకుని లేచి చక్కాపోయార్ట. వరసగా ఇలా నలుగురు అనుకునేవరకు రామయ్యకు మతిచెడి, ఏమో ఈ మారయ్యాకి అప్పివ్వడం మంచిది కాదేమో ననుకుని అతను రాగానే నేనివ్వనని చెప్పి లేచిపోయాట్ట. అప్పుడు ఊరివారూ మునసబూ అంతా సంతోషించార్ట. రామయ్యాకి గొప్ప ప్రమాదం తప్పింది-చెప్పుడుమాటలు వినడంవల్లనే గదా అహో! అనుకున్నారుట...

శీను హఠాత్తుగా కథ ఆపేసి చుట్టూ చూసింది. మిగతా శీమలన్నీ తినేశేసి భయంకరంగా చూస్తున్నాయి. నాగలక్ష్మి, సుబ్బన్న విరగబడి నవ్వుతున్నారు.

శీను నాలిక్కరచుకుంది. ఓహో తప్పుకథ చెప్పాను కాబోలు. లేదా కథ తప్పు చెప్పి వుంటాను. పొంబాటు అంది.

కథేకాదు. నువ్వు మాటాడడమే పొరబాటు. అసలు నువ్వే పెద్ద పొరబాటు అన్నాడు సింహాద్రి.

సుబ్బన్నా నాగలక్ష్మి ఇహ లాభంలేదని కూడ బలుక్కుని పడగలు దింపి పుట్టమీదికి బయల్దేరంబోయారు. చీమలన్నీ, వాటభాషలో హాహాకారాలు చేశాయి. అంతలో చూస్తూ ఉండగా సుబ్బన్నకి కొంచెం ఎదరగా ఓ పెద్ద తేగ నీడపడి, ముంగుగా సాగిపోయింది బాబోయి అంది నాగలక్ష్మి పైకి చూసి.

అప్పులవాడులా వుంది అన్నాడు చీమల సింహాద్రి నవ్వుతూ.

సుబ్బన్న మాటాడలేదు. నాగలక్ష్మిని వెంటేసుకుని పక్కనే ఉన్న పొదలోదూరి కూర్చున్నాడు. ఇపుడు గనక చీమలన్నీ ఇవతలికొచ్చేస్తే, అది పెనించి చూసి, ఇక్కడేదో ఫలహారం ఉందని కిందకి దిగుతుంది అంది. నాగలక్ష్మి మాటాడలేదు.

అయ్యా సుబ్బన్నగారూ మీరు చాలా అద్భుతమైన నికుంజంలో ప్రవేశించారు. అదృష్టవంతులు. ఇపుడపుడే షికారు వెళ్లరు కాబట్టి అప్పారావు కథ ముగించేస్తారా! అతనికి మునసబుగారు అప్పిచ్చినట్టా లేనట్టా అన్నాడు సింహాద్రి.

పొద మాట్లాడలేదు.

బాగ్లుంది మీరు చెప్పకపోతే ఆ కథేదో మిగతాగ నేచెబుతా పట్టండి అన్నాడు అన్నాడు.

★ ఋణానందలహరి ★

ఆ విధంగా అప్పారావుకు బాకీ తీర్చసత్తా ఉందో లేదో కనుక్కొస్తానని త్వరమార్గు గుర్నాధం కదలగానే, మునసబు గారుకూడా లేచి అగరా అబ్బీ నేనూ వస్తా. అటేపే పనుంది. అంటూ వెంట బయల్దేరారు.

ఈ విధంగా వారు వెళ్తూండగా, గడ్డల గుర్రమంటి ఓ చిన్నది. కడవ చంకన బెట్టినది వయారంగా పోతూ ఎదురయ్యే వరకూ, అదృష్ట వశాత్తు గుర్నాధానికి ఎరిగిన గుని పాకను తటస్థపడగా, నువ్వు పద వా న్నా

అంటూ ఒక్క దుడు ఆగాడు గుర్నాధం. ఈలోగా నాలుగు అడుగులు ముందుకువేసి వీధి మలుపు తిరిగి శివాలయం చేరబోయే సరికి మునసబు గారికి సుబ్బారావు అని ఒక ఋణ గృహీత కనుపించాడు. అతడు ఆయనకు ఏదో ంనలు ఇవ్వాలి. నిన్నో మొన్నో ఇస్తా పెడతానన్నాడు. సరే ఇతగాడిస్తే, తన సుపుత్రుడి మిత్రుడికి ఈ పైకం ఇలాగే ఫిరాయించేయొచ్చునని ముచ్చటపడి మునసబు

సహకారంలో ఉన్న చమత్కారం

స్వయం సహాయం. పరస్పర సహకారంవలన ఎంతటి పనులయినా ఎలా అవలీలగా సాధించుకోవచ్చునో ఉత్తర ప్రదేశ్‌లోని సెహానీ గ్రామ మహిళలు ఋజువుచేశారు. తమ యిళ్లకు చేరువగా ఒక బావి ఉంటే వీలుగా ఉంటుందని వారు ఎన్నాళ్లనుంచో అనుకుంటున్నారు. అది అంత తేలికగా సాధ్యపడేదికాదని మగవారు మాట్లాడకుండా ఊరుకున్నారు.

ఒకరికొకరు సహాయంగా కృషిచేస్తే, తప్పకుండా సాధించవచ్చునని తోచింది స్త్రీలకు. అంతే, నలుగురు స్త్రీలు నడుంకట్టి బావి త్రవ్వడం ఆరంభించారు. నమ్మండి. అరవై అడుగుల లోతుకు త్రవ్వారు. నీరు పడింది।

పొరుగు గ్రామాలవారు కూడా ఈ ఉత్సాహాన్ని ఊతగా తీసుకుని కృషిచేస్తున్నారంటే, అందులో ఆశ్చర్య మేముందీ?



సహకార యత్నంవలన మానవ సర్వ సౌకర్యాలూ సమకూరడమే కాక, జంతు సంక్షేమం కూడా సాధ్య పడుతుంది. తద్వారా దేశకల్యాణం త్వరితంగా వర్ధిల్లుతుంది.

ప్రణాళికకు సహకారమివ్వండి

మీ మేలుకు మీరు కృషిచేయండి!

గాగా అతనిదరి చేరబోయారు.

వారిని చూడగానే అప్పారావుకు గుండె గుభేలుమంది అయితే అతను ఉపాయాలపుట్ట కాబట్టి, కర్తవ్యాలు ఎరిగినవాడు కాబట్టి ఆ దారినే బడికి పోతున్న పిల్లల్ని చూసి అందులో ఒకణ్ణి ఆప్యాయంగా ఎత్తుకు ముద్దాడబోయాడు.

వాడు మా వాడు కాడు అన్నారు మునసబుగారు చిరునవ్వి.

అప్పారావు ఆ పిల్లాణ్ణి పడేసి మందలో ఇంకోణ్ణి ఎత్తుకుని ముద్దాడి ఆయన వంక చూశాడు.

వీడూ కాడు అన్నాయి మునసబుగారి చూపులు వెంటనే అప్పారావు వాణ్ణి పారేసి ఇంకోణ్ణి తీసి ముద్దాడే ముందు ప్రశ్నార్థకంగా చూశాడు.

వద్దు అన్నాయి మునసబుగారి చూపులు.

అప్పారావు ఖంగారుగా ఇంకో పిల్లడిని ఏరి ఎత్తుకోబోగా నాకు ఆ వయసు చిన్న పిల్లలు లేరు అన్నాడు మునసబుగారు నవ్వి.

చిత్రం. ఏ వయసులో ఉంటారండి సుమారు అన్నాడు అప్పారావు వినయం నటించి.

పాతికేళ్లు.

అబ్బా. చాలా బరువుంటాడాండి! అన్నాడు అప్పారావు బిక్కమొహంతో.

నీకన్న ఫరవాలేదు. వెనవాయి తిండి పనిలేక అలా వున్నాడుగాని, మా వంశంలో వాడే అర్భకుడు. అయినా నువ్విపుడు వాణ్ణెత్తుకోడం నాకిష్టం లేదు నేనొప్పుకున్నా వాడికి ఇష్టం వుండదు. వాడి పెళ్లాం నవ్వుతుందని భయం అన్నారు మునసబుగారు పుసుక్కున నవ్వి.

అప్పారావు ఫెళఫెళ నవ్వేసి, విరగబడి లేచి, భలేవారండీ మీరు. ఝంతపరకులూ చూటానికలా వున్నారుగాని అని ముడుకుపోయాడు.

అది సరేగాని సుబ్బారావూ మూణ్ణాళ్ళ క్రితమే పైకంజమచేస్తానన్నావూ ఇదే మన్నా బాగుందా అన్నారు మునసబుగారు.

మరేండి ఏంబావుంది. మహాపిడిని పట్టుంది చాలా తప్పుకాదు! అమాటే నేను మా జతగాడికి చెబుతున్నా ఒరేయ్ అవతల పెద్ద మనిషితో మాటరోయ్ మరోటి కాదురోయ్ డబ్బు ఇచ్చి తీరాలి అని చివాట్లేస్తున్నా. ఈపూట తప్పకుండా ఇస్తున్నాడురా గానే మీకు ఫిరాయించేస్తా అన్నాడు అప్పారావు.

నేనేనా దాన్ని పాతరేసి దాచబొయ్యేది లేదు. నువ్విలా ఇచ్చావో నేనలా మరొకరికి ఖరాయించేస్తా. మా పల్లడి జతగాడికి పాపం అర్జెంటుగా కావాలిట అన్నాడు మునసబుగారు

అప్పారావు గుండె తంగున ఆగిపోంది. అంతలో అల్లంత దూరాన సుర్నాధాన్ని చూడగానే మళ్లీ గబ గబ కొట్టుకుండె.

సుబ్బారావ్ వాడేనోయ్ మా పిల్లాడూ అన్నారు మునసబుగారు.

చిత్రం వాడే మా జతగాడు అన్నాడు అప్పారావు,

హల్లో అప్పారావ్ సారీ లేటైంది అన్నాడు సుర్నాధం.

వేళకొచ్చావురా! అన్నాడు అప్పారావు నీపేరు సుబ్బారావుగాదటోయ్ అన్నారు మునసబుగారు అనుమానంగా.

అప్పారావు చెడ్డబటాణీ నమిలిన వేదాంతిలా నవ్వి వాటెజ్ దేర్ ఇన్ ఏ నేమ్ సార్. పేరులో నేముంది అన్నాడు వినయంగా.

* * *

పదినిమిషాలు కిందామీదాపడ్డాక మునసబుగారు ఫెళ ఫెళ నవ్వి భలేవాడివయ్యా నీకు నిజంగా ఐదొందలూ వూరికే యిచ్చినా తప్పులేదు అన్నారు.

చిత్రం మీదయ సుర్నాధం! నువ్విస్తానన్న అయిదొందలూ ఇస్తే, మీ నాన్నగారికి బాకీ తీర్చేస్తానుమరి. పెద్దమనిషితో మాటా మరోటా అన్నాడు.

ఇంక మళ్ళీ వాడు ఇచ్చేదేముంది లే. వాడిచ్చినట్టేననుకో అన్నారు మునసబుగారు.

చిత్రం. అయితే వీడిచ్చింది మీకు నేనిచ్చినట్టేననుకోండి. ముందర మీబాకీ ఫయిసలయిందిగదా. అమ్మయ్య. గుండెలమీద రాయిదిగినట్టయింది అదేమిటో ఆరాయి లేపోతే నాకు నిద్రపట్టదు అన్నాడు అప్పారావు.

రాస్కెల్ మా నాన్నకే వేలా వేటోపి నాకు తెలీకుండా మా నాన్న దగ్గిర ఎలా పుచ్చుకున్నావూ అన్నాడు సుర్నాధం.

బావుంది నీకు తెలీకుండా నీదగ్గిర తీసుకోగాలేంది మీనాన్నదగ్గిర తీసుకోడం విశేషమా. నీకసలు వివ్యాకం తెలీదు.

అలా చెప్పు నాయనా అన్నారు మునసబుగారు.

చెబుతానండి. ఇంకో వోల్డు చెబుతాను. గాని మీరిందాక మాటన్నారు చూడండి... అసే ఐదొందలు ఊరికే ఇచ్చినా ఫర్వాలేదనలేదా! అది ఇచ్చేస్తే బాగుంటుంది. ఆడినమాట తప్పని వారు. పైగా శివాలయం, పైన అన్న దేవతలూ సాక్షులు. అనవసరంగా ఋణోత పడి ఇదవడం, నాకు బాకీ ఉన్నారన్న చింతతో రాత్రుల్ని నిద్రపట్టక ఇదవడం మంచిదికాదు. అన్నాడు అప్పారావు.

ఏడిశావు పోడి తెలివి నువ్వూను అనబోయాడు సుర్నాధం.

కుర్రాడు మంచి చమత్కారి. ఉండాల్సినవాడు. అలాగే లేవయ్యా. నాలుగు రోజులు ఆగు, చేతికి డబ్బురాగానే నీ బాకీ జమకడతాను. అన్నారు మునసబుగారు.

చిత్రం నేను ఎల్లుండి ఊరికెళుతున్నాను. ఈలోగా ఇచ్చెయ్యండి. ఒకవేళ డబ్బు రెడీ కాపోతే, కరణంగారు వస్తారుగదూ. వారితో చెప్పి పదుమంటాను. తరవాత మీరూ మీరూ చూసుకుందురుగాని......లేచి లే సుర్నాధం! మీ నాన్నగారు ఐదొందలు ఇవ్వగానే మళ్ళీ నీది నీకిస్తా గాని ఓ అర్ధణా డబ్బు లిలా పారెయ్! కోషాస్తోంది సోడా తాగాలి......

* * *

అంటూ కథ ముగించాడు చీమల సింహాద్రి. కాబట్టి ఓ సుబ్బన్నా...

అంటూహఠాత్తుగా నేలమీద వేగనీడ కనబడేసరికిగబుక్కున పుట్టలోదూరిపోయాడు.

ఉత్తర క్షణంలో, ఇదేమిటీ! చీమకి వేగలంటే భయమేల అనుకుని, తన శరీరం చూసుకుని గతుక్కుమన్నాడు.

చుట్టూ చూసి ఇంకా గతుక్కుమన్నాడు. హడిలిపోయాడు. గజగజ వణికిపోయాడు.

మెల్లగా పడగెత్తి పుట్ట అవతలికి తొంగి చూశాడు. వేగ, పైన చక్రాలు తిరిగి తిరిగి ఒక్కసారి రివ్వున, సుబ్బన్నా నాగలక్ష్మీ అంతకుముందు దాగిన పాదమీదకు దిగి దాన్ని చీకాకు పరిచి వెతికి తెల్లబోయి చిన్నబుచ్చుకొని, నవ్వుకొని అటూ ఇటూ చూసి ఎవరూ తన పరాభవం చూడలేదని ధైర్యం తెచ్చుకొని ఎగిరిపోయింది.

ఓ నిముషం తరువాత సుబ్బన్న, నాగలక్ష్మి పాద ఇవతలికి వచ్చారు.

పుటలోంచి సింహాద్రి, అతని బలగం కూడా బయటపడ్డారు విలవిల్లాడుతూ.

ఇదేమిటి వింత? అన్నాడు సుబ్బన్న

సింహాద్రి,చుట్టూ చూశాడు తన కళ్ళను తనే నమ్మలేక తనూ తన సాటిలక్షలాది చీమలూ పాములుగా మారిపోవడం జరిగింది.

అంతవరకు ఊహ సాగరుగా బుసలు కొడుతున్న సుబ్బన్నా నాగలక్ష్మీ నేలకంటుకుని ఉన్నారు. వాళ్ళిద్దరూ చీమలు...

నాకర్థంకాలేదు అన్నాడు సుబ్బన్న.

ఏముంది ఆశ్నల్లు స్నేహంచేస్తే వారు వీరవుతారు అన్నాడు సింహాద్రి తమాషాగా నవ్వి. అతను తనపడగా అదీ చూసుకు మురిసిపోతున్నాడు.

ఇపుడు మీరంతా పాములు. ఇన్ని లక్షల మందికి ఒక పుట్ట ఎలాగా చాలదుగదా అంది నాగలక్ష్మి. ఆశగా

మీరద్దరే చీమలు. మీకు ఇంత పెద్ద పుట్టెందుకు కావురుమంటూను. నిశ్రాత్రి వేళ కొలకుక చేరుకుంటారు కూడాను అన్నాడు సింహాద్రి.

నాగలక్ష్మి ఓ నిముషం ఆలోచించి, భయపడితే వదుతాం. గాని, ఆపుట్ట మాకు అప్పివ్వండి. ఎంతసేపు. ఇట్టే నిండుతుంది తెండి అంది.

అప్పా! అన్నాడు సింహాద్రి పక పక నవ్వి.మళ్ళీ అదేంమాట. ఇంకాకగా మీ ఆయన అప్పులు అనగరాదూ ఇవ్వరాదూ అని నీతికథలతో ప్రపంచతంత్రం బోధపరచా ననుకున్నాడు! మళ్ళీ ప్లేటు ఫిరాయిస్తారా.

(50 వ పేజి చూడండి)

తెలుగు వెలుగులు-4



ఇది దాదాపు పధ్నాలుగేళ్ల నాటిమాట.

1946 జనవరిలో మహాత్ముడు రైలులో మద్రాసునుంచి సేవాగ్రామ్‌కు ప్రయాణమై వెళుతూ విజయవాడ ఊరిబయట కొంచెం సేపు ఆగారు. ఊరి జనమంతా కదలివెళ్ళి వారి దర్శనం చేసుకున్నారు; సందేశం విన్నారు. పుర ప్రముఖుడు, మహాత్ముని అనుచరుడు అయిన ఒక వ్యక్తిమాత్రం అస్వస్థత కారణంగా వెళ్ళి చూడలేకపోయాడు. దర్శనం చేసుకోలేకపోయినందుకు బాధ పడుతూ వచ్చీరాని ఉర్దూ భాషలో తన అశక్తతను వ్యక్తపరుస్తూ ఇంటివద్ద నుంచే ఒక చిన్న చీటీముక్క వ్రాసి గాంధీజీకి అందజేశాడు...మహాత్ముని కార్యదర్శి ప్యారీలాల్ ఆ చీటీకి సమాధానంగా ఈ విధంగా ఒక కార్డు వ్రాసి పక్కనే వున్న మధిర స్టేషన్‌లో పోస్టుచేశారు: "మీరు ఎందుచేత తరుచూ జబ్బు పడుతున్నారు? బాపు హుకుం అయింది; ఇకమీద జబ్బు పడకూడదు. భయపడకండి." అంతే; ఆ కార్డు ముక్క చేరిన ఉదయంనుంచే జ్వరం ఎటు పోయిందో పోయింది.

ఇది ఎవరి విషయమో కాదు: ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి అయ్యదేవర కాళేశ్వరరావుగారి విషయమే.

పట్టభద్రుడై న్యాయశాస్త్రాభ్యాసం ప్రారంభించని కొత్త రోజులలో—అంటే యాభైఏళ్ళ క్రితం—కాళేశ్వరరావుగారు బందరు నోబుల్ కళాశాలలో అధ్యాపకుడుగా పనిచేశారనే విషయం ఈ తరం వాళ్లకు చాలామందికి తెలియకపోవచ్చు. అక్కడ కొంతమంది ఆంగ్ల బాలురు కూడా చదువుకుంటుండేవాళ్లు. విద్యార్థులను కళ్ళెదురుతో కట్టుకురావాలి గాని, ఏ పరిస్థితులలోనూ కొటకూడదన్నది పంతులుగారి నియమం. ఒకరోజు 'ఉడ్' అనే ఆంగ్ల బాలుడు తన తరగతిలో చదువుతున్న తెలుగు విద్యార్థిని బూటుకాలితో ఒక్క తన్ను తన్ని వచ్చి తిరిగి తనస్థానంలో కూర్చున్నాడట.

దీన్ని కళ్లారా చూసిన కాళేశ్వరరావుగారు:

"ఉడ్! ఎందుకలా చేశావ్? తప్పు కాదా?" అని ప్రశ్నించారట.

"అతడు నన్ను వెక్కిరించాడు. అందుకు చేసి పని చేశాను," అని బాలుడు బదులు చెప్పాడట.


"వెక్కిరిస్తే నాతో చెప్పాలిగాని, అల చేయవచ్చా?"

"నేనేమీ ఆడదాన్ని కాదు—మీతో ఫిర్యాదు చేయడానికి."

"అలా కాదు; చేసిన తప్పుకు క్షమాపణ చెప్పుకో."

క్షమాపణ చెప్పుకోడానికి ఆంగ్ల బాలుడు

(55-వ పేజీ చూడండి)



ముమూర్షు

రావి. కొండలరావు

అర్ధరాత్రి వేళ-నడివీధికి ఎడమప్రక్కగా పాతుకుపోయివున్న ఎలక్ట్రిక్ స్తంభానికి ఆనుకుని, కుడిచెయ్యి పైకెత్తి తలక్రింద పెట్టుకుని, ఎడమకాలు పైకి మడిచి స్తంభానికి ఆన్చి—నించునివున్నవాడు "రామ్మూర్తి" అని చెబితే ఎవరూ నమ్మరు. కాని-అవును-అతను మూడుమూర్తులా అక్షరాలా రామ్మూర్తే! ఆవేళప్పుడు రామ్మూర్తిని గనక ఎవరన్నా అక్కడ చూస్తే - అతను బ్రతికేవున్నా దెయ్యాన్ని చూసినట్టు భయపడేవారేమో! ఎంచాతంటే ఏ రాత్రీ తొమ్మిది దాటితే గుమ్మం దాటనివాడూ గుమాస్తా ఉద్యోగం చేస్తూ పిల్లాజెల్లాతో జీవితం వెళ్ళబుచ్చుకుంటున్నవాడూ అయిన రామ్మూర్తి ఇట్లా అర్ధరాత్రివేళ-వీధి నిశ్శబ్దంలో పడి నిర్మానుష్యమైనాక - ఎలక్ట్రిక్ స్తంభానికి ఆనుకుని బల్లిలాగా అంటుకుని, నించుని వున్నాడంటే ఎవరికన్నా ఆశ్చర్యం వేస్తుంది! ఐతే రామ్మూర్తి నిజంగా అంటుకుపోలేదు - ఆలోచనాపరుడై అరగంటసేపాయి అట్లా ఒంటికాలుమీద తపస్సు చేస్తున్నాడు!

సాధారణంగా అందరికీ కలుగుతున్నట్టే రామ్మూర్తికీ జీవితంమీద విరక్తి కలిగింది. 'ఎందుకు బ్రతకాలి?' అని ఓ

★ ముమూర్ష ★

ప్రశ్న. 'చావటానికి కాదా?' అని తనే తిరిగి ప్రశ్న. 'చావటానికే అయితే బ్రతకటం ఎందుకూ?' అనే పాత పాటే సమాధానం! ఈ రకం వైరాగ్యంలో పడి రామ్మూర్తి ఆరునెల్లయింది. ఆరునెల్ల క్రిందట ప్రారంభించిన ఈ వైరాగ్యం దినదిన ప్రవర్ధమానమై ఈనాడు అర్ధరాత్రివేళ అతన్నిట్లా ఇల్లుదాటింపించి, ఈ ఎలక్ట్రిక్ స్తంభానికి చేరబెట్టింది! ఎక్కడి నుంచో వస్తూన్న కారులైటు రామ్మూర్తి మొహంమీదపడి, కళ్ళమ్మట కారబోతున్న నీటి చుక్కలను తళుక్కుమనిపించింది. రామ్మూర్తి తల దించుకున్నాడు. తన తలపై వున్న ఎలక్ట్రిక్ దీపం వెలుగుతూనే వుంది. ఈ వేళప్పుడు తనను ఎవరన్నా చూస్తారేమో నని తలను ఇంకా దించుకున్నాడు – అంత విరక్తిలోనయినా ఆత్మాభిమానం అనేది చావక! ఆ దించుకోటంలో అతని చూపు అక్కడున్న ఓ కుక్కపై పడ్డది. ఆ కుక్క రామ్మూర్తిని అదే చూడటం! ఐనా, అతనితో పాత పరిచయం వున్నట్టుగా అతన్ని చూసి చిరునవ్వునవ్వింది. రామ్మూర్తికి తిరిగి నవ్వే వోపికా లేదూ, పైగా నవ్వాల్సిన ఆగత్యమూ కనిపించలేదు.

"భోంచేశావా?" అన్నది కుక్క తను నాకేసిన ఎంగిలాకు చూసుకుంటూ.

"నా మొహం. నేను తినను" అన్నాడు రామ్మూర్తి.

"ఏం – అలిగావా ఏమిటి?"అంది కుక్క.

"జీవితంమీద"

"నీకంతే తెలుసులే. జీవితంమీద అలిగేటంతటి మూర్ఖులు మీ మనుషులకంటే ఎక్కడా వుండరు. ఎంగుకయ్యో అంత నిరుత్సాహం – వున్న దేదో తినివుంటక —" అని లేచి వెళ్ళిపోయింది కుక్క వొళ్ళు విరుచుకుంటూ.

"నువ్వు అదృష్టవంతురాలివి!" అనుకున్నాడు రామ్మూర్తి—అది వెళ్లిపోతూ వుంటే చూస్తూ. కుక్కలకు విరక్తులు కలగవు—జీతాలు చాలకపోవటాలూ, ఇంట్లో ఇబ్బందులు కలగటాలూ, పై ఆఫీసర్లు తిట్టటాలూ—ఇవేవీ వుండవు. మనిషి జన్మకంటే కుక్కజన్మ నయం! పైగా దానికి 'విశ్వాసం' అనే సుగుణం కూడా ఒకటున్నది—అని తెలుసుకున్నాడు రామ్మూర్తి.

రామ్మూర్తి కళ్లు తుడుచుకుని కుక్కను అనుసరించాడు. ఆ కుక్క అట్లాగే పోయి, ఆకులకోసం వెతికింది. ఏమీ కనిపించలేదు. 'రామా కృష్ణా' అనుకుని హోటలు అరుగు మీద నడుం వాల్చింది. 'ఈ కుక్క ఆశాజీవి. దీనికి వున్న ఆశయినా తనకులేదా?' అనుకున్నాడు రామ్మూర్తి. 'లేదు" "వొద్దు" అని కూడా అనుకున్నాడు వెంటనే.

రామ్మూర్తి ఏడుస్తున్నాడు. ముప్పైఏళ్ల రామ్మూర్తి, జీవితంలో సగంభాగం అయినా అనుభవించని రామ్మూర్తి, పెళ్లామూ బిడ్డలూ స్నేహితులూ, వుద్యోగమూ గల రామ్మూర్తి —బ్రతుకుమీద అసహ్యం కలిగి, బ్రతికటం చాతకాక—ఏడుస్తున్నాడు! బ్రతికటం చాతకావటం సులభం కాకపోయినా, బ్రతికే మార్గాన్ని సౌలభ్యం చేసుకోవటం కోసం రామ్మూర్తి ఆలోచించలేదు! మూడు నెల్లయి అతను చాలా కష్టాల్లో వున్నాడు. 'అప్పులు' అనే ప్రవాహంలో గొంతుదాకా మునిగివున్నాడు. ఈ ప్రవాహం ఎప్పుడు ఉధృతం అయి, తనను పూర్తిగా ముంచేస్తుందో రామ్మూర్తి వూహాకందలేదు! ఇంట్లో నలుగురు పిల్లలు—తల్లి—భార్య. తన సంపాదన తక్కువ. వీటన్నిటికీ తోడు ఆఫీసులో అయ్యగార్ల తిట్లూ, దీవెనలూ నిత్యమూ వుండేవే. ఏ క్షణమో ఈ వుద్యోగము వూడిపోయి, ఈ సంపాదనకూడా లేకుండా పోతే, తనకెవరు దిక్కు? ఎక్కడా ఎవడూ కనిపించడు!

తన సంసారం తను చేసుకోవటం, తన బ్రతుకు తను బ్రతుక్కోటం రామ్మూర్తికి దుర్భరమైపోయిం . ఎవడినో ఉద్ధరించి పట్టు! నాలుగు రోజుల్నుంచీ కొంపలో బియ్యమూ లేవు—తన జేబులో 'పైసా' లేదు. ఇవాళ ఆఫీసులో 'కాస్త అడ్వాన్సు పెట్టండర్రా' అంటే మేనేజరు తిట్టాడు. నానా మాటలూ అన్నాడు. "ఎన్నాళ్లని అడ్వాన్సులు? ఇదేం నీ మామగారి ఇల్లా?" అనికూడా అన్నాడు. అడ్వాన్సు ఇవ్వకపోతే ఇవ్వను అని చెప్పాలి గాని—తనను తిట్టటానికీ, ఈ ప్రసక్తిలో తన మామగారిని తీసుకురావటానికీ ఈ మేనేజరుకు అధికారం ఎవడిచ్చాడో రామ్మూర్తికి అర్థంకాలేదు. కాయితాలువిసిరేసి బయటపడ్డాడు. ఇంటికి పోలేదు. పోతే ఏముంది? ఇవ్వాల్సిన అప్పుల వాళ్ళ లిస్టు చెబుతుంది భార్య—కొంపలో లేని సామాన్ల లిస్టు చెబుతుంది తల్లి. కేవురు కావురుమని రాగాలుపెడుతూ దొర్లుతూ వుంటారు సంతానాలు! ఈ 'దిక్కుమాలిన కొంప'కుపోవటంకంటే, వీధి ఎలెక్ట్రిక్ స్తంభానికిఆనుకోవటమే ఉత్తమంగా తోచింది రామ్మూర్తికి. ఈపాటికి ఇంట్లో అంతా నిద్రలు పోతూవుంటారు 'ఆకలి'బాధలతో. వాళ్ళకు నేనేం పెట్టను? స్నేహితుడన్న ప్రతీవాడూ తనకు కనీసం నాలుగు అణా

లన్నా అప్పు ఇచ్చాడు ఇంకెవరిని అడగాలి? కొత్త స్నేహితుల్ని సంపాయించాలి— అడగాలి! ‘ఛీ! ఇది జన్మేనా—కాదు—కర్మ!’ అనుకున్నాడు రామ్మూర్తి ప్రాపబ్ధంగా.

రామ్మూర్తి కళేబరం కదిలింది. సంధిం దాటి ఎంది పదిహేనుగజాలు వచ్చింది. ఎవరింట్లోనో రేడియో పాడుతోంది. వీధిలో కుక్కలు మొరుగుతున్నాయి. ఒకటి రామ్మూర్తిని చూసి మొరిగింది. ‘ఛా—వెధవ కుక్క. దీనిజోలికి పోయినట్టు, నా మీదెందుకూ ఈ మొరుగూ?’ అని కోప్పడి అక్కడినుంచి దూరంగా తప్పుకున్నాడు నిశ్శబ్దంగా నిర్మొహమాటంగా నిశ్చలంగా దారకష్టంగా నించుంది ఓ గాడిద. ‘నన్ను చూసి గాడిదకూడా తప్పుకోదు’ అనుకున్నాడు రామ్మూర్తి.

“ఏమిటి బ్రదర్, గొణుగుతున్నావ్?” అన్నది గాడిద. రామ్మూర్తి వినిపించుకో లేదు. నిరసంలోనే శక్తిని తెచ్చుకుని చరచరా నడిచాడు బీచివొడ్డుకు ప్రశాంతత కోసం.

ఈ సముద్రం ఎన్ని సంవత్సరాలనుంచో ఇట్లా వున్నదట! దీనికి జీవితంమీద విరక్తి కలగదుగదా! సంసారం చెయ్యాలనే తాపత్రయం కూడా అక్కర్లేదుకదా— ‘ఓ భగవంతుడా! నన్ను కనీసం ఈ సముద్రంలో ఒక నీటిచుక్కగానైనా ఎందుకు పుట్టించావు కాదు!’ అని అడగాడు నిలవేసి దేవుడిని—గాల్లోకి చూస్తూ. ఏ దేవుడూ సమాధానం చెప్పలేదు గాని — సముద్రపు హోరుమాత్రం, ‘దానికెంత పుణ్యం చేసుకోవాలి!’ అని అన్నది.

రామ్మూర్తి ఇసుకలో కూలబడ్డాడు. ఎదురుగావున్న సముద్రంలో లేస్తున్నట్టే అతని తలకాయలోనూ కెరటాలు లేవసాగినయి. ఆ కెరటాలు ఉత్సాహంగా ఉరకలు వేస్తూవుంటే ఇవి నిరుత్సాహంగా దిగులుగా రామ్మూర్తికి జీవితంమీద జుగుప్సను కలిగిస్తున్నాయి.

రామ్మూర్తి ఒకటే నిర్ధారణ చేసుకున్నాడు. ‘తను చావాలి–’ అదొక్కటే మార్గం! చచ్చి తను సాధించేది ఏం లేకపోయినా, బ్రతికి సాధించేది ఏమీ లేదు. కాబట్టి, చావటమే సుఖం! కాని, తన వాళ్ళంతా ఏమవుతారు? ఏదోవిధంగా వాళ్ళు బ్రతుకుతారు—కనీసం తావలేకవన్నా. ఐనా, చచ్చేముందు కూడా తనకు ఈ చుటకిరికోలు ఎందుకు? ఇదేగా తనకు ఇట్లా చేసినై?...ఛీఛీ...!

అలసిపోయిన రామ్మూర్తి కళేబరం నిద్రలో పడిపోయింది. నిద్రలోకూడా రామ్మూర్తి ‘చస్తేనే నయం’ అని కలవరించాడు. కాస్సేపటికి రామ్మూర్తి వులిక్క

★ ముమూర్ష ★

పడి, లేక లేచి, అకాత్తుగా లేచి కూచున్నాడు. పీడ కల వొచ్చింది! తానెందుకు ఇక్కడ ఇంకా పడివున్నాడు—పోయి చావక! చచ్చేందుకు మార్గం లేదా?— వెనకటికి ఎవడో నది చుట్టూ పరిగెత్తుతూ 'తాగటానికి నీళ్ళో' అని అరిచాట్ట! అట్లాగా, ఎదురుగా బ్రహ్మాండమైన సముద్రాన్ని పెట్టుకుని చావటానికి మార్గం లేదనుకోవటం ఏమిటి?—మతి పోయింది. అతని కళేబరం లేచింది—సముద్రం కేసి నడిచింది—ఆగింది— దూకుదామనుకుంది — ఆగింది—నాలుగు అడుగులు ముందుకు వేసింది—మళ్ళీ ఆగింది! ఆకాశంమీద మిలమిలా మెరుస్తున్న ఓ నక్షత్రం ఈ వ్యవహారం చూసి పకపకా నవ్వింది.

"ఎందుకా నవ్వు సిగ్గులేక?" అన్నాడు రామ్మూర్తి ఉక్రోషంగా.

"నీకు ధైర్యం లేక" అన్నది తార.

"చావటానికి ధైర్యంకూడా కావాలా?" అన్నాడు రామ్మూర్తి తిరిగి.

"పిచ్చివాడా! దానికే కావాలి ధైర్యం!" అన్నది చుక్క.

"ఐతే నేను పిరికివాడినా—నాకు ధైర్యం లేదూ?"

"ధైర్యమే వుంటే బ్రతికేవాడివేగా" అన్నది తార.

"బ్రతుకు మాట నువు చెప్పకు. దాని కష్టసుఖాలు ఎక్కడో వున్న నీకేం తెలుసు?— ఓ దేవుడా! కనీసం నన్ను ఈ నక్షత్రాల్లో నయినా ఒకటిగా యెందుకు చేశావు కాదయ్యా?" అన్నాడు రామ్మూర్తి.

ఐతే రామ్మూర్తి ఆర్తి తీరలేదు. ఈ సముద్రం తనను చంపుతుందని అతనికి నమ్మకం కలగలేదు. తీరా పడ్డాక, వొడ్డుకు కొట్టుకువచ్చేస్తే? లేదా, ఏ రాజకుమారున్నా అకాత్తుగా అడ్డుపడి రక్షించేస్తే?— అనుకున్నాడతను. ఏమయినా చావడానికి సముద్రం మంచి సాధనం కాదని తీర్మానించుకున్నాడు. పాత చోటులోనే ఇసుకలో విశ్రమించాడు. ఎవడన్నా ధివాలునవచ్చి తనను 'ఆత్మహత్య' చేసెయ్యరాదూ?' అనుకొన్నాడు దూరంగా ఏదో అలికిడైతే.

రామ్మూర్తికి భార్య జ్ఞప్తికి వచ్చింది. తనతోపాటు ఇన్నాళ్ళూ కష్టాలు భరించిన ఉత్తమ ఇల్లాలు! తల్లి గుర్తువచ్చింది. బిడ్డలంతా వరసనా నించున్నారు. దివ్యదృష్టితో వాళ్లందర్నీ ఓసారి చూసుకున్నాడు రామ్మూర్తి.

తెల్లవారబోతున్నది. మళ్ళీ మామూలు ప్రపంచం ప్రారంభం కాబోతోంది. కాఫీలూ, హోటళ్ళూ, ఆఫీసులూ, ఆఫీసర్లూ, టిఫ్లూ, టైప్‌మిషన్లూ—అన్నీ మళ్ళీ మామూలు వీటికి ఈ సముద్రంలాగా అంతే లేదు. ఇవన్నీ జ్ఞాపకం రాగానే రామ్మూర్తి భయపడ్డాడు. 'ఈ లోకానికి తెల్లవారకుండానే తను చచ్చిపోవాలి' అనుకుంటూ బయల్దేరాడు. కొంపదీసి ఇటా 'చచ్చిపోవాలి చచ్చిపోవాలి' అనుకుంటూనే బ్రతికెయ్యడు కదా!

నిర్మానుష్యమైన ఓ ప్రదేశం చేరుకున్నాడు రామ్మూర్తి. కనుచూపుమేరలో ఎక్కడా 'జీవి' అంటూ కనిపించలేదు— ఏవో పక్షుల కిలకిలలు వినిపిస్తున్నా. రామ్మూర్తి ఓ పెద్ద బండరాయిమీద ఎక్కి నించున్నాడు. క్రింద భయంకరంగా పెద్ద అగాధం! ఇదే చావుకు అనువైన ప్రదేశం. ఇక్కడినుంచి దూకితే, భూమికి చేరుకోనే లోగా మార్గమధ్యంలోనే మరణించవచ్చు. తర్వాత తన తల వెయ్యి చెక్కలయిపోయినా తనకు ఇబ్బందిలేదు. ఈ ప్రపంచాన్ని విడిచిపెట్టేస్తున్నానని రామ్మూర్తికి ఓ మూల గుబులు కలిగింది. కళ్ళు తుడుచుకున్నాడు. "ఈ ప్రపంచంలో నేను మరి కష్టాలు పడలేను. నాకు ముక్తి కావాలి. సుఖం కావాలి ఓయి భగవంతుడా! నాకు ముక్తిని ప్రసాదించు!" అని దేవుడికి నమస్కారం పెట్టాడు. దూకబోయే వేళకు 'కిలకిల' మని వినిపించింది. రామ్మూర్తి వెనక్కి తిరిగి చూడగా చెట్టుమీద పంచరంగులరామచిలుక ఒకటి కనిపించింది.

"నువు నవ్వుతున్నావా - జాలిపడుతున్నావా?" అన్నాడు రామ్మూర్తి.

"నీమీద జాలి ఎందుకు? నిన్ను చూసి నవ్వుతున్నాను" అన్నది చిలుక.

"ఏడిశావ్—నువ్వు చిలకవయి పుట్టావు, మనిషివై పుట్టావు కాదు, తెలిసివుంటేది."

చిలక సమాధానం చెప్పలేదు.

బండరాయిమీద నుంచి అగాధంలోకి రామ్మూర్తి దూకేశాడు! అవును — నిజంగానే రామ్మూర్తి చచ్చిపోయాడు! గుర్తుపట్టటానికి వీలు లేకుండా అతని కళేబరం ఛిన్నాభిన్నమైపోయింది!! ఇహలోకంలో కష్టాలు పడలేక రామ్మూర్తి 'ఆత్మహత్య' చేసుకున్నాడు ఈ దృశ్యాన్ని చూస్తూ చెట్టుమీదవున్న చిలక, అనంతాకాశంలోకి రెక్కలు విప్పుకుంటూ ఎగిరిపోయింది!

మహాపాతకాల్లో ఆత్మహత్య ఒకటి. రామ్మూర్తి బండరాయిమీద నుంచి దూకుతున్న సమయంలో యమలోకంలోని కింకరులు అమాంతం భూలోకంలోకి

దూకి రామ్మూర్తి జీవాలను తాడు వేసిలాగేసు కున్నారు!

"ఎవరు మీరు?" అన్నాయి రామ్మూర్తి జీవాలు అమితాశ్చర్య పడుతూ.

"యమ కింకరులం" అన్నారు వాళ్ళు అతి భయంకరంగా నోరు తెరుస్తూ.

"అమ్మో" అన్నాడు రామ్మూర్తి.

"అమ్మో లేదు బొమ్మో లేదు-పద!" అని లాగాడు ఒక కింకరుడు కరకరమని పళ్ళు చప్పుడు చేస్తూ.

"నేను చచ్చిపోయాను కదూ!" అన్నాడు రామ్మూర్తి.

"నిరాక్షేపణీయంగా చచ్చావు."

"అమ్మయ్య! ఇక్కట్ల మాలిన భూలోకం వొదిలి పోయింది. బట్టతల అఫీసరూ వొదిలి పోయివాడు. అప్పుల ముండా కొడుకులూ వొదిలిపోయినారు. "నేను స్వేచ్ఛాజీవిని - నేను స్వేచ్ఛాజీవిని!" అని కేకలు పెట్టాడు రామ్మూర్తి వెర్రిగా భోరుమని నవ్వుతూ, కింకరులు అభ్యంతర పెట్టలేదు. అతన్ని కొంతం నవ్వుకోనిచ్చారు.

భూలోకం వదిలి పోయిందనే సంతోషంలో రామ్మూర్తి ఉక్కిరి బిక్కిరయి పోయినాడు. ఆ సంతోషంలో అతనికి తల్లిగాని, భార్యగాని, బిడ్డలుగాని గుర్తురానే లేదు!

"ఇదేమిటిది - వైకుంఠమా?" అన్నాడు రామ్మూర్తి ఏదో కనిపించగా.

"నరకలోకం" అన్నారు కింకరులు.

"ఇక్కడ యమధర్మరాజుంటాడు గదూ!"

"అవును. రా, చూద్దువుగాని-"

రామ్మూర్తి యమధర్మరాజును కళ్ళారా చూశాడు. అతను నిజంగా యముడిలాగే వున్నాడు. ప్రక్కనే చిత్రగుప్తుడు 'చిటా' ముందేసుకుని కూచుని, చేతి కలం ధరించి, ఏవో కాయితాల వంటివి పరిశీలిస్తున్నాడు.

"ఎవడు వీడు?" అన్నాడు యముడు, మీసం మెలివేస్తూ.

"రామ్మూర్తిని" అన్నాడు రామ్మూర్తి.

"నువ్వేంమం. ఏం చిత్రగుప్తా!" అని గర్జించాడు యమధర్మరాజు.

"చిత్రం! ఇతను మహాపాపి!"

"నేనా? నే నేపాపమూ ఎరగను మహాప్రభూ!" అన్నాడు రామ్మూర్తి సవినయంగా.

"నువు ఇక్కడ కూడా అబద్ధం ఆడుతున్నావ. మా చిటా అబద్ధం ఆడదు." అన్నాడు చిత్రగుప్తుడు సగర్వంగా.

"ఏం చేశాడు?" అన్నాడు యముడు.

"ఇతను ఆత్మహత్య చేసుకున్న మహాపాతకుడు!"

"ఆఁ! అయితే ఘోరశిక్షలు అనుభవించాల్సిందే. తీసుకుపోండి వీడిని!" అని గర్జించాడు యమధర్మరాజు.



చిత్రం: చెరుకూరి గురవయ్యనాయుడు—పాకాల.

రామ్మూర్తి నడుస్తూ నడుస్తూ నరకలోకం చూడసాగాడు ఒక మూల పాపుల్ని కత్తులతో పొడుస్తూంటే, ఇంకో మూల ముళ్లతో రక్కుతున్నారు. మరోమూల నూనెలో వేపుతూవుంటే మరోచోట బండలు మోయిస్తున్నారు. ఇంకోచోట కుళ్ళు దొర్లింపిస్తూవుంటే వేరొకచోట మంటల్లో కాలుస్తున్నారు. అంతా భయంకరం! అంతటా హాహాకారాలు!!

"ఏమిటిది? నన్ను ఇట్లా చేస్తారా ఏమిటి కొంపదీసి" అన్నాడు రామ్మూర్తి ఏడుపు ముఖం పెట్టి.

"ఆహా! నువ్వు వీళ్ళకంటే నాలుగు ఆకులు ఎక్కువే చదివావు" అన్నాడు ఒక కింకరుడు.

"నన్నేం చెయ్యాలనీ?"

"రా. చూద్దువుగాని"

శూలాలు ఎర్రగా కాల్చి రామ్మూర్తి కోసమేనన్నట్టు నిరీక్షిస్తూ నించునివున్నాడు ఒకడు. రామ్మూర్తి రాగానే అతన్ని ఎగాదిగా చూసి ఎర్రగా కాల్చబడ్డ శూలాన్ని అతని గుండెల్లోగుచ్చి పైకి ఎత్తాడు. పైకి ఎత్తి సలసలకాగే నూనెలో ముంచి ఎర్రగా వేపి, బయటకుతీసి ఓమూల విసిరేశాడు! కాస్సేపటికి రామ్మూర్తికి స్పృహ కలిగింది. నెమ్మదిగా కళ్లు తెరిచిచూసి ఒక్కసారిగా పెద్దగా కేక పెట్టాడు.

"నోరుమూసుకుని పోయి పడుకో" అని గర్జించాడు కింకరుడు. రామ్మూర్తి లేవలేకపోయినాడు. లేచేందుకు వొళ్లు స్వాధీనంలో లేదు చూసుకోగా శరీరం అంతా కాలిపోయివున్నది. చేతులూ కాళ్ళూ బొబ్బలెక్కిపోయివున్నై. ఒళ్ళంతా విపరీతంగా మండిపోతోంది. 'నాకెందు కీశిక్ష!' అని అరిచాడు రామ్మూర్తి పడుక్కునే. అతనికి సమాధానం చెప్పటానికి ఎవ్వడూ అక్కడ కాచుకుని కూచోలేదు!

రామ్మూర్తి బాధతో వెర్రిగా కేకలు వేశాడు- బొబ్బలు పెట్టాడు- అరిచాడు!... ఎక్కడా ఏమీ సమాధానం లేదు అరిచిఅరిచి అలసిపోయి రామ్మూర్తి అట్లాగే సొమ్మసిల్లి పడిపోయాడు!

మర్నాడు కాబోలు, రామ్మూర్తి నిద్రలో వుండగానే ఒక కింకరుడువచ్చి త్రిశూలం అతని కడుపులోగుచ్చి పైకెత్తి చరచరా తీసుకెళ్ళి కణకణ లాడుతూవున్న పెద్ద నిప్పుల పొయ్యిలోదూర్చి, కాస్సేపు వుంచి, బయటకులాగి అక్కడే పసిరేసి వెళ్ళిపోయినాడు. రామ్మూర్తికి నోరువిప్పలేదు. చెయ్యి లేవలేదు. కాలుకదపలేదు దాహం- ఆకలి- మంట- బాధ! ఇవన్నీ ఎవరితో చెప్పుకోవాలో రామ్మూర్తికి అర్థంకాలేదు.

"ఓ భగవంతుడా! నా మొర వినవా!" అని ప్రార్థించాడు. అక్కడకూడా ఎవడూ అతని మొర ఆలకించలేదు

చాలా సేపటికి రామ్మూర్తికి వొళ్లుమంట తగ్గింది నెమ్మదిగా లేచికూచుని అటూ ఇటూ చూశాడు. దూరంగా పహారాచేస్తున్న ఓ కింకరుడిని చూసి, ఛట్టున పడుక్కునినిద్ర

(38-వ పేజీ చూడండి)

విద్యాప్రమాణం తగ్గటానికి కారణాల తోరణాలు

ఇంకా చాలా కారణాలు

"గీతా-మూర్తి గార్ల వ్యాసం రెండు చేతులు జోడించి ధన్యవాదాలు చెప్పుకోవలసినంత 'చేటు'గానూ, 'ఘాటు'గానూ లేదని మా విద్యార్థుల వాదన! నిజం చెప్పొద్దూ మరి-నాకు కూడ కొత్త దప్పగానే వుంది.

రచయితలు అంటారూ, డిటెక్టివ్ నవలలు చదవని విద్యార్థులు అరుదట. పాపం వారింకా 1957 సం॥ లోనే వున్నారు. విద్యార్థులు చాలావరకు డిటెక్టివ్ నవలలు చదవడం మానేశారనేది విద్యార్థులకే బాగా తెలుసు. వీటివలన విద్యాప్రమాణానికి కొంచెంకూడా అపాయం వాటిల్లటం లేదని నేనేకాదు ఏ డిటెక్టివ్ నవలల ప్రచురణకర్త నడిగినా చెబుతారు.

విద్యార్థులు పాఠ్యపుస్తకాలు చదవకుండా, 'మేడ్-ఈజీ' నోట్సులలో వున్న ముఖ్య విషయాలు చదివి పరీక్షలలో నూటికి 60 మార్కులు తెచ్చుకుంటున్నారట. అది కూడదని వారి ఊహ. ఈ తెలివి తేటలు ఆ పరీక్ష పేపర్లు సెట్ చేసే పెద్ద మనుష్యులకుంటే బావుండును. వారు ఆనోట్సు పుస్తకాలలో వున్న ముఖ్య విషయాలే అడగాలా వ్రాయమని. ఇటువంటి విషయాలు విద్యార్థులమీదకు నెట్టి విద్యాప్రమాణం తగ్గుతోందని చదువుకున్నవారైన గీతా-మూర్తిగార్లనడం ఏమీ బాగులేదు.

అలాగని విద్యాప్రమాణం పెరిగిపోతోందని కూడా నేననలేను. గీతా-మూర్తి గార్లు చెప్పినవి చాలావరకు (పై చెప్పినవి తప్పిస్తే) నిజమని కూడా చెప్పక తప్పదు. కాని విద్యాప్రమాణం తగ్గటానికి యింతకన్నా బలవత్తరమైన కారణాలు చాలా వున్నాయి. వాటిని యెవరికీ చెప్పరాదని మేము యెవరికివారే నిశ్చయించేసుకున్నాం. 'అలా కాదు చెప్పాలి' అంటే తప్పకుండా చెబుతాను-యెవరైనా అడిగేవారుంటే...

ప్రసన్నరావు-అనకాపల్లి.

* * *

వసతుల లోపం

"విద్యార్థులు—అల్లరులు" అన్న వ్యాసములో కొన్ని ముఖ్య కారణములు బాగానే చర్చించబడినవి. కానీ ఇంకా కొన్ని ముఖ్య కారణములు వ్యాసకర్తలు వదిలిపెట్టారు. మూలముగా విద్యార్థుల సమ్మెలకుగల కారణములు పరిశీలిస్తే అందులో ప్రబలకారణము వారి వసతులకోసం పోరాటము. స్వాతంత్ర్యము లభించిన తర్వాత సమృద్ధిగా ధనం లేకపోయినా కళాశాలలు తెరవడం పరిపాటి అయింది. అందువలన అటువంటి కళాశాలలలో విద్యార్థుల ప్రాథమిక అవసరాలు తీర్చడము కూడా సాధ్యము కాదు. సహజంగా ఇది అల్లరులకు దారి తీస్తుంది.

ఇక రెండవ కారణము ఈనాడు అధ్యాపకులను, కులపతులను నియమించటంలో వ్యక్తుల విలువలకన్న తదితర విషయాలకు ప్రాధాన్యం ఇవ్వడం మామూలుఅయింది. ఇదికూడా ఒకరకంగా విద్యార్థులలో క్రమశిక్షణ లేమికి తోడ్పడుతుంది. మూడవ కారణమేమంటే తక్కువ జీతాలవల్ల క్లాసుల్లో సరిగా చెప్పకపోవడం ట్యూషన్లు పెట్టుకోవడము ఈనాడు మనము చూస్తూనే వున్నాము. ట్యూషన్ల వలన కలిగే నష్టం మరే కారణమువల్ల కూడా ఈనాటి విద్యార్థులకు కలగదంటే అతిశయోక్తి కాదు.

మధురభారతుల రాధాస్వామి—
కడప

* * *

సిఫార్సుల ఫారు

ముఖ్యాతి ముఖ్యమైన కారణం యేఒక్కరూ వ్రాయలేదు. అసలైన లోటు విద్యార్థులను కాలేజీల్లోను, విశ్వవిద్యాలయాల్లోను చేర్చుకోడంలో స్పష్టంగా కనిపిస్తోంది. నూటికి 75 పాళ్ళు విద్యార్థులకు మంచి మార్కుల్నిబట్టి కాదు సీట్లు యిస్తోంట వారు తెచ్చే మంచి రికమెన్‌డేషన్లనుబట్టి యిస్తున్నారు. ప్రయివేటు కాలేజీల్లో మరీ అధ్వాన్నంగా తయారైంది. ఉదాహరణకి, నా స్నేహితుడొకడు యింటర్‌లో కెమిస్ట్రీ సబ్జక్టులో 65% స్వంతంగా సంపాయించి బి. యస్‌సి. (కెమిస్ట్రీ) సీటుకి ఒక ప్రయివేటు కాలేజికి దరఖాస్తు పెట్టాడు. ఇన్‌టర్‌వ్యూకి పిలిచారు. ఇన్‌టర్‌వ్యూలో మొట్టమొదటి ప్రశ్న—

"ఏదైనా రికమెండేషన్ తెచ్చావా?" "లేదు" అని జవాబు. రెండో ప్రశ్న—"కెమిస్ట్రీలో నీకన్ని మార్కులొచ్చాయి" "65%" అని జవాబు. ఇంతకీ చెప్పబోయేదేమిటంటే మా వాడికి సీటురాలేదు. కెమిస్ట్రీలో 44% మాత్రమే వచ్చిన వాడిస్నేహితుడికి సీటు వచ్చిందని తెలిసింది తరవాత 'ఎలా వచ్చిందిరా' అంటే ఆ స్నేహితుడిలా అన్నాట్ట మా వాడితో—'నీకు 65% మాత్రమే వచ్చింది. నాకు 84% అన్నమాట. (44% + రికమెండేషన్ కిచ్చింది 40%)

అంచేత యారికమెండి చేసే ప్రముఖుల్లో మార్పు కల్గిన్నాడు ('మెరిట్‌కే ప్రాధాన్యం యివ్వాలిసుమా' అని వారు గ్రహించిన్నాడు.) ఆయా కాలేజీల, విశ్వవిద్యాలయాల అధికారులలోనూ మార్పు వస్తుంది. దాన్నిబట్టి విద్యార్థుల విద్యాప్రమాణమూ బాగుంటుంది.

వై. వి. రమణ, హైద్రాబాద్.

* * *

ప్రవర్తనకు మార్కులు

స్కూలు ఫైనలు ప్యాసుఅవడంతోటే ఉన్నత విద్యకోసం ఎక్కువభాగం విద్యార్థులు స్వగ్రామం విడిచిపోవలసివస్తుంది. అప్పటివరకు తల్లిదండ్రుల అదుపాజ్ఞలలో నుండి ఒక్కసారిగా ఈ మార్పు జరిగేటప్పటికి పంజరంలోనుండి వదలిన చిలకలా, కళ్ళెంలేని గుఱ్ఱంలా, బ్రేకులులేని కారులా ప్రవర్తిస్తారనడంలో సందేహంలేదు.


కాలేజీలో ప్రతి విద్యార్థియొక్క ప్రవర్తనకు కొన్ని మార్కులు ఇచ్చి యూనివర్సిటీ పరీక్షలకు సహాయపడేలాగుంటే వారి ప్రవర్తన కొంతైన మారుట తథ్యం.

ముసునూరు రాజారావు-తెనాలి

* * *

ఉపాధ్యాయుల లోపం

విద్యార్థులు, విద్యార్థినులు కూడ మన దేశంలో క్రమశిక్షణ చిన్నవయసులో పొందుటలేదు. దీనికి కారణం కొంతవరకు ప్రాథమిక పాఠశాలల్లో బోధించు ఉపాధ్యాయులు వారి కర్తవ్యములను క్రమముగా నిర్వహించుటలేదు. విదేశాలలో ప్రత్యేక పాఠశాలల నేర్పరచి, క్రమశిక్షణ, బోధశిక్షణ, అతిచిన్నవయసునుండే బాలబాలికలకు ఆధునిక పద్ధతులలో బోధించుటచే



మద్రాసులోని వివేకానంద కళాశాల తెలుగు సమితికి ఆగస్టు 28న శ్రీ గుఱ్ఱం జాషువా కవి అధ్యక్షతన శ్రీ చిత్తూరు నాగయ్య ప్రారంభోత్సవం చేశారు. వేదికపై ఉన్నవారు శ్రీ నాగయ్య, శ్రీ జాషువా, ప్రిన్సిపాలు శ్రీ టి. ఆర్. రాఘవశాస్త్రి.

విద్యార్థులు పెద్దవారైనపిదప తమ పౌర ధర్మములను, హక్కులను గుర్తెరింగి మంచి మార్గమున దేశాభివృద్ధికి అన్ని విధములతోడ్పడ గలుగుచున్నారు. అంతే గాక ఆదేశములలో ప్రభుత్వము వారుకూడ విద్యాశాఖకు ప్రత్యేక స్థానమునిచ్చి, ఉపాధ్యాయులకు అధిక వేతనముల నిచ్చి, వారికి వసతి సౌకర్యముల నేర్పరచి గౌరవించుటచే, ఉపాధ్యాయవృత్తికి మంచి గుణవంతులను, తెలివైనవారను వచ్చుచున్నారు. మన దేశములో పైన చెప్పినదానికి వ్యతిరేకముగా నుండుటచే ఉపాధ్యాయులు సక్రమముగా పనిచేయుటలేదు. విదేశములలోవలెనే మన దేశములో గూడ ప్రభుత్వము ప్రత్యేక శ్రద్ధ చూపిననాడు విద్యార్థుల అల్లరు కమేపీ తగ్గిపోయి, సత్ప్రవర్తనగల భారతీయులు లభించగలరు.

ఎ. వి. వి. నరసింగరావు. M.Sc,BEd

(కర్నూలు.)

ఒక విద్యార్థి సరిగా చదవక పోవటానికి కారణం, అతనికి విద్యాబోధ చేసే ఉపాధ్యాయునిలో వున్న లోపం అని వాదించే వారిలో నేనొకణ్ణి. ఉపాధ్యాయుడు సరిగా చెప్పేవాడయితే, విద్యార్థి ఎటువంటి వాడైనా, తప్పక చదువుతాడు. మొత్తం మీద, ఉపాధ్యాయుల లోపాల క్రింద, ఈ క్రిందివానిని వుదహరించవచ్చు:

1) క్లాసులో పాఠం సరిగ్గా చెప్పక పోవటం.

2) టీచర్లలో, టీచర్లు, తగవులాడుకొని, పిల్లలమీద ఆ కోపం చూపించటం.

3) ట్యూషన్ల రాబడి కోసం, ప్రాకులాడి, చదువు చెప్పలేక పరీక్షల సమయంలో మార్కులువేసి పాసు చేయించడానికి తోడ్పడ్డం.

4) అనవసరంగా, విద్యార్థులను, మనస్సుకు కష్టం కలిగించే విధంగా తిట్టడం (పరోక్షంకూడ ఇందులో కలుస్తుంది).

ఎం. కుమార్, మద్రాసు.

* * *

విద్యార్థుల రాజకీయాలు

ఒకప్పుడు మన దేశస్వాతంత్ర్య సమరంలో విద్యార్థుల ప్రాతినిధ్యము ప్రశంసాపాత్రముగా నేర క్రిగట్టిందిగాని-రాను రాను యిది వెర్రితలలు వేసింది. ఇవాళ విద్యార్థులు రాజకీయాలనుగురించి తెలుసుకోవడము అవసరమేగాని; రాజకీయాల్లో మునకలువేసి బాధ్యతా రహితముగా ప్రవర్తించడము శ్రేయస్కరము కాజాలదు. వివిధ రాజకీయ పార్టీల రంగు రంగు ఆకర్షణల ప్రలోభానికి విద్యార్థులు గురి అయిపోయి జీవితాలు బుగ్గిపాలు చేసుకుంటున్నారు. అసలు యీనాటి రాజకీయాలు పెద్దవారియందే శాఖా చంక్రమణము చేయాల్సిన స్థితి గల్గిస్తుంటే— విద్యార్థుల జీవితాలను ఎలా ఓకుదుడుకులపాలు గావించేది ప్రత్యేకముగా వ్రాయాల్సిన పనిలేదనుకుంటాను.

సోమనాథ్-కందుకూరు

పట్టణంలో ప్రథమ పౌరుడు తమ పథకాన్ని ఇలా వివరించారు:

"డబ్బు పుష్కలంగా లేదు కాబట్టిన్నీ, పొదుపు చేయడం మంచిది గాబట్టిన్నీ మనం పాత జైలునే పడగొట్టి దానితాలూకు కర్రా కలపాతోనే కొత్త జైలు కడుతూ ఆలోగా ఖైదీలను పాత జైలులోనే ఉంచి, ఆతరవాత కొత్తజైల్లోకి వాళ్లని మార్చి అప్పుడు పాత జైలును పడగొట్టి—"

★ తీరని కోరిక ★

పంకజం, భాస్కరం ఒకే హైస్కూల్లో చదువుకున్నారు, స్కూలు ఫైనల్ దాకా. భాస్కరం కాలేజీలో చేరాడు. పంకజం చదువును తండ్రి మాన్పించి వేశాడు. స్కూలులో చదివిన పరిచయం వల్ల అప్పుడప్పుడు పంకజం ఇంటికి భాస్కరం వస్తూ పోతూ ఉండేవాడు. కాలేజీలో ముచ్చట్లు తీసుకువచ్చి చెబుతూ ఉండేవాడు పంకజానికి. పంకజం వాటిని వింటూ 'తాను కూడ కళాశాలలో చదువకపోతినే' అని మనస్సులో నిట్టూరుస్తూ ఉండేది. ఒకప్పుడు తాను చదువకపోయినా, భాస్కరం కబుర్లు వింటూ ఉంటే, తానూ చదువుతూ ఉన్నట్లే భావిస్తూ ఉండేది.

పంకజం, పేదకుటుంబంలో పుట్టినా ఆమె తెలివితేటలూ చక్కదనమూ పరిమితమైన బంధువర్గంలో బాగానే పరిమళించాయి. ఫలితంగా కట్నం అక్కరలేకుండా పెళ్ళిచేసుకుంటాననే వరుడు దొరికాడు. అతను ఏమీ అనాకారి కాదు. ఆంగ్లంలో పెద్దక్లాసులు పరీక్ష ఇచ్చినవాడే. ఇంత మంచి సంబంధం వారికి వారుగా వస్తూ ఉంటే, వీరికి మోకాలొడ్డలేకపోయాడు పంకజం తండ్రి. తనకున్న శక్తిలో, ఘనంగానే వివాహంచేశాడు. వాళ్లు ఉన్నవాళ్ళే అయినా 'పెళ్ళికూతురువారిని' తేలికగా చూడడం గాని, పేచీలు పెట్టడంకాని, చేయకుండా మూడు ముళ్ళూ పడగానే పిల్లను తీసుకుపోయి, వేడుకలన్నీ వారి యింటనే జరుపుకున్నారు.

పంకజం భాస్కరంతో తన పెళ్ళి విషయం చెప్పింది. తన పెళ్లి విషయం సాధారణంగా ఏ పెళ్ళికూతురూ చెప్పదు. అయితే చెప్పేవాళ్ళుకూడ లేకపోలేదు. చెప్పేవారు సిగ్గు విడిచి చెప్పరు. పైగా సిగ్గుపడుతూనే, కేవలం చెప్పినట్టు గాకుండా చెబుతారు. పంకజం అల్లాగే ముభావంగా చెప్పింది. పంకజానికి తనకు మంచి సంబంధం వచ్చిందనే సంతోషం లోపల లేకపోలేదు. కాని చెప్పే తీరులో ఏదో హృదయంలో బరువు కూడ ఉంది. సంబంధం వివరాలన్నీ అంతకు ముందే తెలుసుకున్న భాస్కరం, పంకజాన్ని అదృష్టవంతురాలని అభినందించాడు. కాని ఆ అభినందనాన్ని తాను నిండుహృదయంతో చేయడంలేదని తెలుసుకున్నప్పుడు, కొంత సిగ్గూ, కొంత బాధపడ్డాడు. పంకజం తన తండ్రిచేత భాస్కరాన్ని వివాహానికి రావలసిందిగా బలంగా చెప్పించింది. ఆ పెళ్ళిలో భాస్కరం ఒళ్ళు విరుచుకు పని చేశాడు; వడ్డించడం, 'పెళ్లికొడుకువారి'కి సౌకర్యాలు కల్పించడం వగైరా పనుల్లో. పెళ్ళికొడుకు చిట్టాలోకూడ భాస్కరం ఆడపెళ్ళివారి తరఫున జమపడ్డాడు.

తర్వాత నాలుగైదేళ్ళదాకా పంకజం పుట్టింటికి రానే లేదు. అత్తవారింటిదగ్గరే ఉండిపోయింది. పునస్సంధానంకూడ వారింటిదగ్గరనే జరిగింది. పంకజం తండ్రినీ, తల్లినీ, వారే ఆహ్వానించారు. ఆ కాలంలో పంకజం బి.ఏ. పూర్తిచేసింది. భర్తకు ఉద్యోగం అయినా, అప్పుడప్పుడు వస్తూ పోతూ ఉండేవాడు కాని, భార్య చదువు చెడిపోతుందని వేరే కాపురం పెట్టలా. బి. ఏ. ప్యాసయేనాటికి పంకజానికి నీళ్ళుపోసుకుని అయిదు నెలలు.

పుట్టింటివారు పురుడుపోయడానికి తమ ఊరు తీసుకువెళ్ళారు పంకజాన్ని. ఈ నాలుగైదు సంవత్సరాలకాలంలో భాస్కరాన్ని గురించి ఒకటి, రెండు ఉత్తరాలు తండ్రికి

పైడిపాటి సుబ్బరామశాస్త్రి

వ్రాసినా—అతడు క్షేమంగా ఉన్నాడని, వివాహం చేసుకున్నాడనీ తప్ప వేరే వివరాలేమీ పంకజం తెలుసుకోలేకపోయింది. తన చదువు గొడవల్లో తానుంటూ అత్తగారింటి వాతావరణంలో అతుక్కుపోయినా, ఒకటి రెండుసార్లు భాస్కరానికే స్వయంగా క్షేమసమాచారాలకై ఉత్తరాలు వ్రాద్దామనుకుంది. కాని అల్లా వ్రాయడం మంచిది కాదేమోనని మానేసింది. పుట్టింటికిరాగానే మొట్టమొదట జ్ఞప్తికివచ్చింది భాస్కరం, తన చిన్నతనంలో చదువుకున్న రోజులూ. ఇప్పుడు తాను బి. ఏ. ప్యాసయింది తండ్రి చేత భాస్కరానికి కబురు పెట్టింది. ఎమ్. ఏ. చదువుతూ సెలవలకు వచ్చిన భాస్కరం, వచ్చి పంకజాన్ని చూశాడు.

పంకజం భాస్కరాన్ని అడిగింది, అతని పెళ్ళికి తనకు ఆహ్వానం పంపలేదేమని. భాస్కరం సిగ్గుపడ్డాడు. నిజంగా ఆహ్వానం పంపుదామని అతనికి స్ఫురించింది. చిరునామా కూడా ఏమీ తెలియనిది కాదు. అప్పుడప్పుడు పంకజం తండ్రితో తను మాట్లాడుతూ తెలుసుకుంటూనే ఉన్నాడు. లాంఛనంగా తాను పంపడమే కాని భాగ్యవంతుల యింట్లో పడ్డ పిల్ల, ఏదో చిన్ననాటి సహపాఠి వివాహానికి వస్తుందా అని మానివేశాడు. ఇప్పుడు పంకజం ప్రశ్నించే వైఖరి చూస్తే తన వివాహానికి ఆమె వచ్చేదేమో అనిపిస్తోంది అతనికి. ఆ ఆసక్తి ఆమెకు ఉన్నట్లు గమనించగలిగాడు భాస్కరం. సమాధానం ఎల్లా చెప్పాలో అతనికి తోచ లేదు ఇల్లా అన్నాడు: "పంకజం! నీవు రాదగినంత విశేషంగల పెళ్ళి కాదులే."

"అదేం" అంది పంకజం.

"పెళ్లికూతురుకు నీవే సంతోషించక పోతే, ఆ పెళ్ళికి నువ్వేం సంతోషిస్తావ్?"

ఈ మాటలు వినగానే 'పాపం!' అనుకుంది మనస్సులో పంకజం. కాని వెంటనే ఒక ఊహ కదిలింది. 'అందరికీ వచ్చినవాళ్ళే వివాహమవుతారా!' అని. 'మరి తనకో?' కొద్దిగా కలవరపడింది.

"పురుడు వెళ్ళేదాకా ఉంటావు కాదూ—పంకజం!" అన్నాడు భాస్కరం. పంకజం అనుకుంది "ఇదేం ప్రశ్న—పురుడు పోసుకోవడానికి వచ్చినవాళ్ళు పురుడు వెళ్ళేదాకా ఎందుకుండరు?" అతని ముఖం వంక చూచింది. అతనిముఖం ఎందుకో విచారంగా వుంది. అతడు విచారపడుతూ ఉంటే తనకూ విచారంగా ఉన్నట్లనిపించింది. నాలుగయిదేళ్లు గడచిన తర్వాత ఇద్దరూ కొత్తవారు—లోకం ప్రకారం పలకరించుకున్నట్లయిపోయారు.

"నీకు సెలవు లయిపోయినయ్యా!" అంది పంకజం.

"ఇంకా నాలుగురోజు లున్నై. ఎల్లుండి వెళ్లాలనుకుంటున్నాను."

"అవతలెల్లుండి వెడుదువు గానిలే—ఎల్లుండి మాయింటి కొస్తావు కాదూ?"

ఈ వాక్యం రమ్మని పిలిచినట్లుగా గాకుండా అధికారాన్ని చలాయించినట్లుగా వుంది.

"వస్తా—పంకజం!" అన్నాడు భాస్కరం నెమ్మదిగా.

అన్న ప్రకారం ఆ రోజున భాస్కరం పంకజం ఇంటికివెళ్లాడు. ఆ రోజునే హఠాత్తుగా పంకజం భర్త 'మిళింద కుమార్' వచ్చాడు. ఎప్పుడో పెళ్ళిలో చూసిన భాస్కరాన్ని తనభర్తకు పరిచయం చేసింది పంకజం. చాలాసేపు కులాసా కబుర్లు చెప్పుకున్న తర్వాత, తనూ తనభర్త మర్రోజు భాస్కరం ఇంటికి వస్తామని పంకజం చెప్పేసింది భాస్కరానికి. పంకజం తన భార్యను చూడడానికే వస్తోందని గమనించిన భాస్కరం సిగ్గుపడ్డాడు. తాను ఎల్లా కాదనగలడు వస్తామన్న వారిని? పైగా ఆమె సభర్తృకంగా వస్తానంటూ ఉంటే ఏదయినా కాఫీ ఏర్పాటు చేయవలసి వస్తుందని ఊహించుకుంటూనే "తప్పకుండా రండి!" అని మిళింద

కుమార్‌కు మరీమరీ మర్యాదతో చెప్పి వెళ్లి పోయాడు భాస్కరం.

మరురోజు పంకజం భర్తను బయలుదేర తీసింది. భాస్కరం తాను ఎరుగున్నవాడనీ, కలిసి చదువుకున్నామని చెప్పింది. అంతే కాక పెళ్లిలో పెళ్లివారికి వడ్డించడం మొదలయిన విషయాలు జ్ఞాపకం చేసింది. భర్త చేత ఒక మంచి కంచి పట్టుచీర, రవికల గుడ్డా కొనిపించింది, తాను చూడబోయే భాస్కరం భార్యకోసం.

పంకజం, మిళిందకుమార్, తన ఇంటికి రాగానే భాస్కరం పొంగిపోయాడు. ఫలహారం కాఫీ ఏర్పాటు చేశాడు. ఇవన్నీ భార్యచేత నే చేయించాడు తప్పనిసరిగా. తన భార్యను చూడడానికి వస్తే—ఇంట్లో మరొకరిచేత చేయిస్తే పంకజం ఏమయినా అనుకోదూ.

తాంబూలచర్వణం కూడా అయినతర్వాత పంకజం తాను తెచ్చిన కానుక భాస్కరం భార్యకు బొట్టుపెట్టి యిచ్చింది. "పెళ్ళికి మమ్మల్ని పిలవక పోయినా—ఇప్పుడైనా చూశాం. మా భాస్కరం లక్షణమైన పిల్లను చేసుకున్నాడు," అంది పంకజం. వెంటనే 'ఏమండీ' అని భర్తవంక చూసింది.

"నిజం, నిజం"—అన్నాడు మిళింద కుమార్.

"ఏది నిజం? పెళ్లికి పిలవక పోవడం మాత్రమే నిజం" అనుకున్నాడు భాస్కరం. మిళిందకుమార్, భాస్కరం ఏవో కబుర్లతో కాలక్షేపం చేస్తున్నారు. పంకజాన్ని భాస్కరం భార్య ఇంట్లోకి తీసుకు వెళ్లింది. బొట్టుపెట్టి రవికలగుడ్డ ఇచ్చింది. ఇంతట్లో ఆమె కన్నులలో నీళ్లు గిర్రున తిరిగాయి. పంకజం ఆమె కన్నులలోకి చూచింది. కౌగలించుకుని "ఇదేమిటి పిచ్చిపిల్లా!" అంది.

"ఇవాళ నా పుణ్యం మంచిది మీరు వస్తారని నాతో వారికి మాట్లాడక తప్పింది కాదు. నేను అందంగా లేకపోతే నన్ను చేసుకోడం మానివేయవచ్చు. కాని చేసుకుని కోత పెడితే, ఆడదానిగతి అధోగతే కదా" అంది.

పంకజం ఆడది. తనయెగుట ఒక ఆడది భర్తృ తిరస్కృతి. భర్త తిరస్కరిస్తే భార్య వేదన ఎల్లావుంటుందో కొంత ఇప్పుడు తను మాపగలిగింది. తాను ఎంతో అదృష్ట వంతురా లనుకుంది.

"విచారించకు. లిఖితం ఎక్కడ వుంటే అక్కడె వివాహం అవుతుంది. చేసుకున్న తర్వాత ఉసురు పెట్టకూడదు;" అంది.

"నాకు చదువు రాదని ఎప్పుడూ విసిరి కొడుతూ ఉంటారు మా పినతల్లి కూతురు బి యే. ప్యాసయింది. ఉద్యోగం చేస్తోంది. ఎప్పుడూ మొగుణ్ని విసిరి కొడుతూ నే ఉంటుంది మగవాడు కుక్కినపేనల్లే పడి ఉం



తీరని కోరిక

టాడు. పాపం! అతన్ని చూస్తే నాకు జాలి వేస్తుంది. నాకు చదువు రాకపోవడం తనకు మంచిదేగా," అన్నది.

పంకజానికి నవ్వు వచ్చింది. చదువు స్వరూపం ఆమె ఎల్లా అర్థం చేసుకుందో, ఆమె ఎంత అమాయికమైనదో అర్థమైంది. తనను ఏమీ ప్రశ్నించక పోయినా, ఏదో చెప్పవలసి ఉన్నట్లు ఆమె కన్నులు కాంక్షిస్తున్నై. తాను కూడా చదువుకున్నదనీ, చదువుకున్న ఆమెతో మాట్లాడుతున్నాననే ఇంగితం భాస్కరంభార్యకు కలగలేదని ఆశ్చర్యపడింది. ఐతే ఆమె ఒక వేదనలో తనతో ప్రసంగించడంలో ఆమాటఎంతదూరం పోతుందో ఊహించుకో లేక పోవడంకూడా సహజమేనని సరిపెట్టుకుంది.

ఇంతట్లో మిళిందకుమార్ పిలవడంతో పంకజం బయటికి వచ్చేసింది. వాకిలి దాకా భాస్కరం, భార్యా, సాగనంపారు. పంకజం ఎన్నోసార్లు 'వెళ్ళివస్తా'నని భాస్కరం భార్య భుజాన్ని తట్టి మరీ సెలవు తీసుకుంది. "ఆడవాళ్ళకింతలో స్నేహం కలసిపోతుంది." అన్నాడు మిళిందకుమార్ నవ్వుతూ. "మళ్ళీ వెళ్ళిపోతావు కాబోలు, రేపొకసారి మాయింటికేసిరా, భాస్కరం," అన్నది పంకజం. భాస్కరం 'సరే'నని తల ఊపి వెనక్కి తగ్గాడు.

పంకజం, మిళిందకుమార్, కలిసి వారి ఇంటికేసి నడిచి వెడుతున్నారు.

"ఏమిటి పంకజం! లక్షణమైనపిల్ల, అని నాచేత కూడ సర్టిఫికేట్ ఇప్పించావూ. ఆపిల్ల అంతబాగుందా?" అన్నాడు మిళిందకుమార్.

"ఏమో నిజం, నిజం" అని మీరే అన్నారుగా"

"లేకపోతే నీ పెళ్ళాం బాగుండలేదని అంటే బాగుంటుందా?"

"పోనీ! అందుకన్నా బాగున్నదని అన్నారు. నా మటుకు నాకు ఆ పిల్ల లక్షణంగా ఉన్నట్టే కనిపించింది.

"నీకంటేనా?"

"ఆ! నాకంటే కూడా! ఎందుకండీ, ఒకరిని ఇంకొకరితో పోలుస్తారు! ఆడదానికి అందం తెలిసినా ఎదుటి ఆడదాన్ని కూడా అందమైనదనే అంటుంది. అయినా నేను ఆ అమ్మాయి సలక్షణమైనదని మాత్రమే అన్నాను."

"సరేలే- ఆ అందం గొడవ మనకెందుకు?"

"ఆ - అమ్మాయికి అందం లేదని, చదువు లేదనీ కోతపెడతాడుట పాపం! భాస్కరం భార్య చెప్పుకు ఏడ్చింది."

"ఓహో! చివాట్లు పెట్టడానికా ఏమిటి? భాస్కరాన్ని రేపు రమ్మన్నావు"

"మనం చివాట్లు పెట్టేదేమిటి? ఎవరి కర్మ వారిది! పెళ్లి చేసుకున్న తర్వాత ఆజీవిని వేధించకూడదని ఇంగితం ఉండాలి పాపం! తల్లిని, తండ్రిని, అన్నదమ్ములను, అందరినీ వదలి కదా ఆడది కాపురానికి వచ్చేది. నమ్ముకున్న మగవాడు, ఉదాసీనంగా ఉంటే ఆ ఆడదాని మనస్సెల్లా ఉంటుంది."

* * *

మరునాడు మిళిందకుమార్ తన ఊరు వెళ్ళిపోయాడు. భాస్కరం వచ్చాడు పంకజం ఇంటికి. పిచ్చాపాటీ చాలాసేపు మాట్లాడుకున్న తర్వాత "భాస్కరం! నీ పెళ్లాం చాలా మంచిది. నేను ఎంతో వికారమైనదనుకున్నాను నీ మాటలనుబట్టి. మొత్తం మీద బలే వాడివే! నన్ను దగా చేశావే! అవునులే— ఎవ్వరైనా తన భార్య అందమైనదని చెప్పుకుంటారా" అన్నది పంకజం.

"నిజం నీతో నవ్వా, చెప్పకుందామనుకున్నాను" అన్నాడు భాస్కరం.

మాట చెప్పుతో కాదనలేని స్థితిలో పెట్టాననుకున్న పంకజానికి భాస్కరం మాటలు తననే ఇరుకులో పెట్టినై.

"భాస్కరం! నీ భార్య అమాయకురాలు. అనాకారి మాత్రం కాదు. నీవు పెళ్లి చేసుకుని నచ్చలేదనడం ఏమీ న్యాయంగా లేదు"

"నేను ఎవరితో చెప్పుకున్నాను? నాకు నచ్చలేదని. నీతో మాత్రమే— పంకజం! పెళ్ళిచేసుకున్నందుకు, ఏదో— సంసారం చేస్తున్నాను!"

"మగవాడు అనాదరంతో చూస్తున్నాడని తోచినపుడు ఆడది ఎంత బాధపడుతుందో నీకు తెలుసునా భాస్కరం!"

"మగవాడూ ఆడదాని మనసు గూర్చి చెప్పేవాడే, ఆడదీ ఆడదాని మనస్సును గూర్చి చెప్పేదే, మగవాడిని మనస్సును గూర్చి ఆలోచన ఎవ్వరికీ అక్కరలేదు. అవును— మగవాడో రాయో అన్నారు."

"భాస్కరం! నీవు రేపు వెళ్ళిపోతున్నావు కదూ. నేను నీవు వచ్చేవరకి పురుడు పోసుకువెళ్ళిపోవచ్చు నేను నిన్ను ఒక్కటి కోరుతున్నాను నీకు ప్రేమ వున్నా లేకపోయినా నీ భార్య మనస్సు ఏమీ నొచ్చకుండా ప్రవర్తిస్తానని నాతో మాట అను నేను సంతోషిస్తాను."

"నీవు సంతోషస్తావా పంకజం"

"సంతోషిస్తాను భాస్కరం"

"నేను అలా చేయడం నీకు సంతోషదాయకం అయితే అలాగే చేస్తాను పంకజం"

"కూర్చో భాస్కరం — కాఫీ త్రాగి వెళుదుగాని."

పంకజం లోపలికి వెళ్ళింది. అద్దంలో చూసుకుంది తన కళ్లు చెమ్మగిలడం. కాఫీ తెచ్చియిచ్చింది భాస్కరానికి తన చేతులతోనే. భాస్కరం అందుకుని కాఫీ సేవించినతర్వాత మౌనంగా వెళ్ళిపోయాడు.

* * *

హైదరాబాదు నగరంలో ప్రతిసంవత్సరం ఎగ్జిబిషన్ జరుగుతూ ఉంటుంది. చిత్రవిచిత్రములైన వస్తువిక్రయశాలలు అందులో ఏటా వెలుస్తూ ఉంటాయి ఏ ద్వారాన ప్రదర్శనంలోనికి ప్రవేశించాలో, ఏ దారిన బయటకు పోవాలో విద్యుద్దీపాల ధగధగలలో తెలుసుకోవడం అంత తేలిక కాదు. నాటకాలు, నృత్యాలు మొదలైనవి ఆ ఆవరణలో ఏర్పాటు చేయడమే గాక, కొన్ని వినోదాలుకూడ ఏర్పాటు చేస్తూ ఉంటారు. వాటిలో రైలు నడిపించడం ఒకటి. అందులో పిల్లలతో ఎక్కింది పంకజం. దుస్తులనుబట్టి, 'ఫలానావారు ఫలానాభాషవారు'ని చెప్పడం కష్టం. అందులో హైదరాబాదు ఎగ్జిబిషన్‌లో వివిధభాషలు మాట్లాడేవారూ వస్తారు. పంకజం రెండుజడలు వేసుకుని గుజరాతీ దుస్తులలో ఉంది. పిల్లలతో హిందీలోనే మాట్లాడుతూ వుంది. ఇంతలో ఆమెకళ్లు మరొక పిల్లతల్లిమీద పడినై ఆ అమ్మాయి తెలుగుమాట్లాడుతూ ఇద్దరుపిల్లలనూ చెరో రెక్కతో గుంజుతూ రైలు ఎక్కింది. పంకజానికి ఎదురుగా ఉన్న సీటులోనే కూర్చుంది. ఆ అమ్మాయిని ఎక్కడో చూసినట్లు పంకజానికి మనస్సులో మెదులుతోంది. వెంటనే "మీది ఊరండీ" అని తెలుగులో ప్రశ్నించింది పంకజం. రెండు జడలఆవిడ తనను తెలుగులో పలకరించినందుకు ఆశ్చర్యపడి మాది ఫలానా ఊరు అని చెప్పింది. తనభర్త కాలేజీలో లెక్చరరని చెప్పింది పంకజం ఆసక్తితో పేరడిగింది. వెంటనే ఆమె తన కొడుకును మీ నాన్న పేరుచెప్పమని గిల్లింది. పంకజం పుష్కరం తర్వాత భాస్కరం భార్యను చూడగలిగినందుకు సంతోషించింది.

రైలు దిగినతర్వాత ఒక ప్రక్కన నిలబడి భాస్కరంభార్యకు తననుఎరుక పరచుకుంది. భాస్కరంభార్య విస్తుపోయి "నువ్వాఅమ్మా పంకజం! నిన్ను రోజూ దీపం పెటినప్పుడల్లా తలచుకుంటాను," అంది భాస్కరంభార్య. పంకజంవచ్చి చీర యిచ్చిన రోజునుండి భాస్కరంలో మార్పువచ్చిందనీ, తనను మనిషిగా చూస్తున్నాడనీ పంకజం చేతి చలువ అని కొనియాడింది. ఆ చీర కట్టుకున్న రోజున భార్యగా చూస్తాడనికూడ గంగల మనస్సువిప్పేసి చెప్పేసింది భాస్కరం భార్య. ఆ అమాయికకు పంకజానికి నవ్వు రావటమే కాక సిగ్గుకూడ వేసింది. వెంటనే దీర్ఘాలోచనలోపడి, తన భావాలను భాస్కరంభార్యగమనించకుండా భాస్కరంకొడుకులను దువ్వి పేర్లడిగి తెలుసుకుని వారినెత్తుకు ముద్దాడింది. మొన్ననటిదాకా తనభర్త బొంబాయిలో ఉద్యోగంచేశాడనీ, ఇటీవలనే హైదరాబాదు బదిలీ అయిందనీ, మళ్ళీ త్వరలో బదిలీ అవుతుందని అనుకుంటున్నారనీ చెప్పింది. పంకజం తన చిరునామా ఇచ్చి భాస్కరంభార్యను తనఇంటికి రావలసిందిగా చెప్పింది.

మరునాడు భాస్కరం, భార్య, పిల్లలూ మిళిందకుమార్ ఇంటికి వచ్చారు. వచ్చేటప్పుడు భాస్కరంభార్య పసుపు, కుంకుమ, ఒక కంచిపట్టుచీర తీసుకొని వచ్చి పంకజానికి ఇచ్చింది పంకజం ఆ చీరను వెంటనే ధరించిందికూడా. మిళిందకుమార్ ఆ రోజు వారిని తన యింట్లోనే భోజనంచేయుమని కోరాడు. అందరూభోజనంచేశారు. ఆరోజు ఆదివారం అవడంచేత ఎవరికీ ఉద్యోగపు తొందరలేక తీరికగా కూర్చుని కబుర్లు చెప్పుకున్నారు. తాను చిన్నప్పుడు ఎరుపు చీరలంటే మోజుపడేదో ఆ దేరంగు జ్ఞాపకం ఉంచుకొని భాస్కరం తెచ్చియిచ్చాడని పంకజం మనస్సులో అనుకుంది. మిళిందకుమారితో తనపిల్లలకు ట్యూషన్ చెప్పవలసిందిగా భాస్కరాన్ని కోరుకోమని సలహా యిచ్చింది. భాస్కరం అందుకంగీకరించాడు.

రెండు సంవత్సరాలు గడిచినై. పంకజం పెద్దకూతురు చంపకానికి, మిగిలిన పిల్లలకు కూడ చదువు చెబుతున్నాడు భాస్కరం. చంపకం పదునాల్గేళ్ళపిల్ల, చురుకైనది. భాస్కరానికి ఆ అమ్మాయంటే ఎక్కువ ఇష్టం, చంపకానికికూడ భాస్కరం బోధన

హోటల్ యజమాని గెస్టుతో;

"ఇదిగో ఇలా చూడండి. ఇవి మా హోటల్ ఫోటోలు. వివిధశాఖలు, గదులు వీటిల్లో ఉన్నాయి. ఇవి మీతో తీసుకు వెళ్లండి. ఈ ఫోటోలవల్ల మీకు హోటల్‌ను గూర్చి కొన్ని అభిప్రాయాలు కలుగుతాయి.

గెస్టు:

"ఫోటోలు లేకుండానే నాకు మీ హోటల్ పై కొన్ని అభిప్రాయాలు ఏర్పడ్డవి. ఎట్లాగో నేను వాటిని కావలసిన వాళ్లందరికీ చెబుతాను పైగా ఫోటోలెందుకూ?"

★ తీరని కోరిక

మీద ఐక్యం కుదిరింది. అప్పుడప్పుడు మిళిందకుమార్, పంకజం కూడా వచ్చి కూర్చుని ట్యూషన్ వింటూ ఉండేవారు. నెలనెలా భాస్కరానికి జీతం ముట్టచెబుతూ ఉండేవారు. ఆ జీతం చంపకమే ఇస్తూ ఉండేది. జీతం పుచ్చుకోవడానికి లోలోపల ఇష్టం లేకపోయినా భాస్కరం వద్దని అనలేదు.

ఒకరోజున పంకజం చంపకం పాఠం దగ్గర కూర్చున్నది. పాఠం అయిపోయిన తర్వాత భాస్కరం చంపకం తెలివిని మెచ్చుకుంటూ, చిన్నప్పుడు ఆ వయస్సులో పంకజం స్కూలు రోజులు జ్ఞప్తికి తెస్తూ, తల్లికంటే కూతురు ఇంకా తెలివికలదని అన్నాడు. పంకజం ఏమీ మాట్లాడలేదు. చంపకం చెక్కిళ్ళలో సిగ్గుపడుతూ పంకజం వంక చూడడం గమనించింది. వెంటనే ఏ భావమూ ముఖంమీద కనపడనీయకుండా లోపలకు వెళ్ళిపోయింది. ఆ రోజునుండి ట్యూషన్ చెప్పేవేళలలో అక్కడకు రావడం మానివేసింది. కాని భాస్కరానికి ఫలహారం, కాఫీ అందేటట్లు శ్రద్ధమాత్రం యథాప్రకారం చూపుతూనే ఉన్నది.

* * *

ఆ రోజు పంకజం ఇల్లు వచ్చేవారితో పోయేవారితో సందడిగా వుంది. కొందరు మిళిందకుమార్‌ను చూడవచ్చేవారూ, కొందరు మహిళామండలి స్త్రీలు పంకజాన్ని చూడవచ్చేవారూ. మిళిందకుమార్ ప్రమోషన్ మీద ఢిల్లీకి బదిలీ కావడమే ఆ కోలాహలానికి కారణం. ఆ రోజు భాస్కరం కూడా వచ్చాడు. మిళిందకుమార్ భాస్కరాన్ని పట్టుబట్టలతో సత్కరించాడు. మిళిందకుమార్ వెంటనే ఢిల్లీకి ప్రయాణమై వెళ్ళిపోయాడు, మరి రెండు రోజుల్లో కుటుంబాన్ని బయలుదేరి రమ్మని.

పంకజం ప్రయాణానికి ముందు భాస్కరం భార్య వచ్చి చూచి వెళ్ళింది. దూరం వెళ్ళిపోతున్నందుకు విచారించింది.

రైలు ప్లాటుఫారం మీదికి వచ్చింది. సామానులు బ్రేకు వానులో వేశారు. ఫస్టు క్లాసు అంతకుముందే రిజర్వు చేయడంచేత పంకజం, పిల్లలూ రైలులో సుఖంగా ఎక్కారు. ఇంతలో ప్లాటుఫారం మీదికి భాస్కరం వచ్చాడు. చంపకం నమస్కరించి సెలవు తీసుకుంది. పంకజం ప్లాటుఫారం క్రిందికి దిగింది. ప్లాటుఫారం మీద కొంతదూరం దాకా నడిచివెళ్ళారు మాట్లాడుతూ పంకజం, భాస్కరం. ఇంకా టైము ఉండడంచేత, ప్రయాణీకులు ఎవరి హడావిడిలో వారు ఉంటూ కూడా, బంధువుల దగ్గిర వీడ్కోలు తీసుకోవడం, కష్టసుఖాలు చెప్పుకోవడం చేస్తూనే ఉన్నారు.


భాస్కరం పంకజానికి కృతజ్ఞత వెలిబుచ్చాడు ఇన్నాళ్ళనుండి ట్యూషన్ రూపములో ఆర్థికంగా సహాయం చేసినందుకు.

"ఏదో చిన్నప్పుడు కలిసి చదువుకున్నాం. ఈమాత్రం సహాయం ఏం పెద్ద సహాయం భాస్కరం? నాకు సంతోషకరమైన విషయం ఏమంటే నీవు ఆడదాన్ని ఉసురుపెట్టకుండా ఏలుకుంటున్నావు. ఆ అమ్మాయికూడ చాలా మంచిది."

"పంకజం! నువ్వు మంచిదానవు కనుక నీకందరూ మంచిగానే కన్పిస్తారు. ఆ అమ్మాయికూడ ఒక జీవి. నాకు ఇష్టం లేకపోయినా పెద్దలు పెళ్ళిచేశారు. నేను ఎదురుతిరగలేకపోయాను. అందుచేత జీవితాంతం వరకు ఆ అమ్మాయి నాకు పెళ్ళాం అయి కూర్చుంది."

"పెళ్ళి చేసుకోకముందు ఎందుకు ఎదురుతిరగలేకపోయినావు?"

"అది నా దౌర్బల్యం పంకజం! ఎదురుతిరగడం ఎలా చేతకాలేదో, కావలసిన వస్తువు కావాలని చెప్పడం చేతకాదు పంకజం! నేను మనస్సులో వివాహం చేసుకోదలచుకున్న పిల్లను ఆనాడు అడగగలిగివుంటే, ఈ జీవితమే బలికావలసిన అవసరం లేకపోయేదేమో!"



ఈ వారపు ...., స్త్రీలతో వివాదములు,

చిత్రం. జె. సత్యనారాయణ, బిలాస్‌పూర్

పంకజం మాట్లాడలేదు.

"నేను అడగగలిగివుంటే, నా తండ్రిని నీ తండ్రి అడగగలిగి ఉండేవాడు. మనకు వివాహం అయివుండేది. నా జీవితం నీకది తీరని కోరికగా ఉండిపోయేది కాదు."

"నువ్వు అడగగానే అట్లే అయిపోయి ఉండేది కాబోలు. నేను ఒప్పుకోనక్కర లేదు కాబోలు! నలుగురు బిడ్డల తండ్రివైకూడ ఇంకా చిన్నతనపు కబుర్లూ కోతలూ మానలేదు!"

"పంకజం! నిజం చెప్తా నేను నిన్ను మనసారా ప్రేమిస్తున్నాను. తరుణం దాటిన ఇరవై ఏళ్ళకయినా, నా మనస్సులో మాట చెప్పగలుగుతున్నాను. ఇకముందు నీవూ నేనూ జీవితంలో కలియవచ్చు, లేదా కలియకపోవచ్చు. నీవు నన్ను నా భార్యను ఏలుకొమ్మని అధికారం చలాయించినప్పుడు నీమాట విన్నదికూడ నీమీద ప్రేమచేతనే. నీ పిల్లలకు ట్యూషన్ చెప్పడానికి అంగీకరించిందికూడ నీమీద ప్రేమచేతనే. నీకు నామీద ప్రేమలేకపోతే, నాలోని యీ ఊహ చెడుతలపుగా నీకు కనిపించవచ్చు. మంచితనంగా విడిపోయే ఈ మంచిక్షణంలో నీవు నన్ను హీనుడిగా చూడవచ్చు. కాని నాకు తృప్తియేమిటంటే నా హృదయాన్ని ఈ వియోగసమయంలోనయినా చెప్పగలిగానని. పంకజం! నీకు నామీద ప్రేమ లేకపోతే లేదని నిర్భయంగా చెప్పు. నిన్ను నేను ఏమీ గర్హించను. ఆ క్షణంనించి నా జీవితం వెనుక టిపుటలన్నీ ఒక్కసారిగా తిరగేసుకుంటా."

పంకజం మాట్లాడలేదు. ఒక్క నిట్టూర్పు విడిచి "ఎంత పిచ్చివాడవోయీ భాస్కరం" అంది.

"నేను పిచ్చివాడననేమాట నిజం. ప్రేమతో అయిన పిచ్చివాడనా? నీవు నామీద చూపే జాలినిబట్టి నీకుకూడ నామీద ప్రేమవుందని భ్రమపడుతున్నానా అని చాలా కాలంనుంచి ఆలోచించుకుంటున్నాను. ప్రేమ, జాలి రెంటికీ కలనా స్త్రీ నుండి వచ్చే వాక్యాలు ఒకే రకంగా ఉంటై. పంకజం! నీకు నీ సంసారం వుంది. నాకూ నా సంసారం వుంది. జీవితంలో ఎవరి బాధ్యతలు వారికి తప్పలేదు. ఇకముందు కలిసే అవకాశమూ లేదు. ఇద్దరి వయస్సూ చాలా భాగం గడచిపోయింది. నా తృప్తికోసం ఒక్కటి నిజం చెప్పు. నీవు నన్ను ప్రేమిస్తున్నావా లేదా? ప్రేమించనిదే ప్రేమిస్తున్నానని అబద్ధం చెప్పి, నేను సంతోషిస్తానని ఆత్మవంచన చేసుకోవద్దు. నిజంగా నువ్వు ప్రేమిస్తే—నీ ప్రియుడికి నీవల్ల ఏ ఉపకారం లేకపోయినా నిజం చెప్పిన ఉపకారమైనా చేయి."

(32-వ పేజీ చూడండి)

అన్వేషణ

పోతుకూచి సాంబశివరావు

(గతవారం తరువాయి)

ధర్మశాలగది రిహార్సల్సుకు, ఏదో కొద్ది మామూలు గుమాస్తాకు యిచ్చే షరతుతో ఏర్పాటు చెయ్యబడింది. తన దర్శకత్వ నిపుణత అంతా ప్రత్యేకంగా ప్రదర్శించాలని ప్రయత్నించేవాడు ఈశ్వరయ్య. నటనలో ఏవిధంగాను తీసిపోనని, ప్రత్యేకమైన సలహాలు తన నటనలో యిచ్చే అవసరం లేదనే అహంభావంతో ఈశ్వరయ్య సూచనలు నిర్లక్ష్యపరిచేవాడు వెంకట్రావు. వ్యాపార సందడిలో తీరికలేక ఆలస్యంగావచ్చి, ఒక అరగంట రిహార్సల్సు జరిపి ఎలా చెబితే అలా ఏ ఆలోచనా లేక వినిపోయేవాడు నారయ్య. స్వీయఅనుభవంతో, యితరుల సలహాలు కూడా అర్థంచేసుకుని, ఒక సమన్వయ దృష్టితో నటిస్తే, పాత్ర రాణిస్తుందని, శివరాం దర్శకుడి సలహాలను కొంతవినేవాడు.

ప్రభాకరం దర్శకుడిసలహాలన్నీ చాలా సమంజసమనీ, నటకులు తమ అహంభావం తగ్గించుకుని ఎక్కువ సహకారం చూపాలని వాదించేవాడు.

వ్యక్తిగత విలువలకు ఏ అవమానం కలగకుండా రిహార్సల్సు జరిగిపోయేవి. విసుగెత్తినప్పుడు విరామకాలంలోనూ విలాసంగా అల్లరిచేసేవారు నటకులు. ప్రభాకరం లేచి ఆంగ్లపద్ధతిలో నృత్యం చేసేవాడు, విరహవేదన నటిస్తూ, ఇంగ్లీషు పాటలు పాడుతూ. ప్రతికక్ష్య నటకుల నటన, నవ్వే అవహేళనగా అభినయించేవాడు వెంకట్రావు. గారడీవాని ఘనకార్యాలు, సాముద్రికుడి ఉపన్యాసాలు, కోయదొర మాటలు, పెళ్లాజే జోమ్మ పాటలు, విచిత్రమైన నడకలు ప్రదర్శించేవాడు ఈశ్వరయ్య. అమ్మాయిల అంగవిన్యాసాలు, పూర్వఅనుభవంలో తారసిల్లిన నటీమణుల హాస్యాస్పద సాంభంగిమలు ఒయ్యారంగా త్రిప్పుతుంటూ నించుబుగ్గలో సిగ్గుచూపేవాడు నారయ్య. ఎగురుగా చేయబడే వేళ నటనలను హాస్యంగా వ్యాఖ్యానించేవాడు శివరాం. మద్దెల మోతలు, హార్మనీ మనిరాగాలు, మంయ్ మంయ్‌లు, నటకుల విరామకాల హాస్యాన్ని వృద్ధిపరచేవి.

నాటకప్రదర్శనానికి రెండు రోజుల ముందు స్త్రీ పాత్రలు ధరించవలసిన నటీమణులు బెజవాడనుంచి వచ్చేరు. నారయ్య, వెంకట్రావు స్టేషనుకు వెళ్ళి ఆహ్వానించి ధర్మశాలలో ఒక గది ఏర్పాటుచేశారు. నటీమణులిద్దరికీ అండగా, రక్షగా ఒక ముసలి వనిత, ఒక పిల్లవాడు, ఒక పాతికేళ్ళ యువకుడు అనుసరించి వచ్చేరు. వృత్తి విలువలు, మనిషి నడతలు బాహాటంగా అందరికీ అర్థమవుతున్నా, అబలయైన వనితకు ఏ యుగంలోనైనా బలవంతుడైన మగవాడు అండగానే ఉండవలసివస్తోందనుకున్నాడు శివరాం. వారి అవసరాలకు సహజంగా అయేదానికంటే రెండింతలు ఖర్చు ఎక్కువౌతోందని వయసుడిగి స్త్రీవాంఛ తగ్గిన ఈశ్వరయ్య ముఖం చిట్లించాడు. నటీమణుల పరివారాన్ని చూసి. తప్పనిసరి ఖర్చనుకుంటూ ఏకగ్రీవంగా పెదవి విరిచారు నారయ్య, వెంకట్రావు.

క్రొత్తగా స్థాపించిన నాటకసంస్థ అని ప్రజలకు గంధర్వ నాటక సమితిమీద మోజు కుదిరింది. సభ్యుల ప్రచారంవల్లనయితే నేమి, పలుకుబడివల్లనయితే నేమి 'ద్రోపిడి' నాటకానికి ధనం పుష్కలంగా చేరింది. వర్తకులను పట్టి నారయ్య, జమీందారులను, ధనికులను మచ్చిక చేసుకుని వెంకట్రావు, ఆఫీసర్ల ముందు నాజూకుగా తియ్యగా మాట్లాడి శివరాం ధనసేకరణలో ప్రత్యేక నటనా నైపుణ్యం చూపారు. రాష్ట్రపతిరోడ్డుపక్కన ఉన్న థియేటరులో ఆ రాబోయే ఆదివారం పగంటలకు 'ద్రోపిడి' నాటక ప్రదర్శనకు విరివిగా సన్నాహాలు జరుగుతున్నాయి.

తనపాత్రకు అవసరమైన టోపీలు, గుడ్డలు సమకూర్చుకుని టాంగా ఎక్కాడు శివరాం. దారికిరుపైపులా బలాఢ్యులయిన బిచ్చగాళ్ళు పేవుమెంట్లమీద గుడ్డలు, సత్తు గిన్నెలు పగులుకు కూర్చున్నారు. బాటసారులు దయతో విసిరే పైసలకోసం. ఒకడు పేవుమెంటుమీద పడుకుని కాళ్ళు తన్నుకుంటూ పొట్టబాదుకుంటూ ఆఁలీ అంటూ అరుస్తున్నాడు. ఒక కళ్ళున్న మనిషి గ్రుడ్డివాడు మరొక స్త్రీ అండతీసుకుని వీధిలో ముష్టికి బయలుదేరాడు. విభూతిపిండికట్లు బిగించి పంచాంగం చేతబట్టిన బ్రాహ్మణుడు ఎరుగున పెద్దలయింటికి ఆయువారానికి బయలుదేరి మూటలు మోసుకుంటూ నడుస్తున్నారు. మరొక శక్తిభక్తుడు పెద్దతోలు కర్రతో భయంకర శరీరాన్ని పలుమారులు బాదుకుంటూ గజ్జెలు కట్టుకుని నృత్యం చేస్తున్నారు. శరీరానికి ఏ బాధ కలగనట్లు సహజరూపాలకు కాకీరంగు దుస్తులు తొడిగి కాకీటోపీలతో తయారయి శృంగాటకాల్లో తమవృత్తి పాటిస్తున్నారు పోలీసులు. జీవితంలో పొట్టగడుపుకోటానికికూడా ప్రతీ మనిషి మానసికంగాకాని శారీరకంగాకాని మార్పుతెచ్చుకుని ప్రపంచరంగంలో నాటకం వేస్తున్నట్లు కనిపించాడు.

తొమ్మిది గంటలయినా రంగస్థలంమీద తెర ఏర్పాట్లు, విద్యుద్దీపాల అమర్పు 'మైక్' స్థాపన జరగలేదు కూలీలు హాలులో కుర్చీలు సోఫాలు స్థలాలు మారుస్తున్నారు. రంగస్థలంమీద నిచ్చనవేసుకొని వెంకట్రావు అజమాయిషీలో కూలీలు తెరలుకడుతున్నారు. గ్రీన్ రూమ్‌లో నారయ్య నటీమణుల కోటారంగుముఖాలు యింకా సుందరవంతంగా వుండేటట్లు నాజూకుగా కనుబొమ్మలు బుగ్గలు సరిదిద్దుతున్నాడు నవ్వుతూ. ఈశ్వరయ్య పాత్రరూపాన్ని అప్పుడేఆహ్వానించుకొని నటనకు సన్నద్ధుడౌతున్నాడు.

"ఆత్మాన ముపమాం కృత్వా"

ఒక వుపన్యాసకుడు :

"అందమైన స్త్రీని బాహాటంగా చూస్తే తప్పేమిటి? ఎవరికి చెందినా ఏమైనా చూసి ఆనందించడంలో తప్పు లేదు. అందమైన వస్తువు నలుగురూ చూస్తేనే రాణిస్తుంది."

ఇంతలో సభలోంచి ఒకడు ఇలా అని ఊరుకున్నాడు.

"మీ అమ్మాయి విషయంలో డజనుమంది అలాగే అనుకుంటున్నారండీ"

★ అన్వేషణ ★

ఉద్రేకంతో జీవితంలో ఎంతో అపూర్వమైన నటనానుభవం ఉండి ఎప్పుడైనా రంగస్థలంమీదికి వచ్చి నటించిపోవచ్చునే ధోరణిలో పాత్రసంభాషణలే సరిగా తెలియని నటులు అహంభావంతో నాటక ప్రారంభానికి అయిదు నిముషాలు ముందువచ్చి గ్రీన్ రూమ్‌లో ప్రవేశించారు. ఈశ్వరయ్య వాళ్ళని మందలించాడు. రంగస్థలంలోని తెరల ఏర్పాటు తెమిల్చి, ఒక్క అంగలో గ్రీన్‌రూమ్‌లోకి దుమికి, మరుక్షణంలో స్వయంప్రతిభతో తన పాత్రరంగుల కోటాలో సృష్టించుకొని సిద్ధమయాడు వెంకట్రావు. హాలులోని ప్రేక్షకుల ఆతురతి కేకలతో ఈలలతో గ్రీన్‌రూమ్‌లోకి వినిపిస్తోంది.

నాటకం ప్రారంభం అయింది. ప్రకృతి సౌందర్యంతో అలరారే చిదరైతుపాలం దృశ్యం రంగస్థలంమీద కనిపించింది. ఈశ్వరయ్య సన్నగా, బక్కగా ఒక పంచె బనీనుతో, తలపాగా చుట్టుకుని చేతికర్ర భుజానికి తగిల్చి, దీనమైనముఖంతో పాగాకుచుట్టతో నిలబడ్డాడు. నీళ్ళకుండతో పల్లెపిల్లగా వయ్యారంగా సొగసుగా ప్రవేశించింది నటీమణి. నాటకం నడిచింది పట్టుగా, పిచ్చి జమీందారు సినీ డైరెక్టరు శివరాం, అతని అనుచరుడుగా నారయ్య, జంటగా ప్రశంసనీయంగా నటించారు. వెంకట్రావు అహంభావంతో ఏ హాలివుడ్ నటులనో అభినయించాలనే ఆకాంక్షతో సంభాషణలు రాక పాత్రే చెడగొట్టాడు. చిన్నపాత్రలు తమ్ము తాము ఔచిత్యంతో పోషించుకున్నారు రంగస్థలంమీద.

అన్యత్ముడిగా ఆహ్వానించబడిన ఒక ప్రభుత్వోద్యోగి ఇంత ఉత్తమ నటనతో యువకులు ప్రదర్శించిన నాటకం యిదివరకు చూడలేదన్నాడు. అన్యత్ముని ప్రశంసలు తన దర్శకత్వానికే అభినందన అని మురిసిపోయి, రంగస్థలంమీద పరిచయసమయంలో ప్రవేశించి, వంగివంగి నమ్రతగా ప్రేక్షకులకు నమస్కరించి, వారి కరతాళధ్వనులకు చిరునవ్వులు విసిరి అవి ఆఖరయిపోయినా మరొకసారి చప్పట్లు కొట్టమన్నట్లు ఒక క్షణం వారివైపు దీనంగా చూసి తెరలోకి నిష్క్రమించాడు ఈశ్వరయ్య.

పిచ్చి జమీందారుగా శివరాం నటన అద్భుతమైన సహజత్వం ఉట్టిపడుతూ ప్రేక్షకులకు ఆనందం కలిగించిందన్నారు తన నటన పాడయిపోయినదనే బాధతో అవమానం పొందినట్లు ఖిన్నుడయి ఒకక్షణం రంగస్థలంమీద తప్పనిసరిగా నిలుచుని గబుక్కున వినమ్రశిరస్సుతో ప్రేక్షకులకు ముఖం చూపకుండా నిష్క్రమించేడు వెంకట్రావు. నాటకం సమాప్తి అంటూ ప్రేక్షకులు హాలు ఖాళీచేశారు.

ఈశ్వరయ్యకు విజయగర్వం పెరిగింది నాటకరంగంలో ధృవతారగా తాను వెల్లివిరిసినట్లు కనిపించిన ప్రతీవారిముందు ఒక అరగంట చిన్న ఉపన్యాసమిచ్చి, చణుకులు విసిరేసేవాడు వెంకట్రావు తనపాత్ర పాడయిందనే అవమానంతో ప్రజలలో పది హేనురోజులు తిరగడం మానేశాడు. నటీమణులను మరో రెండు రోజులు అట్టేపెట్టి, తనింట్లో స్వయంగా భోజనాలు ఏర్పాటు చేసి ఖులుకుతూ నారయ్య వారిని సాగనంపాడు.

హాలులోని ప్రేక్షకసమూహాన్ని బట్టి నాటకం రాబడి రెండు వేల రూపాయిలు మించిందని అంచనా వేయబడింది. టిక్కెట్లు అమ్మిన నటులు, యింకా సొబ్బు సేకరించలేదని అందినతర్వాత యిస్తామని వాయిదా వేశారు. చేసిన ఖర్చులువచ్చిన సగంధనానికి మించిపోయాయన్నారు నారయ్య, వెంకట్రావు.

ప్రజల మన్ననలు పొంది బహుజన ప్రదర్శితమైన నాటకం సమితి ఆదాయం చివరకు శూన్యం చేసింది. నెలలు గడిచినా టిక్కెట్లపూర్తిసొమ్ము రాకపోగా జమా ఖర్చులు పట్టిక కార్యవర్గం ఆమోదం పొందడానికి కార్యదర్శి పూనుకోనక పోవడంవల్ల ఈశ్వరయ్యకు ఆగ్రహం కలిగింది. అతని ఆగ్రహం సమంజసమన్నాడు శివరాం. ప్రభాకరం సమర్థించాడు. కార్యవర్గంలో నాటకం రాబడినిగురించి ఘర్షణ చెలరేగింది. వాదోపవాదాలు తీవ్రమై వ్యక్తిగత దూషణల దాకా పరిణమించి నారయ్య ఈశ్వరయ్యను కొట్టబోయాడు. శివరాం అడ్డుకున్నాడు. బలమైన నారయ్య చెయ్యి ఈశ్వరయ్య చెంపదూసుకుని పోరుకుంది. ఒక్క ఈశ్వరయ్య బలమైన నారయ్య ఉగ్రరూపం చూసి బెదరిపోయాడు. కార్యవర్గ సభ వాయిదా పడింది.

ప్రభాకరం నటుల నందరినీ కూడగట్టి ఒక సమన్వయసిద్ధాంతం ప్రతిపాదించేడు. కార్యవర్గ పదవులలో సమితి అభివృద్ధి దృష్ట్యా మార్పు తేవడం అవసరమని శివరాంను కార్యదర్శిగా చేయ ప్రతిపాదించాడు. నారయ్య కొంచెం ఆలోచించి వెంకట్రావుతో సంప్రతించి ప్రతిపాదనకు చివరకు అంగీకారం సూచించాడు. శివరాం కార్యదర్శిగా ఎన్నికైనాడు.

నిర్మాణాత్మక కృషి సలుపాలని ఉత్సాహంగా నాటక సంస్థలో చేరిన శివరాంకు సమితిలోని రాజకీయాలు చికాకు కలిగించాయి. తన కార్యదర్శిత్వంలో ఘర్షణలకు అవకాశం తగ్గించి పురోగతికి తోడ్పడాలనే ఆశయం పెట్టుకున్నాడు శివరాం.

గ్రంథాలయాల్లో సంఘసేవాసమితుల్లో సభ్యుడిగా చేరేడు శివరాం. వీలైనంతవరకు నగర సభల్లో ఉత్సవాల్లో సముచితమైన కార్యక్రమాన్ని భుజాని వేసుకుని వివిధ తరగతుల మనుష్యులతో మసులుతూ పరిచయాలు వృద్ధి చేసుకున్నాడు. శివరాం ప్రవర్తన పరిసర వర్గాల్లో విశ్వాసం వృద్ధి చేసింది. ఏ నిర్మాణాత్మకకృషి జరుపదలచినా నగర ప్రముఖులు అతని పేరు లెక్కలో వేసుకోసాగారు.

ఈశ్వరయ్య వర్గబలంతో శివరాం నాటక సమితి కార్యక్రమాలు జయప్రదమైనాయి. నారయ్య వెంకట్రావు తమ సహకారం తగ్గించినా కార్యనిర్వహణలో కార్యానికి దూరంగా వుండడానికి యిష్టంలేక, తమ వ్యక్తిగత పదవి, ప్రభావాలు పోకుండా చెయ్యి వేసేవారు. మరి కొన్ని నాటకాలు ప్రదర్శితమయినాయి. కవులసభలు జరిగాయి. బీదవిద్యార్థినటులకు బహుమతులు యివ్వబడ్డాయి. నగర సంస్థల ముఖ్య గంధర్వ నాటక సమితి తరఫున నాటకాలు పోటీ ఉత్సవాలు జయప్రదంగా జరిగాయి. సమితి ఆదాయం పెరిగింది శివరాం ఎరపతి యినుమడించింది.

ఆఫీసు లేని తీరిక సమయాల్లో, సెలవుదినాల్లో సాంస్కృతిక నాటకరంగ కార్యక్రమాలలో ఊపిరాడక శివరాం తిరగజొచ్చాడు. రాత్రి యింటికి వచ్చేటప్పటికి పదిగంటలు దాటేది. రోజూ రాత్రి ఆలస్యంగా రావడం ఇంటియజమానులు ఆంగ్లోఇండియనులకు చికాకు కలిగించింది. శివరాంకోసం కాంపౌండుగేటు తెరిచి రాత్రి 10 గంటల

'సరే, గాని నేను ప్రసిద్ధ కథారచయితనని నీకింకా తెలీదా'

"ఇంతవరకూ తెలిదు. ఏం? ఏమైనా బాగా అమ్ముడుపోతున్నయ్యా."

'ఓ! చెంబూ, తప్పేలా, ఇల్లూ వాకిలీ సర్వం అమ్ముడుపోయాయి, నేను కథలు రాయడం మొదలెట్టాక.

బాకీ వుంచడం భద్రతకు అపాయం కలిగిస్తుందని బాధపడేవారు. ఒకటి, రెండు సార్లు శివరాంకు చెప్పారు. రాత్రి త్వరగా యింటికిరావాలని. వ్యక్తి విషయాలలో సంబంధం కల్పించుకుని తమ కనుగుణ్యంగా నడవమనే గృహయజమానుల సలహాలు శివరాంకు ఆగ్రహం కలిగించాయి. తన కార్యక్రమాలు యింటికిత్వరగా రానీయవన్నాడు. శివరాం సౌలభ్యాలు గుర్తించకుండా గృహయజమానులు గేటుకు తాళంవేసినారు. రాత్రి విసుక్కుంటూ వచ్చి తలుపు తీసేవారు ఒక్కొక్కసారి వినీవిన్నట్లు నిద్రపోతుంటే, శివరాం కేకలు వేయలేక గేటు దూకి లోపల ప్రవేశించేవాడు.

ఒంటరిమనిషి జీవితం గృహస్థుల ధర్మానికి విరుద్ధమని ఆధునికులుకూడా పాటించడం శివరాంకు కంటకంగా కనిపించింది. సనాతనుల సంకుచితదృష్టితో ఒంటరియువకులు గృహస్థుల యిళ్లలో కాపురముండడం... ప్రమాదమని భావించినా, సమానత్వం స్త్రీపురుషులలో అన్నిరీతుల కావాలంటే ఆధునికులుకూడా బాధ్యతలు అర్థమయి బ్రతికే ఒంటరి యువకులనుంచి తమ గృహాలు కాపాడుకోవాలనీ అద్దెలకివ్వకపోవడం శివరాం నివాసస్థిరత్వానికి వీలు కలిగించటంలేదు. పాశ్చాత్య పద్ధతుల మనస్తత్వంగల ఆంగ్లోఇండియనులు తమ యిల్లు అద్దెకు యివ్వడంలో వారి మానసిక విశాలదృక్పథాన్ని ప్రశంసించినా, ప్రతీ నిమిషం తన ప్రవర్తనను కట్టుదిట్టంచేసి ఇంట్లోనే ఉండిపొమ్మనేవారిమనస్తత్వంలో ఏదో వింతస్ఫురించిందిశివరాంకు. అద్దెఎక్కువయినా ఏకాంతంగా, విశాలంగా ప్రత్యేకంగా ఉండే మిద్దె పైభాగం ఏదైనా దొరుకుతే బాగుంటుందనుకున్నాడు శివరాం.

ఒకరోజు బ్రహ్మయ్యగారు ఉత్తరం వ్రాశారు. లక్ష్మిపెళ్ళి అలస్యంచెయ్యడం గృహసాంప్రదాయాల ప్రకారం మంచిది కాదని, ఎంత త్వరలో సంబంధ నిర్ణయం చేస్తే అంత మంచిదని, వార్ధక్యం వస్తున్న తాను కళ్లారా చూస్తూ, చేతులతో స్వయంగా యీ వివాహం జరిపించాలని కోరుతున్నా నన్నారు. వరంగల్ లో ఏదో సంబంధముందని వాకబువల్ల తెలిసిందని, ఒకసారి వారి ఇంటికివెళ్లి పెళ్లికొడుకును పిల్లను చూసుకోవలసిందని కోరి దగ్గరవుండి అతనిని వీలయితే రాజమండ్రి, తీసుకురావలసిందని వ్రాశారు బ్రహ్మయ్యగారు. సాంఘిక కార్యక్రమాలలో తీరుబడిలేక తిరుగుతున్న శివరాంకు ఒకసారి దృష్టి గృహంవైపు మరలింది యీ ఉత్తరంతో. కుటుంబానికి పెద్దగా బ్రహ్మయ్యగారు సర్వవిషయాలు సర్దుకుంటున్నా, చెల్లెలి పెండ్లి చేసే బాధ్యతలో తన చెయ్యికూడా వేసి సహకారం చూపడం విధ్యుక్తధర్మమనుకున్నాడు శివరాం.

వరంగల్ ప్రయాణమయ్యాడు. ఊళ్ళో ఒక హోటల్లో మకాంచేసేడు. తాతగారిచ్చిన చిరునామా తీసుకొని ఉదయమే యిల్లు వెతుక్కుంటూ బయలుదేరాడు శివరాం. చివరకు పట్టుకున్నాడు.

వీధివైపు ముందు వరండాపై ఒరుగుతున్న పెంకు కప్పు, ఆ వెనకాల డాబా, వీధి వరండాకు ఇనుప కటకటాలు, కటకటాల్లోంచి రెండు వాలుకుర్చీలు కనిపించాయి.

కటకటాలు శబ్దం చేశాడు శివరాం. ఒక ముసలాయన తలుపు తెరిచాడు. ఒక పంచ, బనీను భుజంమీద ఒక తువ్వాలు వేసుకుని నిశితంగా శివరాంవైపు చూసేడు. 'మాది హైదరాబాదు...మీతో కలసి మాట్లాడాలని వచ్చేను...' శివరాం వినయంగా మాట్లాడాడు.

ముసలాయన మౌనంగా వాలుకుర్చీ చూపించాడు కూర్చోమని.

తన తాతగారి ఉత్తరంగురించి ప్రస్తావించాడు శివరాం.

ముసలాయన కులాసాగా నవ్వాడు. కోటు తొడుక్కుని ఆఫీసుకు ప్రయాణమౌతూన్న తన కొడుకును పిలిచాడు. మెట్లుదిగుతున్న అతను ఆగి వరండాలోకి వచ్చి నిలుచున్నాడు ఒక క్షణం.

సగం బట్టతలతో, ముదిరిన ముఖంతో, లావుగా కమిలిన మామిడిపండులా కనిపిస్తున్న ఆ యువకుడి వయస్సు సుమారు ముప్పైఅయిదు సంవత్సరాలు తక్కువ వుండదని నిర్ణయించాడు శివరాం. పద్దెనిమిది సంవత్సరాల వయస్సులో ఉన్న తన చెల్లెలికి యితను తగిన సంబంధమా అనే సంశయం శివరాంకు కలిగింది.

ముసలాయన శివరాంతో మాట్లాడారు బ్రహ్మయ్యగారి సంగతి విన్నానని. ఆయనలాంటి మంచి మనిషి యింకొకరు లేరని, ఉత్కృష్ట కుటుంబంలో పుట్టి మంచి పరపతి సంపాదించుకున్నాడని పొగిడారు. తెల్లని వస్త్రం ధరించి, కేశాలు ముడివేసుకుని తిలకంలేని నలభైఏండ్ల వనిత శివరాంవైపు తొంగిచూస్తూ గుమ్మంలో నిలుచుంది. పాతికేళ్ల జవ్వని లావుగా బొద్దుగా గుండ్రని ముఖంతో ఆశగా చూస్తూ శివరాంకు కాఫీ అందిచ్చింది మర్యాదగా...

'నీ కెంతమంది పిల్లలు బాబు!' ముసలాయన చిరునవ్వుతో ప్రశ్నించాడు.

"నాకు ఇంకా పెండ్లి కాలేదండీ!" శివరాం జవాబుకు ముసలాయన ముఖంలో అసంతృప్తి గోచరించింది. పెళ్ళికాని బ్రహ్మచారి కుర్రాడు చెల్లెలుకోరకు సంబంధాలు వెతుకుతూ పెద్దమనిషిలా ప్రవర్తించటమూ, తనలాంటి వయసు పెరిగిన పెద్దలను ధిక్కరించి అవమానం చెయ్యడమేనన్నట్లు తీవ్రంగా చూశాడు ముసలాయన.

"నువ్వూ, మీ చెల్లీ కవల పిల్లలు కాదూ"

"పుట్టినప్పుడూ, చిన్నతనంలోనూ అంతేనండీ. అది మెడిసిన్‌లో చేరాలి. ప్రస్తుతం నా కన్న అయిదేళ్లు చిన్న"

'మీ తాతగారు స్వయంగావస్తే బాగుండేది...నువ్వు యింకా పిల్లవాడవు యీ విషయాలు ప్రస్తావించడానికి...మా అమ్మాయి సుగంధికికూడా పెళ్ళి చెయ్యాలనుకుంటున్నాను...మీ తాతగారే ఎదురుగావుంటే పరస్పరం......' ముసలాయన అసంతృప్తి ముఖం మార్చి సరదాగా నవ్వేడు.

శివరాంకు భయంవేసింది. చెల్లెలి పెండ్లి గురించినసే తనపెండ్లి ప్రస్తావన జరుగుతుందేమోనని. సుగంధి కిటికిలోంచి తొంగి చూస్తోంది ఓరగా.

'మంచిరోజులు వీలుచేసుకుని మీరు తెలపండి... నేను మీ కుర్రవాణ్ణి రాజమండ్రి తీసుకువెడతాను...తాతయ్య ముసలివారైపోయారుగా...అందువల్ల యింతదూరం రావడం కష్టం...!'

'మంచిది... నేను వస్తాను రాజమండ్రి!' ముసలాయన మళ్ళీ అసంతృప్తిగా నిట్టూర్చాడు...ముసలాయన కొడుకు గంటస్తంభంలా వరండాలో ధ్వనియైన చెయ్యకుండా యింకా నిల్చున్నాడు.


'సరే...నువ్వు ఆఫీసుకువెళ్లు!' తండ్రి ఆజ్ఞతో తలఒంచుకుని వెళ్ళిపోయాడు ముసలాయన కొడుకు.

భోజనానికి ఉండమంటే సంబంధాలు అతకవనే భయంతో ముసలాయన ఆ ప్రస్తావన ఎత్తలేదు శివరాంతో. ఆయనవద్ద శెలవు తీసుకుని బయటికి వచ్చేశాడు శివరాం.

స్వయంగా తనకు సంబంధం నచ్చకపోయినా తుదినిర్ణయం చెయ్యవలసినబాధ్యత తాతయ్యదని జరిగిన సంగతిగురించి విపులంగా తాతయ్యకు ఉత్తరం వ్రాయాలనుకున్నాడు శివరాం. వరంగల్ వచ్చినపని పూర్తయినది కనుక చుట్టుప్రక్కలఉన్న చారిత్రక స్థలాలు చూసిపోవాలనుకుని కిళ్ళీ దుకాణంవైపు నడిచాడు శివరాం. కిళ్ళీ ఒకటి నోట్లో వేసుకుని సిగరెట్టుముట్టించాడు విరామకాలం గడిపేమార్గం ఆలోచిస్తూ.

పొట్టిగా గుమ్మటంలా ఆకారం, పెద్ద ముక్కు, బట్టతల, చేతిలోకర్ర, విశ్వపంచె

(39 వ పేజి చూడండి)



శంభూఫిలిమ్స్ వారి 'నమ్మినబంటు' చిత్రంలో నాగేశ్వరరావు.

బొంబాయి సినిమాలేఖ

కొత్తచిత్రాలు:

చాంద్ : ఉజాలా

నిర్మాత కులదీప్ సెహగల్, దర్శకుడు లేఖ్ రాజ్ భాక్రీలకీర్తిప్రతిష్టలు 'చాంద్' అనే చిత్రం(తస్వీరిస్తాన్)తో గగన పథాన్ని అంగుకొంటాయనీ, దిగంత పర్యంతం వ్యాపిస్తాయనీ ఆ చిత్రం చూసిన వారెవరూ అనుకోరు. కాగా, వారికి ఇంకో విధంగా ఒక కీర్తి ఉంది—ఎంత గొప్ప కథనైనా సినిమా తీసేసరికి సేలబారుగా తయారు చెయ్యడంలో ఈ ఉభయులూ గట్టివాళ్ళు అని గిటనివాళ్లు అంటారు. విశేషం ఏమిటంటే ఈ విధంగాకూడా వారికీర్తి పెరగకపోవడం.

కారణం: తుదీమొదలూ నీరసంగా ఉన్నా, మధ్యభాగం చాలా నిండుగా ఉంది. హృదయంగమంగా ఉంది. ఇదంతా ఇంత బాగుండడానికి కారణం ఇందులో మీనాకుమారి, బల్ రాజ్ సాహ్నీలు తమ భూమికలను నిర్వహించడంలో చూపిన నైపుణ్యం, ప్రదర్శించిన నటనాను. దర్శకుడు, కథాచిత్రణ విషయంలో తామరాకు మీద నీటిబొట్టులా ఉండడంలో విశేషమైన నిగ్రహం చూపినందువల్ల వీరిద్దరూ చేసిన కృషీ పడిన శ్రమా మరింత రాణించాయి. మిగతా నటీనటులు కూడా, బహుశా వీరిద్దరూ ఎలాగా కష్టపడుతున్నారు గదా. ఇక మనమెందుకు అని ఏమంత శ్రమపడకుండా సునాయాసంగా మొక్కు తీర్చుకున్నారు. చాలా గొప్పనటి అని అంతా పండరీబాయిని గౌరవిస్తారు. అయినా ఆవిడకూడా దిగులో అటూ ఇటూ తలతిప్పడంతప్ప ఇంకేంచేయలేదు. గ్లిసరిన్ చల్లగా ఉన్నన్నాళ్ళు కన్నీళ్లకు లోటు లేదు...

చాంద్ చిత్రంలో హేమంతకుమార్ సంగీతంకూడా ఏమంత బాగులేదు. ఆమాటకొస్తే ఏమీబాగులేదు. మ్యూజిక్ డెరెక్టర్ అనేది లోకువైపోయి ఎవరుపడితే వాళ్ళు సంగీతదర్శకులు కావడానికి తడికట్టడానికి పూరికొల్పేది ఈ తరహా సంగీతమే అని కూడా అనిపించింది. అయితే ఏమాటకామాటే చెప్పుకోవాలి కాబట్టి, కథ స్థాయికి తగినట్టుండడం విశేషం అని సంతోషిద్దాం.


షీలావాజ్, హెలెన్‌లు చేసిన నృత్యం ఒకటి ఆకర్షణీయంగా నేత్రపర్వంగా వుంది గాని, సంగీతం వీనుల విందు కానందువల్ల కొంత దెబ్బతింది.

మొత్తంమీద బల్ రాజ్ సాహ్ని, మీనాకుమారి అంతగొప్పగా నటించివుండకపోతే 'ఇంతకన్నా బీచికిపోతే బాగుండును' అనిపించేసే చిత్రం ఇది.

(మిగతా 86 వ పేజీలో)

భాస్కర్ ప్రొడక్షన్స్‌వారి 'మనోరమ'లో కృష్ణకుమారి, పెరుమాళ్ళు, బాలయ్య.







'రేణుకామాహాత్మ్యం'లో జగ్గయ్య.

చందమామా వారి

సిపాయికూతురు

చందమామా ఫిలింస్ వారి జానపద చిత్రం 'సిపాయి కూతురు' ఆంధ్రలో రెండో వారం సాగుతోంది. కొవ్వలి లక్ష్మీనరసింహారావుగారు ఇదేపేరుతో వ్రాసిన నవల దీనికి ఆధారమని, తెలుస్తోంది. ఆయనే దీనికి సంభాషణలు వ్రాయడం, ఇందులో కథానాయిక పేరూ ఆయన లోగడ వ్రాసిన నవలలో వాటిని పోలివుండడం ముఖ్య నిదర్శనాలు అంటున్నారు.


ఇందులో కథానాయిక పన్నాగా జమున అభినయించింది. సిపాయి పాత్రను గుమ్మడి ధరించాడు. రాజుగా నాగయ్య, దుష్టసేనానిగా రాజనాల, ఎ. వి. సుబ్బారావు, రమణారెడ్డి, బాలకృష్ణ, పేకేటి శివరాం మొదలగువారు నటించారు. సత్యనారాయణ అనే కొత్త నటుడిని యువరాజు (హీరో) పాత్ర ధరించింది.

'దొంగల్లో దొర' చిత్రం దర్శకుడు పి. చెంగయ్య దీనికి "చలన! చిత్ర! కథా! సంవిధానం!" (!) నిర్వరచి, దర్శకత్వం నిర్వహించారు. సంగీతం సుబ్రహ్మణ్యం రాజు.

అనగనగా ఒక రాజుగారికి ఆధ్యాత్మిక చింతన ఎక్కువై, ఆ ధ్యాసలో రాజ్యం అధికారం వంటి చిన్న విషయాల సంగతి పట్టించుకోకుండా వాటిని రాజనాల పరం చేసి, 'రాజా'కంఠంతో (నాగయ్య) రిటైరైన రాజులా పాడుకుంటూ ఉంటాడు. అందువల్ల దుష్టుడు రాజనాల డాన్సులూ అవీ చూస్తు తీరిక వేళలలో ప్రజల్ని హింసిస్తూ ఉంటాడు. రాజకుమారుడు ఎక్కడో చదువుకుని పెరిగి పెద్దవాడై ఊళ్ళోకొచ్చి స్వర్గం ఎక్కబోయి పడతాడు. సేనానికి, ఆఖరికి సిపాయికూతురు పన్నాకీ కూడా లోకువై పోతాడు. పన్నా ముందు వేళాకోళాని కోమరు వేళాకోళి మాడినా, తరవాత ఆలయం సెట్ మీద యువరాజును మనసునర్పిస్తుంది. తరవాత ఇంకా చాలా కథ ఉంది కాని ఒకవరస ప్రకారం చెప్పుకోవడం కష్టం. రాజనాల రెచ్చిపోవడం, అప్పుడు పన్నా వీరకుల్లు అనే పేరుతో వాడియా వారి నాడియాలా గుర్రమెక్కి సేనావాహినిని చెండాడినట్లభినయించడం, భిల్లగూడెంలో అంతా ఆకులు బంట్లు కావడం పేకేటి శివరాం కోయవాడిలా మాట్లాడడం ఉన్నాయి. చక్కని ఔట్‌డోర్ దృశ్యాలు ఉన్నాయి.

చివర్ని మీరు ఎదురుచూడని మెలిక, అక్కడ విడిగా, బాగుందని చెప్పుకోతగ్గ సన్నివేశం ఉన్నాయి. చిత్రం పూర్వార్థంలో రమణారెడ్డి ఛలోక్తులూ, బాలకృష్ణ నటన చాలాసరదాగా ఉన్నాయి. ఉత్తరార్థంలో "మొక్కజొన్న తోటలో" పాట జమున వేషం వేసుకుని చేసిన మనోహరమైన నృత్యం ఈ చిత్రానికి ఏకైక అలంకారం. మాటవరసలూ (తెలిసినవే), పాట వరసా (కొద్ది మార్పుతో) జమున నృత్యం కూడా అందంగా కలిశాయి.

ఈ చిత్రం చూసి కథాప్రకారాన్ని మీరు పసిగట్టి సరిగ్గా చెప్పగలిగితే, కొవ్వలివారు అది ఆధారంగా మరో నవల వ్రాయగలరు. ★



'నిత్యకల్యాణం పచ్చతోరణం'లో చలం.

సాహిణీవారి 'బండరాముడు'లో రామారావు సావిత్రి.



సంగీతము రంగులు

"సంగీతపు రంగును నేను మొట్టమొదట సారిగా ఏడు సంవత్సరాల క్రితం 1952 ఆరంభంలో చూచాను," అన్నారు. కాన్‌స్తాంతిన్ లియోంత్యేవ్. "నూతనసంవత్సరపు వేడుకలప్పుడు నన్ను విద్యుద్దీపాలను ఏర్పాటు చేయమన్నారు. కొందరు మిత్రులతో కలిసి నేను ధ్వని 'ఫ్రీక్వెన్సీ ఫిల్టర్'తో వెలుగును కంట్రోలు చేసే ఒక యేర్పాటును చెయడానికి నిర్ణయించుకొన్నాను.

"సాయంత్రం విందుజరుగుతున్న సమయంలో పాల్ రాబ్సన్ పాడిన ఒక జోల పాట రికార్డును పెట్టి దానిదగ్గర నే ఒక 'మైక్రోఫోను'ను యేర్పాటు చేశాను. దానివల్ల కలిగిన ఫలితం అత్యద్భుతంగా ఉన్నది. వెలుగు తక్కువగా ఉన్న గదిలో సంగీతాన్నిబట్టి లయబద్ధంగా, దీపాలు వెలుగసాగాయి. ఒకసారి ఎర్ర బల్బులు, మరొకసారి ఆకుపచ్చ బల్బులు వెలుగుతూవచ్చాయి. ఒక్కొక్క సారి అన్ని రంగుల దీపాలూ ఒకే సారిగా వెలుగుతూ వచ్చాయి.

విందులో పాల్గొన్నవారు ఆ వింతను చూచి ఆశ్చర్యపడ్డారు. కాని అప్పుడు మేము చేసిందల్లా సంగీతానికీ, రంగులకూ ఏదోఒక సంబంధం ఉన్నదన్న విషయాన్ని ధ్రువపరచడమే. సాంకేతికంగా జరుగవలసిన పరిశోధనలు మాత్రం చాలా ఉండిపోయాయి. అందువల్ల ఆరోజు మొదలు కొని నేను సంగీతానికీ, రంగులకూ మధ్యగల సంబంధాల విషయంలో పరిశోధనలకు పూనుకొన్నాను. ఇప్పటికీ ఆపరిశోధనలను కొనసాగిస్తూనే ఉన్నాను."

సంగీతం, రంగుల బాంధవ్యం

ఈ విషయంలో లియోంత్యేవ్ పరిశోధనలు జరిపినప్పటికీ. సంగీతానికీ, రంగులకూ బాంధవ్యం ఉన్నదన్న విషయాన్ని మొట్టమొదటగా ప్రపంచానికి వెల్లడించినవాడు అతడుకాడు. మన శకానికి మూడు శతాబ్దాలముందే అరిస్టాటిల్, సంగీతానికీ రంగులకూ అవినాభావమైన సంబంధం ఒకటి ఉన్నదని తెలియజేశాడు. తర్వాత కొంతకాలానికి న్యూటన్ ఆ విషయానికి వైజ్ఞానిక ప్రాతిపదికను కల్పించాడు. మిఖైల్ లొమొనొసొవ అనే రష్యన్ విజ్ఞానశాస్త్రవేత్తగూడా యీ విషయంలో పరిశోధనలను జరిపాడు. "సంగీతానికీ, రంగులకూ అవినాభావ సంబంధం ఉన్నదన్న విషయం ఆశ్చర్యాన్ని కలుగజేస్తుంద"ని ఆయన అన్నాడు. ముున్ముందు యీ విషయంలో ఇంకా ఆశ్చర్యకరమైన పరిశోధనలు జరుగుతాయని కూడా ఆయన జోస్యం చెప్పాడు.

మానవులు తమ ఇంద్రియావబోధక విషయాలను ఇంపైన స్వరాలద్వారా వ్యక్తం చేయడాన్ని చాలాకాలం క్రితమే నేర్చుకొన్నారు.

సంగీతం, రంగులకు సంబంధించిన ఇంద్రియావబోధకాలు ఒకే పర్యాయం కలిగినప్పుడు అవి ఒకదానిద్వారా మరొకటి ఇనుమడిస్తాయి. ఈ విధంగా సంగీతాన్ని బాగా అర్థం చేసుకోడానికి రంగులు తోడ్పడతాయి. అందుకే స్క్రియాబిన్ అను నతడు తాను రచించిన ఒక స్వరమేళనంలో వర్ణవిశేషాన్నిగూడా ప్రవేశపెట్టడానికి ప్రయత్నించాడు. దీనినిగురించి లెనిన్‌గ్రాడ్ ఆప్టికల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టరు ప్రొఫెసర్ మీసెల్ వ్యాఖ్యానిస్తూ, "ఈ విషయం స్క్రియాబిన్‌కు తగిన సాంకేతిక కౌశలాలు లేకనే విఫలమయింది గాని, భావం పొరపాటు కావడంవల్ల మాత్రం కాద"ని అన్నాడు.

కాని కళ్లు, చెవులూ గ్రహించే అంశాలకు సంపూర్ణమైన అన్యోన్యతను చేకూర్చేవిధంగా సంగీతం, రంగులమధ్య పొందికను కల్పించడం సులభమైన విషయంకాదు. ప్రస్తుత సమయములో ఇష్టం వచ్చినట్లల్లా అలా చేయడానికి మనకు వీలుండడం లేదు. ఎందువల్లనంటే యీరంగంలో ఇంకా విస్తృతంగా పరిశోధనలు కొనసాగవలసి ఉన్నది. పరిశోధనలు బాగా జరిగినట్లయితే పై సమస్యలన్నీ సులభంగా పరిష్కృతమవుతాయి.


పైన చెప్పిన విషయాలను సాధించడానికి చాలా కాలం పటవచ్చునేమో ననే అనుమానం కలగవచ్చు. కాని ఆ అనుమానం సరైనది కాదు. ఇప్పుడు శబ్దశాస్త్రంలోనూ, ఎలక్ట్రానిక్సులోనూ పరిశోధనలు ఉన్నతిసాయిని అందుకొన్నాయి. అందువల్ల రంగుతో కూడిన సంగీతం త్వరలోనే వాస్తవ విషయం అయితీరుతుంది.

ఇందుకు సంబంధించిన సమస్యలు అనేకంఅప్పుడేపరిష్కరింపబడ్డాయి. సంగీతం, రంగులయొక్క ముఖ్యాంశాలను విజ్ఞాన శాస్త్రవేత్తలు అప్పుడే కనిపెట్టారు. లియోంత్యేవ్ యీ విషయంలో సమగ్రపరిశోధనలను జరుపుతున్నాడు. ఆయన పరిశోధించిన విషయాలను సంగీత శాస్త్రవేత్తలు, విజ్ఞాన శాస్త్రవేత్తలు ధ్రువపరుస్తున్నారు.

—టాస్.



పొన్నలూరివారి "దైవబలం"లో రేలంగి, రమణారెడ్డి.



శంభు ఫిలింస్‌వారి 'నమ్మినబంటు' చిత్రంలో గుమ్మడి.

వార్తావరణం

ఎం. ఎ. వి. (ముందడుగు) పిక్చర్స్‌వారి కొత్త సాంఘిక చిత్రం 'అలుమగలు' అక్టోబరులో విడుదల అవుతోంది. ఇందులో అలుమగలు జానకి, జగ్గయ్య. రచయిత ఆత్రేయ. సంగీతదర్శకుడు : కె. వి. మహాదేవన్. దర్శకుడు : కృష్ణారావు.

దీనికిముందో వెనకో రాగలచిత్రం సారధీ వారి 'భాగ్యదేవత'. తాపీ చాణుక్య దర్శకత్వాన తయారైన ఈ చిత్రంలో ముఖ్య నటులు జగ్గయ్య, సావిత్రి, రాజసులోచన, బాలయ్య, రేలంగి, సూర్యకాంతం మొదలగు వారంతా పాల్గొంటున్నారు. సంగీతం వేణు.

* * *

రామారావు, అంజలీదేవి, రంగారావు, రేలంగి, రాజసులోచన ప్రభృతులుపాల్గొన్న వెంకటరమణావారి జానపదం 'బాలనాగమ్మ' అక్టోబరు 9 న విడుదల అవుతుంది. ఈ చిత్రం దర్శకుడు వేదాంతం రాఘవయ్య.

* * *

'భక్త జయదేవ' చిత్రం దర్శకనిర్మాత పేరు సెప్టెంబరు 16 సంచికలో పొరపాటుగా పడింది. ఆయన పమిడిముక్కల రామారావు అని గ్రహించ ప్రార్థన. ఈ చిత్రానికి సముద్రాల రాఘవాచార్య రచన చేస్తున్నారు. నాగేశ్వరరావు ముఖ్యపాత్ర నిర్వహిస్తారు.

భరణీవారు బడదీదీ నవల ఆధారంగా నిర్మించిన చిత్రం 'ఎంసెమావులు' ఫిబ్రవరి మార్చి ప్రాంతాలలో విడుదల కాగలదనుకుంటున్నారు. భానుమతి, నాగేశ్వరరావు నటించిన ఈ చిత్రానికి రామకృష్ణ దర్శకుడు, సముద్రాల రచయిత. ★

సిన్‌బాద్ సప్తమయాత్ర


అబాలగోపాలానికి తెలిసిన అరేబియన్ నైట్సు కథ హీరో సిండ్‌బాద్ సాహస యాత్రలు లోగడ మూడు నాలుగుసార్లు చలనచిత్రాలుగా వచ్చాయి. కాని కొన్ని మాయలు చేయడం సినిమాయకి లొంగనందువల్ల వాటిని సినిమావారు కొంతకాలంగా తాయిలంలా అటే పెట్టుకుంటూ వచ్చారు. సాంకేతిక ప్రగతి కలిగించిన సదుపాయాలు పురస్కరించుకొని కొలంబియా వారు ఇపుడు 'సింద్‌బాద్ సప్తమయాత్ర' పేరిట ఒక చలనచిత్రాన్ని అద్భుతాలతో నింపి తీశారు.

సింగుబాదు ఒక చక్కని చిన్నదాన్ని పెళ్లి చేసుకోబోయే సరికి, ఒక మాంత్రికుడు ఆమెను అత్తురాలా చిన్నదానిగా, బొటనవేలంత దానిగా మార్చివేసాడు. ఆమెను తిరిగి పూర్వరూపంలోకి తీసుకురావడానికి కొలోసస్ అనే ద్వీపంలో ఉన్న రెండుతలల గండభేరుండం గుడ్డు కావలసి వస్తుంది. సిందుబాదు, మాంత్రికుడితో అక్కడికి వెళ్ళి దారిపొడుగునా ద్రోహులైన మనుషులతో, ఒంటికంటి రాక్షసులతో, కత్తిపట్టుకు యుద్ధానికివచ్చే అస్థిపంజరాలతో పోరాడి, సాధించడం ఇందులో ఉదంతం.

మాయా ఛాయాగ్రహణ శిల్పంతో ఇందులో వచ్చే ఈ అద్భుతాలన్నిటిని అద్భుతంగా తీశారు. ఈ తరహా కథా కమామీషూ అంటే సరదా ఉన్నవారు తప్పకుండా చూడతగ్గచిత్రం. పిల్లల్ని తీసుకు వెళ్లవద్దు. భయపడతారు. వాళ్లు భయపడతారని సినిమా వారు కూడా భయపడుతున్నారు మ. ★



కృష్ణాపిక్చర్స్ అధిపతి శ్రీ నాయక్ గారి కుమార్తె, బేబీ నంద్రికళ 'అరంగేట్రాల్' (భరతనాట్య ప్రారంభ ప్రదర్శనం) ఇటీవల మద్రాసులో బాల చలనచిత్రమందిరంలో జరిగింది. శ్రీ ఉదయశంకర్, అధ్యక్షతవహించి నర్తకిని ఆశీర్వదించారు.



శంభూవారి 'నమ్మినబంటు' చిత్రంలో సావిత్రి, హేమలత.

★ బొంబాయి లేఖ ★

ఉజాలా

అమెరికన్ అపరాధ చిత్రాలలో గాంగ్ స్టర్ పాత్రలుకూడా, ఈగిల్ ఫిలింస్ వారి "ఉజాలా" చిత్రం చూస్తే—'సినిమాకథ' అని నవ్వుకుంటాయి. ఇది అంతటి అభూతకల్పన అయినా అది ఆధారంగా దర్శకనిర్మాతలు ఏర్పరచిన వినోదం హుషారుగా కాలక్షేపానికి యోగ్యంగా ఉంది. నటన తగు విధంగా అమరింది. సంగీతం బాగుంది.

ఉన్న వారందరిలోనూ మాలా సిన్హా చాలా బాగా నటించింది. ఈగిల్ ఫిలింస్ వారి అపరాధ చిత్రాలలో మామూలుగా నటించే షమ్మీకపూర్, ఈ సారి మామూలు కన్న బాగా నటించారు. ఇతర నటులలో రాజ్ కుమార్, లీలా చిట్నిస్, శివరాజ్, ధుమల్ లనూ, రెండు చక్కని సినీ డాన్సులు చేసిన కుంకుంను చెప్పుకోవాలి. అన్నిటి కన్న, ఈ చిత్రానికి బలం జవం చేకూర్చినది శంకర్ జై కిషన్‌ల సంగీతం. ఇంతవరకూ వారు చేసిన పాటలన్నిటినీ మించిన సంగీతం ఇందులో వినిపించారు. కథకూ నటీనటులకూ ఈ సంగీతంతో ఏమాత్రం సంబంధం లేదు. దీని దారిన ఇది విడిగా సంతోషపెడుతుంది.

దర్శకుడు నరేష్ సైగల్, కథను ఎంతో శక్తివంతంగా చిత్రించాలని ఎంత కృషి చేసినా కథ కృత్రిమమైనది కావడంవల్ల అది రాణించలేదు. కాని పాటల చిత్రణ మటుకు చాలా అందంగా కుదిరింది. ఈ విధంగా దాదాపు అన్నీ బాగుండి, సంగీతం మరీ బాగున్న ఈ చిత్రంలో కథకూడా మంచిదై వుంటే, ఇది అత్యరాలా హిట్ కాగల అవకాశాలు నూటికి రెండు వందలుండేవి.


కొత్త చిత్రాలు

గతవారం, నిర్మాణంలో ఉన్న చిత్రం దిలీప్ చిత్రవారి 'సచ్చీమోతీ' ఎనిమిదిరీళ్లు చూడడం జరిగింది. మరో రోజున క్వాజా అహమద్ అబ్బాస్, తన కొత్త చిత్రం 'చార్ దిల్ చార్ రాహే' చూపించారు.

'సచీమోతీ', చిత్రాన్ని నిర్మాత సి. ఎల్. కపూర్ భారీ ఎత్తున భారీ చిత్రంగా తీయటంలేదు. పెద్దఆశలు లేకుండా సరసాతపత్కంగా తీద్దామనే పనిచేస్తున్నారు. అదీ ఆ దేవిధంగా తయారవుతోందనిపించింది. తీసిన మేరకు చూడగా అదృష్టం ఏ మాత్రం చిన్న ఎక్స్ట్రాభూమిక నిర్వహించినా ఇది బాగా డబ్బు చేసుకోవచ్చు. అప్పుడు చెప్పుకోతగ్గ కారణాలలో అదృష్టంకాక, ఓపీ (ఓంప్రకాష్) దర్శకత్వం, నాజ్ గోపీకృష్ణలు కలిసి చేసిన ఒక మనోహర దృశ్యం, ముఖ్యంగా ఎన్నతగ్గవౌతాయి. సాహిర్ పాటలూ, ఎస్. దత్తా సంగీతం మరి రెండు కారణాలు కాగలవు.

రికార్డు

అబ్బాస్ చిత్రానికి మటుకు ఇంత మీమాంస అవసరం లేదనిపించింది. అది ఆర్థికంగా ఘనవిజయం సాధించగలదని ధైర్యంగా చెప్పుకోవచ్చు. అబ్బాస్ చాలా



యం. ఎ. వి. వారి "ఆలుమగలు" చిత్రంలో రమణారెడ్డి, ఛాయాదేవి.

పైవారం

స్వరలహరి :

శంకర్, జైకిషన్

మంచికథ వ్రాశారు. నిజానికి ఇంగులో ఉన్నది అందంగా కలిపిన మూడు కథలు. రాజ్ కపూర్, మీనాకుమారి, నిమ్మి, షమ్మీ కపూర్, కుంకుం, జైరాజ్, డేవిడ్ అంతా ఆయా వేషాలలో చాలా బాగున్నారు ఆఖరికి షమ్మీకపూర్ కూడా.

ఈ చిత్రం మొన్ననే సెన్సారైంది. ఢిల్లీలో విడుదలైంది కూడా. ఒక్క అడుగు కూడా కత్తెర కొరకలేదు. ఇలా సెన్సారవుతుంగా సినిమా తీసి "క్లీన్ సర్టిఫికేట్" పంపాదించుకోవడం నయా సన్సార్ సంస్థకూ, అబ్బాస్‌కు ఇది ఏడవసారి. వారిదే ఈ విషయంలో పెద్ద రికార్డు.

(మాజీ బేబీ) నాజ్ హీరోయిన్ అయింది. నవ్ రాజ్ ప్రొడక్షన్స్‌వారి 'ఫస్ట్ లవ్' అనే చిత్రంలో ఈమె నాయికగా బుక్ అయింది. ముఖ్యనటుడు మహమూద్. దర్శకులు వేద్, మదన్.

ముహూరత్-లు

గతవారం అంతా కొత్త చిత్రాల ప్రారంభోత్సవాలతో సందడిగా సాగింది. అరడజను చిత్రాల నిర్మాణం ఆరంభం అయింది. వానా గబ్బా లేనందువల్ల జనం కులాసాగా తిరుగుతూ వీటన్నిటికీ హాజరయారు.

వివరాలు

అమియ చిత్ర వారి హమ్ ముత్వాలే: నటులు అశోక్‌కుమార్, కామినీ కదమ్, ప్రాణ్, మహమూద్, చాంద్ బర్కే. సీమా అనే అందమైన అమ్మాయిని, నితిన్ రాయ్ అనే కొత్త హాస్యనటుడినీ పరిచయం చేస్తారు. సంగీతం ముకుల్ రాయ్ (ఈయనే నిర్మాత). దర్శకుడు, శక్తి సమంత వద్ద కొన్నాళ్ళు పనిచేసిన జగదీష్ నరుల్లా.

బ్రిజ్ కళామందిర్ వారి 'షాంగా కుండీక్'. నటి బీనా రాయ్. ఆమెకు సహనటుడు రాధాకృష్ణన్! సంగీతం సి. రామచంద్ర.

నసీం ప్రొడక్షన్స్‌వారి 'లంబీ సారక్'. నటులు మోతీలాల్ అనితాగుహా, కన్హయాలాల్, అన్వర్, ముక్రీ, రత్నా, ఓం ప్రకాష్. భారతీ, సుజాత అనే కొత్త తారలిద్దరిని భారీ ఎత్తు ప్రచారంతో పరిచయం చేస్తున్నారు. సంగీతం ఎస్. దత్. రాత్ కే రాహీ చిత్రం తీసిన నసీం దీనికి దర్శకుడు.



వెంకటరమణా వారి 'బాలనాగమ్మ' చిత్రంలో రామారావు, అంజలీదేవి.

అమర్ ఛాయావారి 'ఇంతిజార్': ప్రదీప్ కుమార్, విజయలక్ష్మి, సుందర్, ఆగా. సంగీతం దత్తరాం. దర్శకత్వం కేదార్ కపూర్.

జె. బి. ప్రొడక్షన్స్ వారి "ఇసీ కా నామ్ దునియా హై" అశోక్‌కుమార్, శ్యామ, మహమూద్, నజీర్ హుసేన్, కె. ఎన్. సింగ్, లలితా కుమారి, సుశీల్ కుమార్ (ఎవరైతే ఏం గాక.) రేణుక అనే కొత్త నటి వీరి కానుక. సంగీతం రవి. దర్శకుడు శక్తి సమంత్.

గోవక ఫిలింస్ వారి "హమ్ మత్‌వాలే నౌజవాన్!". శేఖర్, సయీదాఖాన్ (ఆమెకిది ఎనిమిదవ చిత్రం) జీవన్, ఆగా మిర్జా ముష్రాఫ్, తున్ తున్, బాలనటి రాజా రాయ్. ఇందులో అశ్వినీ కుమార్ అనే కొత్తనటుడిని పరిచయం చేస్తారు. సంగీతం చిత్రగుప్త. దర్శకత్వం ఎస్. ఆర్. అస్థానా.

—టచ్‌స్టోన్

'రాజమకుటం'

వాహినీవారి 'రాజమకుటం' నిర్మాణం పూర్తిఅయింది. సెన్సారువారి ఆమోదం కూడా వచ్చింది. విడుదల తేదీ నిర్ధారణ కాలేదని తెలుస్తూంది. బి. ఎన్. రెడ్డి దర్శకత్వాన రూపొందిన ఈ చిత్రంలో ఎన్.టి. రామారావు, రాజసులోచన, గుమ్మడి, రేలంగి మొదలగువారు పాల్గొన్నారు. కథయిత డి. వి. నరసరాజు. సంగీతం వేణు. ఈ చిత్రాన్ని తమిళంలో కూడా నిర్మించారు.

★ ముమూర్ష ★

(21-వ పేజీ తరువాయి)

కటించాడు. కాస్సేపటికి మళ్ళీ కళ్ళు తెరిచాడు. కింకరుడు అక్కడే వున్నాడు. రామ్మూర్తి లేచి అక్కడికి వెళ్ళబోయినాడు కాని, వొంట్లో శక్తి లేదు—లేవటానికి ఓపికా లేదు

"ఇదిగో" అన్నాడు రామ్మూర్తి నీరసంగా.

కింకరుడు పలకలేదు.

"కింకరుడు గారూ" అన్నాడు మళ్ళీ కాస్త హెచ్చుస్థాయిలో.

"ఏం?" అన్నాడు కింకరుడు అక్కడినుంచే.

"మాట."

కింకరుడు పర్వతం కదిలినట్టు నడిచివచ్చి, మర్రిచెట్టు నించున్నట్టు నిలబడి, "ఏం—ఏమిటి?" అని అడిగాడు గాలివాన వచ్చినట్టు.

"కాదు. నాకు...ఆకలి..." అన్నాడు రామ్మూర్తి నెమ్మదిగా.

"అయితే ఏం చెయ్యమంటావ్?"

"కాదు. తింటానికేమన్నా..."

"ఇక్కడేం దొరకదు"

"పోనీండి గాని—నన్నెందుకిట్లా బాధిస్తున్నారు?" అని అడిగాడు రామ్మూర్తి.

"పిచ్చివాడా! నువు ఆత్మహత్య చేసుకున్నావయ్యా. అది ఘోరపాపం కదూ! అందుకని పాపఫలం అనుభవిస్తున్నావు"

"ఆఁ!" అన్నాడు రామూర్తి ఆశ్చర్యంగా. "ఎన్నాళ్ళు?" అన్నాడు మళ్ళీ,

"చెప్పలేం—పాపం తీరేవరకూనూ"

"అన్నాళ్ళూ ఇట్లా బాధలు పడాల్సిందేనా?" అన్నాడు రామ్మూర్తి కళ్ళమ్మట నీళ్ళు కారుస్తూ.

"ఇంకా ఏం చూశావ్! ముందున్నది ముసళ్ళపండగ!" అనేసి సుడిగాలల్లే దూకుడుగా వెళ్ళిపోయినాడు కింకరుడు. రామ్మూర్తి పై ప్రాణాలు పైనే ఎగిరిపోయినై.

"ఓయి భగవంతుడా! ఏ వరకి నన్నీ నరకంలో పారేశావుబయ్యా?" అని అరిచాడు... ఏడిచాడు......మొత్తుకున్నాడు...!

"భూలోకంలో కష్టాలుపడలేకపోయాను. అక్కడి బాధలు భరించలేకపోయాను. పరలోకంలో విముక్తి ప్రసాదించమన్నాను. ఓ దేవుడా! ఇదా నువు చేసిన నిర్వాకం! అక్కడ బాధలూ కష్టాలూ తాళలేక వస్తే—ఇక్కడింతకన్నా నరకబాధలు పెడుతున్నావా—" అన్నాడు రామ్మూర్తి భోరున.

ఈ బాధలకన్నా భూలోకమే సుఖంగా వుందనిపించింది అతనికి. సుఖపడదామని తను ఆలోకం వదిలివెడితే జరిగింది ఇది! ఎక్కడికి వెళ్ళినా తనకు ఈ బాధలు తప్పవా!... రామ్మూర్తికి బోధపడలేదు.

మరికొన్నాళ్ళపాటు రామ్మూర్తి ఇట్లాగే నరకబాధలు అనుభవించాడు. అవి మరీ దారుణంగా దుర్భరంగా వున్నై. తనకష్టం చెప్పుకోటానికయినా ఎవరూ లేని లోకం అయిపోయింది. ఏం చెయ్యాలోనని రామ్మూర్తి రాత్రింబగళ్ళూ ఒకటే దీర్ఘాలోచన చేశాడు!

ఒకనాటి అర్ధరాత్రి రామ్మూర్తి లేచిచూడగా కింకరులంతా నిద్రపోతూ కనిపించారు. రామ్మూర్తి నెమ్మదిగా లేచి నించున్నాడు. అడుగులో అడుగు వేస్తూ కింకరుల్ని దాటి బయటకు వచ్చాడు. ఎక్కడా ఏ అలికిడీ లేదు — యమలోకం అంతా నిశ్శబ్దంగా వున్నది. రామ్మూర్తికి దివ్యమైన ఆలోచన కలిగింది. ఆలోకమే అనుకుంటే, దానికి మించిపోయి వున్నది ఈలోకం కష్టపెట్టటానికీ, ఏడిపించటానికీ. తను ఈ బాధలు మరి పడలేడు—ఎట్లాగన్నా ఈ లోకంనుంచీ, ఈ కింకరుల బారినుంచి తప్పించుకోవాలి — ఈ కష్టాలనుంచి బైటకెక్కాలి — అని అటూ ఇటూ చూశాడు రామ్మూర్తి. యమసదనం ఎత్తుగా గంభీరంగా కనిపించింది. రామ్మూర్తి రెప్ప వాల్చకుండా పైకి చూశాడు...అతని మొహంలో ఇన్నాళ్ళకు చిరునవ్వు కనిపించింది!— ఏదో వూహా తట్టగా.

రామ్మూర్తి నిశ్శబ్దంగా ఆ భవన శిఖరానికి ఎగబ్రాకి పైన నించున్నాడు. క్రింద అంతా పెద్ద అగాధంలాగా కనిపించింది. "ఓ దేవుడా! ఈ లోకంలో ఈ బాధలు మరి భరించలేను. నాకు ముక్తిని ప్రసాదించు, నాకు సుఖాన్ని కలిగించు!—" అని ప్రార్థించి, ఎత్తయిన ఆ భవన శిఖరంనుంచి దభాలున దూకేసి 'ఆత్మహత్య' చేసుకున్నాడు రామ్మూర్తి! ★

★ తీరని కోరిక ★

(28-వ పేజీ తరువాయి)

పంకజం మౌనం తాల్చింది. "నీకు పిచ్చి ఎక్కుతోంది భాస్కరం. నీతో పాటు నీ భార్యను సీమకు ఇంగ్లండుకేనా తీసుకువెళ్ళాలని?"

"పంకజం! నన్ను మెలిపెట్టకు. మాటమలపకు. నువ్వు వాక్యమంతా ఉచ్చరించనక్కరలేదు. నీ ప్రేమించడం నిజం అయితే 'నిజం' అని రెండు అక్షరాలు అను చాలు! అబద్ధమయితే ఇంకొక అక్షరం ఎక్కువ 'అబద్ధం' అను చాలు."

ఇంతలో రైలు మొదటిగంట మ్రోగింది. రైలు పెట్టెలోనుండి చంపకం గబగబా పంకజం కేసి నడచివచ్చింది. "గంట మ్రోగింది. మేష్టారూ! నమస్తే! రా! అమ్మా" అని పిలిచింది తల్లిని. పంకజం, చంపకం రైలుపెట్టెలో ఎక్కారు.

"రైలుపెట్టెలో ఎక్కాం. మాష్టారూ! ఇంక బండి కదిలేదాకా కబుర్లు చెప్పుకోవచ్చు. బండి కదులుతుందేమోనని దిగివచ్చాను మాష్టారూ! క్షమించండి."

పంకజం అందుకుని ఇలా అంది "మీ మాష్టారికి, సంసారం గొడవతో పిచ్చెక్కిపోయింది. మనం దూరం వెళ్ళిపోతూంటే ఏవో పిచ్చిపాటి చెబుతున్నాడు పాపం! అవును కాని భాస్కరం! మీ శిష్యురాలిని జ్ఞాపకం ఉంచుకుని జాబులు వ్రాస్తూఉండు. ముందుగా అక్కడి చిరునామాతో చంపకమే వ్రాస్తుందిలే ఉత్తరం."

"అల్లాగే" అన్నాడు భాస్కరం.

"నీ పిల్లలకు ఏవైనా సీట్లు, ఉద్యోగాలు కావలసివస్తే వీళ్ళ నాన్న సహాయం చేస్తారు. నీవంటే ఆయనకు చాలా యిష్టం. నీ మంచితనాన్ని గురించి ఎప్పుడూ నాతో చెబుతూ ఉంటారు" అంది పంకజం.

"అల్లాగే" అన్నాడు భాస్కరం.

"అల్లాగే కాదు. నిజంగా నీకవసరం కలిగినప్పుడు వస్తే వారు సహాయం చేస్తారు. నిజంగా, రా."

బండి కదులుతోంది. బండిని అనుసరిస్తున్నాడు భాస్కరం. "దిగపడవోయి, ఇంకా బండి నడుస్తోంది. నిజంగా రావాలి నిజం చెప్పమన్నావుగా. నిజం చెబుతున్నాను. నిజం నిజం." నిజంగా ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకున్నారు, పంకజం ఆఖరి వాక్యాలు పలికేటప్పుడు.

ఆ చూపులు వ్యక్తం చేసినది నిజంగా ఇద్దరికీ అది తీరని కోరిక అనా?... ★

★ అన్వేషణ ★

[31-వ పేజీ తరువాయి]

కట్టు, చలాకీనవ్వు—ఒకాయన శిల్పదుకోణంవద్ద పలకరించేడు శివరాంను.

'మిమ్మల్ని ఎక్కడో చూసినట్లుందండీ!'

క్రొత్తమనుష్యులను పలకరించి పరిచయం చేసుకోవడంలో అమోఘమైన నేర్పుగల ఆయన ఆమాట అప్రయత్నంగా శివరాంను చూడగానే వదిలాడు.

శివరాం ఆశ్చర్యంగా ఆయనవైపు చూసేడు. ఆయన్ని చూచినట్లు ఏవిధమైన జ్ఞాపకం అతనికి కలగలేదు.

'అలాగా!' నవ్వాడు శివరాం.

'మీ దేవూరు?'

'సికింద్రాబాదు'

'అల్లా చెప్పండి...ఇప్పుడు తెలిసింది... సికింద్రాబాదులో నాటకాల్లో, సభల్లో ఎక్కడో చూశాను!" అన్నాడాయన.

శివరాం తనకు తెలియకుండా అందరూ తన్ను తెలుసుకుంటున్నారనే కులాసాతో నవ్వేడు. ఆ నవ్వులో తన సంభాషణ విజయవంతమైందనుకున్నాడు ఆయన.

'నా పేరు...పేరిశాస్త్రి...జైనగరులో ఉంటూంటాను!"

సికింద్రాబాదు విషయాలు కాస్సేపు ముచ్చటించారు ఇద్దరూ. వరంగల్ వచ్చిన పనులు యిద్దరూ పరస్పరంగా చెప్పుకున్నారు.

'అయితే యిద్దరం ఇంచుమించు ఒకే పని మీద వచ్చామన్నమాట!" పేరిశాస్త్రి అన్నాడు.

'నువ్వు బాగా కుర్రాడివోయ్...ఇటువంటి పెళ్ళివిషయాల్లో నువ్వుమాత్రం సులువుగా నిర్ణయించకుసుమీ...కావాలంటే నా సలహా తీసుకో...నువ్వు చూసిన సంబంధంగురించి నాకు బాగా తెలుసు...నువ్వు కటకటాలింట్లోకి వెళుతూంటే ఏదో అనుమానించి అప్పటినుంచీ నీకోసం ఎదురు చూస్తూ వీధిలో నుంచున్నాను...ఆ సంబంధం పెద్ద చెప్పుకోదగ్గది కాదు!' కర్ర ఊపుకుంటూ నవుస్తూ పెదవి విరిచాడు పేరిశాస్త్రి.

శివరాం విచిత్రంగా పేరిశాస్త్రివైపు చూశాడు.

'నేను ఉద్యోగం పూర్తిచేసుకుని పింఛనీ పుచ్చుకుంటూ దృఢంగా ఉన్నాననీ స్నేహితులందరూ యీ వివాహాల బాధ్యత నా నెత్తిమీద వేస్తారు...ఈ వూళ్లో తహశీల్దారుగారి కొడుకును చూసిరమ్మని స్నేహితుడొకడు పదిసార్లు అడుగుతూంటే పోనీ అని బయలుదేరేను...నువ్వు చూసిన సంబంధంగురించి వాకబు చేశాను...కుర్రాకిది రెండో పెళ్ళి...మొదటి పెళ్లాన్ని కాల్చి నిప్పులో త్రోసి చంపేశాడని పెద్ద పుకారు...మహా కోపిష్టిట...అందుకే...వాళ్ళమ్మాయి సుగంధికి ఏ సంబంధం కుదరటంలేదు!" సాలోచనగా శివరాం భుజం తట్టాడు.

పేరిశాస్త్రి ఇచ్చిన సమాచారంతో శివరాంకు ఆ చూసిన సంబంధంపై పూర్తిగా యిష్టం తగ్గింది. ఈ సంబంధంగురించి ఆలోచించడం కూడా తన వంశప్రతిష్ఠకు భంగమనుకున్నాడు శివరాం. అయినా ఆ ముసలాయన కొడుకు ప్రథమ భార్యను ఏ ఘర్షణ వివాదాల్లో కోపం ఆపుకోలేక నిప్పులోకి త్రోసి చంపేశాడో, నిప్పులోకి త్రోసినంత మాత్రాన అతని భార్య ఎలా చచ్చిపోయిందో తమాషా సన్నివేశంలా కనిపించింది శివరాంకు.

తన సందేహం ప్రశ్నగా చేశాడు శివరాం.

'ప్రొద్దున్న నీళ్ళపొయ్యిముందు కూర్చుందిట భార్య. రాత్రిల్లా ఏదో ఘర్షణ పడ్డారట. స్నానానికి నీళ్ళు కాగు దింపి నీళ్ళు తోలుపుతోందిట భార్య. కోపం ఆగక ఆమె శిరస్సు వంచి కణకణమండే పొయ్యిలో కుక్కాడుట...ముఖం మాడిపోయి, బొబ్బలుదేరి అయిదుగంటలు తిరగకుండా ఆ యిల్లాలు పరమపదించిందట!' ఒళ్ళు భయంతో జలదరించినట్లు పేరిశాస్త్రి కళ్లు మూసుకుని తృళ్ళిపడ్డాడు.

'ఇది నిజమయితే చాలా ఘోరసంఘటనే!' నిట్టూర్పు విడిచాడు శివరాం.

హోటలుచేరి శివరాం ఉత్తరం వ్రాశాడు తాతయ్యకు తాను విన్న సంగతులు గురించి. ఈ సంబంధం తనకేవిధంగానూ నచ్చలేదని సలహాఇచ్చేడు. పేరిశాస్త్రిగారిని తన చెల్లెలుకు ఏమున్న సంబంధాలు చూడమన్నాడు శివరాం. ఓ! అంటూ కళ్ళు పెద్దవి చేసి 'తప్పకుండా, మాయింటికి రావోయి ఒకసారి!' అన్నాడు పేరిశాస్త్రి. శాస్త్రిని వదిలి శివరాం చారిత్రకస్థలాలు చూడటానికి వెళ్ళాడు.

పురాతనమైన ఓరుగల్లుకోట శిథిలావస్థలో పడివుంది. రూపురేఖలు పూర్తిగా మారి నామమాత్రస్థలంగా గడ్డిదుబ్బులు పెంచుకుని పురాతన వైభవానికి చిహ్నంగా మాత్రం కనిపించింది కోట. కాలం మార్పులో యుగయుగాల నాగరికత రూపు మార్చుకుని శిథిలంగా మాత్రమే భావి తరాలకు పొడసూపుతూ ఉంటుంది. నేటి యుగంలో పురాతనత్వంగానూ, పురాతన ఔన్నత్యం శిథిలచిహ్నంగానూ, భావి యుగాలలో నేటి ఆధునిక నాగరికయుగం, బహుశా పురాతన సనాతనత్వంగానూ, శిథిలపురోగతిగానూ పరిణమించేలా అగుపించింది శివరాంకు.

వేయిస్తంభాలగుడి బాగా శిథిలమైనా కట్టడపు సౌందర్యం ఇంకా ప్రతిఫలిస్తోంది. నల్లరాతిస్తంభాలపై చెక్కిన బొమ్మలు, లతలు, శిల్పము, నాటికాలపు నాగరికత, మానసికప్రభావం, వైజ్ఞానిక సాంప్రదాయాలు వెల్లివిరుస్తున్నాయి. ఉపరిభాగాలు ఎగిరిపోయిన స్తంభాలు ఛత్రంలేని ఒంటరి సింహాసనాల్లా ఈశ్వరుని రాజుకీ భటవర్గంలా గుడికెదురుగా నిల్చున్నాయి. ఒయ్యారంగా సొగసుగా కూర్చున్న నంది సౌందర్యముగ్ధగా రాతిలో చెక్కబడి జీవం ఉట్టిపడుతోంది. గోటితో మీటితే సప్తస్వరాలు పలుకుతున్న ఆ రాతి స్తంభాలు ఈశ్వరుని పూజకు రాత్రిళ్ళు అదృశ్యంగా వచ్చే గంధర్వ కిన్నెర కింపురుష వాద్యాల్లా కనిపించేయి శివరాంకు.

శిథిలమైపోయిన ఆంధ్రుల శిల్పౌన్నత్య చిహ్నాలు స్మరించుకుంటూ రైలెక్కాడు శివరాం. పరిగెడుతున్న రైలుచుట్టూ భూమి గుండ్రంగా తిరుగుతోందనిపించింది. భూమి గుండ్రంలాగే కాలయుగం కూడా ఔన్నత్యపతన బిందువుల కలయిక రేఖతో వృత్తాకారంగా కనిపించింది శివరాం దృష్టిలో.

చారిత్రక స్థలాలు, పురాతన శిల వైభవాలు చూసేటప్పుడు తప్పక ఒక కెమేరా ఉండడం ముఖ్యమనిపించింది శివరాంకు. అది కొనుక్కోనందుకు విచారించాడు. అయినా ఒకయంత్రంతో వస్తురూపాలను ప్రతిబింబాలుగా తయారుచేసుకుని ఆనందించడంలోకంటె స్వయంగా చిత్రలేఖనగా నైపుణ్యం పెంపొందించుకుంటే ఒక కళారాధన చెయ్యడం, పరపతి గణించడం, తీరికసమయాన్ని సద్వినియోగం చెయ్యడం కూడా జరుగుతుందని ఆశించాడు శివరాం. చిన్నతనంలో అప్పుడప్పుడు సరదాగా గీసిన బొమ్మలు, దృశ్యాలు తలుచుకున్నాడు. నలుగురూ ప్రశంసించేవారు తిరిగి ఆ కళను వృద్ధిచేసుకోవాలనే సరదా శివరాంలో ఉత్సహించింది. పట్టుదల, నిరంతరకృషి ఉంటే మనిషికి సాధ్యంకానిది లేదనే సిద్ధాంతం నమ్మిన శివరాం ఆలస్యం అయినా చిత్రలేఖనాకళను ఆరాధించాలనే సంకల్పం చేసుకున్నాడు. (ఇంకావుంది)

విధి విధానం

యామిజాల శంకరం



(గతవారం తరువాయి)

తెల్లవారింది ప్రకృతిలో చలనం వచ్చింది. సుందరిలో బాగా చలనం వచ్చింది. శీతల వాయువులు ఆమె సేదదీర్చాయి. రావు ఆమెను దింపాడు. వడిలో పదిలంగా పడుకో బెట్టుకున్నాడు. నోటిలో కొద్ది కొద్దిగా నీళ్ళు విడిచాడు. కొంచెంగా మ్రింగింది కదిలిం . కండ్లయితే తెరువలేదు.

పలువని, ఆ చిన్ని నోటి, గులాబిరేకు పెదిములు కదులుతున్నాయి. ఏదో మాట్లాడటానికి ప్రయత్నిస్తోంది. మెల్లగా గుండె నిమురుతూ మళ్ళీ కొంచెం నీళ్ళు పోశాడు. ఇప్పుడు బాగా మ్రింగింది.

"పల్చని పదార్థమేదైనా ఉంటే బాగుం డేది కదూ!..." అన్నాడతను. 'పదముఖర్జీ!' మళ్ళీ నడక సాగింది.

ఆమె ఏదో మాట్లాడుతోంది. స్మృతి విహీనమై ఉన్నప్పుడే అసలు విషయాలు బయటకొస్తాయేమో! ఆమె అంటోంది. "రాక!......నువు వచ్చావా! నీకోసమే చూస్తున్నాను. మనం...మనం...మన్ని ఆలోకంలో కలుసుకోనీయలేదు. నాకు తెలుసు రావ్! నన్ను ప్రేమిస్తున్నావు. దగ్గరగా రావూ! నీవడిలో పడుకుంటే ఎంతహాయిగా ఉంది. నీ విశాల వక్షస్థలంలో నాకింత స్థానమెందుకు! అందమైన నీ బాహుబంధాల్లో అమందానందం పొందుతాను .....

రావు చకితుడైపోయాడు. ఏమిటీ! తనామెను ప్రేమిస్తున్నాడా? కాదు...కాదు. ఆమె తన్ను ప్రేమిస్తోంది. అదీ సరికాదు. తనలో ఏముందని ఆమె ప్రేమిస్తుంది. ఓహో! ఏమిటిది; తన చెంప నిమురుతోంది. ఎందుకో గాని తన జుత్తు వేళ్ళతో దువ్వుతోంది.

"నేనెక్కడా?" ఆమె తన బుజంమీద నుండి లేచింది.

"ఖంగారు పడకు పడుకో......" అంతకన్నా అతనికి సమాధానం లేదు.

ఆమె గ్రహించింది. సిగ్గుపడింది. ఆమె విదిలించుకుని, క్రిందకు జారింది. తూలింది చటుక్కున పట్టుకున్నాడు రావు.

"నీకింకా బాగా తెలివిరాలేదు సుందరీ! అలా కూర్చో;

ఆమె కూర్చుంది.

"రొట్టె తింటావా?..."

తల ఊపింది.

"ఇంద...మెల్లగా తినాలి. ఆరిపోయిన గొంతు కదూ. కొరపోతుంది. కొసిని నీళ్ళు త్రాగు" ఆఁ...మెల్లగా...సెబాష్!

ఒక గంట గడిచిపోయింది. ఆమె నడుస్తానంటుంది. వద్దంటాడు రావు. కాని ఆమె నడుస్తున్నది. ఆమె నానుకుని నడుస్తున్నాడు. ఆమె తూలిపోతూండేది. అతను పట్టుకుంటున్నాడు.

"నీకు తెలివిరాకపోతే ఎంత బాగుండేది"

"బాగానే ఉండేది"

బలవంతంగా ఆమెను పట్టి బుజాన వేసుకున్నాడు. "వద్దు...వద్దు..." పెనుగులాడింది.

"మిలిటరీ బలం..."

"అయితే నేను నైరృతి దిక్పాలకురాలిని..."

"అంటే?..."

"నరవాహనం కదూ!..."

"వేళాకోళం ప్రారంభించావన్నమాట. ఇదా ప్రతిఫలం..."

"ఏం? బాగానే ముట్టింది. నాలాటి అమ్మాయిని ముట సాహసించలేవు. పైగా ఎత్తుకుంటున్నావు ఇంకేం?..."

"కూత పట్టావే..."

"అబ్బ! ప్రక్కలో పొడవకు. వళ్ళంతా నెప్పులుగా ఉంది..."

ప్రొద్దు బాగా ఎక్కింది. దగరలో ఒక కోనేరు కనిపించింది ముఖం, కాళ్ళు, చేతులూ కడుక్కున్నారు. తలా రెండు రొట్టెలు తిన్నారు. కడుపునిండా నీళ్ళు త్రాగారు.

అంతా అలసి ఉన్నారు. పైగా రాత్రి ఒక్కరూ కన్నుమూయలేదు. ముందుకు పోవడం చేతకాలేదు. నిద్రకొరిగారు. ఎంతసేపు పడుకున్నారంటే, వాళ్ళు లేచేసరికి ప్రొద్దు బాగా వాలిపోయింది.

నవ్వుతూ, త్రుళ్ళుతూ నడక సాగింది. వారికి నాయకుడు రావు. ముఖర్జీ పరిస్థితే బాగా దెబ్బతిన్నది. ఇంతవరకు అతి కఠినమైన క్రమశిక్షణ కలిగిన ఉద్యోగాల్లో ఉన్నారు. ఇంతవరకు ముఖరీ ఎలా చెబితే అలా జరిగేది. రావు చచ్చినట్లు వినాలి. కాలుకదపటానికి గాని, నోరు మెదపటానికి గాని వీలు లేదు అరఫర్లాంగు దూరంలో చూచి కట్టెలా గానిలబడి శాల్యూట్ చేయాలి. ఇప్పుడు?

హోదాలు పెరగలేదు, తరగాలేదు. ...మళ్ళీ అతను సామాన్య సైనికుడు...ముఖర్జీ అధికారి. ఇప్పుడీ కొత్తలో అంతా తరుమారయింది. ప్రభుత్వం మానవుణ్ణి, మానవ హృదయాన్ని వేరు చేస్తుంది. కాబోలు. ఆత్మయొక్క అంతసులు కొలిచేదెప్పుడు? ఎలా? ఈ చదువులు, ఈ డిగ్రీలు మనిషికి హోదా, గౌరవానికేనా! ఆత్మ కేవి

లేవా? సామాన్యుల్లో ఉన్న సద్గుణాలు లెక్కకురావా? ఛీఛీ! ఎంత విశాల ప్రపంచ మిది!

ఎందుచేతనో మానవ నైజం ఆత్మను చంపుతుంది.

ఎందుచేతనో యీ అధికారం, హోదా, ఆత్మను అణచిపెడతాయి.

ఎందుచేతనో ఈ బానిస బ్రతుకుల గాను గెద్దులు మనస్సును మార్చివేసుకుంటారు.

ఎవరికి తెలుసు ఏ పుట్టలో ఏ పాముందో!

ఎవరికి తెలుసు ఎప్పుడేం జరుగుతుందో?

ఎవరికి తెలుసు ఎప్పుడెవరితో అవసరంపడి ఎవరి ఉపకారానికి చేయిచాచాలో?

ఎందుచేతనో ఎవరికి తెలుసు?

"సుందరీ!"...పిలిచాడు రావు.

"ఏం?"

"నీవంటే ముఖర్జీకెందు కంత కోపం?"

"అతన్నడగలేదా?"

"చెప్పలేదు."

"అతనిమీద చాలాసార్లు ఫిర్యాదులు చేశాను."

"ఎందుకు?"...

"ఒకటి, ప్రవర్తన గురించి; రెండు, విధి నిర్వహణలోని లోపం గురించి. చాలామంది కర్రపెత్తనం రాగానే మిడిసిపడతారు. క్రిందివారిని ఖాతరు చేయరు. క్రిందివారు కూడా మనుష్యులు, వీరికి చీమూ నెత్తురూ వుంది. ఇల్లాంటివి మరిచిపోతారు. తనుకు తాము చాలాగొప్పగా అనుకుని గర్వంతో విర్రవీగుతారు. ఏం? మనంమాత్రం గాడిద చాకిరీ చేయటంలేదూ? అప్పనంగా జీతం తింటాడా ఎవరైనా? మరిపెద్దవాళ్లు మరీ చిన్నవాళ్ళను పురుగుల్లా ఎంచి మాట్లాడుతూ వుంటారు."

ఆతరవాత వారి ప్రయాణం బాగా సాగింది. వచ్చిపోతాము అనేభీతి తగ్గింది. ఆకలితో అనుక్షణం చచ్చేదానికంటే, ధైర్యంతో ఏక్షణమో చావునైనా ఎదుర్కోవటం మంచి దనే నిర్ణయానికొచ్చారు. రాత్రిళ్లు ప్రక్క పొంతపల్లెల్లో ప్రవేశించి, రావు ఏవో ఆహారపదార్థాలు తెస్తూనే వున్నాడు.

ఇవ్వాళ వారు తమ మాతృభూమిలో ఒకానొక చివర అడుగుపెట్టారని తెలుసుకున్నారు. అక్కడకు పదిహేనుమైళ్ళ దూరంలోగాని రోడ్డులేదు. అతరువాత ముప్ఫైమైళ్ళ అవతలగాని రైలులేదు. పూర్తిగా అలసటపోయేటంతవరకు అక్కడే ఉండటానికి నిశ్చయించుకున్నారు.

వద్దన్నా సుందరి వినలేదు. వంట తనే చేస్తానన్నది.

"ఎవరైనా వంటకు పెట్టుకుందాం! అంటీవున్నావ్?"... అన్నాడు రావు.

"ఎందుకు? వాళ్ళు నాకంటే బాగా చేస్తారా?"...

"నువ్వే చేస్తానంటావు?"...

"ఠీవుగ్గా."

"నీకెందుకీ శ్రమ?"...

"నాకేదైనా పని చేస్తూ వుంటేగాని ప్రొద్దుపోదు. ఏమీ చేయకుండా వుండటం నాచేతకాదు. అందుకే నేను డ్యూటీలోకి వచ్చానంటే నర్సులు, సిస్టర్లు, డాక్టర్లు ఏడ్చిచస్తారు"

"అయితే కానీ. నేను కూరలూ అవీ తరిగి ఇస్తాను. నువ్వు వండు. నేనే వండుదును గాని ఆడవాళ్ళవంట రుచిగా వుంటుంది"...

నవ్వింది సుందరి. "మగవాళ్ళంటే నాకరికాలిమంట నెత్తికెక్కుతుంది. వాళ్లంటే గిట్టదు. నువ్వుతప్ప—" అం దాఖరుకు.


"ఏమిటో ఆ నమ్మకం?"

"నువు నమ్మతావుగా"—మల్లె మొగ్గలు బయటపడ్డాయి.

భోజనాలు చేస్తూంటే ముఖర్జీ అన్నాడు: "వెల్ మిస్టర్ రావ్!...మనం కష్టపడ్డా, ఆకష్టాల్ని తన శాకపాకాలతో మరిపిస్తోంది. బ్రహ్మాండంగా వుంది."

అశ్చర్యమత్తు. అష్టకష్టాలు పడ్డది రావు. కాని 'మనం' అంటాడు ముఖర్జీ. కష్టపడి పనిచేసేవాళ్ళ ఫలితం, కర్ర పెత్తనపు వాళ్ళకు దక్కుతుంది కదూ! ఏదైనా మిలిటరీ క్యాంపులోకి వెళితే దారి చూపించిన వాడు, ధైర్యం చెప్పినవాడు, ముఖర్జీ అవుతాడు. కాని రావుకాడు. ప్రమోషనుగాని, బిరుదులుగాని, ఒక వేళ...ఇస్తే గిస్తే ఎవరికి?

దాహంతో సుందరి చచ్చిపోతూ ఉంటే ధైర్యంచేసి రావును పంపానవచ్చు. కొంత దూరం మోయింపచేశానవచ్చు. తన్ను గాక, ఇతర్లను తప్పించటానికే తన జీవిత మనవచ్చు. ఇంకా యిలాంటి లక్ష డంబాలు కొట్టవచ్చు. ఎందుకంటే గొప్పవారి మాటకు వంగతోటకు వంక ఉండదుగా! మనం నిత్య



"చుట్ట" రికం

చిత్రం: ఎమ్. రామస్వామి, ఏలూరు.

జీవితంలో చూట్టంలేదూ! ఆఫీసర్లు అబద్ధమాడరని, అన్యాయం చేయరని కదూ ప్రభుత్వం నమ్మకం. చిన్నవాడు నిజం చెప్పినా, పైవాడు వినిపించుకోక పోవడంలో నే ఉంది వారి వ్యక్తిత్వం. చిన్నవాడి మాట వింటం చిన్నతనం.

కాని రావుకుగాని, సుందరికిగాని అలాటి భావాలు కలుగలేదు, కలగవుకూడాను. వారికా పట్టింపులేదు.

సాయంసమయాల్లో తుపాకులు తీసుకుని చుట్టుపట్ల వున్న చిట్టడవుల్లో తిరిగి రోడుప్పినో కొట్టుకొని వచ్చేవారు, రావు, ముఖర్జీ. కావలసినంత ఉంచుకొని మిగతాది పల్లెప్రజకు పంచేవారు.

వేటకు వెళ్ళి, ఒక చెట్టుక్రింద కూర్చుండగా రావు కదిపాడు. "ఆడవాళ్లంటే ప్రత్యేకమైన ఒక విహ్యభావం మీ హృదయంలో పేరుకొని ఉందికదూ?"

"............"

"ఎందువల్ల?"

"............"

"ఏమంత చెప్పరానిదా? ఆత్మీయుణ్నన్న భావంతో అడుగుతున్నాను."

"ఇప్పటికి సరిగ్గా 80 సంవత్సరాల క్రితం ఒక అమ్మాయిని ప్రేమించాను," ముఖర్జీ మొదలుపెట్టాడు. "నాకున్నదంతా ఆమే అనుకున్నాను. ప్రకృతిలోని ప్రతి అణువూ ప్రపంచంలోని ప్రతీదీ ఆమే నాకు. ఐదు సంవత్సరాలు ఆమెను ఆరాధించాను. ఆమె కోసం ఏదైనా చేసేవాణ్ని." ఆగిపోయాడు కొంతసేపు. "ఒకరోజు రాత్రి నా సర్వస్వం అనుకున్న ఆమె నాకు ద్రోహం చేసింది."

"ఈర్ష్య, విరక్తి, వైరాగ్యం కలిగాయి. మూడు సంవత్సరాల నా ముద్దుబిడ్డను నా భుజంమీద వేసుకొని, నాదంతా ఆమెకే వదిలేసి, నిరాధారుడనై, యీ విశాల ప్రపంచంలోకి కదలిపోయాను.

"అప్పట్లో నాకు స్త్రీ అంటే కలిగిన అసహ్యాన్ని, వికారాన్ని, కోపాన్ని నా చిట్టిపాప తన బోసినోటి నవ్వుతో మరపించివేసింది. నా చిన్నారి చిరుతను ఒక అనాథ శరణాలయంలో చేర్చి ఆ పిల్లకోసం ఇందులో చేరాను. పైస ప్రాణంగా దాచి నాపిల్ల కోసం పొదుపు చేశాను. డాక్టరీ చదివించాను. అందమైన వాడితో ఆమెకు ఉద్వాహం చేశాను. నివసించటానికి చక్కని విలాసమందిరం కట్టించిపెట్టాను."

"నాగరికత ప్రబలింది కదూ! భర్తవడి మీద దెబ్బకొట్టి రోజుకో భర్తను మారుస్తోంది—ఆ తల్లి పిల్ల"

చాలాసేపు మౌనంగా గడచింది. ముఖర్జీ అన్నాడు: "ఆడదాన్ని నమ్మకూడదు రావ్! నమ్మించి, మన్ని పీల్చి పిప్పిచేసి చక్కాపోతారు. ఏ పవిత్ర బంధాలు అక్ష

విధి విధానం

రావు. అసలు వాళ్ళు ధనియాలజాతి. చెప్పుతో రాస్తూనే ఉండాలి."

"నేనెందుకు యుద్ధభూమిలోకి వచ్చానో తెలుసా? చచ్చిపోదామనే. ఎవరైనా ఎందుకు ఉద్యోగం చేస్తున్నావ్? ఎందుకింకా బ్రతికి ఉన్నావంటే, ఏం చెప్పేది? ఒకళ్ళకోసం ఒకళ్ళు బ్రతుకుతారా చెప్పు. ఏదో ఒకటి చేయాలిగా. ఏమిచేయకుండా యింట్లో కూర్చొని ఉంటే యీపాటికి నేను పిచ్చివాడినయి ఉండేవాడిని." ముఖర్జి కండ్లుతుడుచుకున్నాడు. ఉద్రేకం పొంగిన దుఃఖంలో: "నేని పరిస్థితి? దిగజారటానికి కారణం ఎవరు? సంఘంమీద నాకు విరక్తి పుట్టించినదెవరు? ఈ ఆడది కూడా నామీద ఫిర్యాదులు వ్రాసి, రిమార్కులు చేయిసుందా? నరకొద్దూ వీళ్ళను..... చిత్రవధ చేయాలి..."

రావు ఒక నిశ్వాసం విడిచాడు. కరుడు కట్టిన అతని భావాలు కరిగించటం కష్టం. కట్టుకున్న భార్య, కన్నకూతురు అతనికి ద్రోహంచేశారు. వాళ్ళకోసం అతనెంతో చేశాడు. సుఖమయమైన సంసారం సాగించటానికి అవరోధం కలిపించారు. విచ్ఛిన్నమయిన అతనిహృదయం విరక్తితో నిండింది.

బసకు చేరుకున్నారు. భోజనాలయ్యాయి. రావు నిషాలో కొంత గడబిడచేశాడు. ముఖర్జి మతి తప్పేంత త్రాగడు.

తెల్లవారింది. శనివారం. రావులేచి లోనికెళ్ళాడు. ఎక్కడా అతనికి సుందరి కనబడ లేదు. ఒకమూలగా చిన్నదీపం వెలుగుతూ ఉంది. గోడకు వెంకటేశ్వరుని పటం వేళ్ళాడుతూంది. అగరు వత్తులు వాసన విరజిమ్ముతున్నాయి. ఏదో చీకటి కదిలినట్లనిపించిందతనికి. అది సుందరి తల. తలార నీళ్ళుపోసుకున్నట్లుంది. ముడి విడి వీపంతా అవే నాట్యం చేస్తున్నాయి.

క్షణం తబ్బిబ్బై ఆశ్చర్యంతో ఒకమూలగా నిలబడ్డాడు రావు. ముఖర్జీకూడా వచ్చాడు. అతన్ని మాట్లాడనీయకుండా చేశాడు రావు. కొద్దిక్షణాలు యిద్దరూ అలా నిలుచుని, ఈ ప్రపంచ సుఖదుఃఖాలకతీతురాలై, మనస్సును భగవదైక్యంచేసిన, ఆ పవిత్రమూర్తిని, చూచి బయటకొచ్చారు.

"నా కూతురు ఇలాంటిదై—" అన్నాడు మైకంలో ముఖర్జి.

"అనుకోవటంలో ఉంటుంది. ప్రపంచమంతా ఒక్కలాగా ఉండదు. ఒకర్ని చూచి అందర్ని అంతే అనుకోవటం ఆత్మద్రోహం చేసుకోవటం."

క్షణమయిన తరువాత పూజ అయినట్లు గ్రహించి రావు లోనికెళ్ళాడు. ముఖర్జి

కాసేపు ఆలోచించి తన మలినముఖాన్ని చూపటం యిష్టంలేక బాధతో బయట కొచ్చాడు.

"సుందరీ..."

"ఆఁ...మీరా! ఇదిగో ఫలహారం."

"పూజచేస్తున్నావేఁ?..."

"మాయింట్లో అంతా యీదినం వెంకటేశ్వరుని పూజిస్తారు. సమయం దొరికింది. అశాశ్వతమైన యీశరీరాన్ని, క్షణకాలం భగవత్సాన్నిధ్యంలో గడిపితే ఏంపోయింది. అయినా, డ్యూటీలో ఉన్నా, ప్రతిరోజూ ఈదినం ఇంకా అతన్ని కొలుస్తూనే ఉన్నాను. కాఫీకి మీ కాలస్యమవుతోందేమో! నా సంభాషణలో కాలం గడిపేస్తున్నాను."

"ఫరవాలేదు. ప్రమాదం ఏమీలేదు..."

"ఇంత...అరె! ఇంతకూ మీరు ముఖం కడిగారా?..."

"అవునుసుమా! ఈ అరణ్య ప్రయాణాల వల్ల అలవాట్లు మారాయి. గబగబ కడిగి వచ్చేస్తాను..." వెళ్ళిపోయాడు.

కాఫీలయ్యాయి. సుందరి అంది:—"మీ వద్ద అన్నీ సుగుణాలే ఉన్నాయి. కాని ఒక్క దుర్గుణముంది."

నవ్వి అన్నాడతను: "ఒక్కటా! భలే దానవు. అన్నీ అవే..."

"కాదు. నేనొకటి కోరుకు నేదా?..."

తల ఊపాడు.

"నెరవేరుస్తారా?..."

"ఏమిటది?..."

"బాసచేయండి."

"బాగుంది. నామీద నాకే నమ్మకం లేదు."

"అది మనభావనలో ఉంది. రాత్రి మీరు చేసిన హంగామా యింతకాదు. సినికులు త్రాగుతారు. త్రాగనివారు ఉండకూడదా? ఇంత విపరీతంగానా? నామీద ఒట్టు. అది మానివెయ్యరూ!"

"అవును సుందరీ. నేను ఏం చేస్తూంటానో నాకే తెలియదు. నేను త్రాగుతున్నాను. అందులో ఏదో ఆనందముంది నా దేహం పాడవుతుందని గాని, చనిపోతానని గాని, నాకు చింతలేదు. నా గురించి బాధపడేవారుగాని, నేను బాధపడవలసినవారుగాని లేరు."

"ఉంటారు..."

"లేరు."

"నే కాళ్ళు పట్టుకుంటాను, ఈ అలవాటు మానివెయ్యరూ?..."

"సుందరి!..." అతను తబ్బిబ్బయాడు.

"ఏదో అలవాటయింది. బహుశా యిప్పట్లో మానలేను. ఈ పదవి వదలిన తరువాత అప్పుడేమో." అని,

"మన ప్రయాణం రేపు నిశ్చయించాడు కెపెన్. రేపటికి మనం యిక్కడాగి ఆరు రోజులవుతుంది...అతి కష్టంమీద ఒక ఎద్దుల బండి సంపాదించాం......"

తరువాత ఎవరెవరితోనూ మాట్లాడుకో లేదు. ఆరిపోయిన తలకు కొద్దిగా నూనెరాసి చిక్కు తీసుకుంటున్నది సుందరి. గోడకు జారగిలబడి సిగరెట్టు కాలుస్తూ కూర్చున్నాడు రావు.

సిగరెట్టు పొడి మూలగా దులుపుతూ:— "సుందరీ! నీకు ఒట్టుమని ఇరవై లేవు. ఇంత చిన్నవయస్సులో ఎందుకిలా చేశావు?..."

"ఏం? నేనేమైనా తప్పుచేశానా?..."

"అనే చెప్పాలి ఇతరత్రా చెప్పలేను. ఈ పని ఆడవాళ్ళకు పరిపడింది కాదు సుమా!..." అన్నాడు. అతని దృష్టిలో ఎందుకూ పనికిరానివాళ్ళు, ఏమీ లేనివాళ్ళు, సంఘ దూరులకే యిక్కడ స్థానమని.

సుందరి మాట్లాడలేదు.

"ఎవ్వరూ లేరా నీకు? నీ చరిత్ర చెప్పవూ?..."

'ఎందుకు?..."

"ఊరికే తెలుసుకుందామనే కోరిక..."

"మా నాన్నకు ఆరుగురాడపిల్లలం. ముగ్గురు మొగపిల్లలు..."

"అవును లే మనదేశంలో అతి ముఖ్య పరిశ్రమ అదేకదా!..."

"అలా నవ్వితే నేను చెప్పను. మామూలు బడిపంతులుగా ఉన్నవాడు యిందర్ని సాకాలి అంటే?..."

"ఇతర్లకంటె యీ పంతుళ్ళకే పిల్లలెక్కువేం? బహుశా వారికింకో పని లేదనుకుంటాను..."

ఋణగుణధ్వని

ఒక అప్పులు చేసే అప్పారావు ఋణాలిచ్చే ఋణజిత్తుతో ఇలా అన్నాడు.

"నాకు అర్జంటుగా వంద రూపాయలు కావాలి. మీకు నాలో ఆ మొత్తానికి విశ్వాసం ఉండకపోదు."

వెంటనే ఋణజిత్తు మత్తుగా ఇలా అనేశాడు:

"నాకు విశ్వాసం ఎంత మొత్తానికయినా ఉంది. కాని డబ్బే లేదు ప్రస్తుతం."

"నా తెండి వేళాకోళం...ఇహ నేను చెప్పను..."

"బుద్ధిగా కూర్చుంటాను. చెప్పు..."

"నేను మూడవదాన్ని. నాకంటె ఇంకా యిద్దరు ఆడపిల్లలు పెద్దవాళ్ళున్నారు. మొగపిల్లలు నాకంటె చిన్నవారు. ఒక్క పిల్లకు పెండ్లి కాలేదు. చదువులూ లేవు. ఉద్యోగార్హత పొందే ఉన్నత విద్యాభ్యాసం మాకు లేదు. వేలు ఖర్చించి మా తండ్రి వివాహం చేయలేక పోయాడు. స్కూల్ ఫైనల్ పాసయి బజారువెంట తిరిగేవాడు కూడా వేలడుగుతాడు. పైగా ఉండ యిల్లు గాని, పండ మంచం గాని ఉండదు.

"అసలు గాంధీ, నెహ్రూలు కలలు కనే నవసమాజనిర్మాణం జరగాలంటే యీ మధ్య తరగతిలో మార్పు రావాలి. ఈ కర్మ కాండలు, తద్దినాలు, పండుగలు, పబ్బాలు, బంధువులు, మర్యాదలు, కడుపు కట్టుకొని ఖర్చుపెట్టే పరిస్థితి మారాలి. ధనవంతుడికి భయం లేదు. బీదవాడు పాటించడు. కీలకమైన యీ తరగతి మారాలి.

"కష్టపడి చదువులు చెప్పిస్తే కట్నాలు లేకుండా చేసుకునేవాడున్నాడా? నేనొక మాటంటాను. కోపం తెచ్చుకోవద్దు రావ్. పురుషత్వమున్న మగవాడు ఆడదాని సొమ్ము కాశిస్తాడా? జ్ఞానం, సంస్కారానికి బదులు డబ్బే ప్రధానం. వలిస్తే కుమూపిని, కులటనూ చేసుకుని ఆజన్మాంతం దుఃఖం అనుభవించటానికి సిద్ధపడే యీ కుక్కల్లాంటి మగాళ్లకు సిగ్గులెలా లేవు?..." ఆమె ఉద్రేకపడింది. అధరాలు చలించాయి. చెక్కిళ్లు ఎర్రబారాయి.

కొంతసేపయిన తరువాత, పట్టుకుచ్చు లాంటి జుట్టును, ముచ్చటముడి వేసింది. దువ్వెనకు పట్టుకొన్న వెంట్రుకలు తీసి వ్రేలికి ఉండగా చుట్టింది. ఆ ఉండ ప్రక్కగా ఉంచి—"ఇలాంటిపరిస్థితులలో ఏంచేయాలో చెప్పు. నేను ధైర్యంచేసి ముందడుగు వేశాను. ఇందులో తప్ప మరెందులోనూ నాకు దారి లేదు. నాకు మావాళ్లు నీళ్ళు వదిలారు. నన్ను వారు ఆదరించాలని, ఆదరిస్తారని నాకు నమ్మకం లేదు ఆతరువాత నా ముఖం వాళ్ళు చూడలేదు.

"మొన్న మా పెద్దక్కయ్యకు ఒక ముసలి వాడితో పెండ్లి అయిందని తెలిసింది. కడమ వాళ్ళ సంగతి నాకు తెలియదు. అంతకన్నా మా నాన్న ఏమీ చేయలేడని కూడా నాకు తెలుసు. కట్నం కావాలని కోరుకునే ఆ కొడుకును కన్నతల్లి, తన తండ్రి తనకు కట్నమిచ్చేటప్పుడు ఎంత కష్టపడ్డాడో మరచిపోతుంది......

"అప్పుడప్పుడూ నాకు మిగిలిన డబ్బు వారికి పంపుతూ ఉంటాను. నా కెప్పుడూ వాళ్లు ఉత్తరం వ్రాయలేదు. నేనూ వ్రాయ

★ విధి విధానం ★

లేదు. కనీసం మా అక్కయ్య పెండ్లి విషయం కూడా నాకు తెలుపలేరు. తెలిపితే, నేను వెళితే, వాళ్ల ఉన్నత వంశానికి, ఉత్తమ సంస్కారానికి ఏం దెబ్బ తగులుతుందోనని భయం. బ్రతికి ఉన్నంతవరకూ సంపుతూనే ఉంటాను. చచ్చిపోతే నా, ఫరవా లేదు. నాకోసం ఎవరూ విచారించేవారు లేరు..."

"ఛా! ఛా! తప్పు కాదూ? కండ్లు తుడుచుకో."

సుందరి పైటతో కండ్లు తుడుచుకుని "ఎప్పుడూ వాళ్ళచాటున ఉన్నదాన్ని. పదిమందిలోకి వచ్చాను. కాని ఎప్పుడూ అమ్మను, వాళ్ళను చూడాలని మనస్సు కుంచాతూ ఉంటుంది హృదయం రెప రెప కొట్టుకుంటుంది..." బావురుమందామె.

"నేను దుఃఖం చూడలేను సుందరీ! నన్ను కూడా ఏడిపించకు."

"కళ్ళెంవేసి లాగిపట్టాను నా మనస్సును రావ్! మాతృహృదయంలో స్థానముంటుందని నాకు తెలుసు. కాని ఆ సంఘంలో... ఆ ఊళ్ళో నాకు స్థానం లేదు. నేనేం తప్పు చేశాను? అయినా నేను సంఘభ్రష్టను, కులభ్రష్టను, జాతిభ్రష్టను......"

ఆమె కండ్లలో కడవలు పగిలాయి. అతనూ కళ్ళు అద్దుకున్నాడు. ఆ వేదనలో ఆలోచన లేక ఆమెను దరిజేర్చుకొని కన్నీళ్లు తుడిచాడు. సానుభూతిని పొందే ఆ విషాద హృదయపు దుఃఖప్రవాహం కట్టలుత్రెంచుకుంది. అతని ఒడిలోపడి పసిపిల్లలా భోరున ఏడ్చింది. వీపు నిమురుతూ అనునయిస్తున్నాడతను. స్వచ్ఛమైన మానవ హృదయపు సంక్షోభం ఆమెలో ఉంది. ప్రశాంతమైన సంసార జీవితానికి అలమటిస్తున్నది.

చాలాసేపు గడచిపోయిన తరువాత ఆమె అతని ఒడిలో ఉన్నట్లు గ్రహించుకుని, సిగ్గుపడింది. దూరంగా జరిగి పమిటి సర్దుకుంది:

"అన్నావు ఉత్తమవంశంలో పుట్టానని. చెప్పావు ఇంటరుదాకా చదివానని. చేస్తున్నావు యీ సిపాయి ఉద్యోగం. ఎందుకో చెప్పమంటె ఎందుకు చెప్పవూ?..." ఆమె అతని కండ్లలోకి చూచింది. అతనింకేమీ చెప్పకుండా వెళ్ళిపోయాడు.

ఏకాదశి. శనివారం కూడాను. ఆమె కఠినోపవాసం. అయినా ఆమె వంట చేసోంది. ఆమెను అడ్డుపెట్టే శక్తి వారిద్దరికి లేదు. ఇద్దరూ బాధపడ్డారు. భారతగృహిణి అంతేకదూ!

ఆతరువాత తెల్లవారి వారి ప్రయాణం. బండిమీద సాగింది. రోడ్డుచేరుకొని, రైలు సేవనుకు వచ్చి, మొత్తానికి వారొక పెద్ద యూనిటు చేరుకున్నారు. విశ్రాంతికోసం వారింకా కొన్నిరోజులుండే ఏర్పాటు చేశాడు—ఆమిలటరీయూనిటు ఆఫీసరు.

సుందరిని ఆడవాళ్ళ క్వార్టర్సులోకి పంపారు. ముఖర్జీ ఆఫీసర్ల గదిలోకి వెళ్లాడు. రావుకి సిపాయీల నివేశాల్లో స్థానం.

అయిదురోజులిలా గడచిపోయాయి. ఈలోపున సుందరి, రావులు కలుసుకోలేదు. వాళ్ళ, వీళ్ళయిళ్లు దూరంగా ఉండటం కొంతకారణం. 'సుందరి తన్ను బాగా ప్రేమిస్తున్నది' అనుకునేవాడు రావు. కాని తనూ ఆమెను ప్రేమిస్తున్నట్లుగా బాధపడేవాడు. ఆవిడనుండి దూరంగాఉంటె అతని కిప్పుడెలాగో ఉంది. ఏదో వెలితి, దేన్నో పోగొట్టుకున్నట్లు. ఏదో అతీయమైన, ప్రియమైన, అమూల్యమైన, ఆరాధ్యమైన వస్తువునుండి దూరంగా విసరివేసినట్టుంది. ఆలోచనలో ఆ వేదన అధికమైతే అదే పనిగా త్రాగుతున్నాడు.

సుందరి పరిస్థితికూడా యిలాగే ఉంది. ఇంట్లో యింతమంది పిల్లల్లో తన్ను ఇంత సానుభూతిగా చూచినవారు లేరు. ఈ మిలటరీ పద్ధతుల్లో బీడుపడిన తనహృదయం పులకించింది. ఎండినహృదయం చిగురించింది. ప్రేమనికారం యిలా ఉంటుందన్న విషయం ఆమె ప్రథమంగా అనుభవించి బాధపడుతూంది. స్వచ్ఛమైన, నిర్మలమైన ఆమె మనస్సులో ముద్రితమైన అతని మూర్తిని మరచిపోలేకపోతోంది. ఆమె ఏమిచేస్తోందో కూడా మరచిపోతోంది. కూర్చున్నచోటనే కూర్చుని అర్థంపర్థంలేని, ఇది అని చెప్పరాని ఏదో ఆలోచనల్లో ఉంటోంది.

ఇవ్వాళ క్రొత్తపోస్టింగ్సు యిచ్చారు. రావును పూనా వేశారు. కలకత్తాకు ముఖర్జీని పంపుతున్నారు. సుందరిని ఢిల్లీకి...

ఆ వేళ అంతా మళ్ళీ స్టేషనులో కలుసుకున్నారు.

ముఖర్జీ వెళ్ళవలసిన రైలు వస్తోంది. కెప్టెన్ దుస్తుల్లో ఉన్న అతనికి రావు మామూలు సైనికునిలా శాల్యూట్ కొట్టాడు. ముఖర్జీ కండ్లల్లో నీళ్లు చూచి ఆశ్చర్యపడ్డాడు. భావాలకు భాషలేదేమో! ముఖర్జీ అతన్ని అమాంతం కౌగలించుకున్నాడు. 'జీవితాన్ని జయించ గలవు రావ్! విధి నీచేతుల్లో ఉంటుంది. భగవంతుడు నిన్ను ప్రేమగా చూస్తాడు." అంతకన్నా మాటలు అతనికి చేతకాలేదు.

"సుందరీ! ... నీముందు నేను చాలా అమానుషంగా ప్రవర్తించానని తరువాత తెలుసుకున్నాను. నా జీవితం సుఖమయం కావాలని హృదయపూర్వకంగా దీవిస్తున్నానమ్మా!"

> వ్యాకరణం మేష్టారు: 'నేను అబద్ధాలాడతావు' ఇందులో తప్పేమిట్రా బాబీ.
>
> బాబీ: "నీవు అబద్ధాలాడతావు" లేదా "నేను అబద్ధాలాడను" అంటే సరిపోతుందండీ.

ఆమె వంగి అతని పాదధూళి స్వీకరించింది. ముఖర్జీ కదిలాడు. చిన్నపిల్లవాడిలా ఆమె వద్ద కూర్చున్నాడు "చూడు. నన్ను నీలాగ కట్టివేయగలిగిన వ్యక్తి యీ ప్రపంచంలో లేదు. నా యింటి తలుపులు నీకోసం ఎప్పుడూ తెరచి ఉంచుతానమ్మా! నువ్వన్నావు కదూ నిన్ను పెంచుకోమని. భగవత్సాక్షిగా యివ్వాళ నువ్వు కూతురివి. తండ్రియింటిని స్వర్గంచెయ్యమ్మా! వీలైనన్నిసార్లు నీపాదం నాయింట్లో మోపవమ్మా!..."

"ఛీ! పెద్దవారు ఏడవ వచ్చునా?..." ఆమె అంది.

"బండికి టయిమయింది గార్డు విజిలు కూడా వేశాడు" అన్నాడు రావు.

"ఈబండిపోతే మరో బండికి వెళతాను. కాని మిమ్మల్ని విడవలేకుండా ఉన్నాను. నన్ను మరచిపోకుండా మీయిద్దరూ నా యింటికి వస్తూంటారు కదూ!..."

"తప్పకుండా."

"సుందరీ! ఎటువంటి కష్టమొచ్చినా, నన్ను మరచిపోకమ్మా!..."

అతనిబండి వెళ్ళిపోయింది. అతను వెళ్ళిపోయాడు.

సుందరి వెళ్ళవలసిన రైలు వచ్చేసియింది. ఇద్దరూ కూర్చున్నారు. ఏం మాట్లాడుకోవాలో వాళ్ళ కర్థంకావటం లేదు.

"మళ్ళీ మనం కలుసుకోలేమేమో!..." అంది సుందరి.

"ఏమో!" అయోమయంగా అన్నాడతను.

"ఉత్తరాలు రాస్తూ ఉంటావు కదూ?"... ఏదో ఆప్యాయత.

"ఊఁ" ఏదో బాధ అతనిలో.

బండివచ్చింది. సుందరి ఎక్కింది పెట్టె ప్రక్క నిలుచున్నాడతను.

"ఈ అయిదురోజులూ ఏదో బాధగా ఉంది నాలో..." అంది.

"నాకూ అలాగే ఉందేం?..."

"పైనకూర్చో యింకా టయిముంది" ఎక్కి ఆమె ప్రక్క కూర్చున్నాడతను.

"నిన్ను చూడాలని బుద్ధిపుడితే ఎలా?" అందామె.

"అవును ఎలా?" అతని బుర్రపని చేయటంలేదు.

నక్షత్రఫలితాలు

| 30-9-59 మొదలు 6 10-59 వరకు |

ఈ వారము గ్రహస్థితి.

శ			
	తే 4 దీని బుధుడు తుల లో ప్రవేశించును. సింహ, కన్యా, తులా, వృశ్చికము లలో చంద్రుడు.		
			గు
శ	కు		రబు శుర

*** అశ్విని [చూ, చే, చో, లా] ***

మీ ఆలోచనల ప్రకారము ఈ వారము కార్యక్రమాలు జరుపుటకు కొందరు అడ్డు వస్తూవుంటారు. కొన్ని సందర్భాలలో అశాంతి, బంధువిరోధము కలుగుతవి. కోర్టు దావాలు అనుకూలముగా తీర్పు అయినా మరి కొన్ని కొత్తచిక్కులుకలుగుతాయి. కొర్రలు రాగులు వంటి అపరదినుసులు, మినుములు, ఉప్పు, నువ్వులు, నూనె సంబంధమగు వస్తువుల వర్తకులకు లాభము. అన్యజాతివారివల్ల గౌరవము కలుగుతుంది. 8 వ భార్యకు అనా

రోగ్యము, అధిక ఖర్చులు.

*** భరణి [లీ, లూ, లే, లో] ***

ఈ వారము ఎంత ప్రయత్నించినా అనేక ఆటంకములు కలుగుతవి. సాహసము పట్టుదల కలవారగుటచేత నిరాశచెందక ప్రయత్నించి కలిగిన చిక్కులు విప్పుకొని మేలు పొందుతారు. సోదర సహాయమువల్ల ఒడి దుడుకులు సర్దుకుంటాయి. జాగ్రత్తగా వుండ డమువల్ల అవయవములకు దెబ్బలుతగిలే

బి. నరసింగరావు

ప్రమాదము తప్పవచ్చును. గనుల యజమానులకు, భూగర్భశాస్త్రజ్ఞులకు, ఖనిజ వ్యాపారసులకు, పోలీసుశాఖ ఉద్యోగులకు కష్టముతో కూడిన యోగము.

*** కృత్తిక [అ, ఈ, ఉ, ఏ] ***

మీరు ధైర్యముతో వృత్తి, ఉద్యోగాలలో ముందంజవేసి హోదా ఆదాయము పెంచుకొంటారు. కొత్త అనుకూలతలు యేర్పడుతవి. మీ బుద్ధికుశలతవల్ల ఉపద్రవాలు దాటుతారు. మీరు వేసుకున్న పథకము ప్రకారము అన్నివిధాలా డబ్బు చేతికి

అందుతుంది. మాట చలువబడితో పరిస్థితులలో అనుకూలమైన మార్గాలు తెచ్చుకోగల కలుగుతారు. ఈశాన్యదిక్కునుండి బంధువుల క్షేమవార్త తెలుస్తుంది. గణిత శాస్త్రజ్ఞులకు, కవులకు, శిల్పులకు, చిత్రకారులకు, నటీనటులకు యోగకాలము.

*** రోహిణి [ఓ, వా, వీ, వూ] ***

ఈ వారము మీకు యోగప్రదము. అవకుండా నిలిచిపోయిన పనులు ఈ వారము సుముఖ మవుతాయి. అధికారముతోపాటు ధనాదాయము కూడా పెరుగుతుంది. బిరుదులు పొందుట, సన్మానమువంటి శుభయోగములు కలుగుతాయి. పండితగోష్ఠి, నూతన గ్రంథములు చదువుటచే విజ్ఞానాభివృద్ధి కలుగుతవి. పిల్లల మేలుకొరకు మీరు కొన్ని ఏర్పాట్లుచేస్తారు. వర్తకులకు లాభయోగము. న్యాయవాదులకు, న్యాయస్థాన ఉద్యోగులకు, పండితులకు, ఉపాధ్యాయులకు మేలు కాలము.

*** మృగశిర [వే, వో, కా, కీ] ***

ఈ వారము లౌకిక వ్యవహార రంగములో చాలా జయప్రదముగా వుంటుంది. ఆదాయము ఎక్కువ అవుతుంది. నీటిమీద ప్రయాణముచేయవలసి వుంటుంది. కవితాగోష్ఠి, గానసభలు మున్నగు వినోదములలో పాల్గొని బంధుమిత్రులతో కలిసి శుభకార్యములలో మృష్టాన్న భోజనము చేస్తారు. బియ్యము, వెండి, నూలు, బట్టలు వ్యాపారసులకు లాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము. వారమంతా శుభయోగములతో కూడివున్నా మానసికాందోళన కలుగుతూ వుంటుంది.

*** ఆర్ద్ర [కూ, ఖ, జ, ఛ] ***

ఈ వారము మీకు యిష్టకార్యసిద్ధి, ధనధాన్యవృద్ధి, వివాహాది శుభకార్యములలో పాల్గొనుట, పరోపకారమువల్ల కీర్తి, తలపెట్టిన కార్యములలో జయము, వాహన యోగము కల్గుతాయి. విలువగల వస్తువుల క్రయవిక్రయాలలో వర్తకులకు లాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము. ఇంట్లోవారికి అలంకారప్రాప్తి. విద్యార్థులకు చదువు బాగా సాగుతుంది.

పునర్వసు [కే, కో, హా, హి] *

ఈవారము మీకు కార్యభారము ఎక్కువ, రాబడి తక్కువ. గృహావసరములు తీరక కలతలు. అకాల భోజనంవల్ల అనారోగ్యము కలుగుచున్న సూచనలు కనబడగానే, ఔషధ చికిత్స పొందవలెను, విశ్రాంతి చేయించుట మేలు. ఉద్యోగస్థులకు కొత్త సమస్యలు, వర్తకులకు

"వస్తావుకదూ? వ్రాస్తే..."

"ఒ..." తడుముకున్నాడు మాటను.

"నేను నీకు జ్ఞాపకముంటానా?..." తల ఊపాడు.

"నన్ను చూడాలని నీకు బుద్ధిపుడితే వస్తావుకదూ!..." అతను తలెత్తి ఆమె ముఖంలోకి చూచాడు, కన్నీళ్లు నిండిన కంట్లో... ఆమెకంట్లు కూడా తడిశాయి.

కొద్దిక్షణాలు గడిచాయి. "త్రాసుడు మానివెయ్యవూ?..."

"ఊఁ" అవును, కాదూ అన్నట్టుగా అన్నాడు.

విజిలువేసి రైలును కదలమన్నాడు గార్డు.

"రైలు కదులుతోంది" అందామె తొందరగా.

లేచాడతను కండ్లద్దుకున్నాడు. ఆమె కన్నీళ్ళ కళ్లతో అతన్ని చూస్తోంది.

రైలు నడుస్తూంది.

"ఎంతభయంకరమైంది ఈ వీడ్కోలు" అన్నాడతను.

"దిగు రైలు బాగా వేగం హెచ్చిపోయింది"

గబగబ దిగబోయాడు, ప్లాటుఫారం చివర కాలుజారి పడ్డాడు.

"ఆఁ..." అంటూ అరిచిందామె "దెబ్బ తగిలిందేమో! దెబ్బ తగిలిందేమో!" హృదయం ఘోషిస్తోంది. రైలు దాటిపోయింది. అతను కనిపించటంలేదు. ఆమె వణికిపోతోంది. హృదయం గగ్గోలు ఎత్తుతూంది.

అతను లేచాడు. మోకాళ్లకు బాగా దెబ్బతగిలింది. పట్టుకుంటున్నాయి కాని లేచాడు. "ఇంకో నా రైలు రాదేం... నా రైలు రాదేం..." పిచ్చిపిచ్చిగా మాట్లాడుకుంటున్నాడు. ★

★ నక్షత్ర ఫలితాలు ★

ఆందోళన. రాజకీయవాదులకు అశాంతి, త్రిప్పట. 2, 8 అనారోగ్యము. 4, 5, 6 పితృవర్గ సహాయము, ప్రయాణము, ధన లాభము. విద్యార్థులకు చదువు సాగదు.

* పుష్యమి [హూ, హే, హో, డా] *

ఈ వారము మీకు మిశ్రమ యోగము. మొదట్లో మీకు నిరాశగా వున్నా మిత్ర సహాయమువల్ల కార్యలాభము పొందుతారు. ధనలోపమువల్ల ఆందోళన. ఉద్యోగస్తులకు బదిలీ అయ్యే సూచనలున్నవి. విద్యార్థులకు బద్ధకమువల్ల చదువు బాగా సాగదు. ఆప్తుల అనారోగ్యము అశాంతి కలిగిస్తుంది. వారములో అవయోగములున్నా మిత్ర సహాయము, కార్యసిద్ధి, ప్రయాణము, విదేశీయుల పరిచయము, విచిత్ర వస్తుసంపాదనవంటి శుభయోగాలు కూడా వుంటాయి.

ఆశ్లేష [డీ, డూ, డే, డో]

ఈ వారము మీరు సహాయము పొంద దలచుకున్న వ్యక్తిమూలముగా కార్యహాని పొందుతారు. ధనాభావముకూడా ఎక్కువ. ఇంట్లోవారి ఆరోగ్యము చెడుటచేత చింత కలుగుతుంది. ఆధ్యాత్మికభావము కలవారగుటచే దైవముపైని భారము వేసి కార్యలాభము పొందుతారు. ఉద్యోగస్తులకు ఒత్తిడి, వర్తకులకు నిరాశ, విద్యార్థులకు మంచిరోజులు కావు. పుణ్యక్షేత్ర సంచారము, దేవతాదర్శనము, వింతలను చూచుట, వస్త్రద్రవ్యలాభము కలుగును. వారమంతా యోగావయోగ మిశ్రమముగా ఉంటుంది.

* మఖ [మా, మీ, మూ, మే.]

ఈ వారము మీకు అనుకూలతకన్న ప్రతికూలత యెక్కువ. ప్రయత్నించిన కార్యములు ఎక్కువశ్రమతో ఫలిస్తాయి. కోర్టు దావాలు అనుకూలిస్తాయి. ఇతరులకు చేయ దలచుకున్న మేలు చేయలేక నిందలు పొందుతారు. ఉద్యోగస్తులకు అధికారుల అనాదరణ, తోటివారి సహకారము కలుగుతాయి వర్తకులకు వారమంతా నిరాశగా వున్నా వారాంతమున మేలు కలుగుతుంది. విద్యార్థులకు చదువు బాగా సాగదు. 8న భర్యకు అనారోగ్యము కలుగుటచే ఆందోళన, కర్ర బొమ్మల శిల్పులకు యోగము.

* పూర్వఫల్గుణి (పుబ్బ) *
మో, టా, టీ, టూ

ఈ వారము ఎన్ని ఆటంకములు వచ్చినా పట్టు విడవకుండా ప్రయత్నించి లాభము పొందుతారు. అనుకున్న సొమ్ము సమయానికి రాక, అప్పుచేస్తారు జాగ్రత్తవల్ల అవయవములకు దెబ్బలు తగిలే ప్రమాదము తప్పవచ్చును. రసాయనిక శాస్త్రజ్ఞులకు లోహ, ఖనిజవ్యాపారస్తులకు, కష్టముతో కూడిన యోగము. గనుల యజమానులకు, యంత్రములనడుపు నిపుణులకు, ఇంజనీరింగు శాఖ ఉద్యోగులకు మేలుకాలము. 8న ప్రమాదసూచన.

* ఉత్తరఫల్గుణి (ఉత్తర) *
(టే, టో, పా, పీ)

గత రెండువారములనుండి కలుగుచుండిన కష్టములను గడచి, అధికారుల సహాయము చేతను మీ నేర్పరితనముచేతను కార్యసిద్ధి పొందుతారు ఆర్థికస్థితి బాగుపడుతుంది. వారమంతా యోగప్రదముగా వుంటుంది. ప్రయాణము, అధికారుల ఆదరణ, బంధు సహాయము కలుగుతవి. విద్యార్థులకు మేలుగా వుంటుంది. డాక్టర్లకు, గణితశాస్త్రజ్ఞులకు, కవులకు, చిత్రకారులకు, శిల్పులకు, నటీనటులకు యోగకాలము. 3, 4 అధికఖర్చులు.

* హస్త [పూ, ష, ణ, ఠ] *

ఈ వారము అన్ని ఇబ్బందులు తీరుతాయి. అనుకున్నసొమ్ము చేతికిఅందుతుంది. కోర్టు దావాలు అనుకూలముగా తీర్పుఅవుతాయి. పిల్లల మేలుకొరకు కొన్ని ఏర్పాట్లు చేస్తారు. నూతన కార్యారంభము, ప్రభుత్వ సన్మానము కలుగుతాయి. పండితులతో శాస్త్రగోష్ఠిజరిపి విజ్ఞానము వృద్ధిచేసుకుంటారు. విద్యార్థులు శ్రద్ధతో క్రొత్త విషయాలు నేర్చుకుంటారు. 3న ఆందోళన కలుగుతుంది. ఇంట్లోవారి ఆరోగ్యము బాగుపడుతుంది. పండితులకు, ఉపాధ్యాయులకు న్యాయస్థాన ఉద్యోగులకు మేలుకాలము.

*చిత్త [పే, పో, రా, రీ] *

ఈవారము మీకు యోగదాయకమైననూ మానసికాందోళన కలుగుతుంది. నీటి మీద ప్రయాణము చేస్తారు. బంధు మిత్రులతో కలిసి కవితాగోష్ఠి, గానసభలవంటి వినోదాలలో పాల్గొంటారు. దూరమందున్న ఆప్తుల క్షేమవార్త తెలిసి సంతోషం పొందుతారు. నూలు, బట్టలు, బియ్యము, వెండి వ్యాపారస్థులకు వారమంతా లాభదాయకముగా వుంటుంది. విద్యార్థులకు చదువు బాగా సాగుతుంది. శుభకార్యములలో పాల్గొంటారు.

* స్వాతి [రూ, రే, రో, తా] *

గతవారం పూర్తికాకుండా ఉండిపోయిన పనులు ఈ వారము లాభకరముగా చేయగల్గుతారు. ధనయోగం అనుకున్నదానికన్నా ఎక్కువగా కలుగుతుంది. పుణ్యకార్యాచరణలో పాల్గొంటారు. విలువగల వస్తువుల క్రయవిక్రయములలో వర్తకులకు లాభము కలుగుతుంది. ఉద్యోగస్తులకు అధికారము పెరుగుతుంది. స్త్రీలతోనూ,బంధువులతోనూ కలిసి విందు వినోదములతో ఆనందిస్తారు. కవులకు, గాయకులకు, కళాకారులకు నటీనటులకు మేలుకాలము.

* విశాఖ [తీ, తూ, తే, తో] *

ఈ వారము యత్నకార్యములకు ఆటంకములు. కార్యభారము ఎక్కువ. తీరుబడిలేని కార్యక్రమమువల్ల అకాలభోజనము చేయుటచే ఉష్ణాధిక్యము, కడుపునొప్పివంటి అనారోగ్య సూచనలు కనపడగానే ఔషధ చికిత్స పొందుట మేలు వర్తకులకు శ్రమ యెక్కువ. ఉద్యోగస్తులకు అధికారుల ఒత్తిడిచే శెలవు పెట్టవలసివస్తుంది. రాజకీయ వాదులకు మేలుగా వుంటుంది. పితృవర్గమునుండి సహాయముచే ధనలోపం కొంత తీరుతుంది

* అనూరాధ [నా, నీ, నూ, నే] *

ఈ వారము నిరాశగా ఉన్నా మిత్రుల సహాయమువల్ల క్రమేణా కార్యలాభము పొందుతారు. రహస్యములను కనిపెట్టుటకు ప్రభుత్వముచే నియోగించబడుతారు. ధన లోపమువల్ల ఆందోళన. ఉద్యోగస్తులకు

—ఈవారము ధరలు:—

నూలు, వస్త్రములు: నిలకడగావుండును.
నూనెదినుసులు: మందగాగా వుండును.
ఆహారధాన్యములు: సమస్థాయినుండును.
బెల్లము, పంచదార, చింతపండు:- మార్పు లేదు.
పప్పుదినుసులు :- నిలకడగా వుండును.
వెండి, బంగారము :- స్వల్ప తేడాలో వుండును.
సువృష్టిగా వుండును.

జన్మనక్షత్రమును బట్టిగాని, జన్మనక్షత్రము తెలియనివారు నామనక్షత్రము (వారివారి పేర్ల ననుసరించి పేరు మొదటియక్షరము)ను బట్టిగాని ఫలితాలు తెలుసుకొనునది. కృష్ణుడను పేరునకుమృగశిరానక్షత్రమును, హనుమంతుడను పేరునకు స్వాతియును, శ్రీధరుడను పేరునకు చిత్తయును, క్షేత్రపాలకుడను పేరునకు హస్తయును, భీముడు, భరతుడు అనే పేర్లకు పూర్వాషాఢయునూ చూచుకొనునది.

బదిలీ అయ్యే యోగము లున్నవి. వర్తకులకు మాంద్యము; విద్యార్థులకు శ్రద్ధ తక్కువ. ప్రయాణము, విదేశీయులతో పరిచయము, వింత వస్తువుల సంపాదన, కార్యసిద్ధి కలుగుతాయి. ఇంట్లో వున్న వృద్ధుల ఆరోగ్యము చెడుటచే ఆందోళన కలుగుతుంది.

* జ్యేష్ఠ [నో, యా, యీ, యూ,] *

ఈ వారము మీరు అనుకున్నట్లు పనులు జరుగవు. ధనాభావముచే ఇబ్బంది ఎక్కువ. ఏ వ్యక్తి సహాయమువల్ల పనులు చేయదల్చుకున్నారో అతనే ఆటంకములను కలుగచేస్తాడు. ఆధ్యాత్మికచింత కలవారగుటచే ఈశ్వరకృపవల్ల కష్టములను గడిచి కార్యసిద్ధి పొందుతారు. ఇంట్లోవారి ఆరోగ్యము ఆందోళన కలిగిస్తుంది. ఉద్యోగస్థులకు ఒత్తిడి, వ్యాపారస్థులకు నిరాశ కలిగినా ద్రవ్యనష్ట లాభము కలుగుతుంది. సాధుసజ్జన సాంగత్యముచే ఆత్మవికాసము కలుగుతుంది.

* మూల [యే, యో, బా, బీ] *

ఈ వారము మీకు అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ. రావలసిన డబ్బు చేతికి అందక అశాంతి, బంధువుల రాకపోకలవల్ల ఖర్చులు ఎక్కువ. కోర్టు వ్యవహారములు కొంతవరకూ అనుకూలిస్తవి. పరులకు చేయదలచే సహాయము చేసేందుకు అవకాశములేక మాటపడతారు. ఉద్యోగస్థులకు కొత్త పనులవల్ల కార్యభారము ఎక్కువ. వర్తకులకు వ్యవహారముపట్ల పేచీలు. 8వ భార్య అనారోగ్యమువల్ల మనోవ్యధ. విద్యార్థులకు బద్ధకముచే చదువు బాగా సాగదు.

* పూర్వాషాఢ [బూ, ధ, భా, ఢా] *

మీ ఆలోచనలు కార్య రూపమునకు వచ్చేందుకు కలిగే ఆటంకములకు నిరుత్సాహపడకుండా పట్టుదలతో ప్రయత్నించి తుదకు కార్యసిద్ధి పొందుతారు. సమయానికి సొమ్ము అందక అప్పు చేయవలసి వస్తుంది. కాని వారాంతమునకు తీరుస్తారు. 8వ యంత్రములవల్ల గాని, అగ్నివల్ల గాని, ఎత్తయిన స్థలములనుండి పడుటవల్ల గాని కలిగే గాయాలు జాగ్రత్తవల్ల తప్పవచ్చును. రసాయనిక శాస్త్రజ్ఞులకు లోహపు సామానులు, రంగుల వ్యాపారస్థులకు, గనుల యజమానులకు కష్టంతో కూడిన యోగము. ఇంజనీరింగు శాఖ యోగ్యులకు, యంత్రములు నడుపు నిపుణులకు యోగకాలము.

* ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ] *

ఈ వారము మీకు ధనయోగము, వ్యవహారాలలో జయము, శుభ కార్యాలలో పాల్గొంటారు. బంధుదర్శనము, విద్యాప్రాప్తి. నూతన కార్యలాభము. ఈశాన్య దిక్కునుండి శుభవార్తతో ఉత్తరములు వచ్చుట, జ్ఞానమార్గ ప్రసంగములు, యుక్తిగ ప్రసంగించుట, గణిత జ్యోతిష శాస్త్ర చర్చలు, సుఖభోజనము వంటి మంచి ఫలితాలు కలుగుతాయి. ప్రత్తి, దూది, నూలు, వస్త్రములు, ఇత్తడి, కంచు మొదలగు సరుకుల వ్యాపారస్థులకు లాభము. నటీనటులకు మేలుకాలము. విద్యార్థులకు చదువు సరిగా సాగుతుంది.

* శ్రవణము [జూ, జే, జో, ఖా] *

ఈ వారము శుభకార్యములలో పాల్గొనటం, పుత్రప్రాప్తి సూచనలు, ధనలాభము, భాగ్యవృద్ధి, బిరుదులు పొందుట, ప్రభుత్వ సన్మానము, ఘనకార్యాచరణ, పుణ్యకార్యములు చేయుట, పుణ్యక్షేత్ర సంచారము, వైద్య జ్యోతిషశాస్త్ర ప్రసంగముల వంటి మంచి యోగములు కలుగును. విద్యార్థులకు పండితులకు న్యాయవాదులకు, న్యాయస్థాన ఉద్యోగస్థులకు మంచికాలము.

* ధనిష్ఠ [గా, గీ, గూ, గే] *

ఈ వారము మీరు వినోదాలలో పాల్గొంటారు. బంధుమిత్రులతో కలిసి వెండిపాత్రలలో దధి, క్షీర మధుర పదార్థయుక్త సుఖభోజనము చేస్తారు. నీటిమీద ప్రయాణము, తలపెట్టిన పనులలో జయము, తెల్లని వస్తువులు కొనుటవంటి మంచియోగములు కలుగును. ప్రత్తి, దూది, నూలు, ఖద్దరు, వెండి, ద్రవపదార్థ జన్యముల క్రయవిక్రయములలో వర్తకులకు లాభము. ఈవారము మానసికాందోళన వున్నా అలంకారప్రాప్తి, విందు వినోదములు కలుగును. కవులకు, గాయకులకు, నటీనటులకు మేలుకాలము. విద్యార్థులు బాగా చదువుకుంటారు.

* శతభిషం [గో, సా, సీ, సూ] *

ఈ వారము ధనధాన్య వృద్ధి, పశువృద్ధి కలుగును. కష్టము ఫలించును. వివాహాది శుభకార్యములలో పాల్గొనుట, ఇష్టవస్తు లాభం, పరోపకారంవల్ల కీర్తి మొదలగు రాజయోగములు కలుగును. విద్యార్థులు వినోదములలో పాల్గొన్నా చదువు బాగా సాగుతుంది. వర్తకులకు బంగారము నవరత్నములువంటి విలువగల వస్తువుల క్రయవిక్రయములలో లాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలం.

* పూర్వాభాద్ర [సే, సో, దా, దీ] *

ఈవారము మీకు కార్యభారం ఎక్కువ. ఆరోగ్యము సరిగాలేని సూచనలు కనబడగానే గ్రహరాజైన రవికి శాంతి చేయుటవల్ల మేలు కలిగించును. ఔషధచికిత్స కూడ పొందుట మంచిది. ఉద్యోగస్థులకు కొత్త సమస్యలు, వర్తకులకు ఆందోళన. విద్యార్థులకు చదువు సరిగా సాగదు. పితృవర్గమునుండి సహాయము, ప్రయాణము, కార్యభారము కలుగును. 8వ ఆరోగ్య భంగము, రాజకీయ వాదులకు ఆందోళన, అధిక ఖర్చులు.

* ఉత్తరాభాద్ర [దూ, శం, ఝా, థా] *

ఈ వారము అనుకున్న సొమ్ము సకాలంలో చేతికిరాదు. కార్యాచరణకు పాలుపోని అనిశ్చిత స్థితిలో ఉంటారు. చేదామనుకున్న పనులకు ఆటంకములు కలిగినా వారాంతమునకు మిత్రసహాయమువల్ల కార్యలాభము కలుగుతుంది. ఉద్యోగస్థులకు వన పర్వత ప్రాంతములకు బదిలీ అయ్యే సూచన లున్నవి. ప్రయాణము, విదేశీయుల పరిచయం, విచిత్ర వస్తు సంపాదన, మిత్రుల సహాయము కలుగును. 2వ ఆప్తుల ఆరోగ్యమును గురించి చింత. విద్యార్థులకు చదువు బాగా సాగదు.

* రేవతి [దే, దో, చా, చీ] *

ఈ వారము మీకు మిశ్రమయోగము. అనుకున్నట్టుగా పనులు జరుగవు. కోరిన సహాయము సకాలమున లభించదు. అవసరములు తీరక ఆందోళన కలుగుతుంది. దైవము పై భారము వేసి కార్యసాధనకు ప్రయత్నించి ఫలము పొందుతారు. వర్తకులకు చాలాకాలమునుండి నిలిచిపోయిన బాకీలు వసూలవుతవి. స్వార్థప్రసంగములవల్ల ఉద్యోగస్థులు అధికారుల ఆగ్రహమునకు లోనవుతారు. పుణ్యపురుషుల సాంగత్యము, ఆత్మవికాసము, శాంతి, పుణ్యక్షేత్ర సంచారము, దేవతాదర్శనము, నష్టద్రవ్య లాభము కలుగును. 8వ ఇంట్లోవారి అనారోగ్యముచే చింత. విద్యార్థులకు చదువు బాగా సాగదు. ★

వనితాలోకం



వనితలూ; వ్యక్తిత్వాలూ

వారికి కొన్ని సలహాలు

జంతు శాస్త్రంలో చెప్తారు—వెన్నెముక లేని ప్రాణులు భూమి మీద నిటారుగా నిలబడ లేవని. కాని ఈ నిలబడే విధానంలోనే మనిషియొక్క మన సత్వం వెల్లడవుతుంది. నలుగురి ఆడవాళ్ళమధ్య నున్నప్పుడు మనస్థానాన్ని గుర్తించుకుని, నిలబెట్టుకోవడమే తెలివిగా నుండడమంటే. అలాగని చెప్పి గడకర్రలా నిలుచుని మాట్లాడితే చాలదా అనుకోవచ్చు. దీనికంటే పొరపాటింకొకటుండదు. చాలమటుకు మన ప్రవర్తనద్వారాకూడ మన గాంభీర్యాన్ని వ్యక్తం చెయ్యవచ్చు.

ప్రతీస్త్రీ, పదిమందిలో సంచరించవలసి వచ్చినప్పుడు తన వ్యక్తిత్వాన్ని ప్రదర్శించాలనుకోవడం సహజమే! ఒక్కొక్కప్పుడు ఆ ప్రదర్శనలోనే కాస్త అహంభావాన్ని వెల్లడిచేస్తుంది. కొన్ని సమయాల్లో కొందరి ప్రవర్తన మనిషిహుందాగాలేక గంభీరంగా ఉంది — అన్న అభిప్రాయానికి బదులుగా "చాలగర్వం! ఎంత టెక్కు!!" అన్న అపోహకి దారితీస్తుంది.

"స్వానుభవం"

పైవిషయంలో నేను మోసపోయానని చెప్పాలి. మాయింటి కొంతదూరాన నా ఫ్రెండ వచ్చింది. ఒక్కర్తే రాలేదు—తనతోకూడ చిన్న సైన్యాన్ని వెంటపెట్టుకుని నామీద దండెత్తేందుకు వచ్చానని చెప్పింది. అవిడ చాల హాస్యంగా, మాటల్ని చక్కగా తొప్పించి మాట్లాడుతుంది. అముకూ ముఖం ఎరగనివాళ్ళని మర్యాద చెయ్యడంలో సతమతమయ్యానంటే నమ్మండి. వాళ్ళైనా నా ఫ్రెండ్ తో మాట్లాడుతారేగాని, నన్ను మాత్రం మాట్లాడించకలిపోను, పరిచయం లేందే నేనసలు మాట్లాడలేను. అలాంటిది ఒకవేపుని పని సవరించుకుంటూ, వాళ్ళతో మాట్లాడేసరికి, నాకు ఉక్కిరి బిక్కిరయినటనిపించింది.

పోతే, వాళ్ళు చదువుగాని, సంస్కారం అలవడని అజ్ఞానులనేందుకూ వీలు లేదు. సభ్యత తెలిసినవారే! చాల అధునాతనంగా ముస్తాబయ్యారు. చేతిలో వేనిటిబేగ్ ప్రతి

కుమారి ఎస్. వాణి

వాళ్ళకీ ఉంది. వెళ్ళిపొయ్యేటప్పుడు నా ఫ్రెండ్ మాత్రమే చెప్పింది. ఎదుట నేనున్నాననైనా లక్ష్యపెట్టలేదు వాళ్ళు. వెళ్ళేటప్పుడైనా మాట్లాడుతారనుకున్నాను. వాళ్ళు వెళ్ళింతర్వాత చాల కష్టమనిపంచింది నాకు. పోనీవెళ్తున్నామనైనా చెప్పలేదే అని క్షోభించాను.

"ముఖాముఖీ"

ఆ తర్వాత వారంరోజులకి నా ఫ్రెండ్ దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. ఒకఊర్లో నే ఉన్నా మాయిల్లు వాళ్ళింటికి చాలదూరం గాబట్టి మేం తరుచు ఉత్తరాలు రాసుకుంటుంటాం. వాళ్ళంతా నాకు చాల గర్వమనుకున్నారట. "ఎంత గ్రేడ్యుయేటయితే మాత్రం ముఖం చూసి మాట్లాడక్కర్లా! ఏదో గోడతో మాట్లాడుతున్నట్లు లెక్కలేకుండా మాట్లాడింది. చాల టెక్కు అవిడకు" అన్నారట.

ఉత్తరం చదివింతర్వాత చాల విచారించాను. ఎంత ఆలోచించినా నా తప్పని నా మనస్సాక్షి అంగీకరించలేదు. ఏం చెయ్యను - అంతమంది నామీద నేర మారోపించినప్పుడు ఒప్పుకోక తప్పదుగా, "పగుకురాడుమాట పాటియై..." అక్షరాల నిజమైంది. పని తొందర్లో ఉండి నిజంగా నేను ముఖాముఖీ మాట్లాడలేదు. పోనీ పని వదిలేసి మాట్లాడేందుకు సంకోచమాయిరి. ఆ తనిసాకుతో మాట్లాడేందుకు ప్రయత్నించడమే అంత అనర్థానికి దారితీసింది. మాట్లాడకుండా చిరునవ్వుతో వాళ్ళని చూస్తూ ఉండపోయినా సరిపోయేదేమో! వాళ్ళే పలకరించే వాళ్ళేమో!

ప్రౌఢా వ్యాకరణం

"ట" కారాలు

"ఇదుగో మొన్నరాత్రి పార్వతమ్మ కూతురూ రెండోకంటికి తెలీకుండా బందరు వెళ్ళారు'ట' గా"

'ఎంచేతటా'

'ఏ నోవమ్మ-నా కెందుకొచ్చినతంటా. అయినా అడిగావు గనక చెప్పకతిప్పదనుకో.

'ఇంతకూ ఏవిటేటా'


'ఈ కాలేజి చదువుల్తో వివచ్చింతొంటా. లేడీ డాక్టర్ కి చూపాలని తీసికెళ్ళిందిట పార్వతమ్మ. మొన్నవిరభద్రం చెప్పాడు'ట' ఎవరితోనో. లేకపోతే పరీక్షలు కొకుండా కూతురు పరుగెతుకు రావటానికి

ద్విరుక్త'ట'కారాలు

'ఎంగుకండీ అమ్మాయిని అట్టాకట్టాడతారు.-వయసొచ్చిన పిల్లగదా.

'వయస్సొచ్చిన పిల్లగనకే ఆ జ్ఞానం నీకూడానికి ఉన్నట్టాలేనట్టా-ఇది బళ్ళో చేస్తున్న ప్రవర్తనకు తలగొట్టేసినట్టు దస్తున్నా ఆ వీరభద్రాన్ని అడుగు దీని సంగతి'

అయ్యో మీ ఉప్పలాయి కూలిపోను. కక్కడి గోల. వాడి కళ్ళల్లో నిప్పులు పోసు కొరుకూతలు కూశాట్ట! ఈయన బంధువు మాడు. వాడికేం గోగం మొన్న పార్వతమ్మ కూతుర్ని గురించీ పిడే ఊరంతా ప్రకాశ్ఞ ఘటించాట్ట' వాడిమాటలా నమ్మటం!"



ఎప్పుడూ ఇంతే—2. —శంకర్.

"గాలంలాంటిది"

చిరునవ్వంటే కాస్సేపు మందహాసముఖారవిందంతో చూసి వెంటనే దిక్కుతోచక, చప్పగ ఊరుకుండిపోకూడదు. కాదా? ఒక నిముషమన్నా ఉండాలి. మా వదిన ఎవర్ని చూసినా ముందు పలకరించదు. ముఖమంతా నవ్వుతున్నట్టే, కళ్ళతో పలకరిస్తున్నట్లుంటుంది. పెదాలు ఏవో మాట్లాడబోయి సందర్శనభాగ్యంతో అవాక్కయినట్లు చలిస్తాయి. ఇహ... ఇటువంటి పోజులో ఎదటివాళ్ళే ముందు మాట్లాడేస్తారు. ఆ చిరునవ్వే ఎదుటివారి మనస్తత్వానికి గాలంలా పని చేస్తుంది. అటువంటప్పుడు మన మేముందుగా లొంగిపోవలసిన అవసరముండదు.

"ఆఁ,' 'ఊఁ' లు"

అలాగని చెప్పి ఎదుటివాళ్ళు పలకరించిన తర్వాత ముక్తసరిగా ఎంచి తూచి సమాధానాలివ్వకూడదు. మన చిరునవ్వు మన 'డిగ్నిటీ'ని మాత్రమే నిలబెడుతుంది. సంభాషణలోకి దిగిన తర్వాతకూడా—ఇంకా నవ్వుతూ పొడిపొడి జవాబులిస్తే—మనమెంతో గర్వంగా మాట్లాడుతున్నామనుకుంటారు.

మచ్చుకిలాంటిదే ఈమధ్యన జరిగింది. నేను మా పిన్ని (నాకంటే చిన్నది లెండి!) సినిమాకెళ్ళాం. మేం కూర్చున్న అయిదు నిముషాలకల్లా మా పిన్నికి తెలిసిన ఫ్రెండు, ఆవిడ భర్తా వచ్చారు. కాస్సేపయిన తర్వాత ఆవిడ తన భర్తని పరిచయం చేసింది. 'నమస్కారమం'టే 'నమస్కారం' అనుకోవడం యథావిధిగా జరిగింది. ఆవిడభర్తది చాల పెద్దమనిషి తరహా. తనభార్యతోనే మాట్లాడడం సబబుగా ఉండదని అందరితోనూ సమంగా మాట్లాడాడు. మా పిన్నిమాత్రం అతనితో మాట్లాడేటప్పుడు ఆఁ ఊఁ అనడం మినహాయించి పల్లెత్తి ఒక్కమాటన్నా మాట్లాడలేదు. ఒక్కొక్కప్పుడు బుర్రాడించే సమాధానం చెప్పేది. నాకు చాల కోపమొచ్చింది. అక్కడే చివాట్లేద్దామనుకున్నాను.

"అవతలి పెద్దమనిషి మాట్లాడేటప్పుడు తలూపుతూ, "ఊఁ ఆఁ" అని అంటే అతనికి కష్టమనిపించదూ? అంతకంటే అవమానముంటుందా? ఈమర్యాదా కొత్తగా నేర్చుకున్నావా?" అని ఇంటికొచ్చినతర్వాత కూకలేశాను.

"ఆఁ పరవాలేదులే–అతనడిగిన ప్రశ్నలూ అలాగే ఉన్నాయి." అంది నిర్లక్ష్యంగా, ఆ మాటా నిజమే. అతని ప్రశ్నలన్నీ కుశల ప్రశ్నల్లాంటివే. అయినా ప్రతిదానికీ ఒకే విధంగా సమాధానమిస్తూ బుర్రాడించడం (గంగిరెద్దులా కాకపోయినా) సభ్యత కాదు, సాధ్యమైనంతవరకూ కల్పించుకునైనా సరే, తృప్తికరమైన సమాధానాలిచ్చేందుకే ప్రయత్నించాలి.

"మెత్తగా ఉంటే...."

చాలమంది నలుగుర్లో ఉన్నప్పుడు తమెంతో తక్కువన్నట్లు బాధపడుతారు. వాళ్ళ కన్నీ లక్షణాలూ ఉంటాయి. రాణించే అవకాశాలూ లభిస్తాయి. చుట్టూ ఉన్నవాళ్ళంతా తననే పరీక్షిస్తున్నారన్న అపోహతో వ్యవహారం చెడిసికొట్టుంది. 'ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్' అంటారే–అది మనిషిని పురుగులా దొలుస్తుంది. కొత్త కళ్ళతో నలుగుర్నీ చూసి ధైర్యంగా ఉండడం చేతకాకపోతే లోకువ చూసుకుని తాటాకులు కట్టేవాళ్ళూ ఉన్నారు. అసలు మెత్తగావున్నవాళ్ళని చూస్తే మొత్తబుద్ధవుతుంది.

ఆ మధ్యన మా అమ్మగారి చిన్నప్పటి స్నేహితురాలి కూతురు వాళ్ళు కొత్తగ ట్రాన్స్ఫరై వచ్చారని తెలిసి చూసేందుకెళ్ళాం. కొత్త సంసారం. ఆ అమ్మాయికి లోకానుభవం లేదు. చెవుడికి మూగ తోడైనట్టు గట్టితన మసలే లేదు. చుట్టుప్రక్కలవాళ్ళంతా తననే పరిహసిస్తున్నారని అనుమానపడి కుళ్ళుకునే రకం. తనూ భర్తా సినిమాకి వెళ్తాంటే ఇరుగు పొరుగు అమ్మలక్కలు కిసుక్కున నవ్వారని రోజంతా ఉపవాసముండదట. మే మున్నంతసేపూ ఇదే వరసలో మాట్లాడింది. తన గోడు వెళ్ళబోసుకున్నతర్వాత కాస్త స్థిమితపడింది. మా అమ్మగారు శతవిధాల బోధించారు. తన నీడని చూసి భయపడేవాళ్ళని ఎవరుమాత్రం ఏం చెయ్యగలరు? అటువంటివాళ్ళు కాస్త స్థిమితంగా తమలోపా లేమిటో వెనుతిరిగి చూసుకోరు.

"తెలిసినట్లు...."

కొంతమందుంటారు. ఏమీ తెలీకపోయినా–తెలిసినట్లు నటిస్తూ అసలు ఎదుటివారిలో మనకు లేని సుగుణాలుగాని, మనకు వచ్చిన గుణాలుగాని ఉన్నాయని తోచినప్పుడే వాళ్ళంటే ఇష్టపడతాము. మన యిష్టమే వాళ్ళమీది గౌరవాన్ని పెంపొందిస్తుంది.

ఏ సంగతీ తెలీనప్పుడు తెలిసినట్టు మాట్లాడడంతో తమనందరూ గుర్తిస్తారనుకోవడం పొరపాటు. అలా మాట్లాడి ఉన్న గౌరవాన్ని ఊడగొట్టుకుంటారు. అచ్చు ఇలాగే ప్రవర్తిస్తుంది – మాకు తెలిసిన ఆఫీసరు పెళ్ళాం. ఆవిడతో ఓసారి సినిమా కెళ్ళాం. తెలిసినవీ, తెలీనివి గొప్పగా కోసేస్తోంది. సరిగా అదే

ముందు జాగ్రత్త

టీచర్: ఏమయ్యా! మూడు నెలల పరీక్షలలోనే కాపీ చేస్తున్నావ్!

విద్యార్థి: యూనివర్సిటీ పరీక్షలలో దడ రాకుండ కాపీచేయడానికండీ!

సమయానికి హీరో చిన్న లెక్చరిస్తున్నాడు. మా పిన్నిగారు సన్నివేశం నచ్చక "ఛీ! వెధవకి మాట్లాడడం రాదు. ఏడి 'మొనాటనస్ స్పీచ్‌'తో తలనొప్పి పట్టుకుంది" అంది. ఆఫీసర్ భార్య అందుకుంది. "అవునండీ! ఎండలో వచ్చాము. మేటినీ కదూ, నాకు తల భారంగానే ఉంది. సమయానికి మోటారు (సిటీ బస్సుకలా అంటుంది) తప్పిపోయింది. మా కారులో వద్దామనుకుంటే, దాని 'స్పీడ్' తగ్గిందని బెంగుళూరికి తీసుకెళ్దామనుకున్నాం."

ఆవిడ కారుని గురించి మేము మాట్లాడామనుకుంది గాబోలు, "మొనాటనస్"కి మోటారు "స్పీచ్"కి "స్పీడ్" ఎంత చక్కగా అన్వయించింది! ఆవిడకి ఇంగ్లీషు రాదని మాకు తెలుసు. తెలిసినట్లు, ఎంతో బాగా అర్థమయినట్లు మాట్లాడబోయి బోల్తా కొట్టింది. ఆవిడ 'మొనాటనస్ స్పీచ్'ని ఎంత బాగా అవగాహన చేసుకుందీ అర్థమయ్యేసరికి నవ్వాగలేదు. కడుపులు మాకు కిరణ్యమయ్యాయి. ప్రతీదానిలో అతి తెలివి ప్రదర్శించబోయి ఉన్న పరువు కాస్తా పోగొట్టుకుంటారు. అటువంటి పరిస్థితుల్లో నోటిని కాస్త అదుపులో పెట్టుకోవడం అలవాటు చేసుకోవడం ఉభయత్రా శ్రేయస్కరం. అతి అన్నిటికీ అనర్థమే!

'ఎవరిపరిధిలో వారు'

కొంతమంది స్త్రీలు తోటి స్త్రీలతో బాగానే వ్యవహరిస్తారు. ఎటొచ్చి రోడ్డు మీద నడిచేటప్పుడు, షాపింగ్‌కి వెళ్ళేప్పుడు తమని అందరూ గుర్తించేట్లు ఎబ్బెట్టుగా సంచరిస్తారు. పురుషులు పైకి ఎంతో మెప్పుదల చేస్తున్నట్లు కనిపించినా లోలోపల మాత్రం ద్వేషిస్తారు. కాలేజీలో చదువుకునే రోజుల్లో మేం రెండు తెగలుగా ఉండేవాళ్ళం. ఐదుగురు మాత్రం మా నుంచి వేరుగా ఉండేవారు. మొగవాళ్ళతోటి చాల చనువుగా ఉండడంచేత లేడీస్ రూముకి వాళ్ళకోసం ఆ సమానం వాళ్ళ మగ ఫ్రెండ్స్ వచ్చేవారు. అప్పుడప్పుడు మేం అసూయ చెందేవాళ్ళం కూడా! కాని అంతమాత్రం చేత వాళ్ళ ప్రవర్తన అసభ్యంగా ఉందని మేమెప్పుడూ అనుకోలేదు. ఒక కాలేజీ వదిలిపెడ్తామనంగా విద్యార్థులంతా ఆటో గ్రాఫు" వేటకి బయల్దేరారు. మా దగ్గరి కొచ్చాడు, యూనియన్ సెక్రటరీ.

"అయితే మా విద్యార్థినులంతా పెట్టారు" ఉంగుకో కొంటెగా అడిగింది మా జట్టులోని అమ్మాయి, మీ ఆటోగ్రాఫు కూడా ఇవ్వండీ' అని.

"ఆఁ చూద్దాం లెండి," అన్నాడతను. "వాళ్ళదగ్గర కెళ్ళకుండా ముందే మా దగ్గరి కొచ్చినట్లుందే" ఇంకాస్త రెట్టించింది.

ఆ అబ్బాయి కొంచెం తటపటాయించి అన్నాడు. "వాళ్ళతోటి సరదాగా మాట్లాడడం వాళ్ళమీది మోజుచేత గాదు. నిండు కుండ తొణకదంటారు. ఎవరి పరిధిలో వాళ్ళుండడం ఉభయులకీ మంచిది."

అతని మాటలు మాకేమీ అర్థం కాలేదు. ఏ పనికీ ధైర్యంగా ముందడుగు వెయ్యలేని మామీద వాళ్ళకటువంటి సదభిప్రాయం కలగడం చిత్రంగా తోచింది. కాని అంత స్నేహంగా ఉండి, మా ఫ్రెండ్స్‌మీద ఆఖరుకలాంటి తుచ్ఛమైన అభిప్రాయం వెలిబుచ్చాడే అని విచారించాం. తోటి స్త్రీలతో సంచరించినంత చనువుతో పురుషులతో ఉండకూడదన్న గుణపాఠాన్ని పరోక్షంగానైనా నేర్పినందుకు లోలోపనే అభినందించాం.

'అవతలివాళ్ళు?'

పోయినసంవత్సరం మా చిన్న వదిన పెళ్ళికి వెళ్ళాం. అది పల్లెటూరికీ, పట్టణానికీ మధ్యస్థంగావున్న ఊరు! పెళ్ళయి మూడోరోజు నాయుడు వాళ్ళ మంతా షాపింగ్‌కి బయల్దేరాం. అందరూ సాధ్యమైనంత ఆడంబరంగానే తయారయ్యాం. మా వదిన చెల్లెలు ఏదో చీర బేరమాడుతోంది. బేరం కుదిరేట్టు లేదు. ఇరవిషయమై యజమాని నడుగుతున్నాడు గుమాస్తా. ఇంతలో తోటి గుమాస్తా కలగజేసుకుని వాళ్ళభాషలో ఏదేదో వాగేశాడు. సమంగా అర్థం కాకపోయినా భావంమాత్రం తెలిసేసరికి నాకు తల తీసేసినంతపనైంది. మావాళ్ళ అలంకరణనీ, ప్రవర్తననీ అంత అసభ్యంగా అర్థంచేసుకున్నాడంటే, మా వదినదే దానికి కారణం. వాడెవడో అనుభవంలేని గుమాస్తా కాబట్టి మేము షాపు దాటకముందే అనేశాడు. మేమిచ్చిన లోపువే అంత అనర్థానికి దారితీసింది. తోటిస్త్రీలతో సంచరించేటప్పుడుకంటె, బయటి పురుషులతో మెలగవలసివచ్చినప్పుడు కాస్త జాగ్రత్తగా ప్రవర్తించి మన హుందాని నిలబెట్టుకోవచ్చు.

ఋణానంద లహరి
(15-వ పేజీ తరువాయి)

జన్మలూళా లీలా ఫిరాయించగా లేందిపేటు ఫిరాయించడానికేముంది...అదిగాక, అక్కల్లు స్నేహమైతే వారు వీరవుతారని మీరే అన్నారుగా. మళ్ళీ బేరాలాడదాం అక్కల్లపాటు. అప్పుడు వళ్ళీ మీరు మేమూ, మేము మీరూ, మీరు మారూ, మేరు మూరూ, మూము మేమూ, మూమె మే మే...

అఋణ కిరణుడు సవ్యకుని కొండచాటుకి పోగానే, ఋణకిరణుడు ఇవతలికి వచ్చి ప్రతాపం వెలిగిస్తున్నాడు. మళ్ళీ, అప్పిచ్చినవాడొచ్చి మండిపడేవరకూ నిశ్చింత.

*　　*　　*

సూర్యుడు సముద్రుడిదగ్గిర అప్పు తీసుకుంటున్నాడు. ఆయన దగ్గరనుండి భూమి అప్పు తీసుకుంటోంది. దాన్ని సముద్రుడు వసూలుకుంటున్నాడు; మళ్ళీ పైవాడికి అప్పు లిస్తున్నాడు.

ఋణభ్రమణం దా ఋణంగా సాగిపోతోంది...

ఫలశ్రుతి

ఋణానందలహరి చదివిన వారికి అప్పులు చేసే ట్రిక్కులు కొన్ని తెలియును. ఎన్నో స్ఫురించును. కాని, ఒక చదివినవారిమీద ఇంకొక చదివిన వారు ఇందులో తాము ట్రిక్కులనుకున్నవి ప్రయోగించడం గిట్టుబాటైన పని కాజాలదు. ఒక చదవనివాడు, ఇంకొక చదవనివాడి దగ్గర ఈ ట్రిక్కులు తెలిసి ప్రయోగించే అవకాశం ఉండదుకనక చెప్పేదేం లేదు. ఒక చదవని వాడు ఒక చదివిన వాడిదగ్గర ప్రయోగించడమూ అంతే. కాబట్టి ఒక చదివిన వాడు ఇంకో చదవని వాడిదగ్గర (దొరికితే) ప్రయోగించవచ్చు. కాని, అవి చెల్లుబడికాకపోవచ్చు. అందువల్ల ఒక చదివినవాడు ఇంకో చదివిన వాడితో చేరినప్పుడు, దీన్ని గురించీ, ఇంకా ఇతర ఋణవాక్యాల గురించి కాసేపు మాటాడి ఛలోకులాడి, చివర్ని సూటిగా అడిగేస్తే మంచిది. అప్పుదొరకడం, దొరక్కపోవడం వేరే సంగతి. (అయిపోయింది)

"మోతాదులో...."

అలాగని చెప్పి పిలిస్తే పలకకపోక మాట్లాడకపోతూంటే నిర్లక్ష్యంగా [illegible] లాంటివి స్త్రీ ఆధిక్యతని పెంపొందనీయవు. సమయాసమయాల్ని బట్టి, పరిస్థితులననుకూలంగా ప్రవర్తిస్తే ఏదైనా రాణిస్తుంది. మితాన్ని మోతాదులో సహజరీతుల్లో ఉపయోగిస్తే ఎవరికీ హానికలుగదు. ★

ఆలనా - పాలనా:

పిల్లల పెంపకం-తల్లుల బాధ్యత

సాయంకాలపు చల్లనిగాలి మనసుకు హాయిగా వుంది. కిటికీదగ్గరగా నిల్చుని, సన్నజాజిపూల సౌరభాన్ని ఆస్వాదిస్తూ అస్తమిస్తున్న సూర్యబింబపు రామణీయకతను ఆస్వాదిస్తున్నాను. క్రిందనుండి పిల్లల కేరింతలు నా దృష్టి నటు లాక్కున్నాయి. తదేకధ్యానంతో వాళ్ళవైపే చూస్తూ, వాళ్ల ఆనందంలో పాలుపంచుకుంటున్నాను. ఎప్పుడొచ్చిందో ఏమో సుహా నా ప్రక్కగా నిల్చుని కళ్ళెత్తి నిక్కి నిక్కి చూస్తుంది- ఆనందంతో చిందులుత్రొక్కే ఆ పసిపాపల వేపు.

'ఏమ్మా! నువ్వూ వెళ్ళి ఆడుకోరాదూ?" సుహా తల నిమురుతూ అన్నాను.

"అమ్మ వొద్దంది" విచారంగా అంది సుహా.

"ఎందుకనీ........"

"వాళ్ళతో ఆడకూడదట."

"సుహా నా కళ్ళల్లోకి ఆశగా చూసింది నేను వెళ్ళమని చెప్తానేమోనని. నా అసహాయతకు బాధగా భారంగా మూలిగాను.

'అత్తయ్యా! వెళ్ళనా' సుహా లేని నవ్వును తెచ్చిపెట్టుకుని అడిగింది.

"ఉహూ వెళ్ళొద్దు. అమ్మ వద్దంటే ఎలా వెళ్తావ్" సుహా విచారంగా వెళ్ళిపోయింది.

వదిన మనస్తత్వం నాకు క్రొత్త కున్నా, యీ విషయంలో వదినను గురించి విచారించకుండా వుండలేక పోయాను. చదువూ, సంస్కారమూగల వదిన, క్లబ్బుల్లో ఉపన్యాసాలివ్వ నేర్చిన వదిన యిలాంటి సంకుచితభావాలతో సతమతమవడము ఆశ్చర్యకరమైన విషయమే! ఉపన్యాసాలివ్వడమూ-వాటిని ఆచరణలో పెట్టడమూ-యీ రెంటికీమధ్య ఉత్తరదక్షిణ ధృవాలకున్నంత భేదముంది. చెప్పినదంతా ఆచరణలో పెట్టడం ఏ మహాత్ములకో తప్ప అందరికీ సాధ్యమయ్యేపని కాదు. ఈ విధంగా వదినశిక్షణలో పెరిగిన 'సుహా' అహంకారమూ మూర్తీభవించిన మనోజ్ఞమూర్తిగా తయారవడానికి వలసినంత అవకాశముందనే తలపు రాగానే నా హృదయం చివుక్కుమంది.

ఇంత ఉపోద్ఘాతం ఎందుకంటే బిడ్డల శిక్షణకు తల్లుల బాధ్యత ఎంతవరకూ అని. యీనాటి బోసినవ్వుల పసిపాపలే రేపటి రాజ్యాంగరథాన్ని నడిపే పౌరులని మన కందరకూ తెలిసిన విషయమే. భావిపౌరులను తయారు చెయ్యడంలో తల్లులబాధ్యత ఇంతా అంతా అని చెప్పలేము. దేశభవిష్యత్తు భావి పౌరులమీద ఆధారపడివుంది అనడం - పరోక్షంగా తల్లులమీదే దేశభవిష్యత్తు ఆధారపడి వుంది అని చెప్పకోవచ్చు!

భావిపౌరుల శిక్షణలో తల్లి కింత ప్రాముఖ్య మెందుకిచ్చాము అనే ప్రశ్న రాకపోదు. "పాపని ప్రాథమిక పాఠశాల గృహము" అనే సూక్తి వుంది. ఇక గృహమనే పాఠశాలకు ప్రధానోపాధ్యాయిని తల్లి. జీవనోపాధికై ఉదయంవెళ్ళి సాయంకాలం ఇంటికి చేరుకునే తండ్రికి-అనుక్షణమూ తన ఒడిలో లాలించే తల్లికున్నంత ప్రాముఖ్య ముండదు. అనురాగపూరితమైన తల్లి ఆలనా-పాలనలో ఆట-పాటలలో, అ, ఆ, ఇ, ఈ లనేగాక ఉత్తమపౌరున కుండవలసిన సద్గుణ

'పద్మశ్రీ'

లతకు బీజాన్ని నాటుకునే అవకాశమెంతేని వుంది.

అయితే ఏవిధంగా తల్లి ఈ సద్గుణవల్లరికి బీజాన్ని నాటవచ్చు? శివాజీ అంతగొప్పవాడయ్యాడంటే జిజియాబాయి ముఖ్యకారణమని చరిత్ర మనకు చెప్తుంది.

సానుభూతి, సహకారము, సమానత్వము, న్యాయము, దయ, త్యాగము మొదలగు సద్గుణాల నన్నింటిని, తల్లి తన పాఠశాల అయిన గృహంలోనే నేర్పవచ్చు.

ఉదాహరణకు చిన్నపిల్లకు ఏ మేనత్తో పిన్నమ్మో వస్తూ రెండు బొమ్మలు తెస్తుందనుకోండి. లేక యిద్దరికని తెచ్చినా ఎదురుగా వచ్చిన చిన్నదాని చేతుల్లోనే పెడ్తుందనుకోండి. ఇక పెద్దపిల్ల 'గీ' మంటుంది. "అహ! పిన్ని నా చేతికే ఇచ్చింది యివి నావి" నంటుంది చిన్నపిల్ల. నాకూ కావాలంటుంది పెద్దపిల్ల. ఇక తల్లి తప్పనిసరిగా కలుగజేసుకోవాల్సివస్తుంది. చిన్నపిల్లను నాల్గుతిట్లో, పెద్దదానిని నీ కెందుకని గదమాయించో నానాభీభత్సం చెయ్యక, వాళ్ల కునవ్వు చెప్పాలి. "మాడు-చిట్టీ! రెండు బొమ్మలు నువ్వు తీసుకోవడం తప్పుగదూ? నీ కొకటుంటే అక్కయ్య కొకటుండొద్దూ! మా చిట్టి బంగారమ్మ! ఒకటి అక్కయ్య కివ్వవూ?" అంటే ఆ పిల్ల తప్పకుండా ఇస్తుంది. 'అవును నా కొకటుంటే, అక్కయ్య కొకటుండాలనే న్యాయబుద్ధి చిన్నతనంనుండీ పెంపొందుతుంది. సరే బాగుంది! చిన్నతనంలో అంటే యిచ్చింది గానీ పెద్దయ్యాక కూడా అలా యిస్తారా? రెండు మేడలున్న ఆసామీ బాధపడుతున్న పేదవానితో "నువ్వొకటి, నేనొకటి తీసుకొందామంటాడా?" అంటే నేను జవాబు చెప్పలేను. కాని చిన్నతనంలో హృదయంలో నాటుకున్న ఆ న్యాయబుద్ధి, పెద్దయ్యాక అక్రమసంపాదనకూ మరే యితర అన్యాయాలకు దారితీయదని నేనంటాను.

మరో ముఖ్యవిషయం మనం ప్రతియింట్లోనూ చూచేది—పిల్లల ఫిర్యాదులు. "అవును నాన్నకు చెల్లెలంటే యిష్టం" అంటాడు పెద్దబ్బాయి "అమ్మకు అన్నయ్యమీద ప్రేమ" అంటుంది చిన్నపిల్ల. "నేనంటే ఎవరికీగిట్టదు" అంటుంది మధ్యలో పిల్ల. ఎందుకు పిల్లలిలాంటి ఫిర్యాదులు చేస్తారు? వీళ్ళమాటల్లో ఎంతవరకూ నిజముందంటే నూటికి నూరుపాళ్ళు అసత్యమే! సాధారణంగా కన్నతల్లిదండ్రులకు బిడ్డలందరిమీదా ప్రేమ వుంటుంది. అయితే పిల్లలు పొరపడడానికి కారణమేంటి? ఏదో పెద్దబ్బాయి కాలేజీలో చదువు వెలగబెడుతున్నాడని చాటుగా మాటుగా తల్లి డబ్బు అందిస్తుంది—అది తక్కినపిల్లలు కనిపెడ్తారు—లేకుంటే అందరికన్నా ఎక్కువగా రెండుజతల బట్టలు కుట్టాయి. దాంతో 'అన్నయ్యంటే యిష్టం' అనే తీర్మానాన్ని చేసిపడేస్తారు! లేకుంటే చిన్నపిల్ల బలహీనంగావుందని పండూ అదీయిచ్చి పనిచెయ్యనివ్వకుంటే "చెల్లాయంటే 'ప్రేమ' అనేస్తారు. కానీ యీ అపోహలొక్కొక్కసారి విపరీత పరిణామాలకు దారితీస్తాయి. కాబట్టి అలా కాకుండా - పిల్లల్లో -ఒక్క-చిక్క- ఎప్పుడూ బలహీనంగావున్న, అక్కయ్యో లేక తమ్ముడిమీదో—జాలీ, సానుభూతీ కాలేజీలో చదివే అన్నకోసం త్యాగాన్నీ-తల్లి కలుగజేయవచ్చు. "పాపం అన్నయ్య రోజూ ఎంతదూరం నడిచిపోవాలి! మనందరం, సినిమాలూ, బట్టలు కొనడం కాస్త తగ్గించుకుని అన్నయ్యకో సైకిలు కొనిపెడ్దాం" మంటే పిల్లలు త్యాగానికి సిద్ధంగా వుంటారు. అంటే తల్లి బాధ్యత ఎంత గురుతరమైందో తెలుస్తుంది. ఆ త్యాగంలో పిల్లలుపొందిన సంతోషాన్ని అనుభవించాల్సిందేకాని, వర్ణించి చెప్పలేము. పెద్దయ్యాక, తమ దేశంకోసం తమ సుఖాలను, ఒకరు జీవితాన్నికూడా త్యాగం చెయ్యడానికి సిద్ధపడ్తారు.

మరో ముఖ్య విషయం—సంఘంలో అధికుల మనుకునే తల్లిదండ్రులు (దేవో అధిపులో అది వాళ్ళకే తెలియాలి!),

వాదన అవివేకమా?

లీలారాణి

వాదించటం వ్యక్తిరీత్యా కేవలం క్రీడల్లోకే చెందినా, వాక్స్వాతంత్ర్యం వున్న మన ఇండియన్ రిపబ్లిక్‌లో ఆ అధికారం అందరిదీని - జీవితంలో ఘాటుగా వాదించవలసిన అవసరం అందరికీ ఎప్పుడో అప్పుడు వొస్తూనే వుంటుంది. వాదించుకొనేవాళ్ళ తెలివితేటల్నిబట్టి, వాదన వినే వాళ్ళకి ఆనందాన్ని కలిగిస్తూ వుంటుంది. ఐతే వినేవాళ్ళకి మంచి వినోదంగానే వున్నప్పటికీ, వాదించుకొనే రెండుపక్షాల వాళ్ళకీ నిప్పులు తొక్కుతున్నట్టే అనిపిస్తూ వుంటుంది. వినేవాళ్ళు నవ్వుతూనే వున్నా, వాదించేవాళ్ళు ఎంతో సీరియస్‌గా మొహం పెట్టి, పెద్దగొంతుక చేసుకుని అరుస్తూనే వుంటారు. అవతలివాళ్ళకి చెముడు లేదని చాలాకాలంనుంచీ తెలిసినా సరే, గొంతు మాత్రం తగ్గించరు. అసలు ఒక్కొక్కప్పుడు వాదించుకొనేవాళ్ళు మొహాలు మొహాలు చూసుకోకుండానే గట్టిగా మాట్లాడేస్తుంటారు. అది చూస్తుంటే వాదన ఎవరెవరి మధ్య జరుగుతోందో చప్పున అర్థం కాదు.

ఇటువంటి ఘర్షణసందర్భాలు మనం ప్రతిరోజూ ఎన్నో చూస్తూంటాం. పంపు నీళ్ళదగ్గిరా, రైళ్ళలో సీట్లదగ్గిరా జరిగేలాంటి వాదనలు వినటానికి మంచి సరదాగా వుంటయ్. మళ్ళీ ఆస్తిపంపకాలలో, పెళ్ళిళ్ళలోనూ జరిగే ఘర్షణ ఇంకో రకంగా వుంటుంది. ఇది చూసేవాళ్ళకి సరదాగానే వుంటుందిగానీ, ఏమైనా రైళ్ళలో జరిగే వాదన ముందు తీసికట్టే.

ఇహ పోతే ఇళ్ళల్లో ప్రతిరోజూ జరిగే చిన్న చిన్న యుద్ధాలు, వీటన్నిటికన్నా గొప్పగా వుంటయ్. ఈ విషయాల్లో మనుషుల వాగ్ధాటి, చాతుర్యం, కల్పనాశక్తి, వ్యూహాలూ వుద్దేశాలూ స్పష్టంగా బైట పడుతూ వుంటయ్. ఆ వేడిలో ఒక్కొక్క సారి ఇంటిగుట్టు అంతా బైటపడుతూ వుంటుంది కూడా. తర్వాత నాలుక్కొరుక్కొంటే మాత్రం ఏం లాభం.

వాదించుకోవటం చూడటానికి ఎంత మూర్ఖంగా కనిపించినా, తమాషా ఏమిటో గానీ, ప్రతివాళ్ళూ వాదించేటప్పుడు ఆ విషయం మరిచిపోతారు. లేకపోతే అసలు వాదనే కొనసాగదు. పెద్ద పెద్ద చదువులు చదివి గొప్ప వుద్యోగాలుచేసే అన్నదమ్ములు కూడా, అసంతోషపడుకొన్నాక, ఆఖరికి, ఏ రోట్లో, రోకలో లాంటి చిన్న విషయాలదగ్గిర జుట్టూ జుట్టూ పట్టుకొంటారంటే వాళ్ళ సంస్కారాన్ని ఏ కోవలో అర్థం కాదు.

రెండు చేతులూ కలిస్తేగానీ చప్పుడు కాదన్న విషయం కాసేపు వాదించి, భర్తకి విసుగు కలుగుతోందని తెలియగానే వాదన పుటుక్కున తెంపేసే భార్య విషయంలో పూర్తిగా నిజం. ఐతే అంతమాత్రంచేత ఆవిడ ఎదుటివాళ్ళ వాదాన్ని ఒప్పుకొందని మాత్రం అర్థం కాదు! ఆవిడ ఆ విషయాన్ని ఇతరవిధాల వ్యక్తపరుస్తుంది.

'కుందేటికి మూడే కాళ్ళు' అనేవాదన అందరూ వినే వుంటారు. ఎవరో మహానుభావుడు ఓ కుందేల్ని పట్టుకొన్నాట్ట. దురదృష్టవశాత్తూ ఓ కాలువిరిగిపోయిందో, ఏమైందో గానీ దానికి మూడే కాళ్ళున్న మాట యదార్థమే. ఐతేమాత్రం అది పట్టుకుని 'కుందేళ్ళకి మూడే కాళ్ళుంటయ్యా'ని అనటం ఏం సబబు చెప్పండి? మళ్ళీ మాట్లాడితే సాక్షాత్తూ నేను పట్టుకొని చూశానయ్యా అంటాడుగానీ, కుందేళ్ళకి నాలుగు కాళ్ళుండటం సత్యం, న్యాయం, ధర్మం అని చెపితే వినడుగదా ఖర్మ. లోకంలో ఈ రకం వ్యక్తులూ వున్నారు. అవతలవాడు చెప్పింది ఎంత కటికనిజమైనా కానివ్వండి ససేమిరా ఒప్పుకోడు. కేవలం వాదనకోసం చేసే వాదం. దీన్నేనేమో వితండవాదం అంటారు.

అంతే కాదు. కొంతమంది మనం ఏది చెపితే అది 'కాదు' అంటారు. వాళ్ళు కాదు అని చెప్పినదాన్నే కొన్నాళ్ళు పోయాక మనంకూడా 'కాదు' అని చెపితే, కొన్నాళ్ళక్రితం వాళ్ళు 'కాదు' అని చెప్పినమాట మర్చిపోయి, మళ్ళీ మనకి వ్యతిరేకంగా 'ఔనని' వాదిస్తారు. ఐతే దీనివల్ల పెద్ద ప్రమాదం లేదు. వాదన మొదలైన కాసేపట్లోనే పరిస్థితి బోధపడి అవతలివాళ్ళు వొదిలించుకొంటారు. లేకపోతే చదరంగంలో 'డ్రా' అనే ఆటని అంతులేకుండా ఆడినట్టే ఔతుంది.

రెండుపక్షాలూ సమాన వుజ్జీలు ఐనప్పుడే

★ పిల్లల పెంపకం-తల్లుల బాధ్యత ★

ముఖ్యంగా తల్లులు-వాళ్ళతో ఆడుకోరాదు, వీళ్ళతో స్నేహం చెయ్యరాదు, అని పిల్లలను శాసిస్తుంటారు. అంటే తమతో సమానంగా ధనమూ అధికారమూ, అంతస్తూ లేవని వాళ్ళు తమ పిల్లలతో ఆడుకోడానికి గూడా తగరనీ మా వదినలాగ — పిల్లల అమాయక హృదయాల్లో విషబీజాలను నాటుతుంటారు. పెద్దయ్యాక చదువూ సంస్కారాల ప్రభావంవల్ల వాటిని ఎంత తొలగిద్దామన్నా సాధ్యం కాదు. "తక్కువవాళ్ళనీ వీధి వాళ్ళనీ ఏమీ లేదు-అందరమొకటే-అయితే చూడూ-చిన్నప్పటినుండీ యిలా పెరిగామా" అని డిగ్రీలు పుచ్చుకున్న మహామహులే నీళ్ళు నములడం మనం చూస్తూనే వున్నాము. మా యింట్లో పనిచేసే సుబ్బికూతురు 'సుహా' యీడుదే. సుహా రెండుసార్లు వాళ్ళింటికి వెళ్ళడం వదిన దండించడం జరిగింది. చిన్నతనంనుండీ తాము తక్కువవాళ్ళకన్నా అధికులమనే భావాన్ని తల్లిదండ్రులు వీళ్ళలో కలుగజేస్తారు. ఏ కలెక్టరుగారబ్బాయో ఏ ప్రిన్సిపాలుగారమ్మాయో లేక ఏ లక్షాధికారి కూతురో, అయినంత మాత్రాన తక్కువవాళ్ళకన్నా అధికులమనుకోరాదు అవకాశాలంటే ప్రతియొక్కరూ కలెక్టరూ, ప్రిన్సిపాలు అయ్యేందుకు వీలుంది. అహంకారంతో విఱ్ఱవీగే యిలాంటి పిల్లలవల్ల యితరులకు చెడు కలగకున్నా వీళ్ళు ఉత్తమపౌరులు కాజాలరు. కనుక యిటువంటి మిథ్యాభిప్రాయాలను తల్లి పిల్లల్లో కలుగనీయకుండా తగినంత జాగ్రత్త పడాలి. అందరికన్నా అధికులమనుకునే తల్లులు-అలాంటి భావాలను తొలగించుకుని — పసిపాపల లేతహృదయాల్లో, అలాంటి విషబీజాలను నాటకుండా తగిన శ్రద్ధ వహించాలి.

స్వార్థం, అహంకారం, అధికారం, దర్పం, మొదలగు దుర్గుణాలమధ్య పెరిగినబిడ్డలు దేనికీ పనికిరారు. కనుక 'అల్లి' 'తల' 'పలక', 'గిలక' నేర్పడంతోనే తనబాధ్యత తీరిందని తల్లి తలంపరాదు. ఆ చిలకపలుకులతో పాటు, మానవత్వాన్ని మంటకలుపుకోకుండా వుండేందుకు, జాలీ, త్యాగమూ, న్యాయమూ, సమానత్వమూ, సహకారమూ, మొదలుగాగల సద్గుణాలను పిల్లల హృదయాల్లో నాటుకునేటట్లు చెయ్యాలి.

మహోజ్వలమైన భారతదేశపు భవిష్యత్తు, భావిపౌరులమీద ఆధారపడివుందని చెప్పనవసరం లేదు. కనుకనే భారతదేశం ముందుకు పురోగమించాలంటే, తల్లుల బాధ్యత ఎంతయినా వుందని మరోసారి మనవి చేస్తున్నాను. ★

తల్లి "పాలు ఎప్పుడు పొంగొస్తాయో కనిపెట్టి ఉండమన్నానా?"

కొడుకు: "కనిపెట్టే ఉన్నానే... సరిగ్గా పదిన్నరయింది."

వాదన వినేవాళ్లకి మంచి రసవత్తరంగా వుంటుంది. అటువంటి అవకాశం, ఇంతకు ముందే చెప్పినట్టు రైళ్లల్లోనే దొరుకుతూ వుంటుంది. అందుకనే తిరుగుతూ 'నువ్వెంతంటే, నీకూ కొన్నా సేవయ్యాటికెళ్ళిన్నా' అనే మాటలు వినపడుతూ వుంటయి. అలాకాక ఏ పెళ్ళిలోనో వాదన వొచ్చినా, తప్పెవరిదైనా ఆడపెళ్ళివాళ్ళు కొంచెం తగ్గి వుంటారు పెళ్ళి అయేదాకా!

వీథిలో పంపునీళ్ళ దగ్గిర, సర్వసమానత్వం కోసం దీర్ఘోపన్యాసాలు అతి సామాన్యంగా వినిపిస్తూ వుంటయి. ఐతే ఇంకా బలంగల వాళ్లదే అధికారంగా జరుగుతూ వుంటుంది. ఇది సామాన్యంగా ఆడవాళ్ళ మధ్య జరుగుతుందేమో చూట్టానికి మహా ముచ్చటగా వుంటుంది.

ఓ గొప్ప తమాషా ఏమిటంటే వాదన ఎక్కువగా జరిగినచోట, తర్వాత ఫలితాలు విపరీతంగా ఊహిస్తాం. కానీ ఒకొక్కసారి అటువంటిచోట్లే, తర్వాత స్నేహం సౌహార్ద్రం అపరిమితంగా పెరిగిపోతయి ఉదాహరణకి మళ్ళీ రైళ్లల్లో సంఘటనలే తీసుకోండి. సీటుకోసం వాదించిన వ్యక్తి ఎక్కడో అక్కడ దిగే కలపడ్డాక తర్వాత వ్యక్తులందరిలో కొత్తవాళ్లని ఎక్కనివ్వకుండా ఉంచటంలో పాతవాళ్లకి ఆప్తబంధువౌతాడు. చూశారో, లేదో - రాజకీయాల్లోనూ అంతే - ఎంతో వాదించుకొన్న తర్వాత మళ్ళీ 'భాయ్' 'భాయ్' అనుకొంటారు.

అలాకాక పెళ్ళిళ్ళల్లో ఘర్షణ తాత్కాలికంగా అప్పటికి ఉపశమించినా, తర్వాత దుష్ఫలితాలు వడ్డీ పెరిగినట్టు పెరుగుతయి.

భార్యాభర్తల మధ్యైతే మాటిముడుపులూ, నాటబిగింపులతో ముగుస్తుంది. ఒక్కొక్కసారి భార్యామణి అలిగి పుట్టింటి కెళ్ళే పరిస్థితి వొచ్చినా వస్తుంది.

వాదించుకోవటం కేవలం అవివేకం అని అందరూ ఒప్పుకుంటారు. ఐతే ఆవేశం వచ్చినప్పుడు మాత్రం ఆపుకోలేరు. శాంతి స్వభావులైనవాళ్లు ఆ కాసేపూ ఏం బాధ పడినా తర్వాత ఎంతో సుఖపడతారు. దానికి గుర్తు గొంతు చించుకోనేవాళ్లు తర్వాత పడే ముచ్చట.

ఏమైనా ఈ విషయాలన్నీ మనసులో పుంచుకొంటే, వాదించకుండా వుండటంలో కొంతైనా జయంపొందగలమేమో నని

చేమంతుల పెంపకం

ఉత్తరాలు అనే శీర్షికలో ఖరగ్‌పూరు నుంచి వొకరు చేమంతులు యెలా పెంచాలో వ్రాయమని వ్రాసినారు.

మాయింట్లో చేమంతి పూవులు సంక్రాంతి పండుగకు చాలాబాగా పెద్దపెద్ద పూవులు, ఎఱుపు పసుపు కలిసినవి వైలెట్ కలర్ పూవులు, కుండీలలోపూచి చూచుటకు చాలా అందముగా యుండును. ప్రతీవారు చాలా పెద్దపూవులు పూసినవి అందముగాయున్నవి అని అందురు. కొన్ని ప్రదేశములలో నేలలు సారం పట్టిపూయును.

పెంచు విధానము:— నేలమీదకన్న కుండిలలో పెంచుట చాలాబాగుండును. యెందుకంటె, వర్షాకాలము నేలమీద యున్నంత సేపు బాగుండి, వేసవి కాలము నీరు లేక, యెండ వేడికి దచ్చిపోవును. దానివల్ల అనవసరంగా చెట్టు లేకుండాపోవును. అందుచే కుండీలలో వేసిన వర్షాకాలము అరు బయట ఉంచి, వేసవి కాలము నీడప్రదేశములో, అనగా యింటిముందు పందిరిక్రిందగానీ వృక్షాల నీడలో గానీ పెట్టినయెడల, చక్కగా బ్రతుకును. మనము ఇంతా పెంచి వేసవి కాలములో చంపుకొనుటకంటె ఈ పని చేయుట చాలముఖ్యమైనది. మనము పడినశ్రమ ఫలించి ప్రతీఏట పూవులు పూయును.

ముందు మనము చేమంతి కుండీలలో వేయాలంటే కుండలు తెప్పించి, వాటికి అటుప్రక్క, యిటుప్రక్క, రెండు రంధ్రములు పొడవవలెను. తరువాత నల్లటి చెఱువు మన్ను తెప్పించుకొని రెండుతోజులు ఆరనియ్యవలెను. తరువాత అందులో, వొక బుట్టెడు ఇసుక కలిపి నీరుచల్లిన (కొద్దిగా) బులబులాగా ఉండును; ఆ మట్టిని ప్రతీ కుండీలలోను సగమువరకు పోయవలెను. ఇంకా పదిరోజులకు ఈపని చేయుచు మనకు, నేలలో గుంట చేసి, అందులో ఆవు పేడగానీ, గేదె పేడగానీ వేసి, పైన నల్లమన్ను వేసి గుంటపూడ్చవలెను. అప్పుడు కొన్ని రోజులకు పెంటఅగును. దానిని త్రవ్వవ, చక్కగా పొడిపొడిగా ఎఱువు వచ్చును. దానిని తీసి కుండీలలో పోసినమన్నులోనిండా ఈ పెంట వేసి కల్పవలెను. అప్పుడు కొద్దిగా నీరుపోయవలెను. అలా ఒకపూటవుంచి, మొన్నాడు ప్రొద్దున్నే, ఒక్కొక్క చేమంతి మొక్క నాటవలెను. వెంటనే నీరు పోసిన, మొక్కలు కావలసిన నీరు పీల్చి మిగతానీరు రంధ్రములుద్వారా బయటకు వచ్చును. బాగుగా నాటుకొనినవని తెలిసిన తర్వాత, అందులో కచికలుబూడిద వేయవలెను. నీరుకూడా పోయవలెను. లేనిచో పేడికలు అనుగనఉండు పోడుములాంటిది తీసివేయవచ్చును. అంతేకాకుండా రోడ్డు మీద యెఱ్ఱమన్ను తెప్పించి కొంచెము కొంచెముగా వేసి నీరుపోయవలెను. మఱియు నేలకు వొకసారి అడుగునుంచి పైవఱకు వేళ్ళు తెగకుండా, గరటెతో మన్నుకలిపి, ఎఱువు వేయవచ్చును. ఎక్కువ మొక్కలు వచ్చినచో వర్షాకాలములో మొగురుకొమ్మలు కత్తిరించి నేలపై నాటవచ్చును. పైవిధముగానే, పెద్దపెద్దమడులు త్రవ్వి ఎఱువు వేసి, కొమ్మలు, మొక్కలుకూడా నాటవచ్చును. మొక్కలు వరుసగా మడిలో నాటినప్పుడు, మొక్కకి మొక్కకి కొంచెము దూరము ఉంచవలెను. మందు ఎఱువులు తెప్పించి వేయుటకంటె, నేను చెప్పిన ఎఱువులు వేసిన చక్కటి పూవులు పూయును. ★

ఒకసోదరి, ఏలూరు

★ ఉత్తరాలు ★

(2 - వ పేజీ తరువాయి)

ఉంది: నిజంగా కూడా కొంతమంది అమ్మాయిల పగటివేషాల్ని చూస్తుంటే—వీరు ఆడవారేనా! అని అనుమానము, ఆశ్చర్యము కూడ కల్గుతాయి.

సి. యల్. నరసింహారావ్, తలమర్ల.

ఆమె వ్రాసిన "హీరోయిను మార్కు వనితలు" మైక్రోస్కోపుకు అందే మెనారిటీగానైనా వుండరు. ఒకరిద్దరు వుంటే వ్యాసం వ్రాయనక్కరలేదు. కధగా వ్రాయవచ్చు యింమైతే. నా విమర్శన ధ్వనిని పూర్ణ గారు సుహృద్భావముతో వింటారని ఆశ.

భూలతా బుందూరు, చినవాల్తేరు.

హీరోమార్కు అబ్బాయిలనుగురించి గూడా వ్రాయాలని నా ప్రార్థన.

యల్. వి. సుబ్రహ్మణ్యశాస్త్రి, గుంటూరు.

"హాస్యా పెస్యా" అనేవ్యాసం ఎంతో చక్కగా వ్రాశారు. వారు వ్రాసిన శ్రీ అమ్మాయి మనసాలు ... ...

ఎ. వి. రాజ్యలక్ష్మి, ధర్మవరం.

అనుకరణలు చేసేవారు ఉన్నందువల్లనే పెద్దలు కొందరు "సినిమాలు చూస్తే చెడిపోతారు" అని అంటారు. కాని ఈ మాటలతో నేను పూర్తిగా ఏకీభవించలేను. కాని అనుకరించేవాళ్లు మంచి_చెడూ చూచి అనుకరిస్తేచాలు. సినిమాలో రెండూ ఉంటాయి. ఈ సినిమాలను చూచే బాగుపడేవారున్నారంటే పొరపాటు కాదేమో.

యర్రా సుజాత, అనంతపురం.

*   *   *

అస్తు

సినిమాజగత్తు కేవలం కల్పితమని, సినీ అనుకరణప్రియులు గ్రహించి, సమాజ సౌందర్యానికి మసిబూసి మారేడుకాయను చేయకుందురు గాక.

కె. ఎం. నారాయణ, ధర్మాబాదు.

దర్భా అన్నపూర్ణాదేవిగారు రాసిన "పెళ్ళిళ్ళు కావలసినవాళ్ళహల్లో పెల్లో!"_ వ్యాసం బాగుంది. చదువుకొంటున్నవాళ్ళలోనే ఈ"హల్లో పెల్లో" చాలా ఎక్కువ! అంటే బియ్యేలు, ఎమ్మేలు చదివి ప్రఖ్యాతిగాంచిన వనితలు లేకపోలేదు! అసలువారిని చూస్తే బియ్యే, ఎమ్మే చదివినవారిలా ఉండనే ఉండరు! సాధారణ స్త్రీలవలెనే ఉంటారు (కొంతమంది). అంగుళీ ఏ... పొమెత ఉందిగా: ఏమీ లేని ఆకు ఎగిరెగిరి పడుతుందని.

"మీరు పొదుపరులేనా?" ప్రశ్నావళి నిజంగా, అద్దంలో ప్రతిబింబం చూసుకొన్నట్లే తెలుపుతోంది.

"శాయి" (గుంటూరు)

*   *   *

మీరు పొదుపరులేనా!

ఈ శీర్షిక క్రింది ప్రశ్నల్ని మా అక్కగారికి ఒప్పగించి జవాబులు ఆరా తీశాను. తీరాచూస్తే ఇ ప్రశ్నలకి తొమ్మిది అవునులు వచ్చినవి. వెంటనే 64 పుటలో ఫలితం చూస్తే, ఎవరయినా పెద్దవారికో మీవారికో అప్పగించటం మంచిదనిఉంది. టక్కున మీ బావగారికిచ్చేస్తానంది. చిక్కు మొగంతో. అయితే అధికారం నీ చేతిలో ఉంచగానే ముందు నాకో పదు రూపాయిలు ఇచ్చి మరీ ఒప్పగించమని ఏడ్పు మొగం పెట్టాను. నా అక్క మరీ ఘోరాలుమన్నది!

కె. సరసంహాలు, అనంతపురం.

"మీరు పొదుపరులేనా" లోని వానికి జాబులిచ్చుకొనగా నాకు 8 పాయింటులు వచ్చినవి. సమాధానాలు చాలా కరెక్టుగా ఉన్నవి. ఇలాంటి శీర్షికలనే తరచుగా ప్రచురింపవలసిందిగా కోరుతున్నాను.

జి. కౌసల్యాబాయి, తిరుపతి.

"మీరు పొదుపరులేనా?" ప్రశ్నావళి నేను, మా అక్కయ్య లెక్క వేసి పోల్చి చూచుకొన్నాము. అందులో ఏడవప్రశ్నకు 'అ' అంశము ఉన్నదిగాని 'ఇ' అంశము లేదు. అందునుంచి ఏడవప్రశ్న వదిలేసి పది ప్రశ్నలకే లెక్క చూచాము. నాకు 'అ' ప్రశ్నకి ఐదు పాయింటులు 'ఇ' ప్రశ్నకి ఐదు పాయింటులు, మా అక్కయ్యకు 'అ' ప్రశ్నకి నాలుగు పాయింటులు 'ఇ' ప్రశ్నకి ఆరు పాయింటులు వచ్చాయి. నా వాటికి సమాధానం చూశాక ప్రశ్నావళి జవాబులు సర్యాలేదని, ఉత్సాహంగా మా అక్కయ్యనడిగి ఆమె వాటికి సమాధానం చూస్తేఉన్న కాస్త ఉత్సాహం పోయింది. ఆమె వాటికి సమాధానం "చాలా చిన్న ఖర్చులు, చిన్న విషయాలు అని మీరు అనుకుంటున్నవే మీ ఖర్చులు పెరగడానికి కారణం అని గుర్తించాలి" అనివుంది. మా అక్కయ్య ధారాళంగా ఖర్చు పెడ్తేస్తుంది. అలాంటిది ఆమెకు అలా సమాధానం వచ్చిందేకి ఏడవప్రశ్న వదిలివేయుబట్టి అలా వచ్చిందేమోనని అనుమానంగా వుంది.

యల్. ప్రభారెడ్డి, బుచ్చిరెడ్డిపాలెం.

* ప్రతి రూపాయా ఖర్చు పెట్టినపుడల్లా. ఇది అవసరమా అని ఆలోచిస్తారు పొదుపరులు....ధారాళంగా ఖర్చు పెట్టేవారు ప్రతి చిన్న అవసరాన్ని. అనవసరాన్నీ కూడా ముఖ్యమనే అనుకుని ఖర్చు పెట్టేస్తారు అందువల్ల మీ అక్కగారికి వచ్చిన జవాబు సరిగ్గానే అన్వయిస్తుందనుకోవాలి.

* ప్రశ్నావళిలో ప్రధానమైనవి పదే ప్రశ్నలు. ఒకటి అదనంగా ఉంచినది. పదీ మీకు నప్పితే జవాబులు చెప్పవచ్చు. ఏదేనా కుదరకపోతే వదలివేయవచ్చు. ఏడవ ప్రశ్నకు 'ఇ' భాగం ఉండదు ★

గృహ రామాయణం

బావ—బావమరది.

మన తెలుగుసనంలోని కమ్మదనం వీరి వరసల్లో ఎంతో నాఉంది. బావ, బావమరదులు వేళాపాళా లేని వేళాకోళాల్లో సరస సల్లాపాల్లో నవ్వు మాటలు రువ్వుకుంటూ గృహరామాయణంలో కిష్కింధకాండ రచిస్తూ ఉంటారు.

ఒకసారి ఇద్దరు బావమరుదులు కవిత్వంలో దెబ్బలాడుకుంటున్నారు అందులో ఒకాయనకు పండితుడనన్న అహంభావం మహాఉండేది. ఆయన పాండిత్య ప్రకర్షకు ఘనసన్మానం కూడా పొందాడు. బావగారు ఆయన గౌరవార్థం ఇంట్లో ఇలా పద్యం చెప్పాడు.

'తీరి కూర్చున్నచో తిరుమల పైకోతి
ఇదియె దైవమందు రెంచువారు
పండితోత్తముండ వంచునిన్
గొల్చెదు
వారునొకటిసుమ్ము! మాటనమ్ము!'

వెంటనే బావగారు ఉక్కిరిబిక్కిరయి నవ్వుతూ 'ఒరి నీ అసాధ్యంకూలా— అన్నట్లు తిరుపతి వెళ్లొచ్చావుకాబోలు నున్నగా చేయించలేదేం' అన్నాడు ఎగతాళి హాస్యంతో, ఒక్క బావగారే నవ్వుతారని భయపడ్డం అటుంచి తలనీలాలు తీయించుకోబోతే నన్ను వెక్కిరించడానికా అన్నట్లు నీ నామరూపాలే తిరుపతిలో ఎక్కడచూసినా—బావా! అన్నాడు బావమరది.

'నారూపాలేవిట్రా' అన్నాడు బావగారు.

"నీ నామరూపములకు నిత్య జయమంగళం".. అని రాగంతీస్తూ బావమరది గోడకుతగిలించిఉన్న ఆంజనేయస్వామి పటం చూపించాడు బావగారికి.

'హారి అసాధ్యంగూలా' అనుకున్నాడు బావగారు.

క్రీడారంగం:

ఫుట్‌బాల్:

ఇటీవల మలయాలో స్వతంత్ర వార్షికోత్సవ ఫుట్‌బాల్ టోర్నమెంటు జరిగింది. ఈ పోటీలలో భారతదేశజట్టు పాల్గొన్నది. ఈ జట్టుకి కెప్టన్ బొంబాయి ఆటగాడైన లతీఫ్. మొదటిరౌండులో భారతదేశజట్టు హాంకాంగు జట్టును 2 గోల్సు తేడాతో (స్కోరు 2—0) ఓడించారు. ప్రథమార్థంలోనే భారతజట్టు రెండుగోల్సును చేశారు. ట మొదలుపెట్టిన మొదటి ఎనిమిదవ నిమిషములో భారతదేశం జట్టువారు మొదటి గోలును చేశారు. 18వ నిమిషములో రెండవగోలును చేశారు. భారతజట్టు బంతి పాసింగులోను, రక్షణలోను విశేషమైన ప్రతిభను ప్రదర్శించారు. కాని గోలులోకి బంతిని తన్నడంలో నేర్పరితనము చూపించలేక పోయారు.

హాంకాంగ్ జట్టు ఆటలో చాల సమర్థులు. అటువంటి జట్టును భారతదేశజట్టు సునాయాసంగా ఓడించడంవల్ల మనజట్టువారు ఈ పోటీలలో విజయం సాధిస్తారని అందరు ఆశించారు.

వాత భారతజట్టు వియట్నాంతో ఆడారు. ఈ పోటీ 2-2 గోల్సులతో డ్రా అయింది. మలయా జట్టువారు భారతదేశంతో మాత్రమే డ్రా చేసి మిగతా మాచ్‌లన్నిటిని గెలిచారు. భారతదేశ ఆటగాళ్ళు, మలయాలోను, వియట్నాంతోను డ్రా చేశారు. వియట్నాంతో డ్రా చేసిన కారణంగా ఈ పోటీలలో భారతదేశం ద్వితీయ స్థానాన్ని పొందగలిగింది. వియట్నాంతో జరిగిన మాచ్‌లో కూడ భారతదేశం నెగ్గి ఉండవలసింది. ఆఖరి అర్థగంటలో భారతదేశ ఆటగాళ్ళు వియట్నాం గోలుపైకి చాల దాడులు సాగించారు. కాని బంతిని గోల్సులోకి సరిగా తన్నలేకపోయారు. చేతికి చిక్కిన అవకాశాలను ఉపయోగించుకోలేకపోయారు.

టెన్నిస్:

లలో ప్రఖ్యాత ఆటగాళ్ళందరు పాల్గొంటున్నారు. ఈ పోటీలలో 5వ ఆటగాడుగా కృష్ణన్ పరిగణింపబడ్డాడు. అయితే ఈ పోటీ మూడవరౌండులో మాజీ వింబుల్‌డన్ ఛాంపియన్ సెక్సస్‌తో 8-6, 4-6, 2-6 స్కోరులో ఓడిపోయారు. విక్ సెక్సాస్ నెగ్గడానికి ముఖ్యంగా ఆయన సర్వీస్ చాల తోడ్పడింది. బలంగా సర్వీసుచేసి నెట్టు దగ్గరకివచ్చి అందకుండా బంతులనుకొట్టి, కృష్ణన్‌ని సునాయాసంగా ఓడించారు.

హాకీ:

ఈనెల 21వ తేదినుంచి యూరప్‌లో భారతదేశ హాకీజట్టు పర్యటన చేస్తూంది. ఈ జట్టుకి కెప్టెన్‌గా క్లాడియస్, వైస్‌కెప్టెన్‌గా ఉధామ్‌సింగ్ నియమింపబడ్డారు. క్లాడియస్ ఇంతవరకు భారతదేశం తరపున మూడు ఒలింపిక్ పోటీలలో పాల్గొన్నారు. ఆటలో పూర్వమంతటి నిశ్చితను ఇంకా ప్రదర్శిస్తున్నారు. వీటన్నిటినిబట్టిచూసే కెప్టెన్‌గా నియమించుటకు ఈ యవకాశం ...


దివ్యజ్యోతి

వేలేటి వెంకటసుబ్బారావు

ఔరంగజేబు చక్రవర్తి మహారాష్ట్రులపై పగతీర్చుకోవాలని స్వయంగా సైన్యాధిపత్యము తీసికొని దక్షిణదేశంలో వున్నాడు. మహారాష్ట్రరాజు రాజారాం చనిపోయిన తరువాత అతని భార్య తారాబాయి యుద్ధము సాగిస్తోంది. వాళ్ళ యుద్ధపద్ధతి చక్రవర్తికి క్రొత్తగా ఉంది. వాళ్లు అకస్మాత్తుగా గుఱ్ఱాల మీదవచ్చి ఒక దెబ్బకొట్టి పారిపోతూండేవాళ్లు. చక్రవర్తి అతికష్టంతో ఒకకోట పట్టుకొని కొన్ని సైన్యాలుంచి మరో కోట ముట్టడిస్తూంటే పట్టుకొన్న కోటను మహారాష్ట్రులు వశపరచుకునేవారు. అయినా, ముసలితనంలో మొండిపట్టుదలతో ఔరంగజేబు యుద్ధం సాగిస్తున్నాడు. కాని అతనిలో అంతకంతకు నిరాశ పుట్టి హృదయంలో కూకటివేళ్ళలా వ్యాపించింది; దానితో కోపముగూడ జతగూడేది. అతని సైన్యాలెక్కడికి వెళ్లినా చుక్కెదురైయేది, అయినా లెక్కచేయక నిర్దాక్షిణ్యముగా వృద్ధులు, శిశువులనే విచక్షణ లేకుండా చేతికందినవాళ్లనల్లా చంపేవారు. వాళ్లు వస్తారనగానే ప్రజలు గ్రామాలు విడిచి చుట్టుప్రక్కల అడవుల్లోకి పారిపోయేవారు.

ఒకసారి మొగలుసైన్యాలు ఒక దుర్గముపై ముట్టడి చేస్తున్నాయి. చక్రవర్తి తన గుడారంలో కూర్చొన్నాడు. ఇంతలో ఒక సైనికుడు వచ్చి అదివరలో పట్టుకొన్న కోటను తిర్గి మహారాష్ట్రులు వశంచేసికొన్నారని చెప్పాడు. ఆ సంగతి వినగానే చక్రవర్తి కర్రదెబ్బతిన్న త్రాచులాగ కోపంతో బుసకొట్టాడు. సైనికుడు చల్ల చల్లగా జారిపోయాడు. ఔరంగజేబు బోనులోని సింహములాగ అటు యిటు పచారులు చేస్తున్నాడు. చీకటి పడడంతోనే సేవకులు వచ్చి దీపాలు వెలిగించారు. చక్రవర్తికవేమీ తెలియలేదు. కొంతసేపటికి ముఖమల్ దిండ్లమీద జేగిలబడి దీర్ఘాలోచనలో పడ్డాడు. అవమానము, క్రోధము, నిరాశ అతణ్ణి దహించివేస్తున్నాయి. బుర్రలో ఆలోచనలు వాయువేగముతో పరుగులెత్తుతూ వేడెక్కిస్తున్నాయి. ఆసమయములో నాలుగేళ్ళ వయస్సుగల బాలిక చక్రవర్తికి వెనుకగా వచ్చింది.

ఆ పిల్లదుస్తులు చిరిగిపోయి, మాసిపోయినా పిల్ల బంగరుబొమ్మలాగ ఉంది. ముఖము చంద్రబింబములాగ వుంది. విశాల నేత్రాలతో, గులాబిరేకులవంటి పెదవులతో చూడడానికి తీర్చిదిద్దిన శిల్పములాగ ఉంది. పెదవులపై నాట్యముచేస్తున్న చిరునవ్వు ఆమె ముఖమునకొక వింత కాంతినిస్తోంది. నల్లని తుమ్మెద రెక్కల్లాంటి ముంగురులు ఫాలము పైపడి ఒక వింతశోభ నిస్తున్నాయి. ఆ పాప ఆ లోపలికొచ్చి ఆశ్చర్యముగా అంతా కలయజూచి చివరికి నిశ్శబ్దంగా కూర్చొన్న చక్రవర్తివైపు చూచింది. ముఖం సంతోషంతో వికసించింది. అటూ యిటూ జోగాడుతూ చప్పుడు చెయ్యకుండా అతని వెనగ్గా వచ్చి తన చేతులతో అతని కళ్ళుమూసి "అమ్మదొంగా! యిక్కడున్నావా? దొరికేవులే!" అని పకపక నవ్వుతోంది. చక్రవర్తి తన ఊహాప్రపంచంలోంచి మేల్కొన్నాడు. వేడిమెక్కవున్న తన నుదురుమీదపడిన చల్లని చేతులు పట్టుకున్నాడు. పాప జిలిబిలిపలుకులు చెవులలో అమృతధారల్లాగ పడుతున్నాయి. "తాతా! యిక్కడికెలాగ వచ్చావు?" అని పాప అడిగింది. చక్రవర్తి మారు మాట్లాడక ఆ చిన్ని లేతచేతులను పట్టి ముద్దెట్టుకున్నాడు. అప్పుడు పాప "తాతా! ఓముద్దు" అని చక్రవర్తి భుజాలమీదనుంచి ముందుకు వొరిగి అతని బుగ్గలమీద ముద్దుపెట్టుకుంది. చక్రవర్తికిమహదానందము కలిగింది.



చిత్రం: ఎమ్. వెంకటేశ్వరశాస్త్రి, కాకినాడ.

పిల్లను మెల్లగా తన ఒడిలోనికి తీసికొని లేతబుగ్గలు నిమురుతూ వుంటేగా అతని ముఖంలోకి చూచి పాప తెల్లబోయి కనురెప్ప వాల్చకుండా అతనివైపే చూస్తూండి పోయింది. "పాపా! ఎందుకలాగ చూస్తున్నావు?" అని అడిగాడు. ఆ పాప "నువ్వు మా తాతవి కావు" అని లేచి అతనిచేతుల్లోంచి విడిపించుకోడానికి ప్రయత్నించింది. చక్రవర్తి "నేను మరో తాతని. నీకన్నీ యిస్తాను. నా దగ్గిర వుంటావా?" అని అడిగాడు బుజ్జగిస్తూ.

పాప (కొంచెంసే పతనివైపు చూసి): నువ్వు మంచితాతవేనా? నాతో ఆడుకుంటావా? మా తాత లాగ గుర్రము ఆట ఆడుతావా? నాకు ఆకలేస్తే పాలూ, బువ్వా పెడతావా?" అని ఏడుస్తూ 'మా తాత, అమ్మా, నాన్న పోయారు. పాలూ బువ్వా లేదు. ఆకలేత్తోంది' అన్నది. చక్రవర్తి బయటకువచ్చి పారా సిపాయితో బంగారు గిన్నలతో పాలూ, రొట్టె, అన్నమూ తెమ్మని పంపేడు. లోపలికొచ్చి చూచేసరికి ముఖమలు పరుపుమీద పాప నిద్రపోతూంది. పాప ముఖముపైగల చిరునవ్వు, ప్రశాంతతా చక్రవర్తిని ఆనందపరవశుణ్ణిగా చేశాయి. ఆ ముఖము చూస్తూ మైమరచాడు. సేవకుడు ఆహారపదార్థాలు తెచ్చిపెట్టి సలాం చేశాడు. వాడు వెళ్ళాక చక్రవర్తి పాపను లేపి పాలు గిన్నలోపోసి యిచ్చాడు. పాలుత్రాగి అన్నము తినేసరికి పాపకి నిద్రమత్తు వదిలి "తాతా! అవన్నీ ఏంటి" అని అమాయికంగా ప్రశ్నించింది. చక్రవర్తి వాటిపేర్లు చెప్పి తిర్గి పాపను నిద్రపుచ్చాడు.

ఎవరెన్ని సినిమాలు చూశారు?

[చిక్కు ప్రశ్న]

ఫోర్తుఫారం చదువుతున్న రామారావు, కృష్ణమూర్తి, వెంకటరెడ్డి. సుబ్బారావు ఎప్పుడూ కలిసి మెలిసి తిరిగేవారు. వాళ్ళకి తెలుగు మేష్టారు మిత్రచతుష్టయం అని పేరు పెట్టాడు. కృష్ణమూర్తికి సినిమా పిచ్చి ఎక్కువ. కొత్తసినిమా వచ్చిందంటే చాలు పోతానని పోయేవాడు అతనికి తోక సుబ్బారావు రామారావుకి అంత పిచ్చి లేదుగాని, బలవంతంచేస్తే వెళ్ళేవాడు. అందరికంటె తక్కువ సినిమాలు చూసింది వెంకటరెడ్డి.

వాళ్ళు ఆ ఏడాది ఈ క్రింది విధంగా సినిమాలు చూశారు.

రామారావు, కృష్ణమూర్తి, సుబ్బారావు కలిసి 62.

రామారావు, కృష్ణమూర్తి, వెంకటరెడ్డి కలిసి 45.

రామారావు, వెంకటరెడ్డి, సుబ్బారావు కలిసి 41.

వెంకటరెడ్డి, సుబ్బారావు, కృష్ణమూర్తి కలిసి 50.

వీరిలో ఎవరెన్ని సినిమాలు చూశారో చెప్పగలరా?

[జవాబులు 68 వ పేజీలో]

మర్నాడు తెల్లవారకమునుపే లేచి చక్రవర్తి తన కాలకృత్యములు తీర్చుకునేసరికి సూర్యోదయామైనది. నమాజు చేసికొంటున్న చక్రవర్తిని, పాప కళ్ళునులుపుకుంటూ లేచి 'తాతా?' అని పిలిచింది. చక్రవర్తి అప్పుడే ప్రార్థన ముగించాడు. పాప మంచముమీదనుంచి దిగి "ఏంచేస్తున్నావు తాతా!' అని అడిగింది.

చక్రవర్తి: దేవుని ప్రార్థన చేస్తున్నానమ్మా.

పాప: అదా! ఏడీ దేవుడు? కనుబడడే?

చ: కనుబడడు.

పా: అబద్ధం. మా యింటిలో కృష్ణుడూ, రాముడూ, ఉన్నారు.

చ: అవి బొమ్మలు. దేవుళ్ళుగారు.

పాప: ఉహుఁ దేవుళ్ళే. నీకు తెలియదు తాతా! కృష్ణుడెంత మంచివాడనుకున్నావు వెన్నముద్ద లిస్తాడు.

చ: మా దేవుడు వేరు.

పా: కాదు.

చ: నీ కెవరు చెప్పారు?

పా: మా తాత. అందరికీ ఒకే దేవుడు

చక్రవర్తి ఆలోచనలో పడ్డాడు. ఒకడే దేవుడు. పాపమాట నిజము. పాపను ఎత్తుకొని ముద్దాడాడు.

పాపాయి: తాతా! నువ్వెవరూ?

చక్రవర్తి: నేను చక్రవర్తిని.

పా: (అపరిమితంగా నవ్వుతూ) చెక్కరవొత్తి! అదేం పేరు.

చ: అది పేరుగాదు. నాహోదా.

పా: అగేమిటో? నువ్వు తాతవే. నీకిల్లు లేదూ?

చ: ఉంది. ఢిల్లీలో.

పా: ఢిల్లీయా? ఎక్కడుంది?

చ: చాలదూరంలో వుంది.

పా: మరి ఇక్కడకెందుకొచ్చావు?

చ: ఇదంతా జయించడానికి.

పా: అంటే ఏమిటి?

చ: పట్టుకోవడానికి.

పా: (తల అటూ ఇటూ ఊపుతూ) నువ్వు పట్టుకోళ్ళలేవు. మా అవ్వ చచ్చిపోయింది. ఏదీ

★ దివ్యజ్యోతి ★

పట్టుకెళ్ళలేదు. అన్నీ నా కిచ్చేసింది.

చక్రవర్తి మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. "ఇవి ఏవీ పట్టుకెళ్ళలేవు." అలాగే నిశ్చలంగా ఉండిపోయాడు. అతని మెడనుండి వ్రేలాడుతున్న బంగారుపతకంతో పాప చాలసేపాడుకొని అతని గడ్డం నిమురుతూ "తాతా! నీ పేరు చెప్పవూ?" అని అడిగింది.

చక్రవర్తి: నా పేరు ఔరంగజేబు!

పాప (భయంతో గజగజ వణికిపోతూ, అతణ్ణి కౌగలించుకొని, కళ్లు మూసికొని) ఒద్దు. ఆ పేరు వద్దు. నువ్వు మంచివాడివి.

చ: ఏమీ? అవురంగజేబు అంటే ఎందుకంత భయం.

పా: వాడు రాక్షసుడు. నిన్ను పట్టుకుంటే రక్తం తాగేస్తాడు.

చ: సరేలే. నీ తాత పేరేమిటి?

పా: తానాజీ తండేకర్.

చ: మీ నాన్న పేరు?

పా: వెంకోజీ.

చ: మీ యిల్లెక్కడ?

పా: అక్కడే. ఆ యేటిదగ్గర.

చ: అక్కడివాళ్లందరూ ఏమయ్యారు?

పా: క్రరల కెళ్లేరు. రాక్షసులొస్తే పారిపోయారు. నేనుకూడ రాక్షసుల కంటబడకుండా తాత కోసం వెదకివెదకి వొస్తే నువ్వు దొరికావు.

చ: మీ తాతని తీసికొని వస్తాను. నువ్వెళతావా?

పా: నువ్వొత్తావా? మా తాత మంచివాడు. నీ జట్టుంటాడు.

చ: నేను రాకూడదు. మా వూరు వెళ్ళాలి.

పా: అయితే నానాడుకుంటాను. అది యిస్తావా? (అని చక్రవర్తి మెడలోని పతకం చూపించింది.)

చ: తప్పకుండా యిస్తాను.

పాప సంతోషంతో చప్పట్లు చరిచి చక్రవర్తి మెడను పట్టుకుని అతణ్ణి ముద్దుపెట్టుకుంది. చక్రవర్తి తానాజీ తండేకర్, వెంకోజీ తండేకర్లను వెదకడానికి మనుష్యుల్ని పంపాడు. పాపాయి కాశిబిరంలో ఎక్కడికెళ్ళినా అడ్డులేదు. తన యిష్టం వచ్చినట్లు తిరిగి చక్రవర్తి చేత్తోనే భోజనం పెడితేనే తిని అతనిదగ్గరే నిద్రపోయేది పాప నిద్రించే వేళలలో, ఆ ప్రశాంతమైన ముఖం చూస్తూ వుంటే అంతా ఒకటే. అన్ని రూపములూ దేవుని రూపములే. ఇవి యేమియు నాతో పట్టుకుపెళ్ళలేను. ఔరంగజేబు రాక్షసుడు. రక్తపిపాసి. అమాయకులను నిష్కారణముగ నిర్దయుడై చంపించిన మహాపాపి. అతనిది వ్యర్థజీవితమని అతని అంతరాత్మ ఘోషించేది.

వారము దినములు గడచినతరువాత మొగలుసైనికు లిద్దరు వ్యక్తులను చక్రవర్తి యెదుటికి తెచ్చారు. అప్పుడు చక్రవర్తి సంతోషంతో కేరింతాలు కొడుతూన్న పాప నెత్తుకుని ముద్దులాడుతున్నాడు. సైనికుల నవ్వడి విని చక్రవర్తి యిటు తిరిగాడు. వెంటనే పాపాయి 'తాతా! తాతా!' అంటూ చక్రవర్తి భుజం మీదినుండి దిగి ఆ యిద్దరిలో ముసలివానివద్దకు పరుగెత్తింది. చక్రవర్తి తనవజీరును పిలిపించి వారికి విలువైన దుస్తు లిప్పించాడు. పాపాయికి ఒక జాగీరు యిచ్చి ఫర్మానా వ్రాయించాడు. ఆ బాలికి వెలగల దుస్తులు, నగలు, తన మెడలోని అమూల్యమైన పతకము బహూకరించాడు. పాప వెళ్ళిపోతూ 'తాతా! తాతా! మళ్లీ ఒస్తాను' అన్నది. చక్రవర్తి పాపనెత్తుకు ముద్దాడి కన్నీరు కార్చాడు. పాప "తాతా! ఏడవకు. పోని యిక్కడే వుంటానులే" అంటే చక్రవర్తి 'ఒద్దని' విడువలేక విడువలేక విడిచిపెట్టాడు. చక్రవర్తికి పాపాయిలేని గుడారం అంధకారబంధురమైంది. పాప వెళ్ళిన మర్నాడు తనకుమారునకు చక్రవర్తి జాబు నీ రీతిగా పంపెను.

"ప్రియపుత్రున కాశీస్సులు,

నాకు దివ్యజ్యోతి సాన్నిధ్యము కలిగినది. సుమారు పదిదినములు స్వర్గములో వున్నట్లుంటిని. ఆ చిన్ని జ్యోతి నాకు జ్ఞానోదయము కలుగజేసినది. నా జీవితము వ్యర్థమని గ్రహించితిని. నేను చేసిన పాట్లు నీవు చేయవద్దు. మరణకాలమందు మనతో ఏమియూ రావు. రేపు యుద్ధము విరమించి అహమ్మదు నగరము పోవుచున్నాను.

నీ శ్రేయోభిలాషి, ఔరంగజేబు."

★

గుడ్డి న్యాయం

ఓలావుపాటి గురువు, తన – పలచని శిష్యుడితో దేశ రానికి బయలుదేరి ఓ నగ చేరుకున్నారు. గురువు నగ ాలిమేరలో ఓ పెద్దచెట్టుక్రింద ంచి శిష్యుని వంటకు కావ సరకులు కొనుక్కురమ్మని నికి పంపాడు. ఆ శిష్యుడు నికి వెళ్ళినతర్వాత ఆ నగ ప్రతి వస్తువు ఒకేధరకు లభి తెలిసింది. వంట సరకులు నికి వచ్చిన శిష్యుడు మితా కూడా అదే ధరకు శేరు తున్నారని తెలియడంవలన డబ్బులతో మితాయి ాడు.

కొన్న మితాయిలతో గురువు వచ్చాడు. తర్వాత తెచ్చిన యి పొట్లాలను గురువుముందు ా "గురువుగారూ! ఈ నగ ప్రతివస్తువు ఒకే ధరకు శేరు న అమ్ముతున్నారు. అంటే ం, జొన్నలు కొనే ధరకే ట చక్కని నేతిమితాయి స్తుంది. కావున మనము ఈ లోనే ఉండిపోదాం" అని డు శిష్యుడు.

ప్పుడు గురువు శిష్యుడితో న్యాయశూన్య నగరంరా, కావున యిక్కడే ఉండి ప్పుడో ఓ రోజు తప్పక చిక్కుకుంటాం" అని డు. కాని గురువుగారి హిత ష్యుడి మెదడు కెక్కలేదు. వదిలి కదలనంటే కదల ట్టాడు. ఇక విధిలేక గురువు కూడా శిష్యుడితో ఉండిపోవాల్సి వచ్చింది. ప్రతి రోజూ కోవా, పాలతో చేసిన మితాయిలు తింటూ బక్కపలచని శిష్యుడు లావెక్కసాగాడు. ఒకరోజు ఆ నగరపురాజుగారి దగ్గరకు ఓ పిర్యాదు తీసుకురాబడింది. ఒక యింటిగోడ కూలడంవల్ల ఓ గొల్లవాడి మేక దానికింద పడి చచ్చిపోయింది. అందువల్ల రాజు ఆ యింటియజమానిని ఉరి తీయండని ఆజ్ఞాపించాడు. కాని ఎప్పుడైతే యింటి యజమానిని ఉరి

యం. యల్. పత

కంబానికి తీసుకొనివచ్చారో అప్పుడు ఉరితాడుయొక్క మెడను తగిలించే కొలకిడి నేరస్థుడి మెడ సన్నగా ఉండడంవల్ల వదులుగా ఉంది.

అప్పుడు రాజు ఆ సన్నని మెడ గల యింటి యజమానిని వదిలి ఆ ఉరికి సరిపోయే లావైన మెడగల వ్యక్తిని తీసుకువచ్చి ఉరి తీయండని ఆజ్ఞాపించాడు.

రాజాజ్ఞ ప్రకారం సైనికులు లావైన వ్యక్తి అన్వేషణార్థం బయలుదేరారు. వాళ్లు ఊరి చివరకు వెళ్లేసరికి చెట్టుకింద కూర్చొని ఉన్న గురు-శిష్యులు కనిపించారు. అప్పుడా సైనికులు శిష్యుని లాక్కొనిపోయారు. శిష్యుడికి ఆపద మూడిందని గురువుకూడా వాళ్ళ వెనకాలే వెళ్ళాడు.

ఎప్పుడైతే శిష్యుని ఉరికంబం మీదికి తీసుకెళ్ళారో అప్పుడు గురువు గబగబా అక్కడకు పరిగెత్తుకుంటూ వచ్చి "నన్ను ముందు ఉరితీయండి!" అని అరవసాగాడు. అప్పుడు ప్రజలంతా కారణమేమిటని గురువు నడిగారు. అప్పుడతను "నేను నా విద్యాప్రభావంతో ఈ ఘడియలో ఎవరైతే ఉరి తీయబడతారో వారు నేరుగా స్వర్గానికి వెళ్తారని తెలుసుకున్నాను. అందువల్ల నేను స్వర్గానికి వెళ్ళే ఈ చక్కని అవకాశాన్ని వదులుదలచుకోలేదు. కావున నన్ను ఉరితీయండి" అని అరవసాగాడు.

గురువుమాటలు విన్న ప్రతి వాక్కడికి తిన్నగా స్వర్గానికి వెళ్ళాలన్న కోరిక కలిగింది. అందువల్ల ప్రజలంతా "నన్ను ఉరితీయండి, నన్ను ఉరితీయండి!" అంటూ ఉరి కంబంమీదికి రాసాగారు.

ఈ వార్త తిన్నగా రాజుదగ్గర కెళ్లింది. అతడు వెంటనే ఉరికంబానికి పరిగెత్తుకుంటూవచ్చి ఉరితాడు కొలకిడిని మెడకు తగిలించుకొని "నన్ను ఉరితీయండ"ని సైనికులను ఆజ్ఞాపించాడు. రాజే స్వయంగా ఉరికంబ మెక్కేసరికి ప్రజలంతా కంబంమీంచి ప్రక్కకు తొలిగారు. రాజుగారు ఉరితీయబడ్డాడు.

ఈ విధంగా గురువు తన శిష్యుని రక్షించుకొని మరుక్షణమే ఆ నగరాన్ని వదిలి వెళ్లిపోయాడు. అప్పటి నుండి శిష్యుడు గురువుమాటని కాదనకుండా అతడు చెప్పినట్లు నడుచుకోసాగాడు. ★

నవనవ - పంచపంచ

పూర్వం భోజుడనే మహారాజు ధారానగరాన్ని పరిపాలించేవాడు. అతని ఆస్థానంలో కాళిదాసనే మహాకవి వుండేవాడు. ఆ కాళిదాసు కాళికాదేవికృపవల్ల గొప్పకవి పండితుడు, అయ్యేడు.

భోజుని ఆస్థానంలో కల్లా కాళిదాసు మిన్నగా వుండేవాడు. కాళిదాసు కీర్తి రోజురోజుకూ అన్ని దేశాల ప్రాకుతోంది. భోజుడు కూడ కాళిదాసు అంటే అభిమానించేవాడు. అందుచేత ఆ ఆస్థానంలోని పండితులు, కవులు అంతా కలసి ఆలోచించి కాళిదాసు నెలాగేనా అవమానించి కాళిదాసుని భోజుడు మెచ్చకుండా చేయాలని నిశ్చయించుకున్నారు.

ఒకనాడు అంతా ఆలోచించుకొని భోజుడు ఏకాంతంగా వున్న సమయంలో పండితులందరూ అతని వద్దకు వెళ్ళి "మహారాజా ! మనం నిత్యం చదివే వేదాల్లోను పురాణాల్లోను కొన్ని ఛందోదోషాలున్నాయి. కావున మనము ఆ తప్పులను దిద్దవలెను" అన్నారు. అప్పుడు భోజుడు మనసులో "ఆహా! బ్రహ్మముఖమునుండి వెలువడిన వేదంలోనే తప్పులా? వాటిని వీరు సరిదిద్దుటయా?" అనుకొని ఈ పండితులేదో ఎత్తువేశారని తలచి వారితోటి "పండితులారా! వాటిని మీరే సరిదిద్దుడు" అని చెప్పి పంపివేసెను.

భోజుడి మాటలకు ఆ పండితులు తమలో తాము సంతోషించివేదాన్ని సరిదిద్దుటకు ముహూర్తము పెట్టుకొని మొదటగా విఘ్నేశ్వర పూజ చేద్దామని మొదలుపెట్టేరు. సరిగా పూజ మొదలుపెట్టే సమయానికి సమీపంలో వున్న చెట్టు మీదనుంచి ఒక రామచిలుక 'నవ-నవ' అని కూసింది. పండితులందరూ ఆ కూతను విని తాము చేయుచున్న ఘనకార్యానికి పక్షి కూత అపశకునమని తలచి పూజ మర్నాటికి వాయిదా వేసి వెళ్ళిపోయారు.

మర్నాడు మళ్ళీ పండితులందరూ సమావేశమై వినాయకపూజ ప్రారంభించేసరికి మళ్ళీ అదే చిలుక 'నవ-నవ' అని కూసింది. ఇలా వరుసగా ఆరు రోజులు వారు పూజ మొదలు పెట్టడమూ చిలుక కూయడమూ కూడా జరిగింది. ఇంక 7 వ రోజున ఏమైనా సరే పూజ చేయాల్సిందే అని నిశ్చయించుకొని మర త్నము చేసిరి.

మరల పూజ మొదలి మరల చిలుక 'నవ-న కూసింది. ఆ సమయానికి దాసు లిటుపురూ ఆ తోట తున్నారు. చిలుక కూసిన యను మాటలు వినగానే 'పంచ-పంచ' అన్నాడు. చిలుక ఎగిరి పోయింది.

రోజూలాగే చిలుక ' అనడమూ, కాళిదాసు పంచ' అనగానే చిలుక డమూ చూచి అక్కడక పండితులూ, చివరకు భ రాజూ కూడ ఆశ్చర్యంతో పోయి చూస్తున్నారు.

అప్పుడు భోజుడు కాళి తిరిగి "మహాకవీ! ఈ బ్రహ్మముఖమునుండి వేదాన్ని సంస్కరింపదల లయ్యారు. అది అట్లుండ 'నవ-నవ' అనుటయు నీవు పంచ' అనుటయు మాకు నాశ్చర్యముగా నున్న దేమో మాకు వివరించ మని అడిగేడు.

అప్పుడు కాళిదాసు ప్రభూ! ఈ పక్షి రూప నున్నది చిలుక కాదు వేద ఈ మూర్ఖులు చేయబో అసహ్యించుకొని పక్షిరూ వచ్చి 'నవ-నవ' యని మీరు నవవ్యాకరణము

ఉత్తరాషాఢ

మిత్రభేదం

గోపి: "నేను హాస్పిటల్‌లో ఉండగా స్నేహితు లెప్పుడూ నన్ను కనిపెట్టుకునే కంటికి రెప్పల్లాఉండేవారంటే నమ్ము."

రాము: "నీలో అంత ఆకర్షణ ఉన్నమాట నిజం."

గోపి: నీ మొహం. వాళ్ళను ఆకర్షించింది నేను కాదు, ఆస్పత్రిలో నర్సు."